ఈనాడు

విజయవాడ 7-7-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 328
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మచ్చ తొలగుతోంది

మన్యంలో తగ్గిన గంజాయి సాగు

- వైకాపా పాలనలో 11 వేల ఎకరాల్లో సాగు..
- ఇప్పుడు దాదాపు లేనట్టే
- ఫలితం ఇస్తున్న ఈగల్, పోలీసు విభాగాల చర్యలు



ఈనాడు – అమరావతి

'ఏడాది క్రితం వరకూ మేమెప్పుడు గంజాయి పట్టుకున్నా ఆ మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండేవి. పట్టుబడిన వారిని ప్రశ్నిస్తే విశాఖ మన్యం నుంచి తీసుకొచ్చామని చెప్పేవాళ్లు. అప్పట్లో ఈ విషయాన్ని పదే పదే ఏపీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండేది కాదు. కొన్ని నెలలుగా మాత్రం.. ఏపీ నుంచి మా రాష్ట్రానికి గంజాయి రావడం ఆగిపోయింది. పట్టుబడుతున్న వారిని విచారిస్తుంటే ఒడిశా నుంచి తీసుకొచ్చామని చెబుతున్నారు' - ఇటీవల జరిగిన నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో సమావేశంలో తమిళనాడు యాంటీ నార్కొటిక్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు చెప్పిన అభిప్రాయమిది. అంతేకాదు, ఎన్‌సీబీ సమావేశాల్లో గతంలో ఏపీని రెడ్‌జోన్‌లో చూపించేవారు. ఇప్పుడు ఆ జాబితా నుంచి తొలగించారు. ఒక్క ఏడాదిలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పు ఫలితమిది. వైకాపా పాలనలో గంజాయి సాగు, రవాణా మూలకేంద్రంగా పేరుమోసిన విశాఖ మన్యం ఇప్పుడు కూటమి ప్రభుత్వ చర్యల ఫలితంగా ఆ మచ్చను పూర్తిగా తొలగించుకుంటోంది. ఈ ప్రాంతంలో ఏడాది కిందటి వరకూ 11 వేల ఎకరాల్లో జరిగిన గంజాయి సాగు.. ఇప్పుడు పూర్తిగా ఆగిపోయింది. గతేడాది జులై, ఆగస్టు నెలల్లో సాగు జరుగుతున్న ప్రాంతాలు, గ్రామాలన్నింటినీ క్షేత్రస్థాయిలో, సాంకేతికంగా గుర్తించి ఆ మొక్కల్ని ఈగల్, పోలీసు, ఇతర ప్రభుత్వ విభాగాలు కలిసి ధ్వంసం చేశాయి. ఆ తర్వాత మళ్లీ అక్కడ సాగు చేయకుండా (మిగతా 3లో)

375 గ్రామాల్లో మార్పు తీసుకొచ్చారు..

- విశాఖ మన్యంలోని చింతపల్లి, జి.మాడుగుల, కొయ్యూరు, పాడేరు, జీకే వీధి, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల పరిధిలోని 375 గ్రామాలు గంజాయి సాగుకు హాట్‌స్పాట్‌లుగా ఉండేవి.
- గంజాయి సాగు చేస్తున్న రైతులందర్నీ గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.
- 10,256 మంది రైతులకు నిమ్మ, అవకాడో, జీడి, కొబ్బరి, డ్రాగన్, జామ, జఫ్రా, నేరేడు, దానిమ్మ, సపోట, సీతాఫలం, చింత, రబ్బరు, పనస తదితర మొక్కలను ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది.
- ఆ ఉద్యాన పంటల సాగుకు అవసరమైన సహకారాన్ని ఐటీడీఏ, ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా అందజేసింది.
- ఇన్ని చేసినా కొంతమందిలో మార్పు రాలేదు. వారు సాగు చేస్తున్న గంజాయి తోటలను డ్రోన్ల ద్వారా గుర్తించి ఈగల్ బృందాలు ధ్వంసం చేశాయి.



శుభ్‌మన్ గిల్

భలే గెలుపు

ఐదు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఎదురైన ఓటమికి టీమ్‌ఇండియా ప్రతీకారం తీర్చుకుంది. రెండో మ్యాచ్‌లో చివరి రోజు ఆకాశ్‌దీప్ (6/99) అద్భుతంగా బౌలింగ్ చేయడంతో 336 పరుగుల తేడాతో ఇంగ్లిష్ జట్టును చిత్తు చేసింది. 608 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 271 పరుగులకు ఆలౌటైంది. – వివరాలు ఛాంపియన్‌లో

జనవరిలో మరో 70 అన్న క్యాంటీన్లు

అసెంబ్లీ స్థానానికి ఒకటి చొప్పున ప్రారంభించేందుకు సన్నాహాలు

ఇప్పటికే పట్టణ నియోజకవర్గాల్లో నిర్వహణ

ఈనాడు, అమరావతి: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 113 నియోజకవర్గాల్లో ప్రస్తుతం క్యాంటీన్లు ఉన్నాయి. మిగిలిన 62 నియోజకవర్గాల్లోనూ జనవరిలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన క్యాంటీన్ భవనాల నిర్మాణ పనులు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. డిసెంబరు నాటికి (మిగతా 3లో)



₹100తో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్



గ్రామ/వార్డు సచివాలయాల్లో త్వరలో ప్రారంభం

ఈనాడు,అమరావతి: గ్రామ/వార్డు సచివాలయాల్లో నామమాత్ర ఫీజుతో.. వారసత్వ భూముల సంక్రమణ భాగస్వామ్య (సక్సెషన్) రిజిస్ట్రేషన్‌లు త్వరలో జరగనున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం సదరు ఆస్తి విలువ రూ.10లక్షల లోపు ఉంటే రూ.100, ఆపైన ఉంటే రూ.1,000 ఫీజును స్టాంపు డ్యూటీ కింద తీసుకోనున్నారు. ఆస్తి యజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే వాటికి మాత్రమే గ్రామ/వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. మిగిలిన వాటిని యథావిధిగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే చేస్తారు. తల్లిదండ్రులు మరణించిన అనంతరం వారసత్వంగా వచ్చే ఆస్తులను వారసులు.. తహసీల్దారుకు దరఖాస్తుచేసి, కాగితాలపై రాసుకుంటున్నారు. వీటికి మ్యుటేషన్‌లు సకాలంలో జరగడం లేదని, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది పదేపదే తిప్పుతున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్నాయి. గత ఏడాదిలో సుమారు 55 వేల ఫిర్యాదులు ఇలా ప్రభుత్వానికి అందాయి. మరోవైపు.. తమ ఆస్తికి ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించాలి అనే ఉద్దేశంతో కొందరు ఉంటున్నారు. దీనివల్ల చనిపోయిన వారి పేర్లు భూముల రికార్డుల్లో అలాగే ఉండిపోతున్నాయి. ఫలితంగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

మరింత సులువు..

గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా మరణ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. యజమాని మరణించిన అనంతరం వచ్చిన ఆస్తులను వారసులు భాగాలు చేసుకుని లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే (మిగతా 3లో)

భద్రతామండలిని సంస్కరించాల్సిందే

బ్రిక్స్ వేదికగా ప్రధాని మోదీ పిలుపు


రొట్టెల పండగ ప్రారంభం

నెల్లూరులో కిటకిటలాడిన బారాషహీద్ దర్గా

లోపలి పేజీల్లో »

'సేఫ్ జోన్' కోసం చూసుకోవద్దు

పెద్ద లక్ష్యాలు పెట్టుకుని.. వాటిని సాధించాలి



అంతరిక్షం, రక్షణ, సాంకేతిక రంగాల్లో గణనీయ పురోగతి

వాటిలో అవకాశాల కోసం ఐఐటీల్లోనే చదవక్కర్లేదు

'ఈనాడు'తో బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ కోట సుబ్రహ్మణ్యం

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, గాంధీనగర్: పిల్లలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదని.. వారు పైకి ఎదిగే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే ధైర్యం ఇవ్వాలని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట) అన్నారు. చేతిలో తగినంత డబ్బు లేకపోయినా.. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో దేశం దాటి వెళ్లేందుకు చూపిన తెగువ... ఆయనను ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తగా ఎదిగేలా చేసింది. ఓ ఉద్యోగిగా మొదలైన ఆయన ప్రస్థానం... వేల మందికి ఉపాధి చూపించే స్థాయికి తీసుకువెళ్లింది. యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఆయన తన వంతు సహకారం అందిస్తున్నారు. విజయవాడలో పుట్టి, కాకినాడలో చదువుకుని, అమెరికాలో స్థిరపడిన కోట సుబ్రహ్మణ్యం ఇటీవల కాకినాడలోని జేఎన్టీయూ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడానికి వచ్చినప్పుడు.. 'ఈనాడు'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

ఈ రంగాల్లో ఎన్నో అవకాశాలున్నాయి

దేశంలో మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఏఐ, ఏఆర్‌లను అన్ని స్థాయులకు తీసుకెళ్తున్నారు. అంతరిక్షం, రక్షణరంగాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. కానీ, చాలామంది చిన్న ఉద్యోగాలతోనే సరిపెట్టుకుంటూ సురక్షిత మార్గం (సేఫ్ జోన్) చూసుకుంటున్నారు. ఆ ఆలోచనా ధోరణి మారాలి. పెద్ద లక్ష్యాలు పెట్టుకుని ఆ దిశగా (మిగతా 3లో)

కొత్త పార్టీని ప్రకటించిన మస్క్

- అమెరికన్లకు స్వేచ్ఛ కల్పిస్తానని వెల్లడి
- అధ్యక్షుడయ్యే వీలులేని ఎలాన్
- విదేశాల్లో పుట్టినవారు అనర్హులు
- గవర్నర్ వరకూ అవకాశం



9లో

ఈనాడు బిజినెస్

ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలపై 12కు పైగా దేశాలతో భారత్ చర్చలు

దిల్లీ: ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బీఐటీ)లను ఖరారు చేసుకునేందుకు 12కు పైగా దేశాలతో మన దేశం క్రియాశీలకంగా సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. సౌదీ అరేబియా, ఖతార్, ఇజ్రాయెల్, ఒమన్, ఐరోపా సమాఖ్య (ఈయూ), స్విట్జర్లాండ్, రష్యా, ఆస్ట్రేలియా, తజికిస్థాన్, కాంబోడియా, ఉరుగ్వే, మాల్దీవులు, కువైట్ తదితర దేశాలతో చర్చలు నడుస్తున్నాయని తెలిపారు. వచ్చే 3-6 నెలల్లో వీటిలో కొన్ని దేశాలతోనైనా బీఐటీలు తుది దశకు చేరతాయని, వాటిని ప్రకటిస్తామని ఆయన వివరించారు. ఈ పెట్టుబడుల ఒప్పందాలు రెండు దేశాల్లో పెట్టుబడుల ప్రోత్సాహానికి దోహదం చేస్తాయని తెలిపారు. 2024లో మన దేశంతో యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), ఉజ్బెకిస్థాన్‌తో బీఐటీలు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 50,000 ఉద్యోగాలు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) సుమారు 50,000 మందిని నియమించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. పెరుగుతున్న తమ వ్యాపారం, విస్తరణ అవసరాలకు అనుగుణంగా ఈ నియామకాలు చేపట్టనున్నాయి. తాజా ఉద్యోగాల్లో సుమారు 21,000 ఆఫీసర్ల విభాగంలో ఉండగా, మిగతావి క్లర్కులు, ఇతర సిబ్బంది ఉండనున్నారు. మొత్తం 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు నియామక ప్రక్రియలో ఉండగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒక్కటే 20,000 మందిని నియమించుకునే అవకాశం ఉంది. 2025 మార్చి నాటికి ఈ బ్యాంకులో 2,36,226 మంది పని చేస్తున్నారు. ఇందులో 1,15,066 మంది ఆఫీసర్లు ఉన్నారు. 2024-25లో ఒక్క పూర్తిస్థాయి ఉద్యోగిని నియమించుకోవడానికి సగటున రూ.40,440.59 ఖర్చయినట్లు తెలుస్తోంది.

● పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 5,500కు పైగా నియామకాలను ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోతోంది. 2025 మార్చి నాటికి ఈ బ్యాంకులో 1,02,746 మంది పని చేస్తున్నారు.

● సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4,000 మంది వరకు నియమించుకోనుంది. మిగతా బ్యాంకుల ఉద్యోగ నియామక వివరాలు తెలియాల్సి ఉంది.

జూన్‌లో విద్యుత్ కార్ల విక్రయాలు పెరిగాయ్

శ్రీరామ్ ఫైనాన్స్ మొబిలిటీ నివేదిక



చెన్నై: 2025 జూన్‌లో విద్యుత్ మోటార్ కార్ల విక్రయాలు భారీగా పెరిగాయని, ఇదే నెలలో ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్(ఐసీఈ)తో నడిచే సంప్రదాయ కార్ల విక్రయాలు తగ్గాయని శ్రీరామ్ ఫైనాన్స్ మొబిలిటీ నివేదిక తెలిపింది. ఐసీఈ కార్లకు వినియోగదార్ల నుంచి గిరాకీ తగ్గడం ఇందుకు కారణమని పేర్కొంది. ప్రైవేటు రంగంలో నియామకాలు పెరగడంతో జూన్‌లో ట్రక్కుల అద్దెలు స్థిరంగా ఉన్నాయని తెలిపింది. అయితే 18 టన్నుల 'పేలోడ్'తో నడిచే ట్రక్కు రౌండ్-ట్రిప్ (పోయిరావడం) అద్దెలు దిల్లీ-ముంబయి-దిల్లీ, దిల్లీ-హైదరాబాద్-దిల్లీ మధ్య పెరిగాయని నివేదిక వివరించింది. 2024 జూన్‌తో పోలిస్తే గత నెలలో ట్రక్కు అద్దెలు 5 శాతం మేర పెరిగాయని తెలిపింది. 2024 మే నెలతో పోలిస్తే 2025 మే నెలలో 1.3 శాతం అద్దెలు పెరిగాయని పేర్కొంది. నివేదిక ప్రకారం..

● విద్యుత్ ద్విచక్ర వాహనాల విక్రయాలు నెలవారీగా 2025 జూన్‌లో 5 శాతం పెరిగి 93,872కు చేరాయి. విద్యుత్ మోటార్ కార్ల విక్రయాలు 2024 జూన్‌లో నమోదైన 717 నుంచి 1,267 శాతం వృద్ధితో గత నెలలో 9,804కు చేరడం గమనార్హం. నెలవారీగా చూస్తే మేలో 9,693 కాగా, జూన్‌లో 1 శాతం వృద్ధితో 9,804కు చేరాయి.


● ఇంధన వినియోగంలో పెట్రోల్ వినియోగం 2025 జూన్‌లో 6.4 శాతం పెరిగి 3.51 మిలియన్ టన్నులకు చేరింది. 2024 జూన్‌లో ఇది 3.30 మి.టన్నులుగా నమోదైంది. డీజిల్ వినియోగం 7.98 మి.టన్నుల నుంచి 8.08 మి.టన్నులకు పెరిగింది.

వరుసగా మూడో నెలా ఎఫ్‌పీఐల పెట్టుబడుల జోరు



దిల్లీ: జూన్‌లో దేశీయ ఈక్విటీ మార్కెట్లలో రూ.14,590 కోట్లు విదేశీ మదుపర్లు పెట్టుబడి పెట్టారు. వరుసగా మూడో నెల నికర పెట్టుబడులు పెట్టడం విశేషం. ఇందుకు అంతర్జాతీయ ద్రవ్యలభ్యత పరిస్థితులు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులు మెరుగుపడడం, ఆర్‌బీఐ కీలక రేట్లను తగ్గించడం దోహదం చేశాయి. ఈ నెలలో విదేశీ మదుపర్ల పోర్ట్‌ఫోలియో(ఎఫ్‌పీఐ) నికర విక్రయదారులుగా మారడం గమనార్హం. ఈ నెల మొదటి వారంలో రూ.1,421 కోట్లను విక్రయించారు. 2025లో ఇప్పటిదాకా రూ.79,322 కోట్ల ఉపసంహరణ చేసుకోవడం గమనార్హం. జులై 9తో అమెరికా టారిఫ్ గడువు, అమెరికా ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి కారణంగా ఇక ముందు ఎఫ్‌పీఐల నుంచి ఇదే ధోరణి కొనసాగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పసిడి సమ్మేళనాలపై ఆంక్షలతో ఎలక్ట్రానిక్స్ తయారీదార్లకు కష్టాలు



దిల్లీ: అరుదైన భూ అయస్కాంతాల (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్) ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో ఇప్పటికే భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఇబ్బందులు పడుతోంది. తాజాగా మరో కీలక ముడి వస్తువు పసిడి సమ్మేళనాల(కాంపౌండ్స్)పై మన దేశం దిగుమతి ఆంక్షలు విధించడంతో ఈ కష్టాలు రెట్టింపయ్యాయి. కంప్యూటర్ చిప్‌లు, ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, విద్యుత్ వాహనాలు, విండ్ టర్బైన్‌లు, వైద్య పరికరాల తయారీలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్‌ను వినియోగిస్తున్నారు. ఇక మదర్‌బోర్డ్స్, సెమీకండక్టర్లలో విద్యుత్ ప్రవాహాన్ని మెరుగుపరిచే కీలకమైన ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీలో గోల్డ్ కాంపౌండ్స్‌ను ఎక్కువగా వాడతారు. అరుదైన లోహాలు, కాంపౌండ్స్ దిగుమతులను 'ఫ్రీ' నుంచి 'రిస్ట్రిక్టెడ్'గా వర్గీకరిస్తూ ఈ ఏడాది జూన్ 17న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్, ప్రత్యేక యంత్రపరికరాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది.

● పసిడి కాంపౌండ్స్‌పై దిగుమతి ఆంక్షల కారణంగా దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ పెంపు విషయంలో పరిశ్రమకు అనిశ్చితి నెలకొందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) పేర్కొంది. 'ఇటీవలి దిగుమతి ఆంక్షలతో పసిడి కాంపౌండ్స్ లభ్యతపై ప్రభావం పడింది. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ తయారీ విస్తరణ చర్యలకు విఘాతంగా మారింది. ఈ వస్తువులు అవసరమైన కీలక సబ్-అసెంబ్లీ విభాగాల్లో పెట్టుబడులు జాప్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి' అని ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మొహింద్రు పేర్కొన్నారు.

● పొటాషియం గోల్డ్ సైనైడ్, ఇతర వస్తువుల దిగుమతులను ఇప్పటికే కస్టమ్స్ వర్గాలు నిలిపివేయడం ప్రారంభించాయని, ఫలితంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఉత్పత్తి, సరఫరా వ్యవస్థల్లో ఆటంకాలు ఏర్పడ్డాయని ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీదార్ల సంఘం ఎల్సినా వెల్లడించింది.

ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ రూ.3000 కోట్ల ఐపీఓ



దిల్లీ: సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యుల్స్, సోలార్ సెల్స్ తయారు చేసే ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్ ఐపీఓకు రానుంది. ఐపీఓ ద్వారా రూ.3,000 కోట్లు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ప్రాథమిక పత్రాలను కంపెనీ ఆదివారం దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.2,143.86 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)లో రూ.856.14 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా వచ్చిన నిధుల్లో రుణాలు చెల్లింపునకు రూ.1,607.90 కోట్లను కంపెనీ వినియోగించనుంది. మిగతా భాగాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. 2025 మార్చికి కంపెనీకి రూ.1,950 కోట్ల రుణాలు ఉన్నాయి. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా కంపెనీ రూ.428.77 కోట్లు సమీకరించనుంది. ఇది పూర్తయితే, తాజా ఇష్యూ ద్వారా సమీకరించే నిధుల మొత్తం తగ్గనుంది. ఈ ఐపీఓ నిర్వహణకు మర్చంట్ బ్యాంకర్లుగా జేఎం ఫైనాన్షియల్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సెక్యూరిటీస్, జెఫరీస్ ఇండియా, కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీలను నియమించారు.

ఐపీఓకు అలైడ్ ఇంజినీరింగ్ వర్క్స్

దిల్లీ: ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద స్మార్ట్ ఎనర్జీ మీటర్ల తయారీ సంస్థ అలైడ్ ఇంజినీరింగ్ వర్క్స్ ప్రాథమిక పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.400 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 75 లక్షల షేర్లను ప్రమోటర్ అశుతోష్ గోయల్ విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను తయారీ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన మూలధన వ్యయాలకు కంపెనీ వినియోగించనుంది. కుండ్లీ కేంద్రంలో స్మార్ట్ గ్యాస్ మీటర్లు, స్మార్ట్ వాటర్ మీటర్లు, ఐఓటీ సొల్యూషన్స్ కోసం రూ.116.75 కోట్లు, రాయ్ కేంద్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఉత్పత్తికి రూ.99.71 కోట్లు కేటాయించనుంది. భవిష్యత్ మూలధన అవసరాలు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం రూ.120 కోట్లు వెచ్చించనుంది.

స్పార్టన్ పవర్ సిస్టమ్స్ ఐపీఓ నేటి నుంచి

దిల్లీ: స్పార్టన్ పవర్ సిస్టమ్స్ తొలి పబ్లిక్ ఆఫర్(ఐపీఓ) ఈ నెల 7న (నేడు) ప్రారంభమై 9న ముగియనుంది. ఒక్కో ఈక్విటీ షేరు ధర రూ.100గా నిర్ణయించారు. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.50 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లు ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌పై నమోదు కానున్నాయి. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.40.01 కోట్ల విలువైన 40.01 లక్షల వరకు తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.10 కోట్ల విలువైన 10 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా నిధులను బ్యాటరీ తయారీ యూనిట్‌లో ప్రొడక్షన్ లైన్‌కు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయడానికి, మూలధన అవసరాలు, రుణాల చెల్లింపు, మూలధన వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 2024-25లో కంపెనీ రూ.203.20 కోట్ల ఆదాయాన్ని, రూ.12.77 కోట్ల లాభాన్ని నమోదుచేసింది. ఈ ఐపీఓ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా అరిహంత్ క్యాపిటల్ మార్కెట్ వ్యవహరిస్తోంది.

వర్షాకాలంలోనూ పర్యటనలకు సై!

'మాన్‌సూన్ ట్రావెల్'పై యువత ఆసక్తి



ముంబయి: వర్షాకాలం.. సాధారణంగా పర్యటనలకు, ప్రయాణాలకు అంత అనువుగా ఉండదు. కానీ నేటి యువతరం (జెన్ జెడ్, మిలీనియల్స్) మాత్రం వర్షాకాల పర్యటనలపై ఆసక్తి చూపుతున్నారు. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ, అందమైన ప్రదేశాలను చుట్టేస్తూ సాహస యాత్రలకు మొగ్గు చూపుతున్నారని తాజా నివేదికలు చెబుతున్నాయి. తక్కువ ఖర్చు, రద్దీ లేని ప్రదేశాలను వారు ఎంచుకుంటున్నట్లు పేర్కొంటున్నాయి.

● బ్యాక్ వాటర్స్ నుంచి వైల్డ్ లైఫ్ సఫారీలు, బైకింగ్ ట్రయల్స్, ఆధ్యాత్మిక ప్రదేశాల నుంచి ఆయుర్వేద చికిత్సల వరకు రాయితీ ధరల్లో లభిస్తుండటంతో యువత పర్యటనలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు థామస్ కుక్(ఇండియా) ప్రెసిడెంట్, కంట్రీ హెడ్ రాజీవ్ కాలే వెల్లడించారు.

● వర్షాకాలంలో కుటుంబాలు, మిలీనియల్స్, వర్కింగ్ ప్రొఫెషనల్స్, మిత్ర బృందాలు, దంపతులు, కార్యాలయ మిత్రుల కోసం ఏదో రకమైన ఆఫర్లు అందుబాటులో ఉంటున్నాయని ఎస్ఓటీసీ ట్రావెల్ ప్రెసిడెంట్ నందకుమార్ పేర్కొన్నారు. జెన్ జెడ్, మిలీనియల్స్, దంపతులు, ఉద్యోగుల నుంచి వీటికి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. మెట్రో నగరాలే కాకుండా రెండో అంచె, మూడో అంచె నగరాల్లోనూ ఆఫర్లకు గిరాకీ పెరిగిపోతోందన్నారు. స్వల్ప వ్యవధిలో వెళ్లి వచ్చే ప్యాకేజీలను నేటి యువతరం ఇష్టపడుతోందని వెల్లడించారు.

● స్వల్ప విరామాలు, చిన్న ట్రిప్‌లు, వీకెండ్‌లో బయటకు వెళ్లడం వంటివి సర్వసాధారణంగా మారిపోయాయని క్లియర్‌ట్రిప్ పేర్కొంది. ఈ సీజన్ బుకింగ్‌లలో 46 శాతం పెరుగుదల కనిపించిందని తెలిపింది. మొదటి అంచె నగరాలు తొలి స్థానంలో ఉన్నాయని వెల్లడించింది. గిరాకీ పెరుగుతున్నప్పటికీ హోటళ్ల ధరలు మాత్రం స్థిరంగా ఉన్నాయని, విమాన టికెట్ ధరలు కాస్త పెరిగినా అవి కూడా పర్యాటకులకు అందుబాటులోనే ఉన్నాయని వివరించింది.

● ఈ ఏడాది వర్షాకాల సీజన్‌లో పర్యాటకుల్లో గణనీయ పెరుగుదల కనిపిస్తోందని ఇక్సిగో గ్రూప్ సహ సీఈఓ రజ్‌నీష్ కుమార్ పేర్కొన్నారు. సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కొందరు తమ ప్రణాళికలను వాయిదా వేసుకున్నారని గుర్తు చేశారు. గతేడాది వర్షాకాలంతో పోలిస్తే ప్రస్తుతం విమాన టికెట్ల బుకింగ్‌లు 25-30 శాతం పెరిగాయని.. పోర్ట్‌బ్లెయిర్, తిరుపతి, ఉదయ్‌పుర్, కోయంబత్తూర్, దేహ్రాదూన్ వంటి ప్రదేశాలకు మంచి గిరాకీ ఉందన్నారు.

'వికసిత్ భారత్'కు ఏటా 10% ఆర్థిక వృద్ధి అవసరం

సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మెమాని



దిల్లీ: వికసిత్ భారత్ - 2047 లక్ష్యాన్ని సాధించడానికి దేశంలో ప్రతి ఏటా స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) 10% వృద్ధి చెందడం అవసరం అని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) అధ్యక్షుడు రాజీవ్ మెమాని తెలిపారు. 'అమెరికా-భారత్ మధ్య త్వరలోనే మధ్యంతర వాణిజ్య ఒప్పందం పూర్తి అవుతుందని భావిస్తున్నాను. దీని ద్వారా భారత పరిశ్రమలకు ముఖ్యంగా కార్మికులు అధికంగా పని చేసే రంగాలకు అమెరికా మార్కెట్లోకి ప్రవేశం లభిస్తుంది. 'వాణిజ్య ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య సాంకేతికతను బదలాయించుకోవడానికి, భాగస్వామ్యాలకు ఒక మార్గం ఏర్పడుతుంద'ని రాజీవ్ పేర్కొన్నారు.

● ఒత్తిడికి లోనై భారత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోదని, జాతి ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని రాజీవ్ పేర్కొనడం గమనార్హం. భారత్ వాణిజ్య ఒప్పందం అతి త్వరలో ఉంటుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గుతుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

కోడి గుడ్లు

7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	560	గోదావరి	535
వరంగల్	562	విశాఖపట్నం	560
విజయవాడ	570	చిత్తూరు	633

పసిడి కిందకొస్తుంది!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.97,780 కంటే పైన చలించకుంటే రూ.95,380 వరకు దిద్దుబాటు కొనసాగే అవకాశం ఉంది. ఒకవేళ రూ.97,780 ఎగువకు వెళ్తే రూ.98,050; రూ.99,116 వరకు పెరుగుతుందని భావించవచ్చు.

వెండి



వెండి సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,06,683 దిగువన చలించకుంటే మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే రూ.1,09,452 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయినీ అధిగమిస్తే రూ.1,10,475; రూ.1,12,221 వరకు వెళ్లే అవకాశం ఉంటుంది.

ప్రాథమిక లోహాలు



● రాగి జులై కాంట్రాక్టును ఈవారం రూ.886 దిగువన మాత్రమే షార్ట్ సెల్ చేయడం మంచిది. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.903.55 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయి కంటే పైకి వెళితే రూ.915.25; రూ.924.55 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు.

● సీసం జులై కాంట్రాక్టు ఈవారం రూ.181 కంటే పైన చలిస్తే మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. లేకుంటే దిద్దుబాటు కావచ్చు. అందువల్ల లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్‌ను పెట్టుకోవడం మంచిది.

● జింక్ జులై కాంట్రాక్టు ఈవారం రూ.255.60 కంటే దిగువన ట్రేడయితే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు. అదే సమయంలో రూ.258.80 కంటే పైకి వెళితే రూ.260.90; రూ.262.70 వరకు వెళ్తుందని అనుకోవచ్చు.

● అల్యూమినియం జులై కాంట్రాక్టు ఈవారం రూ.252 కంటే దిగువన ట్రేడయితే షార్ట్ సెల్లింగ్ చేయొచ్చు. అయితే రూ.254.15 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణించాలి. ఎందుకంటే రూ.254.15 స్థాయిని మించితే రూ.259.80; రూ.263 వరకు వెళ్లే అవకాశం ఉండటమే ఇందుకు కారణం.


ఇంధన రంగం



● ముడి చమురు జులై కాంట్రాక్టు ఈవారం రూ.5,525 కంటే దిగువకు రాకుంటే లాంగ్ పొజిషన్లను కొనసాగించడం మంచిదే. ఒకవేళ రూ.5,547 కంటే కిందకు వస్తే రూ.5,405; రూ.5285 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంటుంది.

● సహజవాయువు జులై కాంట్రాక్టు ఈవారం రూ.303 కంటే పైన కదలాడకుంటే షార్ట్ సెల్ వైపు మొగ్గు చూపొచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.310.55 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.329.65; రూ.343.65 వరకు వెళ్లే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.13,060 కంటే కిందకు వస్తే రూ.12,722; రూ.12,112 వరకు దిద్దుబాటు కావచ్చు. రూ.14,008 కంటే పైన కదలాడితే రూ.14,618; రూ.14,956 వరకు రాణించే అవకాశం ఉంది.

● పత్తి క్యాండీ జులై కాంట్రాక్టుకు ఈవారం రూ.53,536 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.52,873; రూ.52,246 వరకు దిగివచ్చే అవకాశం ఉంటుంది. అలాగే రూ.54,826 కంటే పైకి వెళితే రూ.55,453; రూ.56,116 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

- ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి (శాతంలో)
పసిడి (ఆగస్టు)	95,492	96,988	1.57
వెండి (సెప్టెంబరు)	1,06,281	1,08,429	2.02
రాగి (జులై)	888.05	891.90	0.43
సీసం (జులై)	179	181.45	1.37
జింక్ (జులై)	258	256.70	(0.50)
అల్యూమినియం (జులై)	255.90	248.50	(2.89)
ముడి చమురు (జులై)	5,589	5,690	1.81
సహజ వాయువు (జులై)	315.70	291.40	(7.70)
పసుపు (ఆగస్టు)	14,198	13,398	(5.63)
పత్తి క్యాండీ (జులై)	53,500	54,200	1.31

ఈ వారమూ సూచీలు పెరిగే అవకాశం!



● అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం కీలకం ● 10న టీసీఎస్ ఫలితాలపై దృష్టి

స్టాక్ మార్కెట్ ఈ వారం

● ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా షేర్లు రాణించొచ్చు

● సిమెంటు, వాహన షేర్లకు ప్రతికూలతలు ● విశ్లేషకుల అంచనాలు

అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య చర్చల ఫలితం ఈ వారమే బయటకు రానున్నందున, దేశీయ సూచీలు సానుకూల ధోరణిలో చలించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశీయంగా ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కానుండటంతో షేరు/రంగం ఆధారిత కదలికలు చోటు చేసుకోవచ్చు. నిఫ్టీ-50 సూచీ 25,200-25,900 పాయింట్ల మధ్య చలించొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 26,000 పాయింట్లను కూడా అధిగమించే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఔషధ, ఆరోగ్య సంరక్షణ షేర్లకు సానుకూల పరిణామాలు ఉన్నాయని, ఎఫ్ఎంసీజీ షేర్లు స్థిరీకరణ దిశగా పయనించినా, సమీప కాలంలో బుల్లిష్‌గా ఉంటాయని వెల్లడించారు. జూన్ త్రైమాసికంలో కంపెనీ రెండంకెల ఆదాయ వృద్ధి నమోదు చేయొచ్చని గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ గత శుక్రవారం మార్కెట్ ముగిసిన అనంతరం ప్రకటించిన నేపథ్యంలో నేడు ఈ షేర్లను గమనించొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● ఎలాంటి ప్రధాన వార్తలూ లేనందున, టెలికాం షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. రంగం ఆధారిత వార్తలు ప్రభావితం చేయొచ్చు. ఈ వారం భారతీ ఎయిర్‌టెల్ షేరు రూ.1,960-2,070 మధ్య చలించొచ్చు.

● గిరాకీ స్తబ్దుగా ఉన్నందున, సిమెంటు కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. వర్షాల వల్ల నిర్మాణ కార్యకలాపాలపై ప్రభావం పడి గిరాకీ తగ్గింది. దీంతో సమీపకాల అంచనాలు బలహీనంగా ఉన్నాయి.

● కీలక వాణిజ్య భాగస్వాములతో అమెరికా జరుపుతున్న వాణిజ్య, టారిఫ్ చర్చల నుంచి లోహ కంపెనీల షేర్లు సంకేతాలు అందుకోవచ్చు. ఉక్కు ఉత్పత్తులపై సేఫ్‌గార్డ్ సుంకం పెంచే అవకాశం ఉండటం సమీప కాలంలో కలిసి రావొచ్చు.

● చమురు-గ్యాస్ కంపెనీల షేర్లు సానుకూలంగా చలించొచ్చు. జూన్ త్రైమాసిక ఫలితాల ఆధారంగా ఈ రంగ షేర్లలో కదలికలు ఉండొచ్చు.

● ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు సానుకూల ధోరణిలో చలించొచ్చు. దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు సానుకూలంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం తగ్గడం, వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఉండటం కలిసిరావొచ్చు.

● ఐటీ కంపెనీల షేర్లు సానుకూల ధోరణిలో ట్రేడయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కానున్నందున.. ఈ కంపెనీల ఆర్థిక వృద్ధి, యాజమాన్య వ్యాఖ్యలను మదుపర్లు గమనించొచ్చు. ఈ నెల 10న టీసీఎస్ ప్రకటించబోయే ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు.

● బలమైన ఆర్డర్ల రాక, అధిక మార్జిన్లపై అంచనాలతో యంత్రపరికరాల షేర్లు సమీప కాలంలో సానుకూల ధోరణిలో చలించొచ్చు.

● ఫార్మా కంపెనీల షేర్లు స్వల్పకాలంలో సానుకూలంగా కదలాడొచ్చు. అమెరికా టారిఫ్‌లు, విధాన మార్పులు ఈ రంగ షేర్లకు దారి చూపించొచ్చు.

● వాహన షేర్లు స్వల్ప కాలంలో ఒత్తిడికి గురి కావొచ్చు. బలహీన విక్రయాలు, గిరాకీ తగ్గడం, సరఫరా చైన్‌లో అవాంతరాలు, టారిఫ్ సంబంధిత వార్తలు ప్రభావం చూపొచ్చు..

● బ్యాంక్ నిఫ్టీ ఈ వారం జీవనకాల గరిష్ఠాన్ని తాకొచ్చు. ప్రైవేటు బ్యాంకుల షేర్లు మంచి పని తీరు కనబరచవచ్చు. 57,500 పాయింట్ల పైకి వెళితే 58,500 వరకు పెరిగేందుకు అవకాశం ఉంది. 56,000-57,500 మధ్య స్థిరీకరించుకోవచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	249.85	253.40	246.60
బజాజ్ ఆటో	8433.00	8501.30	8330.30
ఐషర్ మోటార్స్	5629.00	5750.30	5559.30
హీరో మోటోకార్ప్	4345.00	4409.90	4274.70
ఎం అండ్ ఎం	3162.50	3200.80	3115.00
మారుతీ	12646.00	12807.30	12527.30
టాటా మోటార్స్	689.05	695.90	682.90
టీవీఎస్ మోటార్	2880.10	2943.80	2817.40

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5771.50	5878.20	5703.20
కోల్గేట్ పామోలివ్	2446.70	2473.20	2413.20
డాబర్ ఇండియా	495.10	500.50	488.90
ఇమామీ	562.55	568.80	553.70
హిందుస్థాన్ యునిలీవర్	2339.30	2361.40	2299.20
ఐటీసీ	412.55	416.40	409.90
మారికో	728.60	752.00	713.50

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	260.15	265.80	255.40
సీజీ పవర్	676.60	685.90	664.60
ఎల్ అండ్ టీ	3594.60	3618.10	3558.30
సీమెన్స్	3292.40	3366.10	3200.10
థెర్మాక్స్	3458.50	3530.20	3394.20

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1191.30	1220.70	1143.90
బయోకాన్	380.05	386.20	369.60
సిప్లా	1513.30	1529.80	1495.60
డాక్టర్ రెడ్డీస్	1307.40	1328.30	1276.70
గ్లెన్‌మార్క్ ఫార్మా	1830.40	1884.50	1747.90
లుపిన్	1980.90	2017.00	1939.00

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1965.00	2011.90	1923.10
అంబుజా సిమెంట్స్	595.75	608.40	582.40
ఇండియా సిమెంట్స్	344.20	352.50	334.60
శ్రీ సిమెంట్	31315.00	31755.00	30955.00
అల్ట్రాటెక్ సిమెంట్	12506.00	12664.00	12262.00

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	699.45	707.90	685.20
హిందుస్థాన్ జింక్	445.15	451.50	439.90
ఎన్ఎండీసీ	68.78	70.00	67.70
సెయిల్	134.72	138.10	132.00
టాటా స్టీల్	163.01	168.30	159.30
వేదాంతా	459.05	467.80	450.70

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1989.30	2014.40	1967.40
ఐసీఐసీఐ బ్యాంక్	1442.80	1459.40	1412.80
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	77.88	79.10	76.50
ఇండస్ఇండ్ బ్యాంక్	856.25	871.00	842.00
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2129.80	2152.30	2099.70
పీఎన్‌బీ	110.85	111.80	109.40
ఎస్‌బీఐ	811.85	819.70	800.20

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1527.30	1537.60	1512.00
బీపీసీఎల్	346.20	357.70	326.10
హెచ్‌పీసీఎల్	446.60	452.80	432.00
ఐఓసీఎల్	151.62	154.60	146.40
ఓఎన్‌జీసీ	245.24	247.30	241.50
ఆయిల్ ఇండియా	445.75	458.40	437.80

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1725.90	1743.20	1697.60
ఇన్ఫోసిస్	1640.70	1663.20	1601.00
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5896.00	6039.70	5766.70
టీసీఎస్	3419.80	3449.20	3375.40
టెక్ మహీంద్రా	1655.20	1676.60	1629.80
విప్రో	270.05	273.60	265.80

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,017.20	2,051.00	1,988.20
ఎమ్‌టీఎన్ఎల్	50.23	51.50	49.20
టాటా కమ్యూనికేషన్స్	1,762.40	1,806.40	1,732.40
వొడాఫోన్ ఐడియా	7.36	7.60	7.20

ఈనాడు

విజయవాడ 7-7-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 328 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

స్టెల్త్ విమానాలూ దొరికిపోతాయ్!

భారత తొలి ఫొటానిక్ రాడార్ సిద్ధం



రక్షణ పరిజ్ఞానంలో భారత్ కీలక మైలురాయిని సాధించింది. శత్రువుల గగనతల దాడి యత్నాలను మరింత ముందుగా, విస్పష్టంగా పసిగట్టేందుకు కీలక టెక్నాలజీని సమకూర్చుకుంది. తొలిసారిగా ఫొటానిక్ రాడార్‌ను రూపొందించింది. తద్వారా.. అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది. రాడార్లను ఏమార్చే స్టెల్త్ యుద్ధవిమానాలనూ ఇది ఇట్టే పసిగడుతుంది. శత్రువుల ఎలక్ట్రానిక్ జామింగ్ తంత్రాలకు ఇది లొంగదు. బెంగళూరులో డీఆర్‌డీవోకు సంబంధించిన ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ల్యాబ్ దీన్ని అభివృద్ధి చేసింది.

సంప్రదాయానికి భిన్నం

ప్రస్తుతం ఉపయోగిస్తున్న సైనిక రాడార్ వ్యవస్థలను 1940లలో అభివృద్ధి చేశారు. అవి రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) తరంగాల సాయంతో నింగిలోని లక్ష్యాలను గుర్తించడంతోపాటు ఎంత దూరంలో ఉన్నాయి, ఎంత వేగంతో పయనిస్తున్నాయి.. వంటి వివరాలను సేకరిస్తాయి.

- వీటితో.. తక్కువ ఎత్తులో, తక్కువ వేగంతో ఎగిరే యుద్ధవిమానాలు, డ్రోన్లు, రాడార్లను ఏమార్చే స్టెల్త్ ఫైటర్ జెట్‌లను గుర్తించడం కష్టం.
- ఈ ఇబ్బందులను అధిగమించడానికి ఫొటానిక్ రాడార్ పరిజ్ఞానం తెరపైకి వచ్చింది. ఇది ఆర్ఎఫ్ తరంగాలకు బదులు ఫొటానిక్స్‌ను ఉపయోగిస్తుంది. అంటే కాంతి తరంగాలన్నమాట!
- ఇది ప్రధానంగా కాంతిని రాడార్ తరంగాలుగా మారుస్తుంది. ఈ వ్యవస్థలో ప్రధానంగా లేజర్లు, ఆప్టికల్ ఫైబర్లను వినియోగిస్తారు. దీనివల్ల రాడార్ వేగవంతమైన, మరింత కచ్చితమైన పనితీరును కనబరుస్తుంది.
- సంప్రదాయ ఆర్ఎఫ్ రాడార్లకు బ్యాండ్‌విడ్త్ పరిమితులు ఉంటాయి. ఫొటానిక్ రాడార్లు స్పెక్ట్రమ్‌లోని అనేక తరంగ దైర్ఘ్యాల్లో పనిచేస్తాయి. అందువల్ల వాటికి విస్తృత బ్యాండ్‌విడ్త్ ఉంటుంది.
- అమెరికా, చైనా, ఇజ్రాయెల్ వంటి దేశాలు ఫొటానిక్ ఆధారిత వ్యవస్థలపై విస్తృతంగా దృష్టిపెట్టాయి.

ఎన్నో ప్రయోజనాలు

- అత్యంత ఎక్కువ స్పష్టతతో బహుళ లక్ష్యాలను ఏకకాలంలో త్రీడీలో పరిశీలించడానికి ఫొటానిక్ రాడార్లు వీలు కల్పిస్తాయి. వేగం, కచ్చితత్వం విషయంలో వీటికి తిరుగులేదు.
- సంప్రదాయ రాడార్లు గుర్తించలేని స్టెల్త్ యుద్ధవిమానాలు, డ్రోన్లు, క్షిపణులను ఇవి పసిగట్టగలవు.
- ప్రత్యర్థులపై దాడులతోపాటు నిఘాకూ ఇవి ఉపయోగపడతాయి.
- రాడార్లను స్తంభింపచేయడానికి శత్రు దళాలు జామింగ్ వంటి ఎలక్ట్రానిక్ కౌంటర్ మెజర్స్‌ను ప్రయోగిస్తుంటాయి. ఈ విధానాలేవీ ఫొటానిక్ రాడార్ల ముందు పనిచేయవు.
- ఫొటానిక్ రాడార్లు తక్కువ వేడిని ఉత్పత్తి చేస్తాయి. అందువల్ల సమర్థంగా పనిచేస్తాయి.
- ఈ రాడార్ ప్రధాన బలం.. ఫొటానిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు. ఇవి సంకేతాలను వేగంగా విశ్లేషిస్తాయి. ఈ క్రమంలో ఆ సంకేతానికి తక్కువగా నష్టం వాటిల్లుతుంది.

చైనా, పాక్‌కు చిక్కులే!



స్టెల్త్ యుద్ధవిమానాలు, డ్రోన్ పరిజ్ఞానంపై చైనా, పాకిస్థాన్‌లు భారీగా పెట్టుబడి పెట్టాయి. చైనాకు చెందిన జె-20 స్టెల్త్ యుద్ధవిమానాలు, పాక్‌కు చెందిన డ్రోన్లు సాధారణ రాడార్లను ఏమార్చడంపై ప్రధానంగా దృష్టిపెడుతున్నాయి. ఈ వ్యూహాలను ఫొటానిక్ రాడార్లతో అడ్డుకోవచ్చు.

- శత్రువుల వైమానిక, క్షిపణి దాడుల గురించి ముందే సమాచారం ఇచ్చే గగనతల హెచ్చరిక వ్యవస్థల్లో ఈ రాడార్లను అమర్చవచ్చు. అందువల్ల ముప్పులను త్వరగా గుర్తించొచ్చు. హైపర్‌సోనిక్ అస్త్రాలనూ పసిగట్టొచ్చు.

త్వరలో విస్తృత పరీక్షలు

- ఫొటానిక్ రాడార్ పనితీరును విశ్లేషించడానికి డీఆర్‌డీవో ఈ ఏడాది చివరి నుంచి విస్తృతంగా పరీక్షలు నిర్వహించనుంది. పర్వత, తీర ప్రాంతాల్లోనూ ఇవి సాగనున్నాయి.
- ప్రస్తుతం భారత్‌వద్ద ఉన్న ఆకాశ్‌తీర్ వంటి గగనతల రక్షణ వ్యవస్థలతో ఈ రాడార్ అనుసంధానానికీ చర్యలు చేపట్టనున్నారు.
- దేశంలోని అగ్రశ్రేణి యుద్ధవిమానాలైన సుఖోయ్-30ఎంకేఐ, రఫేల్, తేజస్‌లలో దీన్ని అమర్చే వీలుంది.
- ఫొటానిక్ రాడార్ చిన్నగా ఉండటంతో సంచార వేదికలపైనా దాన్ని అమర్చడానికి వీలవుతుంది. అందువల్ల పాకిస్థాన్, చైనా సరిహద్దుల వెంబడి సులువుగా మోహరించొచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

జలాశయానికి ప్రమాదమేమీ లేదు

- శ్రీశైలం ప్లంజ్‌పూల్‌లో గొయ్యితో విద్యుత్తు కేంద్రాల పునాదులకు ముప్పు
- ప్రభుత్వ సలహాదారు కన్నయ్యనాయుడు



శ్రీశైలం ఆనకట్ట గేట్ల పరిశీలనకు వెళ్తున్న కన్నయ్యనాయుడు, శ్రీరామచంద్రమూర్తి తదితరులు

ఈనాడు, కర్నూలు; న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్: శ్రీశైలం జలాశయ ప్లంజ్‌పూల్‌లో భారీ గొయ్యి కారణంగా విద్యుత్తు కేంద్రాల పునాదులకు పగుళ్లు ఏర్పడే ముప్పు ఉందని ప్రభుత్వ సలహాదారు, రిజర్వాయర్ల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు తెలిపారు. అయితే ప్రధాన ఆనకట్టకు ప్రమాదమేమీ లేదన్నారు. ఆదివారం ఆయన శ్రీశైలం జలాశయ గేట్లను పరిశీలించారు. డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తితో కలిసి తనిఖీ మార్గం నుంచి వెళ్లి 12 గేట్లను దగ్గర నుంచి చూశారు. యంత్ర విభాగాలనూ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'రెండు విద్యుత్తు కేంద్రాల మధ్య ప్లంజ్‌పూల్ గొయ్యి ఉంది. 2009లో డ్యాం ఎఫ్ఆర్ఎల్ కన్నా 9 అడుగుల ఎత్తున ప్రవాహం వచ్చినప్పుడు ఒక్కో గేటు సామర్థ్యం కన్నా అధిక నీటిని వదిలారు. ఆ ప్రభావం వల్లే ప్లంజ్‌పూల్‌లో గొయ్యి ఏర్పడింది. ఇది డ్యాం ఆఖరి పాయింట్ నుంచి 60 మీటర్ల దూరంలో ఉండటం వల్ల ఆనకట్టకు ముప్పు లేదు. ఆందోళన చెందాల్సినంతగా లీకేజీలు లేవు. గేట్ల దగ్గర లీకేజీ పరిమితికి లోబడే ఉంటోంది. గేట్లకు 2010 తర్వాత ఇప్పటి వరకూ రంగులు వేయలేదు. కొన్ని తుప్పు పట్టాయి. వాటి నిర్వహణపై నివేదిక ఇస్తాం. డ్యాం గేట్లు ఏర్పాటుచేసి 40 ఏళ్లు గడిచాయి. కాల పరిమితి మరో ఐదేళ్లు ఉంది. జాగ్రత్తగా నిర్వహిస్తే మరో 30ఏళ్ల వరకు ఢోకా ఉండదు' అని వివరించారు. ప్రభుత్వం గేట్ల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

పెరుగుతున్న నీటిమట్టం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు జూరాల, సుంకేసుల నుంచి 1,76,434 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 879.30 అడుగులకు చేరింది. గరిష్ఠ నీటినిల్వ 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 184.27 టీఎంసీలుగా నమోదైంది. కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాలకు 67,740 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పురమిత్ర యాప్.. సమస్యలకు చెక్

ఫొటో అప్‌లోడ్ చేస్తే 24 గంటల్లో పరిష్కారం

పెద్దవైతే 3-15 రోజుల్లో చర్యలు

మూడున్నర నెలల్లో 9,889 సమస్యలు తీర్చిన అధికారులు

విజయవాడలోని పటమటలో పాడైన కల్వర్టు కారణంగా మురుగునీరు నిలిచిపోవడంతో ఏడాదిగా ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. రెండు నెలల క్రితం స్థానికుడు దుర్గారావు ఆ పరిస్థితిని ఫొటోలు తీసి, పురమిత్ర యాప్‌లో అప్‌లోడ్ చేశారు. నగరపాలక సంస్థ అధికారులు పాడైన కల్వర్టుకు పది రోజుల్లోనే మరమ్మతులు చేయించి, మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపారు.




పుర, నగరపాలక సంస్థల కమిషనర్లు, అధికారులు, సిబ్బంది వీధుల్లో పర్యటిస్తూ సమస్యలు గుర్తించి పరిష్కరించే రోజులు పోతున్నాయి. ప్రజలే సమస్యలపై అధికారులను అప్రమత్తం చేసే రోజులొచ్చాయి. ఇందుకోసం పురపాలక శాఖ పురమిత్ర యాప్‌ను ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్మార్ట్‌ఫోన్‌తో అక్కడి సమస్య తీవ్రత తెలిసేలా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తే చాలు.. సిబ్బంది 24 గంటల వ్యవధిలో సమస్యను పరిశీలించేందుకు వస్తున్నారు. చిన్న సమస్యలైతే వెంటనే, పెద్దవైతే 3 నుంచి 15 రోజుల్లో పరిష్కరిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 15న యాప్‌ను ప్రారంభించగా మూడున్నర నెలల్లో 10,421 సమస్యలపై ప్రజలు స్పందించారు. వీటిలో ఇప్పటి వరకు 9,889 పరిష్కారమయ్యాయి.

గడువులోగా పరిష్కరించకపోతే అధికారులదే బాధ్యత

ఈ యాప్‌లో రోజూ గరిష్ఠంగా 50-70 వరకు సమస్యలు అధికారుల దృష్టికి వస్తున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలులలో స్థానికులు బాగా స్పందిస్తున్నారు. ఈ సమస్యలను అధికారులు ఎన్ని గంటలు/ రోజుల వ్యవధిలో పరిష్కరించాలో పురపాలక శాఖ కమిషనర్లకు నిర్దేశించింది. అప్పటిలోగా పరిష్కరించకపోతే సంబంధిత అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు బాధ్యులను చేస్తున్నారు. దీంతో అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. ఇప్పటి వరకు 95 % సమస్యలను గడువులోగానే పరిష్కరించారు.

పురమిత్ర యాప్ ప్రారంభించాక ఇప్పటి వరకు వచ్చిన సమస్యలు, పరిష్కరించినవి



యాప్ డౌన్‌లోడ్‌పై విస్తృత ప్రచారం

స్మార్ట్‌ఫోన్లలో ప్లే స్టోర్ నుంచి పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే 82,091 మంది డౌన్ లోడ్ చేసుకున్నారు. ఈ నెలాఖరుకు దీన్ని 2.50 లక్షలకు చేర్చాలనే లక్ష్యంతో పట్టణాలు, నగరాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. 'ఇప్పటి వరకు యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న ప్రజల నుంచి స్పందన బాగుంది. కమిషనర్లు తక్షణమే చర్యలు తీసుకునేలా ఆదేశాలిచ్చాం. అమలును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం' అని పురపాలకశాఖ సంచాలకులు సంపత్‌కుమార్ తెలిపారు.

- ఈనాడు, అమరావతి

రైతుల గోడు.. వింటే మేలు

- అభ్యంతరకర భూముల్లో వచ్చిన రిటర్నబుల్ ప్లాట్లతో ఇక్కట్లు
- రిజిస్ట్రేషన్లు కాక కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులు
- కూటమి ప్రభుత్వం చొరవ చూపితేనే పరిష్కారం



తుళ్లూరు పరిధిలో రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-తుళ్లూరు: రాజధాని అమరావతికి భూములు ఇచ్చి అభ్యంతరకరమైన, రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేనిచోట్ల రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతుల కష్టాలు తీరడం లేదు. అటు రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేక, ఇటు అవసరానికి అమ్ముకునే పరిస్థితి లేక అవస్థలు పడుతున్నారు. జీవనాధారమైన తమ భూములను రాజధాని కోసం త్యాగం చేసినవారు తమ ప్లాట్లను మార్చాలని సీఆర్డీఏ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ సమస్యను వైకాపా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఐదేళ్లూ గాలికొదిలేసింది. ఫలితంగా రైతులకు అత్యవసర సమయాల్లో అక్కరకు వస్తాయనుకున్న ప్లాట్లు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

భూములు బదిలీ కాక పీటముడి..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో తొలిదశలో 28 వేల మందికి పైగా రైతుల నుంచి 34,000కు పైగా ఎకరాలను సమీకరించారు. భూములు ఇచ్చిన వారికి నివాస, వాణిజ్య ప్లాట్లను అభివృద్ధి చేసి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న సీఆర్డీఏ.. 64,735 ప్లాట్లను కేటాయించింది. 2019లో జగన్ సర్కారు రాకతో ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ ఆగింది. సుమారు 3,500 మంది రైతులకు సీఆర్డీఏ ఆధీనంలో లేని అటవీ, వక్ఫ్, దేవాదాయ, రెవెన్యూ తదితర భూముల్లో ప్లాట్లు రావడంతో అవి రిజిస్ట్రేషన్ కాలేదు. భూసేకరణలో ఉన్న భూముల్లోనూ పలువురు రైతులకు ప్లాట్లు వచ్చాయి. ఈ భూములు రైతుల పేరిట రిజిస్ట్రేషన్ జరగాలంటే ఆయా ప్రభుత్వ శాఖల నుంచి సీఆర్డీఏకు బదిలీ కావాల్సి ఉంది.

కక్షతో పట్టించుకోని వైకాపా ప్రభుత్వం..


భూముల బదిలీ విషయంలో సీఆర్డీఏ, గుంటూరు జిల్లా అధికారులు చొరవ చూపాలి. ప్రభుత్వం దీనిపై దృష్టి పెడితే తేలికగా పరిష్కారం అవుతుంది. జగన్ జమానాలో ఐదేళ్లూ పట్టించుకోలేదు. ఒప్పందం ప్రకారం రైతులకు వివాదాల్లేని ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. గతంలో తెదేపా హయాంలో సమీకరణలో భూములు ఇవ్వని ప్రాంతాల్లో భూసేకరణ కింద తీసుకునేందుకు ప్రకటన ఇచ్చింది. వాటిలోనూ దాదాపు వెయ్యి మందికి రిటర్నబుల్ ప్లాట్లు వచ్చాయి. పలు భూములు కోర్టు వివాదాల్లో ఉన్నాయి. కేసులు త్వరగా పరిష్కారం అయ్యే మార్గాలపై అధికారులు దృష్టి పెట్టలేదు.

అవసరానికి ఉపయోగపడక రైతుల అవస్థ

రిటర్నబుల్ ప్లాట్లు అక్కరకు వస్తాయని ఆశించిన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. పిల్లల విద్యావసరాలకు, పెళ్లిళ్ల, ఆరోగ్య అవసరాలకు కష్టాలు తప్పడం లేదు. కొందరైతే మందులు కొనేందుకూ డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో ప్లాట్లను అమ్ముకుందామన్నా రిజిస్ట్రేషన్ కావట్లేదు.

- మందడం రైతు ఆలూరి యుగంధర్.. తన కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న 10 ఎకరాల పొలాన్ని పూలింగ్‌లో సీఆర్డీఏకు ఇచ్చారు. ప్రతిగా 9,600 చదరపు గజాల నివాస ప్లాట్‌ను కేటాయించారు. అతనికి ఇదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో ప్లాట్ వచ్చింది. ఆయన తన పొలాన్ని సమీకరణలో ఇవ్వలేదు. ఈ ప్లాట్‌ను తన కుమార్తెకు కట్నం కింద ఇద్దామని యుగంధర్ భావించారు. గత ఆరేళ్లుగా ఆ ప్లాట్‌ను మార్చి, వేరే చోట ఇవ్వాలని అడుగుతున్నా, ఎవరూ స్పందించడం లేదు.
- అనంతవరం గ్రామస్థుడు సంగా ఏసుపాదం ఆటో నడిపి జీవిస్తున్నారు. 55 సెంట్ల భూమిని రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చారు. సీఆర్డీఏ 270 చదరపు గజాల నివాస ప్లాట్‌ను కేటాయించింది. 27.5 చదరపు గజాలకు టీడీఆర్ బాండ్ ఇస్తామని చెప్పారు. అయితే ఈ ప్లాట్ గ్రామంలో పూలింగ్‌కు ఇవ్వని రైతు పొలంలో వచ్చింది. దీనిని రద్దు చేయాలని సీఆర్డీఏకు రెండేళ్ల కిందట అర్జీ పెట్టుకోగా రద్దు చేశారు. వేరే చోట ప్లాటు కేటాయించాలని సీఆర్డీఏ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. పిల్లల చదువులకు ప్లాట్ అమ్ముదామన్నా వీలు కాని పరిస్థితి.
- వెలగపూడివాసి ధనసిరి శ్రీనివాసరావు పూలింగ్‌లో 4.5 ఎకరాలు ఇచ్చారు. ఇతనికి 650, 150, 150 చదరపు గజాల వాణిజ్య ప్లాట్లను.. భూసమీకరణలో ఇవ్వని రంగారావుకు చెందిన భూమిలో కేటాయించారు. దీంతో సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఆరోగ్య అవసరాలకు, కుటుంబ పోషణకు తల్లడిల్లుతున్నారు. ప్లాట్లు అమ్ముకొని చిన్న వ్యాపారం ప్రారంభించి కుమారుడి వివాహం చేయాలనుకున్నారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారు.

ఘనంగా దలైలామా జన్మదిన వేడుకలు



హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లా మెక్‌లియోడ్‌గంజ్‌లో జరిగిన తన 90వ పుట్టినరోజు వేడుకల్లో కేక్ తింటున్న టిబెట్ బౌద్ధ మతగురువు దలైలామా.



ఉత్సవాల్లో భాగంగా ఓ యువతి అద్భుత విన్యాసం

వివరాలు 9లో

ఆగస్టు 27 నుంచి వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలు ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 16 వరకు 21 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పెంచల కిషోర్ ఆదివారం ప్రకటించారు. ఆగస్టు 27న వినాయకచవితి, రాత్రి గ్రామోత్సవం, 28న ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం, 29న నెమలి, 30న మూషిక, 31న ఉదయం చిన్నశేష, రాత్రి బంగారు పెద్దశేష వాహనం, సెప్టెంబరు 1న ఉదయం చిలుక, రాత్రి వృషభ, 2న గజ, 3న రథోత్సవం, 4న ఉదయం భిక్షాండి, రాత్రి తిరుకల్యాణం, అశ్వవాహనం, 5న ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ప్రత్యేక ఉత్సవాల్లో 6న అధికార నంది, 7న ఉదయం రావణబ్రహ్మ, 8న యాళి, 9న సూర్యప్రభ, 10న చంద్రప్రభ, 11న కల్ప వృక్ష, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకీ సేవ, 14న కామధేను, 15న పూలంగి సేవ, 16న తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో పేర్కొన్నారు.

రాజు వేగేశ్న ఫౌండేషన్ సంచాలకుడు ఆనందరాజు కన్నుమూత



విశాఖపట్నం (కార్పొరేషన్), న్యూస్‌టుడే: రాజు వేగేశ్న ఫౌండేషన్ సంచాలకుడు వేగేశ్న ఆనంద రాజు(67) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలోని పెదవాల్తేర్ డాక్టర్స్ కాలనీలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఫౌండేషన్ నిర్వహణలో ఆనందరాజు కీలకంగా వ్యవహరిస్తూ.. దాని ద్వారా దేశంలోని వివిధ ఆలయాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రూ.కోట్లు వెచ్చించారు. రూ.77 కోట్లతో తిరుమలలో అన్నదాన సత్రం, రూ.27 కోట్లతో నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణకు ఏటా రూ.1.50 కోట్లు ఇస్తున్నారు. శ్రీశైలంలో నీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. తిరుపతి, ద్వారకా తిరుమలలో ఆసుపత్రులు నిర్మించారు. ఆయన స్వస్థలమైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గణపవరంలో ఆరు ఎకరాల స్థలం కొనుగోలు చేసి.. పేదలకు ఇళ్ల స్థలాలు అందించారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రూ.25 కోట్లతో అన్నదాన సత్రం నిర్మించారు. దేవాలయాలు ఉన్న చోట బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో అనేక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ, ద్వారకా బస్టాండ్‌లోనూ సౌకర్యాలు కల్పించారు. పేదలు, ఆపదలో ఉన్న కుటుంబాల్లోని పిల్లల చదువుకు ఆయనవంతుగా నిధులు సమకూర్చారు. 1979లో ఆయన విశాఖ వచ్చేశారు. వేదిక నుంచి ఇటు హైదరాబాద్‌లో, ఇటు విశాఖలో ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వచ్చారు.

800 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం బస్తాలు

అనంతవరప్పాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలో భారీగా రేషన్ బియ్యం పట్టుబడింది. సీఐ రామానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారుల బృందం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని శ్రీవల్లి రైస్ మిల్లులో ఆదివారం తనిఖీలు చేయగా.. అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 800 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికింది. బియ్యం తరలించేందుకు వినియోగిస్తున్న రెండు వాహనాలను కూడా సీజ్ చేశారు. బియ్యం నిల్వలను గుంటూరు దక్షిణ మండల డీఎస్పీ భానోదయ పరిశీలించారు. వట్టిచెరుకూరు తహసీల్దార్ క్షమారాణి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, వీఆర్‌ఓ మధుబాబు తనిఖీల్లో పాల్గొన్నారు.

3 అంతస్తులు.. నయా పార్కింగ్ సముదాయం

- ఒకేసారి 500 కార్లు, 2 వేల బైక్‌లకు చోటు
- యనమలకుదురులో ఓ భక్తుడి దాతృత్వం





యనమలకుదురు శివాలయం వద్ద నిర్మిస్తున్న మూడంతస్తుల పార్కింగ్ సముదాయం ◆ అన్నప్రసాద వితరణకు రామలింగేశ్వరస్వామి సన్నిధిలో నిర్మిస్తున్న భవనం

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, యనమలకుదురు: విజయవాడ శివారులో తొలి మల్టీ లెవెల్ పార్కింగ్ భవనం సిద్ధమైంది. యనమలకుదురులో దేవాదాయ శాఖకు చెందిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దాత సహకారంతో ఈ అధునాతన సముదాయం నిర్మించారు. ఒకేసారి 500 కార్లు, 2 వేల ద్విచక్ర వాహనాలు నిలిపేలా ఎకరా స్థలంలో రూ.30 కోట్లతో 3 అంతస్తుల్లో కట్టారు. యనమలకుదురు మునిగిరి కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రద్దీ ఏటేటా పెరుగుతోంది. వచ్చే 5 దశాబ్దాల పార్కింగ్ అవసరాలకు తగ్గట్టుగా మల్టీ లెవెల్ భవనం నిర్మించారు. కింది అంతస్తులో కార్లు, ఒకటో అంతస్తులో ద్విచక్ర వాహనాలను నిలిపేందుకు సౌకర్యాలు కల్పించారు. మిగతా అంతస్తుల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. యనమలకుదురుకు చెందిన శివ భక్తుడు, దాత సంగా నరసింహారావు తన సొంత నిధులతో ఈ అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. 2 దశాబ్దాలుగా తన జీవితాన్ని పూర్తిగా శివాలయం అభివృద్ధికే అంకితం చేశారు. ఇప్పటి వరకూ రూ.70 కోట్లు వెచ్చించారు. ఉపాలయాలు, కొండపై విశాల ప్రదేశాన్ని సొంతంగా అభివృద్ధి చేయించారు. తాజాగా చేపట్టిన పనులకు రూ.42 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో రూ.12 కోట్లతో అన్నదానం కోసం భవనం నిర్మిస్తున్నారు. దీనిపై 50 గదులతో కాటేజీ కట్టిస్తున్నారు. 'భవిష్యత్తులో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ ఇప్పుడే కల్పించాలనే లక్ష్యంతో పనులు చేయిస్తున్నాం. మల్టీ లెవల్ పార్కింగ్ భవన నిర్మాణాన్ని రెండేళ్ల కిందట ప్రారంభించాం. ఇప్పుడు పూర్తయింది.. నెలరోజుల్లో అందుబాటులోకి తెస్తాము'ని దాత నరసింహారావు వెల్లడించారు.



సంగా నరసింహారావు

అల్లర్లు సృష్టించేందుకు వైకాపా నేతల కుట్ర

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: 'పొన్నూరు నియోజకవర్గంలోని మన్నవ గ్రామంలో యాదృచ్ఛికంగా జరిగిన ఘటనను అడ్డం పెట్టుకుని అల్లర్లు సృష్టించేందుకు వైకాపా నేతలు కుతంత్రాలు చేస్తున్నారు. దాడిలో గాయపడ్డ నాగమల్లేశ్వరరావుకు మెరుగైన వైద్యం అందకుండా చేసి, ఏదో విధంగా చనిపోయేలా చేయాలని పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, అంబటి రాంబాబు, అంబటి మురళి ఇతర నేతలు కుట్ర పన్నారు' అని తెదేపా సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. గుంటూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "నాగమల్లేశ్వరరావుపై దాడి ఘటనకు సంబంధించి అంబటి సోదరులతో పాటు వైకాపాలోని కొందరు నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో వారు చేసినట్లు.. ఇప్పుడు మేము వ్యవహరిస్తే అంబటి రాంబాబు, పేర్ని నాని వంటి వారు బయట తిరిగేవారు కాదు. జగన్ వాహనం కిందపడి సింగయ్య చనిపోతే.. ఆయన భార్యను వైకాపా కార్యాలయానికి పిలిపించుకుని, తెలిసిన అంబులెన్స్‌లో ఏదో జరిగిందని చెప్పించడం చూస్తుంటే వారి నేరచరిత్ర అర్థమవుతోంది. ఈ కేసు నుంచి బయటపడేందుకు రూ.కోటి చేతులు మారినట్లు సమాచారం. నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిన స్థల ప్రాంతం వైకాపా వారిదే. ఘటన జరిగిన తర్వాత నాగమల్లేశ్వరరావును అంబులెన్స్‌లో కాకుండా ఆటోలో ఎందుకు తరలించారు? ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లకుండా.. వైకాపా నాయకురాలికి చెందిన హాస్పిటల్‌లో ఎందుకు చేర్పించారు? దాడి సమయంలో ఐదుగురు వైకాపా కార్యకర్తలు అక్కడ ఎందుకున్నారో పోలీసులు దర్యాప్తులో తేల్చాలి' అని ధూళిపాళ్ల డిమాండ్ చేశారు.

ప్రతి నియోజకవర్గంలో బీసీ భవనం నిర్మిస్తాం

బీసీల ఆత్మగౌరవ భరోసా సభలో మంత్రి అనగాని సత్యప్రసాద్



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ బీసీ భవనాన్ని నిర్మించి బీసీల ఐక్యత చాటుదామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతిలోని ఇందిరా మైదానం వేదికగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్, ఫులే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'బీసీ ఆత్మగౌరవ భరోసా' సభకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ 'వైకాపా ప్రభుత్వం బీసీలను ఓట్ల కోసం వాడుకుని ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే.. కూటమి ప్రభుత్వంలో బీసీలకు పునర్ వైభవం వస్తోంది. బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి, సాధికారత లభించేలా పథకాల రూపకల్పన జరుగుతోంది. 67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తే, అందులో 29.2 లక్షల మంది బీసీలు, 11 లక్షల మంది ఎస్సీలు ఉన్నారు. ఈ సభ ద్వారా వెల్లడైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా' అని హామీ ఇచ్చారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ 'వైకాపా పాలనలో జరిగిన అణచివేత, దౌర్జన్యాలు ఇప్పుడు కనిపించడం లేదు. వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీలోని బీసీలకు ఏం గౌరవం ఇచ్చారు? మంత్రివర్గంలో మార్పుల పేరుతో సమర్థత ఉన్న మంత్రులనే కొనసాగిస్తానని చెప్పిన జగన్.. అనిల్‌కుమార్ యాదవ్, గుమ్మనూరు జయరాం, పార్థసారథిని మార్చారు. జగన్ తన సామాజిక వర్గానికి చెందిన వారిని ఎందుకు మార్చలేదు' అని ప్రశ్నించారు. మంత్రి సవిత మాట్లాడుతూ 'బీసీలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తున్నారు. బీసీలకు అత్యంత ప్రాధాన్యం గల మంత్రి పదవులు, బాధ్యతలు అప్పగించారు' అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, యాదవ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ల ఛైర్మన్లు నరసింహ యాదవ్, రుద్రకోటి సదాశివం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్, మాజీ మంత్రి పరసా రత్నం తదితరులు పాల్గొన్నారు.

నగరాల సామాజిక వర్గీయులకు 'బీసీ-డి' ధ్రువీకరణ పత్రాలు అందిస్తాం: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నగరాల సామాజిక వర్గీయులకు బీసీ-డి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీనిచ్చారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నగరాల సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. 'రాష్ట్రంలోని నగరాలకు బీసీ-డి కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని జీవో ఉన్నా, అధికారులు కేవలం విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, కృష్ణా జిల్లాల్లో మాత్రమే అందిస్తున్నారు. మిగతా జిల్లాల్లో ఇవ్వడం లేదు' అని నగరాల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

కాకి ముక్కు.. కొడవలిలా!



సాధారణంగా కాకులకు చిన్న ముక్కే ఉంటుంది. కానీ ఈ కాకి ముక్కు పొడవుగా. . కొడవలిలా వంపు తిరిగి వింతగొలుపుతోంది. తెలంగాణలోని ఆదిలాబాద్ పట్టణం రవీంద్రనగర్‌లో విద్యుత్ తీగలకు ముక్కును రుద్దుతూ కనిపించింది.

– ఈనాడు, ఆదిలాబాద్

బాలుడి చికిత్సకు దాతల ఆర్థికసాయం

ఒక్కరోజే రూ.1.60 లక్షల అందజేత



చికిత్స పొందుతున్న పోతల విజయ్

పాతపట్నం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన బాలుడు పోతల విజయ్ కొన్నేళ్లుగా తీవ్ర కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా, ఆ చిన్నారి దయనీయ స్థితిపై ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మానవతామూర్తులు స్పందించారు. కడప, కర్నూలు, తిరుపతి, గుంటూరు, ఏలూరు, విజయవాడ, విశాఖపట్నంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పలువురు దాతలు విజయ్ తండ్రి సోమేష్‌కు ఫోన్ చేసి, సమస్యను అడిగి తెలుసుకున్నారు. తమ వంతుగా బాలుడి చికిత్స కోసం ఆర్థికసాయం చేశారు. ఒక్కరోజే రూ.1.60 లక్షల వరకు అందినట్లు సోమేష్ తెలిపారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు స్పందించి, ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది.

ఇప్పటికే 3.08 లక్షల టన్నుల మామిడి సేకరణ

- కర్ణాటకతో పోలిస్తే ఇక్కడే మెరుగైన విధానం
- ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

జూన్ 9 నుంచి సేకరించిన తోతాపురి మామిడి

జిల్లా	రైతుల సంఖ్య	సేకరించింది (టన్నుల్లో)
చిత్తూరు	38,706	2,22,718
తిరుపతి	10,046	67,989
అన్నమయ్య	2,170	17,554
మొత్తం	50,922	3,08,261

ఈనాడు–అమరావతి: తోతాపురి మామిడికి కిలోకు రూ.12 చొప్పున ధర చెల్లిస్తున్నామని.. ఇప్పటి వరకు 3.08 లక్షల టన్నులు సేకరించామని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కిలోకు రూ.12 చొప్పున రైతులకు ఇస్తుండగా.. అందులో రూ.4 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందని పేర్కొన్నారు. కర్ణాటకతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన సేకరణ విధానం అమలు చేస్తున్నామన్నారు. జిల్లాల వారీగా ఉద్యాన అధికారులతో బృందాలు ఏర్పాటు చేశామని.. రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని.. పల్ప్ యూనిట్లకు, వ్యాపారులకు మార్గదర్శకాలు జారీ చేశామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంపై మే 20, 22, 24, 28 తేదీల్లో రాష్ట్ర, జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. కర్ణాటకలో ఒక్కో రైతు నుంచి ఒక్కో హెక్టారుకు 5 టన్నుల చొప్పున అదీ గరిష్ఠంగా రెండు హెక్టార్ల వరకే సేకరిస్తుండగా. . ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి పరిమితి లేకుండా ఈ-పంట ఆధారంగా కొనుగోలు చేస్తున్నామని వివరించారు. రైతుల వద్ద ఉన్న పంట మొత్తం కొనుగోలు చేస్తామని.. ఆగస్టు వరకు సేకరణ కొనసాగుతుందన్నారు.

జగన్‌కు తోతాపురి అంటే ఏంటో తెలుసా?

- దండయాత్రగా వెళ్తే సమస్యలు తెలుస్తాయా
- మంత్రి సత్యకుమార్ నిలదీత

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: 'మాజీ సీఎం జగన్‌కు తోతాపురి మామిడిపండు అంటే ఏంటో తెలుసా, గతంలో ఆ పంటకు ఎంత ధర ఇచ్చారో తెలుసా, ఇంతకుముందు ఎప్పుడైనా ఆ కంపెనీలతో మాట్లాడి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని చెప్పారా' అని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "మామిడి రైతుల గురించి జగన్‌కు ఏమి తెలుసు? చిత్తూరు జిల్లాకు ఎందుకు వస్తున్నారు? వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలను తీసుకుని ఆయన పరామర్శకు వెళ్తే మంచిది. అలా కాకుండా దండయాత్రగా వెళ్లడం ఎందుకు? వేల మందితో వెళ్తే రైతుల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందా?' అని నిలదీశారు. జన సమీకరణతో తొక్కిసలాట జరిగితే.. మా నేతలు చనిపోతే మీకేంటి అంటూ వితండవాదం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం కర్షకుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

తగినంత నీరు తాగుతున్నారా?



శారీరక ఆరోగ్యానికి పోషకాహారం ఎంత ముఖ్యమో, తగినంత నీరు తాగడం కూడా అంతే ముఖ్యం. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి.

1. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
2. శరీరం నుంచి విషపూరిత పదార్థాలు బయటకు వెళ్తాయి.
3. మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
4. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.
5. తలనొప్పిని నివారిస్తుంది.
6. తక్షణ శక్తి లభిస్తుంది.

– క్రిస్టెన్ జకోబిట్జ్, న్యూట్రిషన్ ఎక్స్‌పర్ట్

గ్రహం అనుగ్రహం

7-7-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం

ద్వాదశి: రా. 10-14 తదుపరి త్రయోదశి

అనూరాధ: రా. 1-09 తదుపరి జ్యేష్ఠ

వర్జ్యం: లేదు

అమృత ఘడియలు: మ. 1-39 నుంచి 3-24 వరకు

దుర్ముహూర్తం: మ. 12-30 నుంచి 1-22 వరకు తిరిగి 3-06 నుంచి 3-58 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.5.34; సూర్యాస్తమయం: సా.6.35

చాతుర్మాస్య వ్రతారంభం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	38.6	27.4
నెల్లూరు	37.3	29.5
కడప	36.0	27.0
విజయవాడ	35.6	27.5
నల్గొండ	35.0	22.4
తాడేపల్లిగూడెం	34.9	27.2
ఒంగోలు	34.4	28.5
నరసాపురం	34.0	28.0
గుంటూరు	33.0	28.0
విశాఖపట్నం	33.0	26.4
అనంతపురం	33.0	26.2
హైదరాబాద్	32.8	23.1
విజయనగరం	32.0	25.0
కర్నూలు	31.6	25.1
రాజమహేంద్రవరం	31.5	26.0
శ్రీకాకుళం	30.0	26.0
ఆదిలాబాద్	29.8	22.2

ఆలయాల ఎత్తు పెంచుతున్నారు!

- తమిళనాట రోడ్ల దిగువకు వెళ్లిన వందేళ్ల నాటి ఆలయాలు
- భారీ వర్షాలు, వరదలతో పూజా కార్యక్రమాలకు అంతరాయం
- పునాదుల వరకు తవ్వి మళ్లీ నిర్మిస్తున్న ఓ సంస్థ



సింగపెరుమాల్ కోయిల్‌లో 1500 ఏళ్ల క్రితం పల్లవరాజులు నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న పనులు (పాత చిత్రం)

ఇళ్లను జాకీల సాయంతో లిఫ్ట్ చేసి ఎత్తు పెంచడం తెలిసిందే. తమిళనాడులో తొలిసారిగా ఆలయాలను కూడా ఇలా లిఫ్ట్ చేస్తున్నారు. ఎప్పుడో కట్టిన ఆలయాలు కావడంతో వాటి చుట్టూ రోడ్ల ఎత్తు పెరిగిన సమస్యలు ఎదురవుతున్నాయి. గుడులు లోతట్టుగా మారిపోవడంతో వర్షాకాలంలో ముంపు సమస్య నుంచి బయటపడడానికి పలు ఆలయ కమిటీలు ఈ పద్ధతిని అనుసరిస్తున్నాయి. హిందూ రిలీజియస్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ అనుమతి తీసుకుని ఇప్పటికే 15 ఆలయాల ఎత్తు పెంచారు. ఈ పనులను హమ్‌చంద్ హౌస్‌లిఫ్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపడుతోంది.



చెన్నైలోని మధ్య కైలాష్ ఉప ఆలయాలను జాకీల సాయంతో పైకి ఎత్తుతున్న కార్మికులు



ఆరడుగుల మేర ఎత్తు పెంచారిలా..

చెన్నైలో నాలుగు చోట్ల..

చెన్నైలోని పురాతన ఆలయాల్లో మధ్య కైలాష్ ఆనంద వినాయకర్ గుడి ఒకటి. సర్దార్‌పటేల్ రోడ్డు, ఓల్డ్‌మహాబలిపురం రోడ్ల మలుపులో ఉన్న ఈ ఆలయం ముంపులో ఉంది. రహదారితో పోల్చితే లోపలున్న ప్రధాన, ఉప ఆలయాలు ఆరు అడుగుల కింద ఉండటంతో పెద్దపెద్ద వరద వచ్చి చేరుతోంది. ఆయా సమయాల్లో పూజా కార్యక్రమాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. దీంతో కొద్దినెలలుగా ప్రాంగణంలోని 12 ఆలయాలు ఎత్తును ఆరు అడుగుల మేర పెంచే పనులు చేస్తున్నారు. అంబర్, వీరాంజనేయ, నవగ్రహ, శివుని ఆలయాల పనులు పూర్తవగా ప్రధాన రాజగోపురం, వినాయక ఆలయాన్ని ఆరు అడుగుల మేర ఎత్తారు. మొత్తంగా 25 శాతం పనులు పూర్తయ్యాయి. ఇదే తరహాలో చెన్నై వ్యాసర్పాడిలోని రవీశ్వరర్, వడపళనిలోని సోమేశ్వరర్, కోవిలంబాక్కం బాలగుయనాథస్వామి ఆలయాల పనులు కొనసాగుతున్నాయి.

బెల్ట్‌బీమ్ సాంకేతికత వాడాం

– సురేందర్‌కుమార్, ఎండీ, హమ్‌చంద్ హౌస్ లిఫ్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్

'పునాదుల మీద జాకీల్ని అమర్చి, ఆలయాల్ని ఒక్కో అడుగు చొప్పున పైకి ఎత్తుతూ నిర్మాణాలు చేపడుతున్నాం. చెంగల్పట్టు సింగపెరుమాల్ కోయిల్‌లో 1500 ఏళ్ల క్రితం పల్లవరాజులు నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని అక్కడి పరిస్థితులకు తగ్గట్లు ఆరు అడుగుల మేర పైకి లేపుతున్నాం. మొదట పునాదుల మధ్యలో బెల్ట్ తరహాలో పటుత్వం వచ్చేలా రెండంచెల బెల్ట్‌బీమ్ కాంక్రీట్ సాంకేతికతను వాడాం. దీంతో గోడ దృఢంగా ఉండటంతో పాటు భవిష్యత్తులో వర్షాలకు నీరు లోపలికి వెళ్లదు.'

– ఈనాడు, చెన్నై

₹100తో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారు. సచివాలయాల్లో.. అది కూడా నామమాత్ర ఫీజులతో రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారసులు ముందుకు వస్తారని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయడం వల్ల భూముల రికార్డుల్లో వివరాల నమోదు (మ్యుటేషన్) ఆటోమేటిగ్గా జరుగుతుంది. ఈ-పాస్‌బుక్ కూడా జారీ అవుతుంది. వారసులుగా ఉన్న వారి నుంచి ఈ-కేవైసీ సైతం తీసుకుంటారు. ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు జారీచేసిన ఆదేశాల ప్రకారం.. రెవెన్యూ శాఖ నుంచి ఈ విధానం అమలుపై మార్గదర్శకాలు రానున్నాయి. దీనికి అనుగుణంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ చర్యలు తీసుకుంటుంది. ఇందుకు కనీసం రెండు, మూడు నెలల సమయం పట్టనుంది. గత వైకాపా పాలనలో గ్రామ/వార్డు సచివాలయాల్లో అనాలోచితంగా ప్రవేశపెట్టిన దస్తావేజుల రిజిస్ట్రేషన్ గందరగోళానికి దారితీసింది. ఇప్పుడు వారసత్వ భూములకే రిజిస్ట్రేషన్ చేస్తారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఎలా చేయాలన్న దానిపై డిజిటల్ అసిస్టెంట్లకు మరోదఫా శిక్షణ ఇచ్చే అవకాశముంది.



ఉపాధ్యాయుడు నిర్మించిన కాలిబాట వంతెన

పాఠాలు చెప్పే మాస్టారు.. పాఠశాలకు బాట వేశారు!



సీతారామరాజు

పాఠశాలకు రావడానికి సరైన మార్గం లేకపోవడమే విద్యార్థుల హాజరు పడిపోవడానికి కారణమని తెలుసుకున్న ఉపాధ్యాయుడు.. ఆ సమస్యను తన సొంత ఖర్చుతో పరిష్కరించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారు సూరంపేట ప్రాథమిక పాఠశాలకు సరైన దారిలేక విద్యార్థులు రావడం తగ్గిపోయింది. ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉన్నారు. పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు రైల్వే అండర్‌పాస్ వద్దనున్న మురుగు కాలువ పక్క నుంచి ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజుకు చెప్పారు. ప్రత్యామ్నాయం ఆలోచించిన ఆయన.. సమీపంలోని పంట కాలువ మీదుగా రూ.లక్ష సొంత నిధులతో కాలిబాట వంతెన నిర్మించారు. పూర్తయ్యే దశలో ఉన్న ఈ బాట సాయంతో విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు వచ్చేందుకు వీలుకలగనుంది.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

మానవతావాది జగ్జీవన్‌రామ్

సీఎం చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, అసమానతలు లేని సమాజం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు.

భద్రతామండలిని సంస్కరించాల్సిందే

- బ్రిక్స్ వేదికగా ప్రధాని మోదీ పిలుపు
- బ్రెజిల్‌లో ప్రారంభమైన శిఖరాగ్ర సదస్సు
- పహల్గాం దాడిని ఖండిస్తూ రియో ప్రకటన
- హాజరుకాని చైనా, రష్యా, ఇరాన్, ఈజిప్టు అధ్యక్షులు

రియో డి జనీరో: అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత సహా అన్నింటా ద్వంద్వ ప్రమాణాలకు బాధితురాలిగా దక్షిణార్ధ గోళాన్ని (గ్లోబల్ సౌత్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి వంటి కీలక సంస్థలను ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సంస్కరించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరో వేదికగా ఆదివారం ప్రారంభమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. 20వ శతాబ్దంలో ఏర్పాటైన అంతర్జాతీయ సంస్థల్లో.. ప్రపంచ జనాభాలోని మూడింట రెండొంతుల మందికి ప్రాతినిధ్యం లభించలేదన్నారు. గ్లోబల్ సౌత్‌కు తగిన ప్రాతినిధ్యం లేని ఆ సంస్థలు.. సిమ్‌కార్డు ఉన్నా నెట్‌వర్క్ లేని మొబైల్ ఫోన్‌లాంటివని వ్యాఖ్యానించారు. పర్యావరణ పరిరక్షణకు ఆర్థిక సహాయం, సుస్థిరాభివృద్ధి, సాంకేతికత లభ్యత వంటి అంశాల్లో దక్షిణార్ధ గోళ దేశాలకు కంటితుడుపు చర్యలు తప్ప ఏమీ దక్కలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

నాయకత్వ స్థానాల్లో మార్పులు రావాలి

నేటి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన వాటాదారులుగా ఉన్న పలు దేశాలకు.. నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోవడాన్ని ప్రధాని మోదీ ప్రశ్నించారు. 'ఇది కేవలం ప్రాతినిధ్యానికి సంబంధించిన ప్రశ్న కాదు. విశ్వసనీయత, ప్రభావశీలతకు సంబంధించినది కూడా. ద్వంద్వ ప్రమాణాల కారణంగా దక్షిణార్ధ గోళానికి ఇన్నేళ్లూ చాలా అన్యాయం జరిగింది. నేటి ప్రపంచానికి కొత్త బహుళధ్రువ, సమ్మిళిత వ్యవస్థలు అవసరం. అంతర్జాతీయ సంస్థల్లో సమగ్ర సంస్కరణలతోనే ఆ దిశగా మార్పు మొదలవ్వాలి. సంస్కరణలు ప్రతీకాత్మకంగానే ఉండకూడదు. వాటి వాస్తవ ప్రభావం కనిపించాలి. పరిపాలనా వ్యవస్థలు, ఓటింగ్ హక్కులు, నాయకత్వ స్థానాల్లో మార్పులు రావాలి. విధాన రూపకల్పనలో గ్లోబల్ సౌత్‌దేశాల సవాళ్లకు ప్రాధాన్యమివ్వాలి" అన్నారు. కాలానుగుణంగా తనను తాను మార్చుకోగల సత్తా బ్రిక్స్‌కు ఉందన్నారు. భద్రతామండలి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో), బహుళపక్ష అభివృద్ధి బ్యాంకుల వంటి సంస్థల్లోనూ ఇదే తరహా సంస్కరణలు చేపట్టాలని పిలుపునిచ్చారు.



బ్రెజిల్‌లో ఆ దేశ అధ్యక్షుడు లూలా డిసిల్వాతో ప్రధాని మోదీ

20వ శతాబ్దపు టైప్‌రైటర్లే ఇంకానా..?

ప్రస్తుతం సాంకేతికతలు ప్రతివారం అప్‌డేట్ అవుతున్నాయని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో.. అంతర్జాతీయ సంస్థలు 80 ఏళ్లలో ఒక్కసారి కూడా అప్‌డేట్ కాకపోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. 21వ శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను 20వ శతాబ్దపు టైప్‌రైటర్లతో నడపలేమని వ్యాఖ్యానించారు. స్వలాభాన్ని పక్కనపెట్టి యావత్ మానవాళి ప్రయోజనాల కోసం పనిచేయడాన్ని భారత్ ఎల్లప్పుడూ తన బాధ్యతగా భావిస్తూ వచ్చిందన్నారు. అంతకుముందు- ఆతిథ్య బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా బ్రిక్స్ సదస్సులో ప్రసంగించారు. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్-ఫతా ఎల్-సిసి సదస్సుకు హాజరుకాలేదు. 2012 తర్వాత జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు రాకపోవడం ఇదే తొలిసారి.

ఉగ్రవాదులపై ఆంక్షలకు సంకోచించొద్దు

ఉగ్రవాదానికి మద్దతిచ్చేవారిని, దానివల్ల నష్టపోయేవారిని ఒకేలా చూడకూడదని మోదీ అన్నారు. బ్రిక్స్ సదస్సులో భాగంగా శాంతి, భద్రత అంశాలపై ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని భారత ఆత్మ, గుర్తింపు, గౌరవంపై ప్రత్యక్ష దాడిగా ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాడదామని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులపై ఆంక్షలు విధించేందుకు ఎంతమాత్రమూ సంకోచించకూడదని పేర్కొన్నారు. మరోవైపు- గాజాలో ప్రస్తుత పరిస్థితులపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

సుంకాల ఏకపక్ష పెంపుపై ఆందోళన

పహల్గాం దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రస్థాయిలో ఖండించాయి. ఉగ్రవాదాన్ని ఎంతమాత్రమూ సహించకూడదని, ఆ రక్కసిపై పోరాడటంలో ద్వంద్వ ప్రమాణాలను వీడాలని పిలుపునిచ్చాయి. ఈ మేరకు 'రియో డి జనీరో ప్రకటన'ను బ్రిక్స్ నేతలు ఆవిష్కరించారు. పశ్చిమాసియాలో పరిస్థితులతోపాటు ఏకపక్షంగా సుంకాల పెంపుపై అందులో ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా విధానాలను ఉద్దేశించి సుంకాల అంశాన్ని వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

'సేఫ్ జోన్' కోసం చూసుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

రాజీలేని ప్రయత్నాలు చేయాలి. ఇందుకోసం ఐఐటీల్లోనే చదవక్కర్లేదు. ఇంజినీరింగ్, డిగ్రీలు చదివినవారు వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలతో వస్తే అవకాశాల తలుపులు తెరిచే ఉంటాయి. ఒకప్పుడు నేను సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిని. జీతం బాగానే వస్తోందని ముందడుగు వేయకుంటే ఈ స్థాయికి ఎదిగేవాడినే కాను.

పరీక్ష రోజునే నాన్న చనిపోయారు

నేను విజయవాడలో ప్రీ ఇంజినీరింగ్ పరీక్షలు రాసేటప్పుడే మా తండ్రి చనిపోయారు. ఆయన పార్థివ దేహం ఇంట్లో ఉండగానే పరీక్షలు రాసి వచ్చాను. తర్వాత నాన్న దేహం దగ్గర కూర్చున్నా. అప్పటివరకు ఆపుకొన్న దుఃఖం ఆ క్షణం బద్దలైంది. ఆ పరీక్షలో నెగ్గి.. కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందాను. నాన్న మరణంతో ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ఉపకార వేతనాలు, స్నేహితులు, తెలిసినవారి సాయంతో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదివి, ఎనిమిది డాలర్లతో 1968లో అమెరికా వెళ్లాను. ఈ రోజు కోట్ల డాలర్ల కంపెనీలకు అధిపతిగా ఎదిగాను.

భిన్న రంగాల్లో పెట్టుబడులు

మొదట ఏడెంటా అనే స్టార్టప్ కంపెనీలో ప్రోగ్రామర్‌గా చేరా. ఐదేళ్ల తర్వాత బోస్టన్ వచ్చి 17 ఏళ్ల పాటు డేటా జనరల్‌గా ఓ కంపెనీలో పనిచేశాను. అదే సమయంలో సొంతంగా పాస్‌వర్డ్ సిస్టమ్స్ అనే ఐటీ కంపెనీ పెట్టాను. తర్వాత స్థిరాస్తి వ్యాపారం మొదలుపెట్టా. విజయవాడలో వాణీ ఫిలిమ్స్ పేరుతో పంపిణీదారుగా చేసిన అనుభవం ఉంది. దీంతో అమెరికాలో తెలుగు, హిందీ, హాలీవుడ్ సినిమాల పంపిణీ వ్యాపారం చేశాను. టీకాల తయారీలోనూ పెట్టుబడులు పెట్టా. గ్యాస్‌స్టేషన్లు నిర్వహిస్తూ వాటి కోసం చాలా కంపెనీలు పెట్టా. అందులో కొన్ని విజయవంతమయ్యాయి. మరికొన్ని విఫలమయ్యాయి. బోస్టన్ గ్రూప్ ద్వారా భారతదేశం నుంచి 2,500 మందిని అమెరికా తీసుకొచ్చాం. వారిలో చాలామంది ఇప్పుడు కంపెనీలు పెట్టుకుని స్థిరపడ్డారు.

అంధుల క్రికెట్ బృందాన్ని తయారుచేస్తున్నాం

బెంగళూరు నుంచి కొంతమంది అంధ పిల్లలు వచ్చి అమెరికాలో చక్కని నృత్య ప్రదర్శనలు చేశారు. వారి ఉన్నతికి తోడ్పడాలని బెంగళూరులోని సమర్థనం ట్రస్ట్‌కు మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చాం. క్రికెట్ జట్టును తీర్చిదిద్ది కామన్వెల్త్ దేశాలకు తీసుకువెళ్లి ఆటలు ఆడించాం. ఇప్పుడు అమెరికాలోనే పుట్టిన అంధ బాలికలతో ఓ జట్టును తయారుచేస్తున్నాం. వారిని బెంగళూరు తీసుకొచ్చి శిక్షణ ఇప్పించాం.

తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు రావాలి

నేటి యువతరంలో మంచి ఆలోచనలున్నా, అవి ఆవిష్కరణల వరకు వెళ్లట్లేదు. ఏదో ఒక ఉద్యోగం చేసుకో.. మనకు ఆస్తి ఉంది కదా అని తల్లిదండ్రులే నిరాశపరుస్తున్నారు. ఆ ఆలోచన మారాలి. పిల్లలకు ఆస్తులు కాదు, వారు పైకి ఎదగడంలో ఎదురయ్యే సవాళ్లు అధిగమించేలా ధైర్యాన్ని ఇవ్వాలి. మీరు పైకి రావడానికి సరిపడా సాయం చేస్తా.. మిగతాదంతా సమాజానికే ఖర్చు చేస్తానని నేను మా పిల్లలకు ముందే చెప్పేశా.

అంకుర సంస్థలకు అండగా..

జేఎన్టీయూకేలో ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటుచేసి విద్యార్థులను ఆంత్రప్రెన్యూర్లుగా మార్చడానికి సుబ్బుకోట ఫౌండేషన్ ద్వారా రూ.కోటి ఇచ్చాం. మా తండ్రి స్వగ్రామం రేపల్లె వద్ద వడ్డివారిపాలెంలో సినీనటి సావిత్రి నిర్మించిన పాఠశాలలో విద్యార్థులకు చుట్టుపక్కల గ్రామాల నుంచి రవాణా సదుపాయం కల్పించాం. 60 ఏళ్ల క్రితం డిగ్రీ అందుకున్న కళాశాల నుంచి తాజాగా గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉంది.

మచ్చ తొలగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

కఠిన చర్యలు చేపట్టాయి. విశాఖ మన్యంలో ఏటా రెండు సీజన్‌లలో గంజాయి వేసేవారు. జులై, ఆగస్టు నెలల్లో విత్తనాలు చల్లితే, డిసెంబరు, జనవరి నెలల్లో పంట చేతికొచ్చేది. మళ్లీ డిసెంబరు, జనవరి నెలల్లో వేస్తే, జూన్, జులైల్లో కోతకొచ్చేది. రెండు సీజన్‌లలో కలిపి ఎకరాకు సగటున 2 వేల కిలోలపైనే దిగుబడి వచ్చేది. మన్యంలో ఒక కిలో గంజాయి కనీస ధర రూ.5 వేలు. సుమారు 11 వేల ఎకరాల్లో సాగయ్యేది. ఆ లెక్కన ఏటా రూ.11 వేల కోట్ల విలువైన సరకు మార్కెట్‌లోకి వెళ్లేది. మన్యం నుంచి నగరాల్లోకి చేరాక దాని విలువ అనేక రెట్లు పెరిగేది. గతేడాది జులై, ఆగస్టులోనే మొక్కలన్నీ ధ్వంసం చేసేయడం, డిసెంబరు, జనవరి నెలల్లో సాగు కాకుండా చూడటంతో పూర్తిగా ఉత్పత్తి నిలిచిపోయింది. గతేడాది లాగానే ఈ జులై, ఆగస్టు నెలల్లో కూడా సాగు లేకుండా చేసేలా ఈగల్ చర్యలు చేపట్టింది. ఇలా మూలంలోనే ఈ సరఫరా చైన్‌కు అడ్డుకట్ట వేయగలిగారు.

అల్లూరి నడిచిన నేలలో గంజాయి సాగు లేకుండా చేశాం

–ఆకే రవికృష్ణ, ఈగల్ విభాగాధిపతి

అల్లూరి సీతారామరాజు నడిచిన ప్రాంతంలో గంజాయి సాగు ఉండకూడదని ప్రతినబూనాం. అందుకే స్థానిక గిరిజనులూ సహకరించడంతో విశాఖ మన్యంలో గంజాయి సాగు లేకుండా చేయగలిగాం. మేం చేపడుతున్న అవగాహన కార్యక్రమాల వల్ల కొందరు వారంతట వారే గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. గతేడాది మారుమూల ప్రాంతాల్లో ఓ 100 ఎకరాల వరకూ సాగైంది. ఇప్పుడు అది కూడా లేదు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మాసాంతం వరకూ 21,736 కిలోల గంజాయి పట్టుకుంటే అందులో 90 శాతం ఒడిశా నుంచి వచ్చిందే ఉంది. ప్రధానంగా మల్కన్‌గిరి, కొరాపుట్, గంజాం, కొంధమాల్, గజపతి, రాయగడ జిల్లాల నుంచి ఏపీలోకి గంజాయి వస్తోంది. దాన్ని కూడా అడ్డుకుంటాం.

జనవరిలో మరో 70 అన్న క్యాంటీన్లు

(మొదటి పేజీ తరువాయి)



అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో నిర్మాణంలో అన్న క్యాంటీన్ భవనం

వాటిని సిద్ధం చేయనున్నారు. నగరాలు, పట్టణాల్లో ప్రారంభించిన అన్న క్యాంటీన్లు పేదల ఆకలి బాధలు తీరుస్తున్నాయి. ఒక్కో క్యాంటీన్‌లో రోజూ మూడు పూటలా 900 మందికిపైగా అల్పాహారం, భోజనం చేస్తున్నారని అంచనా. మధ్యాహ్నం అత్యధికంగా 400 మంది వరకు వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 205 క్యాంటీన్లలో రోజూ మూడు పూటలా 1,84,500 మంది హాజరవుతున్నారు. రూ.5కే ఆహారం అందిస్తున్న ప్రభుత్వం. . మూడు పూటలా కలిపి ఒక్కొక్కరిపై రాయితీ కింద రూ.75 ఖర్చు చేస్తోంది. అల్పాహారంపై రూ.17, మధ్యాహ్నం రూ.29, రాత్రి భోజనంపై మరో రూ.29 ఖర్చు చేస్తోంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న 205 క్యాంటీన్లపై రాయితీ కింద నెలకు రూ.11 కోట్ల చొప్పున ఏడాదికి రూ.132 కోట్లు భరిస్తోంది. 16 వంటశాలల నుంచి క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేస్తున్నారు.

ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై విస్తరణ

అన్న క్యాంటీన్లను అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల సూచనతో ప్రభుత్వం కొత్తగా మరో 70 మంజూరు చేసింది. ఇప్పుడున్న వాటిలో ఎక్కువగా పట్టణ నియోజకవర్గాల పరిధిలోనే ఉన్నాయి. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం నగరాల్లో 5-10 వరకు ఏర్పాటు చేశారు. కొత్తగా కేటాయించిన వాటిని అన్ని గ్రామీణ నియోజకవర్గాల్లోనూ సర్దుబాటు చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలకూ విస్తరిస్తాయి. జనవరి నుంచి కొత్త క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో భవనానికి రూ.61 లక్షలు చొప్పున రూ.41.70 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కొత్తగా ప్రారంభించనున్న 70 క్యాంటీన్లతో ప్రభుత్వంపై ప్రజలకు అందించే భోజనంపై రాయితీ భారం ఏటా మరో రూ.45.07 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

కొత్తగా మంజూరు చేసిన అన్న క్యాంటీన్లు

జిల్లా	క్యాంటీన్ల సంఖ్య	పల్నాడు	1
		ఎన్టీఆర్	1
శ్రీకాకుళం	5	కృష్ణా	3
పార్వతీపురం మన్యం	1	ప్రకాశం	4
విజయనగరం	3	శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు	3
అల్లూరి సీతారామరాజు	3	తిరుపతి	2
అనకాపల్లి	3	చిత్తూరు	7
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	3	అనంతపురం	3
తూర్పు గోదావరి	4	శ్రీసత్యసాయి	1
కాకినాడ	2	కర్నూలు	4
పశ్చిమ గోదావరి	3	నంద్యాల	1
ఏలూరు	4	వైఎస్సార్ కడప	1
గుంటూరు	5	అన్నమయ్య	3

మాదకద్రవ్యాల కేసులో వైద్యుడి అరెస్టు

కొకైన్ వాడుతున్నట్లు అంగీకరించిన డాక్టర్

విశాఖపట్నం (పెదవాల్తేరు), న్యూస్‌టుడే: విశాఖలో కలకలం సృష్టించిన మాదకద్రవ్యాల కేసులో ఓ వైద్యుడిని మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తూర్పు డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఈ కేసు వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 5న అర్ధరాత్రి దాటాక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులో కొకైన్‌తో ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఈ కేసులో కూర్మన్నపాలేనికి చెందిన డాక్టర్ టి.శ్రీకృష్ణచైతన్యవర్మ (34)ను ఆదివారం అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈయన కొకైన్ కోసం రూ.65 వేల డబ్బు ఇవ్వడమే కాకుండా, ఆ డ్రగ్‌ను తాను వాడుతున్నట్లు అంగీకరించారని తెలిపారు. ఈ కేసులో మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. మిగిలిన ఇద్దరినీ త్వరలో అరెస్టు చేస్తామని, ఇందుకోసం ఓ బృందం దిల్లీ వెళ్లిందని పేర్కొన్నారు. సమావేశంలో మూడో పట్టణ సీఐ పైడయ్య పాల్గొన్నారు.

కాజేస్తుంటే... కాపాడే వారేరీ?

- శ్రీకాకుళం జిల్లాలో భూముల కబ్జాకు తెగబడిన వైకాపా నాయకులు
- అన్నదాతలపై దౌర్జన్యానికి దిగిన వైనం
- తట్టుకోలేక భార్యతో కలిసి ఓ రైతు ఆత్మహత్యాయత్నం
- ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం: కొన్ని తరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూమిపై వైకాపా నాయకులు కన్నేశారు. ఎలాగైనా సరే ఆక్రమించాలని పథకం వేశారు. వెబ్‌ల్యాండ్‌లో ఇష్టానుసారం మార్పులు చేసి రైతుల కుటుంబాల్ని ఇబ్బందుల్లోకి నెట్టారు. వీరి వేధింపులకు తట్టుకోలేక ఓ రైతు తన భార్య సహా ఆత్మహత్యాయత్నం చేశారు. ఇదంతా స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు లేకపోవడం చర్చనీయాంశమైంది. శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు రెవెన్యూ గ్రామ పరిధి సర్వే నంబర్లు 179, 180-1లో కొందరు భూస్వాములకు చెందిన 40.5 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. ఈ భూములను 50 మంది రైతులు పూర్వకాలం నుంచీ సాగు చేసుకుంటున్నారు. 2022లో రైతులు, యజమానుల మధ్య భూముల విషయమై ఒప్పందం జరిగింది. ఇరువురూ 65:35 ప్రకారం పంచుకుని సెటిల్‌మెంట్ చేసుకున్నారు. తమ భాగంగా వచ్చిన 16.50 ఎకరాలను యజమానులు వేరే వారికి విక్రయించేశారు.



వైకాపా నేతలు కాజేయాలని చూస్తున్న వ్యవసాయ భూమి

పథకం వేశారిలా...

రైతుల భాగంగా వచ్చిన 24 ఎకరాలపై కొందరు వైకాపా నాయకుల కన్ను పడింది. ఆ భూములను రైతుల పేరిట రిజిస్ట్రేషన్లు చేసే క్రమంలో తండేంవలస, గూడెం, సింగివలస గ్రామాలకు చెందిన వైకాపా నాయకులు మధ్యవర్తులుగా వ్యవహరించారు. ఈ క్రమంలోనే మోసానికి తెరతీశారు. కొన్ని భూములను తమ కుటుంబసభ్యులు, బినామీల పేర్లతో రాయించుకున్నారు. 2022లో నిర్వహించిన జగనన్న భూసురక్ష సర్వేలో... మరికొందరి భూములను స్థిరాస్తి లేఅవుట్ అని పేర్కొంటూ వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేశారు. సర్వే నంబర్లనూ తారుమారు చేశారు. అప్పట్లో ఓ వీఆర్వో వీరికి సహకరించారు. ఈ భూములకు సమీపంలోనే వైకాపాకు చెందిన నేత భారీ లేఅవుట్ వేశారు. భవిష్యత్తులో ధరలు పెరిగితే... రైతుల సాగులోని భూములనూ లేఅవుట్‌గా మార్చేసి కాజేయాలనేది వీరి కుయుక్తి. ఇప్పటికే అనధికారికంగా లేఅవుట్ మ్యాప్‌నూ తయారు చేయించారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

రైతుల వద్ద భూముల పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్, 1బి, భూమి శిస్తు రసీదులు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, వ్యవసాయ పరమైన రాయితీలను 2022 వరకు పొందారు. వైకాపా నాయకులు వెబ్‌ల్యాండ్‌లో లేఅవుట్ అంటూ చేయించిన మార్పుతో సుమారు 40 కుటుంబాలు పథకాల లబ్ధికి దూరమయ్యాయి. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించినా ఫలితం లేకపోయింది.

గట్లు తొలగించి... పంట ధ్వంసం

గూడెం పంచాయతీకి చెందిన శీర కోటేశ్వరరావు పేరిట 3.40 ఎకరాల భూమి ఉంది. దీనిని తమకు ఇచ్చేయాలంటూ వైకాపా నాయకులు ఆయనపై ఒత్తిడి తెచ్చారు. జూన్ 9న పొక్లెయిన్‌తో వచ్చి గట్లను పూర్తిగా ధ్వంసం చేశారు. పొలంలో రూ.1.50 లక్షలు వెచ్చించి నాటిన నీలగిరి మొక్కల్ని ధ్వంసం చేశారు. కోటేశ్వరరావుపై దాడికి దిగారు. ఈ బాధతో ఆయన. .. తన భార్య అనసూయతో కలిసి మరుసటి రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలు దక్కాయి. ఈ ఘటనపై ఇప్పటికీ చర్యలు లేవు. దీంతో వైకాపా నాయకులు మరింత రెచ్చిపోతూ ఇతర రైతులనూ వేధిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత సర్కారు హయాంలో అధికారులకు, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రెవెన్యూ మంత్రి, స్థానిక నేతలు, కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించినా పట్టించుకోకపోవడం గమనార్హం.

న్యాయం చేయండి

– శీర కోటేశ్వరరావు, ఖైరి రాజారావు, గూడెం గ్రామం రైతులు



వైకాపా వారు ధ్వంసం చేసిన మొక్కలను చూపుతున్న కోటేశ్వరరావు

వైకాపా వారు మా భూములను లాగేసుకోవాలని చూస్తున్నారు. దాడులకు పాల్పడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సాగు భూమిని స్థిరాస్తి లేఅవుట్ కింద చూపడంతో ప్రభుత్వ పథకాలను కోల్పోయాం. ఎలాగైనా మా పొలాల్ని కొట్టేయాలని మాలో మాకు గొడవలు పెడుతున్నారు. మా బతుకులన్నీ ఈ భూములపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.



రాజారావు

దర్యాప్తు చేయిస్తాం

ఈ విషయం మా దృష్టికి వచ్చింది. బాధితులతో మాట్లాడతాం. వివరాలు తెలుసుకుని సమగ్ర దర్యాప్తు చేయిస్తాం. రైతులకు అన్యాయం జరిగిందని తేలితే దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సంయుక్త కలెక్టర్, శ్రీకాకుళం

అందరికీ అందని ఆరోగ్య వరం!

ఆరోగ్యంగా ఉంటూ ఉత్సాహంగా పనిపాటల్లో నిమగ్నమయ్యే ప్రజానీకమే ఏ దేశానికైనా తరగని సిరి. మెరుగైన వైద్య వసతులను కల్పిస్తూ పౌరులను కంటికి రెప్పలా కాపాడుకోవడం సర్కారీ విధి. కానీ, స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా మన దేశంలో నేటికీ చాలామంది ఆరోగ్య భాగ్యానికి నోచుకోలేకపోతుండటమే దురదృష్టకరం. ముఖ్యంగా జాతి సౌభాగ్యానికి పట్టుగొమ్మలైన పల్లెపట్టులకు నాణ్యమైన సర్కారీ వైద్యాన్ని చేరువచేయడంలో ప్రభుత్వాల వైఫల్యం ఒక విషాద వాస్తవం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాల ఆధారంగా జరిగిన ఓ అధ్యయనమూ ఈ విషయాన్ని మరోసారి నిర్ధారించింది. దాని ప్రకారం- 35శాతం గ్రామీణులకు ఇప్పటికీ ఆధునిక ఆరోగ్య సంరక్షణ సేవలు అందటంలేదు. ఎస్సీ, ఎస్టీల్లో ఇలాంటి నిర్భాగ్యులు ఇంకా ఎక్కువగా ఉంటారు. పేదలతో పోలిస్తే సంపన్నులు 47 రెట్లు అధికంగా నాణ్యమైన వైద్యాన్ని అందిపుచ్చుకుంటుండటం- ప్రగతి ఫలాల పంపిణీలో తిష్ఠవేసిన తీవ్ర అసమానతలకు అద్దంపడుతోంది. సామాజిక అణచివేత, పేదరికం కారణంగా ఆవహించిన నిరాశా నిస్పృహలతో- అనారోగ్యం బారినపడినా ఆసుపత్రికి వెళ్లని వారు, సర్కారీ దవాఖానాల్లో ఉచితంగా వైద్యం అందుతుందన్న కనీస అవగాహన లేనివారు ఎందరో ఉన్నారన్న సమాచారం మరీ కలవరపరుస్తోంది!

దేశీయంగా 2005-2020 మధ్యకాలంలో వైద్యారోగ్య కేంద్రాల సంఖ్య ఎనిమిది శాతమే పెరిగినట్లు అధికారిక నివేదిక ఒకటి గతంలో వెల్లడించింది. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాణప్రదమైన సౌకర్యాల కల్పనలో ప్రభుత్వాల మందకొడితనాన్ని అది కళ్లకుకడుతోంది. పల్లెలకు వైద్యసేవలను అందించేందుకు చాలినన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీలు), ఉపకేంద్రాలు, సామాజిక స్వాస్థ్య కేంద్రాలు(సీహెచ్‌సీలు) ఉన్నాయని ప్రభుత్వాలు నమ్మబలుకుతుంటాయి. కానీ, జనాభా అవసరాలను బట్టి చూస్తే- గ్రామీణ భారతంలో ప్రస్తుతం ఉన్న సర్కారీ ఆసుపత్రులు ఏమాత్రం సరిపోవని పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. దీనికితోడు సీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత 80శాతానికి చేరింది. అత్యవసర ఔషధాలు, పరికరాలకూ కరవే! దీంతో జనం గత్యంతరం లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడ తడిసిమోపెడవుతున్న వైద్య వ్యయభారం దాటికి ఏటా ఆరుకోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. ప్రజాశ్రేయస్సుకు పాటుపడటం రాజ్యం కర్తవ్యమని నిర్దేశిస్తున్న రాజ్యాంగ ప్రమాణాలకు పాతరేస్తున్న దౌర్భాగ్యస్థితి ఇది!

అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ వంటివి జీడీపీలో పదిశాతానికి పైగా నిధులను జనారోగ్య సంరక్షణపై ఖర్చుపెట్టేస్తుంటే- ఇండియాలో ఆ మొత్తం కేవలం 1.84 శాతమే! ప్రజావైద్యానికి బడ్జెట్లో కనీసం ఎనిమిది శాతం సొమ్మును ప్రత్యేకించాలంటున్న జాతీయ వైద్యవిధానాన్ని రాష్ట్రాలు పట్టించుకోవట్లేదు. గతితప్పుతున్న జీవనశైలికి తోడు వాతావరణ మార్పులు, కాలుష్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోనూ వ్యాధుల తాకిడి పెరిగింది. వైద్య సదుపాయాల అందుబాటు లేమి మూలంగా పల్లెల్లో పరిస్థితి మరీ అధ్వానమవుతోంది. లింగ వివక్ష వంటి సామాజిక రుగ్మతల వల్ల మహిళలు మరింత ఎక్కువ సంఖ్యలో వైద్యసేవలకు దూరమవుతున్నారు. ఈ అంతరాలు అన్నింటినీ రూపుమాపి అందరికీ ఆరోగ్య రక్షణఛత్రం కిందకు తీసుకురావాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వాలదే. ఉద్యోగ విరమణ చేసిన వైద్యులను వారి ఆసక్తిని బట్టి పునర్నియోగించుకుంటే పల్లె భారతానికి మేలు జరుగుతుంది. గతంలో ఆర్‌ఎంపీలు గ్రామాల్లో అత్యవసర సమయాల్లో తక్కువ ప్రతిఫలానికే చక్కటి చికిత్సలు అందించేవారు. ప్రస్తుతం ఎవరుపడితేవారు ఆర్‌ఎంపీ అవతారమెత్తుతుండటం ఆందోళన రేపుతోంది. పటిష్ఠ నియమనిబంధనలు రూపొందించి ఈ వ్యవస్థను చక్కదిద్దితే ప్రజలకు ప్రయోజనకరమవుతుంది!

ముప్పు నిత్యం... సన్నద్ధత ముఖ్యం!



పహల్గాం ఉగ్రదాడి ఇండియాపై జరిగిన మొదటి దాడి కాదు. చివరిదీ కాబోదు. 2016లో ఉరీలో భారత సైనికులపై ఉగ్రదాడికి ప్రతిగా మన బలగాలు పాక్ భూభాగంలో సర్జికల్ దాడులు చేశాయి. ఆపై మూడేళ్ల వరకు ముష్కరులు దాడులకు తెగబడలేదు. 2019లో బాలాకోట్‌లో జైషే మహమ్మద్ శిక్షణ శిబిరంపై మన యుద్ధ విమానాలు విరుచుకుపడగా, ఆరేళ్ల వరకు ఉగ్రవాదులు భారత్ వైపు కన్నెత్తి చూడలేదు. ఆపరేషన్ సిందూర్ తరవాత పరిస్థితి ఏంటన్నది పరిశీలనార్హం.

పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పహల్గాంలో పర్యాటకులపై జరిపిన దాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి ముష్కరులను ఠారెత్తించింది. చావుదెబ్బ తిన్నా తామే గెలిచామని పాకిస్థాన్ సైన్యం చెప్పుకొంటున్న గొప్పలను ప్రశ్నించే ధైర్యం అక్కడెవరికీ లేదు. ఇప్పుడు ఇస్లామాబాద్ దృష్టి బలూచిస్థాన్ మీదకు మళ్లింది. బలూచీ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న యోధులను భారతదేశ తొత్తులుగా పాక్ మీడియా దుమ్మెత్తిపోస్తోంది. శత్రుదేశంపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వచ్చే ఎన్నికల్లో తనకు లబ్ధి చేకూరుస్తుందని భారతీయ జనతా పార్టీ ఆశిస్తోంది. ఇది తమకు ప్రమాదకరమని భావిస్తున్న విపక్షాలు, ఈ సైనిక చర్యలో భారత్‌కు జరిగిన నష్టమెంతో చెప్పాలని పట్టుపడుతున్నాయి. రఫేల్ విమానాలు కూలిపోయాయన్న వార్తల గురించి ప్రశ్నిస్తున్నాయి. కార్గిల్ యుద్ధం మాదిరిగా ఆపరేషన్ సిందూర్‌పైనా సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేస్తున్నాయి. త్రివిధ దళాలు మాత్రం సహజంగానే మౌనంగా తమపని తాము చేసుకుంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో నిష్పాక్షిక విశ్లేషణ అవసరం.



నష్టాలు సహజమే

సింధు నదీజలాల ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసిన దరిమిలా పాక్ వ్యవసాయం దెబ్బతింటుంది. కాబట్టి, పాక్ సైన్యం కొంతకాలం గుర్రాన్ని కట్టేయవచ్చు. ఆపరేషన్ సిందూర్ వల్ల జరిగిన ఆర్థిక నష్టం నుంచి కోలుకోవడానికి ఇస్లామాబాద్‌కు కొంత సమయం పడుతుంది. మత ఛాందసవాదాన్ని ప్రోత్సహించడమే పాకిస్థాన్ విధానం కాబట్టి, ఉగ్రవాదులను అది కొంతకాలమే పగ్గాలు వేయగలదు. ఆపై వారిని అదుపు చేయలేదు. పైగా కశ్మీర్ సమస్యను ప్రపంచం మరచిపోకుండా పాక్‌కు ఆస్కారం ఉండదు కాబట్టి, అక్కడి ఆర్మీ నిరంతరం ఉగ్రవర్గాలను ప్రోత్సహిస్తూనే ఉంటుంది.


'భారతదేశంపై ఎప్పుడు ఉగ్రదాడి జరిగినా వెంటనే దెబ్బకుదెబ్బ తీస్తాం. ఉగ్రవాదులు ఎక్కడి నుంచి పుట్టుకొచ్చినా చూడకుండా వేటాడి పెకలిస్తాం. వారిని ప్రోత్సహించే ప్రభుత్వం, ఉగ్రశక్తులు వేర్వేరని భావించం. అణ్వస్త్ర బ్లాక్ మెయిల్‌కు భారత్ లొంగదు' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దీనర్థం- ఇక మీదట భారత్‌పై దాడి జరిగితే ఏదైనా దేశంలోని ఉగ్రవాదస్థావరాలతోపాటు సైన్యంపైనా ఎదురుదాడి చేస్తుందని. అయితే, ముందుగా పాక్ గగనతల రక్షణ వ్యవస్థను దెబ్బతీయకుండా మన యుద్ధ విమానాలను పంపితే నష్టం చవిచూడాల్సి వస్తుందని ఆపరేషన్ సిందూర్‌తో అర్థమైంది. ప్రత్యర్థి ప్రచారాస్త్రాన్ని, కట్టుకథలను ఎదుర్కోవడంలో భారత్ తగినంత సన్నద్ధతను కనబరచలేదనేది రెండో పాఠం. ప్రభుత్వ నిఘా సంస్థలు, త్రివిధ దళాల మధ్య సమన్వయంలో ఈ లోపాన్ని సరిదిద్దుకోవాల్సి ఉంది. ఈ ప్రతికూలతలున్నా, సానుకూలతలే ఎక్కువని చెప్పాలి. ఆపరేషన్ సిందూర్‌కు పటిష్ఠ ప్రణాళిక రూపొందించి, కట్టుదిట్టంగా అమలు చేయడం మొదటి విజయం. థియేటర్ కమాండ్ పద్ధతిలో సైన్యం, వాయుసేన, నావికాదళం ఒకే దళపతి కింద పాక్‌పై విజయవంతంగా దాడి చేయడం రెండో ఘనత. అణ్వాయుధాలు కలిగిన ఇస్లామాబాద్‌ను భారత్ నాలుగు రోజుల్లోనే కాళ్లబేరానికి తీసుకురాగలిగింది. పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడి చేసినప్పుడు పెద్దసంఖ్యలో మనుషులుగానీ, ఇళ్లుగానీ దెబ్బతినలేదు. భారత్ గురిచూసి కొట్టి ఉగ్ర నెలవులను మట్టికరిపించింది. సైనిక చర్యల్లో కొన్నిసార్లు నష్టాలు సహజం. అవేవీ లేకుండా సునాయాసంగా గెలిచేస్తామనుకోవడం పొరపాటు.

గ్రే జోన్ యుద్ధంలో...


ఇక ఆపరేషన్ సిందూర్‌లో చైనా, తుర్కియే ఆయుధాలకన్నా భారతీయ ఆయుధాలే సమర్థంగా, శక్తిమంతంగా పనిచేశాయి. ఇది మన రక్షణోత్పత్తులకు గిరాకీ పెంచుతుంది. ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్థాన్‌కు చైనా ఉపగ్రహాలు, అవాక్స్ విమానం ద్వారా నిఘా సమాచారం అందించింది. భావి సమరాల్లోనూ బీజింగ్ మరింత సహాయం అందిస్తుంది. భారత్‌ను దెబ్బకొట్టడమే చైనా, పాకిస్థాన్ ఉమ్మడి లక్ష్యం కాబట్టి, అవి మనపైకి ఉగ్రవాదులను ఉసిగొల్పుతాయి. సైబర్ దాడులు, డ్రోన్ల వంటి గ్రేజోన్ యుద్ధ రీతులను కొనసాగిస్తాయి. ఎలక్ట్రానిక్ మార్గాల్లో సమాచారం ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది కాబట్టి, యుద్ధాల్లో గోప్యత అనేది కష్టమవుతుంది. భారత్ దీన్ని అధిగమించి విస్మయకర దాడులతో శత్రువును దెబ్బతీయడానికి పదునైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి.

సొంత ఆయుధాలు

భారత్‌పై మళ్లీ ఎవరైనా దాడి చేసే దుస్సాహసానికి ఒడిగడితే గట్టిగా బదులిచ్చేలా ప్రభుత్వం త్రివిధ దళాలకు అధునాతన అస్త్రశస్త్రాలను, వినూత్న నిఘా వ్యవస్థలనూ సమకూర్చాలి. అందుకోసం రక్షణ పరిశోధన-అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)కి పెద్దయెత్తున నిధులు కేటాయించాలి. అత్యాధునిక ఆయుధాల కోసం విదేశాలపై ఆధారపడకుండా సొంతంగా తయారు చేసుకోవడంపై దృష్టి సారించడం ముఖ్యం. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, కొన్ని ఆధునిక విమానాలను దిగుమతి చేసుకోవడం... అయిదోతరం, ఆరోతరం యుద్ధ విమానాల రూపకల్పన, తయారీలో ప్రైవేటు రంగాన్ని భాగస్వామి చేయడం తక్షణమే జరగాలి. విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, డీఆర్‌డీవో వర్గాలు, సైనిక దళాలతో నిత్యం సంప్రదిస్తూ అధునాతన ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వ్యవస్థల రూపకల్పనకు కలిసికట్టుగా కృషి చేయాలి. కొన్ని ప్రాంతాల్లో త్రివిధ బలగాలు ఒకే అధిపతి కింద పనిచేసే థియేటర్ కమాండ్ వ్యవస్థను చేపట్టాలి. లద్దాఖ్ విభాగాన్ని ఉత్తర కమాండ్ నుంచి కేంద్ర కమాండ్‌కు బదిలీచేస్తే, ఉత్తర కమాండ్ పాక్ సైన్యాన్నీ, అది రెచ్చగొట్టే ఉగ్రమూకలను సమర్థంగా ఎదుర్కోగలుగుతుంది. శత్రుదేశాల దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టే యంత్రాంగమూ అత్యావశ్యకమే.



హర్ష కాకడ్
విశ్రాంత మేజర్ జనరల్



ప్రయత్నంతోనే విజయం!

'చిత్తశుద్ధితో పని చేసేవారు ఒక ప్రయత్నంలో కాకపోతే మరో ప్రయత్నంలోనైనా తప్పకుండా విజయం సాధిస్తారు. జీవితమంతా ఓటములే ఉండవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని చెబుతారు అబ్దుల్ కలామ్ తన 'ఇండామిటబుల్ స్పిరిట్' పుస్తకంలో. కానీ మనలో చాలామంది ఒకసారి ఓడిపోతే రెండోసారి ప్రయత్నమే మనస్ఫూర్తిగా చేయలేరు. సగం అపనమ్మకంతో పనిచేస్తారు. దాంతో విజయావకాశాలు మరింతగా తగ్గిపోతాయి.

ఒకసారి కొండ కింది గ్రామం మీద శత్రువులు దాడి చేశారు. గ్రామానికి చెందిన ఒక చిన్న పిల్లాణ్ని ఎత్తుకెళ్లిపోయారు. ఎలాగైనా వాళ్ల దగ్గరి నుంచి ఆ అబ్బాయిని తిరిగి తెచ్చుకోవాలని గ్రామ ప్రజలంతా నిర్ణయించుకున్నారు. అదో పెద్ద అటవీ ప్రాంతం. చాలా ఎత్తయిన కొండమీద ఉంటారు దాడి చేసినవాళ్లు. వారికి తప్ప మరెవరికీ నిటారుగా ఉండే ఆ కొండ అంచుకు చేరుకోవడం సాధ్యం కాదు. అయినా ప్రాణాలకు తెగించి.. కొంతమంది గ్రామస్థులు కొండ మీదికి ప్రయాణం మొదలుపెట్టారు. దారి తెలియకపోయినా కష్టపడి నడుస్తూ పైకి ఎక్కుతూనే ఉన్నారు. ఒక అడుగు పైకి వెళ్తే నాలుగు అడుగులు కిందకి జారిపోయే సందర్భాలే ఎక్కువవుతున్నాయి. అలా నాలుగు రోజులు కష్టపడ్డారు. వెంట తీసుకెళ్లిన ఆహారం అయిపోయింది. వాళ్ల ఓపిక నశించింది... అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఇంక పైకి వెళ్లలేం, పిల్లాణ్ని కనిపెట్టలేం... అని రాజీపడిపోయి తిరుగు ప్రయాణం మొదలెట్టారు.

దారిలో వాళ్లకు ఆ పిల్లాడి తల్లి కనపడింది. 'ఒక్కదానివే ఎక్కడికెళ్తున్నావు? ఆ కొండను చేరుకోవడం మన వల్ల కాదు. నీ కొడుకు ఎక్కడున్నా క్షేమంగా ఉండాలని కోరుకో అంతే! పద ఇంటికి' అన్నారంతా. 'నేను కొండపై నుంచే వస్తున్నాను' అంటూ తన వీపునకు కట్టుకున్న పిల్లాణ్ని చూపించిందామె. వాళ్లంతా ఆశ్చర్యంతో 'ఒక్కదానివే కొండ ఎలా ఎక్కగలిగావు, వాళ్లను ఎదిరించి నీ బిడ్డను ఎలా తెచ్చుకోగలిగావు?' అని అడిగారు. 'మీ ఊరి అబ్బాయిని తిరిగి తీసుకురావడం మీ బాధ్యత అనుకున్నారు, ప్రయత్నించారు. నాది కన్న కడుపు. కేవలం ప్రయత్నించి ఊరుకోలేను. నా ప్రాణాలన్నీ ఆ బిడ్డమీదే కాబట్టి తెలిగ్గానే కొండ ఎక్కాను. వాళ్లను నిలదీశాను. నాకేదీ అసాధ్యంగా తోచలేదు. నా బాధను చూసో ఏమో వాళ్లు బిడ్డను తీసుకొచ్చి నాకు అప్పజెప్పారు' అని చెప్పింది తల్లి. ప్రయత్నం ఎలా ఉండాలో చెబుతుందీ కథ. కలాం చెప్పిందీ అదే. లక్ష్యం అంటూ ఒకటి పెట్టుకున్నాక అందులో విజయాన్ని మాత్రమే కోరుకోవాలి. మనసు పెట్టి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించడం కష్టసాధ్యం అవుతుందేమో కానీ అసాధ్యం మాత్రం కాదు. అదీ ఒకసారి విఫలమైనవాళ్లు మలి ప్రయత్నాన్ని మరింత పట్టుదలగా చేయాల్సి ఉంటుంది.

– మధుకిరణ్




జాలి, దయ అంటే ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర యాచకులకు రూపాయో రెండో దానం చేయడం కాదు. ఒక్కరికైనా బతికే మార్గం చూపించగలగాలి. అవకాశాలను అందిపుచ్చుకోవడమెలాగో నేర్పాలి.

– శ్రీకాంత్ బొల్లా, వ్యాపారవేత్త

ధ్యానమే శరణం

ఉరుకులు, పరుగులు, అలసట, ఆందోళన... వీటితో సహజీవనం సాగిస్తున్నాం. సమస్య ఆవగింజంతైనా దాన్ని భూతద్దంలోంచి పనసకాయంత పరిమాణంలో చూస్తున్నాం. అయితే, జీవితం అంటేనే అంతులేని పోరాటం. ఎన్ని సమస్యలు ఎదురైనా వాటినుంచి విముక్తి పొందేందుకు ప్రయత్నించాలి. అందుకు 'ధ్యానం' తోడ్పడుతుంది. దాని ద్వారా ఆరోగ్యం, ధైర్యం, దూరదృష్టి, తెలివితేటలు, సామర్థ్యం... ఈ లక్షణాలన్నీ అలవడతాయి. విజయానికి దగ్గరచేస్తాయి.

రోజుకో ఆపిల్ తింటే వైద్యుడి అవసరం రాదన్న చందాన, రోగం- ధ్యానం చేసేవారి దరిచేరదు. పైగా ఏకాగ్రత ప్రశాంతతను ఇస్తుంది. మౌనసాధన వల్ల ఆచితూచి మాట్లాడటం అలవడుతుంది. స్నేహం, ప్రేమ, కరుణ పెంపొందుతాయి. నిద్రాణంగా ఉన్న శక్తిసామర్థ్యాలు వెలికి వస్తాయి. శత్రువును కూడా మిత్రుడిగా మార్చుకోగల శక్తి ధ్యానం ద్వారా సిద్ధిస్తుంది. ఊపిరి మీద యువత దృష్టిపెడితే వారు వాయుపుత్రుడంతటి వారవుతారు. కృతజ్ఞతాభావం అలవడుతుంది. క్షమించమని అడిగే ధైర్యం, క్షమించగలగడం ఇవన్నీ ధ్యానం వలన లభించే ఫలాలు. సంతోషం తాత్కాలికం కనుక శాశ్వతమైన ఆనందం కోసమే మన ప్రతి అడుగు పడాలి. అప్పుడు ఆ ప్రయాణం నిజంగా బ్రహ్మానందమే. ఆలోచనలను అదుపు చేసుకోగలిగితే నిత్యయవ్వనమే. మనసు మర్కటం లాంటిది. అది మనకు యజమాని అయితేనే ప్రమాదం. ఆ మనసును నియంత్రించగలిగే సాధనమే ధ్యానం. మనసు ఓ ఆబోతులా కోరికలనే రంకెలు వేస్తుంటుంది. దాన్ని 'శ్వాస' అనే తాడుతో 'ధ్యాన'మనే చెట్టుకు కట్టడమే అందరికీ శ్రేయస్కరం.



అంతర్యామి

ఉత్తరగీతలో 'కోటి పూజ సమస్తోత్రం...' అనే శ్లోకం ఉంది. పూజ అనేది భగవంతుడి ఉనికిని తెలియజేస్తుంది. ఆ పరమాత్మ గుణాలను తెలిపేది స్తోత్రం. పదే పదే దైవాన్ని తలచుకుంటూ చేసేది జపం. భగవంతుడు ఎక్కడో లేడు. మనలోనే ఉన్నాడని తెలిపేదే ధ్యానం. చివరికి మనమే భగవత్ లక్షణాలను అలవర్చుకోవడం 'లయ'గా చెబుతాం. అదో దివ్యమైన మోక్షం. కోటి పూజల కన్నా ఆ అంతర్యామికి ఒక్క స్తోత్రం చాలు. కోటి స్తోత్రాలెందుకు.. పెదాలపై వీడని జపం చాలు. కోటి జపాలెందుకు- ఒక్క ధ్యానంతో అన్నిరకాల లబ్ధి పొందవచ్చు. కోటి ధ్యానాల కన్నా కూడా ఆ పరమాత్ముడిలో విలీనం కావడమే అసలు సిసలైన అంతిమ లక్ష్యం.

బుద్ధుడు తెలిపిన ఆనపానసతియే ఉత్తమమైన జీవన విధానం. ఆనపానాలంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలు. వాటి మీద దృష్టి నిలపడమే- సతి. బుద్ధం, ధర్మం, సంఘం వైపుగా వెళ్దామన్న బుద్ధుడి ప్రచారంలో 'ధ్యానం శరణం గచ్ఛామి' కూడా చేరింది. ధ్యానం అనే స్నానం ద్వారా మనసు శుద్ధి అవుతుంది. ఆ దివ్యానుభూతితో సమస్యలను తట్టుకునే శక్తి పొందుతాం. సహస్రారం (బ్రహ్మరంధ్రం) ద్వారా ఈ శక్తి ప్రతి అవయవానికీ ప్రసారమై చైతన్యాన్ని ప్రేరేపిస్తుంది. తద్వారా మంచి జీవన విధానం అలవడి, ఆదర్శప్రాయమైన, ధర్మమైన సమాజం ఏర్పడి తీరుతుంది.

– కె.వి.వి.సత్యప్రసాద్

జన సంక్షేమానికి జనగణన

సిబ్బందికి కొరత

ప్రపంచవ్యాప్తంగా 2020 నాటికి 1.54 కోట్ల మంది ఆరోగ్య సిబ్బంది కొరత ఉంటే, 2023 నాటికి అది 1.47 కోట్ల మందికి దిగివచ్చింది. 2030 నాటికి 1.11 కోట్ల మంది దాకా లోటు నెలకొంటుందని అంచనా. అయితే, అధికాదాయ దేశాలతో పోలిస్తే అల్పాదాయ దేశాల్లో.. ముఖ్యంగా ఆఫ్రికా, తూర్పు మధ్యధరా ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉండనుంది. 53శాతం జనాభాకు నెలవైన ఎగువ మధ్యాదాయ దేశాల్లో వైద్య సిబ్బంది పెద్దసంఖ్యలోనే ఉన్నా, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా 2030 నాటికి అదనంగా 84 లక్షల మందిని నియమించుకోవాలి. రాబోయే అయిదేళ్లలో వైద్య సిబ్బంది కొరతలో ఆయా ప్రాంతాల వాటా ఎంత ఉండవచ్చంటే.. (శాతాల్లో)

ఆఫ్రికా ప్రాంతం	51
అమెరికా ఖండాలు	3
ఆగ్నేయ ఆసియా	24
తూర్పు మధ్యధరా ప్రాంతం	18
పశ్చిమ పసిఫిక్	4

(ఆధారం: ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక)

ప్రభుత్వ సర్వేల్లో వాస్తవాలను వెల్లడించడానికి ప్రజలు సుముఖంగా లేనట్లు క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఆ మధ్య 'సమగ్ర కుటుంబ సర్వే' చేపడితే, మూడు లక్షలకు పైగా కుటుంబాలు సమాచారం ఇవ్వడానికి పూర్తిగా నిరాకరించాయి. మరికొందరు ఆర్థికాంశాలకు సంబంధించి తప్పుడు వివరాలు చెప్పినట్లు తెలుస్తోంది. సర్వేలో రాష్ట్ర ప్రజల వాస్తవ ఆర్థిక స్థితిగతులు వందశాతం నమోదు కాలేదని ప్రభుత్వమే వెల్లడించింది. ఈ నేపథ్యంలో జనగణనపై ఆసక్తి నెలకొంది.

దేశంలో జనన, మరణాలకు సంబంధించిన గణాంకాలను కేంద్రం ఏటా విడుదల చేయాలి. 2021 నాటి లెక్కలను 2023 మేలో, 2022 నాటి గణాంకాలను నిరుడు మేలో వెల్లడించాల్సి ఉంది. తద్వారా దేశ జనాభా ఎంత పెరిగిందనేది ప్రజలకు చెప్పడం ఆనవాయితీ. రెండేళ్లుగా విడుదల చేయని ఆ నివేదికలను- మొన్న మే, జూన్ మాసాల్లో ఆన్‌లైన్‌లో పెట్టారు. ఇంత జాప్యం ఎందుకు జరిగిందో తెలియదు. దేశంలో మునుపెన్నడూ లేనివిధంగా 2021లో అక్షరాలా కోటీ రెండు లక్షల మందికి పైగా ప్రజలు మరణించినట్లు కేంద్రం తాజాగా విడుదల చేసిన 'పౌర నమోదు వ్యవస్థ(సీఆర్‌ఎస్) నివేదిక-2025'లో వెల్లడించింది. దేశంలో అంతకుముందు- 2020లో 81లక్షల మంది, 2019లో 76లక్షల మంది మృతిచెందారు. కొవిడ్ ఉద్ధృతి నెలకొన్న 2021లో మాత్రం దేశంలో అదనంగా సుమారు 21లక్షల మరణాలు నమోదైనట్లు సీఆర్‌ఎస్ నివేదికల్లోని గణాంకాలను బట్టి అర్థమవుతోంది. అయితే, కరోనా మహమ్మారి నెమ్మదించిన 2022లో దేశంలో మరణాలు మళ్లీ 86.50 లక్షలకు తగ్గిపోయాయి! దేశ చరిత్రలోనే మరెన్నడూ మరణాలు ఇలా ఒక్క ఏడాదిలోనే 15.50 లక్షల మేర తగ్గింది లేదు.

ఆలస్యం ఎందుకని?

జనన, మరణాల ఆధారంగా దేశ జనాభా ఏటా నికరంగా ఎంత పెరిగిందనేది కూడా సీఆర్‌ఎస్ నివేదికాంశాలు వివరించాయి. ఆ ప్రకారం, దేశ జనాభా 2019లో



1.71 కోట్ల మేర పెరగ్గా- 2020లో 1.61 కోట్లు, 2021లో 1.39 కోట్ల మేర మాత్రమే అధికమైంది. అంటే, 2019తో పోలిస్తే ఆ తరవాత వరసగా రెండేళ్ల పాటు నికర జనాభా పెరుగుదల రేటు తగ్గినట్లు తెలుస్తోంది. అధిక మరణాలే ఇందుకు కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 2022లో మరణాలు తగ్గుముఖం పట్టడంతో ఆ ఏడాది నికర జనాభా పెరుగుదల 1.67 కోట్లకు చేరింది. దీన్నిబట్టి జనన, మరణాలకు సంబంధించిన సీఆర్‌ఎస్ నివేదికల విడుదలను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొవిడ్ మరణాలు లక్షల సంఖ్యలో ఉన్నందువల్లే నివేదికల విడుదలలో జాప్యం జరిగిందనే వాదనలూ బలంగా వినిపిస్తున్నాయి. దేశంలో 2011 తరవాత ఇంతవరకూ జనగణన జరగలేదు. 2020-21లో దాన్ని చేపట్టాల్సి ఉన్నా, కొవిడ్ కారణంగా వాయిదా పడింది. 2026-27లో జనగణన చేపట్టేందుకు ఇటీవల అనుమతి లభించింది. ఈ లెక్కలు 2027 చివరిలో అందుబాటులోకి వస్తాయి. కాబట్టి, మళ్లీ 2030-31లో జనగణన చేపడతారా అనేది అనుమానమే. కులగణన చేస్తేనే జనగణన చేపట్టాలని ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబడుతుండటం వల్లే 2021 నుంచి ఇప్పటివరకూ ప్రభుత్వం దాని జోలికి పోలేదన్నది ఒక వాదన. తాము డిమాండ్ చేయడం వల్లే కులగణనకూ అంగీకరించారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చెబుతున్నాయి.


ప్రజాధనం వృథా కాకూడదంటే...

పేదలకు రేషన్ సరకులు, వృద్ధాప్య పింఛన్లు వంటి సంక్షేమ పథకాలను అందించడానికి జనాభా లెక్కలు చాలా అవసరం. దేశంలో 81.35 కోట్ల మంది పేదలకు నెలనెలా ఉచితంగా బియ్యం, గోధుమలను పంపిణీ చేయడానికి 2024-28 మధ్యకాలంలో రూ.11.80 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఏపీలో 2.69కోట్లు, తెలంగాణలో 1.91కోట్ల మంది చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం అందుకుంటున్నారు. మరి దేశంలో గడిచిన ఒకటిన్నర దశాబ్ద కాలంగా జనగణన జరగకుండానే ఇన్ని కోట్ల మంది పేదలున్నట్లు ఎలా నిర్ధారించారు? పేదలు ఎంతమందో పక్కాగా లెక్క తేల్చకుండానే పలురకాల సంక్షేమ పథకాలకు ప్రభుత్వాలు భారీగా ఖర్చుపెడుతున్నాయనే విమర్శలున్నాయి. అసలు జనాభా ఎంత? ప్రజల ఆర్థిక స్థితిగతులేంటి? అనే వాస్తవాలను నిర్దిష్ట కాలావధిలో తెలుసుకోకపోతే- లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందనేది వాస్తవం. 2026-27లో చేపట్టే జనగణనతోనైనా దేశంలో పేదలెందరో తెలియవచ్చి, అసలైన లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందివస్తాయని ఆశిద్దాం.

– మంగమూరి శ్రీనివాస్

ఏది ఇస్తే అదే వస్తుంది!

అడవిలో చెట్టు కింద దిగులుగా కూర్చుంది ఏనుగు. దాని దగ్గరికెళ్లిన నక్క.. 'ఏమైంది ఏనుగు మామా.. అలా ఉన్నావు' అని అడిగింది. 'అడవిలో ఒక్క జంతువు కూడా నాకు గౌరవం ఇవ్వట్లేదు. ఎదురుపడితే కనీసం పలకరించట్లేదు' అంది ఏనుగు. 'అలాగా' అంటూ మౌనంగా ఉండిపోయింది నక్క. 'నువ్వు కూడా కనీస మర్యాద పాటించడం లేదు. నాకు శుభోదయం చెప్పలేదు' కోపంగా అంది ఏనుగు. 'క్షమించు ఏనుగు మామా శుభోదయం' అంది నక్క. 'అడిగితే గానీ.. చెప్పడంలేదు. నేను ఇంత పెద్దగా ఉన్నాను. అసలు మర్యాద ఇవ్వట్లేదు.. అడవిలోని జంతువులన్నింటి సంగతీ తేలుస్తాను' అంది ఏనుగు. అప్పుడు నక్క.. 'మన అడవిలోని జీవులన్నీ మిమ్మల్ని గౌరవించడానికి నా దగ్గర ఒక ఉపాయం ఉంది' అంది. 'అవునా.. ఏంటో చెప్పు' అడిగింది ఏనుగు. 'వాటి కన్నా ముందు.. నువ్వే పలకరించు. అప్పుడు తప్పకుండా తిరిగి మాట్లాడతాయి. నీకు కావాల్సిన గౌరవమూ అందుతుంది' అంది నక్క.



హాయ్! బుజ్జీ!!

మరుసటి రోజు నుంచి నక్క మాటలు పాటించడం మొదలుపెట్టింది ఏనుగు. ఆహారం కోసం వెళ్తుంటే దానికి కుందేలు ఎదురుపడింది. 'శుభోదయం చిట్టి కుందేలు' అంది ఏనుగు. ఇంత పెద్ద ఏనుగే నన్ను పలకరిస్తోందన్న ఆనందంలో.. 'శుభోదయం ఏనుగు మామా! ఎలా ఉన్నావు' అంది కుందేలు. అలా కనిపించిన ప్రతి జంతువునూ పలకరించింది. కొన్నాళ్లకి మిగతా జంతువులే ముందుగా మాట్లాడసాగాయి. ఒకరోజు ఏనుగు దగ్గరికి వచ్చిన నక్క.. 'చూశావా మామా! నా ఉపాయం ఎలా పని చేసిందో!' అంది. 'అవును.. మనం ఎదుటివాళ్లతో ఎలా ప్రవర్తిస్తే.. అదే మనకు బదులుగా వస్తుందని తెలిసింది' అంది ఏనుగు.

– వడ్డేపల్లి వెంకటేశ్

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవి కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం!

దారం | గూడు | అరటిపండు
ముక్కు | నక్షత్రం | వల
కళ్లజోడు | సూది | గోర్లు

సఫారీలో షికారు.. సరికొత్త హుషారు

ఈనాడు, అమరావతి

పర్యాటక సర్క్యూట్లపై సర్కారు ప్రత్యేక దృష్టి


కృష్ణా నదిలో బోటు ఎక్కి భవానీద్వీపం, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కార్యాచరణ సిద్ధమైంది. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న భవానీద్వీపం, కొండపల్లి కోట, కృష్ణా పరివాహక ప్రాంతంలోని ఆలయాలు, అటవీ ప్రాంతాల్లోని ట్రెక్కింగ్ జోన్లు, జలపాతాలు.. ఇలా అన్నింటిపైనా దృష్టి సారించి పర్యాటక ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా కొత్త పర్యాటక సర్క్యూట్లపైనా దృష్టి పెడుతున్నారు. ప్రధానంగా కొండపల్లి అటవీ ప్రాంతంలో.. జంగిల్ సఫారీ, బయో డైవర్సిటీ పార్కు, నేచర్ ట్రయల్స్, మూలపాడు బటర్‌ఫ్లై పార్కు వద్ద 250 హెక్టార్లలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానం..

ఎన్టీఆర్ జిల్లాకు ఆతిథ్య, సేవా రంగంపైనే ప్రస్తుతం 60శాతానికి పైగా ఆదాయం వస్తోంది. ప్రస్తుతం సేవా రంగంలోనే ఏటా 70శాతం వృద్ధి ఉంటోంది. దీనిని భారీగా పెంచేందుకు ఇక్కడ పుష్కలంగా అవకాశాలున్నాయి. విజయవాడలోని దుర్గగుడి, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, నెమలి వేణుగోపాలస్వామి, వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి, కృష్ణా నదికి పక్కనే ఉన్న మంగళగిరిలోని పానకాలస్వామి.. ఈ ఆలయాలన్నింటినీ కలిపి ఏడాదికి కనీసం రెండు నుంచి మూడు కోట్ల మంది భక్తులు సందర్శిస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది వచ్చిన వాళ్లు వచ్చినట్టే దర్శించుకుని వెళ్లిపోతున్నారు. వీరిని పర్యాటక ప్రదేశాల వైపు ఆకర్షించేలా సౌకర్యాలు కల్పిస్తే గణనీయంగా ఆదాయ వృద్ధికి అవకాశం ఉంటుంది. దీనిపైనే ప్రస్తుతం అధికారులు దృష్టి సారించారు.

భవానీద్వీపంపై ప్రత్యేక దృష్టి: కృష్ణా నదిలోని భవానీ ద్వీపాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. భవానీ ద్వీపం అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికల్లో భాగంగా

దశలవారీగా అభివృద్ధి.. ప్రకృతి వనరులను వినియోగించుకుని ఇప్పటివరకూ లేనివిధంగా సరికొత్త అనుభూతి ఇచ్చేలా ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి పెట్టారు. విజయవాడలోని గాంధీహిల్, అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, బాపూ మ్యూజియం, అక్కన్న మాదన్న, మొగల్రాజపురం గుహలు, కొండపల్లి ఖిల్లా.. వీటన్నింటినీ దశలవారీగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

తాజాగా బోటులో ప్రయాణించి వెళ్లి సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. పర్యాటకుల కోసం ద్వీపంలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లు, మేజ్ గార్డెన్, బోటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆలయ, ఎకో పర్యాటకానికి పుష్కలంగా అవకాశం ఉందని, కొత్త సర్క్యూట్లను అభివృద్ధి చేయడంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు.

ప్రత్యేకంగా పర్యాటక ప్యాకేజీలు

ఆలయ, ఎకో పర్యాటక సర్క్యూట్లను అభివద్ధి చేయడంతో పాటు సందర్శకులు ఆయా ప్రాంతాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా పర్యాటక ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.




పండగ నాడు.. సారె చూడు.. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. ఒకవైపు క్యూలైన్లలో రద్దీ ఉండగా.. మరోవైపు పెద్దఎత్తున మహిళలు దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు తరలివచ్చారు. - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దస్త్రం ముట్టనివ్వరు.. నిషేధం పెట్టనివ్వరు!

ఈనాడు, అమరావతి

విజయవాడ లోటస్‌ల్యాండ్ ప్రాంతంలో దుర్గ గుడి భూముల పరిరక్షణకు అధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. ఈ భూముల పూర్తి వివరాలతో ఇటీవల జిల్లా రిజిస్ట్రార్, రిజిస్ట్రేషన్ల శాఖకు దస్త్రం పంపిస్తే వాటిని నిషేధిత జాబితాలో పెడతారు. ప్రయివేటు వ్యక్తులు ఆస్తులను నిలుపుదల చేసేందుకు ఈ ప్రక్రియకు ఒక వారం సమయం పడుతుంది. కబ్జాకు గురైన 11.54 ఎకరాల భూములు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందినవేనంటూ స్పష్టమైన ఆధారాలున్నాయి. అయినా అవి ఒకరి నుంచి మరొకరికి చేతులు మారుతూ వెళ్తున్నాయి. రూ.200 కోట్ల విలువైన ఈ భూములను స్వాధీనం చేసుకోవడం పక్కన పెడితే.. కనీసం నిషేధిత జాబితాలో పెట్టడానికి అధికారులు దస్త్రం తీసుకెళ్లడం లేదు. దీనికి ప్రధాన కారణం ఈ భూముల్లో పాగా వేసినోళ్లంతా బడా బాబులే.

★ 2023 డిసెంబరులో ఈ కబ్జా విషయం వెలుగులోకి రాగా కొన్నాళ్లు దేవాదాయశాఖలో నుంచి ఈ దస్త్రం బయటకు రాకుండా ఆపేశారు. ఆ తర్వాత దేవాదాయశాఖ నుంచి విడుదలై.. ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ విభాగానికి చేరింది. గత రెండు నెలలుగా అక్కడే మూలుగుతోంది. దుర్గ గుడి భూముల్ని ఆక్రమించినది వాస్తవమేనంటూ తేల్చి కూడా ఇప్పటికే తొమ్మిది నెలలవుతోంది. ఈ భూముల పరిరక్షణ కోసం విజయవాడకు చెందిన సామాజిక కార్యకర్త కృష్ణారావు సహా మరికొందరు ఏడాదిన్నరగా పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం జాప్యం చేయడానికి రెవెన్యూ అధికారులు కొత్తవాదన తెరపైకి తీసుకొస్తున్నారు. వీటికి సంబంధించిన కొన్ని కేసులున్నాయని, ఆ వివరాల్ని సంపాదించాకే వీటిపై ముందుకెళ్లాల్సి ఉందని చెబుతున్నారని కృష్ణారావు మండిపడ్డారు. దేవాదాయశాఖకు చెందిన ఈనాం భూములు ఎన్ని కేసులున్నా అవన్నీ దేవస్థానానికి చెందుతాయంటూ గతంలోనే సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలున్నా కబ్జా చేసినోళ్లకు అండగా ఉంటున్నారంటూ మండిపడ్డారు.


రూ.200 కోట్ల భూమిపై తెరవెనుక లాబీయింగ్

ఆర్డీవో కార్యాలయంలోనే మూలుగుతూ..

దుర్గమ్మకు చెందిన సత్యనారాయణపురంలోని పాత సర్వే నంబరు 118, ఆర్ఎస్ నంబరు 112 లోని ఈ భూముల పరిరక్షణ కోసం త్వరగా జాబితాను రిజిస్ట్రేషన్ల శాఖకు పంపించాలంటూ ఇప్పటికే దేవాదాయశాఖ కమిషనర్ కూడా రెవెన్యూ శాఖకు నివేదిక పంపించారు. ప్రస్తుతం విజయవాడ ఉత్తర మండలం ఎమ్మార్వో నుంచి ఈ భూములకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన దస్త్రం ఆర్డీవో కార్యాలయానికి చేరింది. ప్రస్తుతం అక్కడే దస్త్రం మూలుగుతోంది. ప్రస్తుతం ఈ 11.54ఎకరాల్లో 127మంది పాగా వేశారు. వీరిలో కొందరు ఆక్రమించుకున్న వాళ్లుండగా, మరికొందరు వేరేవారి దగ్గర కొని మోసపోయినవాళ్లు ఉన్నారు.

కబ్జా కోరల్లో మరో 10 ఎకరాలు..

ఇప్పటికే ఆక్రమించినట్టు అధికారులు గుర్తించిన 11.54 ఎకరాలతో పాటు కొత్తగా మరో 10.38 ఎకరాల భూమి తెరపైకి వచ్చింది. రీసర్వే నంబరు 145, పాత సర్వే నంబరు 180లోని టైటిల్ డీడ్ నెం.131 పరిధిలోని ఈ 10.38 ఎకరాల భూమి దుర్గగుడికి చెందినదేనని ఈనాం రిజిస్టర్‌లో నమోదై ఉన్నట్టు సమాచారం. ఈనాం రిజిస్టర్, ఆర్ఎస్ఆర్ రికార్డు ఇవ్వాలంటూ స.హ దరఖాస్తులు చేసినా అధికారులు మాత్రం ఇవ్వడం లేదు.



సూర్యుడి చుట్టూ వలయం

సూర్యుడి చుట్టూ నల్లటి వలయం, దానికి అంచులా బంగారు రంగులో మరో వృత్తం దర్శనమిచ్చాయి. దుర్గగుడి గోపురం వద్ద ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు కనిపించింది. ఆకాశంలో మంచు స్ఫటికాలు కాంతి విక్షేపణం చెందడం, సూర్యకాంతి 22 డిగ్రీల కోణంలో పడినప్పుడు ఇలా ఏర్పడుతుందని లయోలా కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి తుమ్మల శ్రీకుమార్ తెలిపారు.

- ఈనాడు, అమరావతి

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 7వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో సమాచారం తెలుసుకునేందుకు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.




మా ఇంటి నేస్తాలు.. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం శునకాలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. ప్రేమగా పెంపుడు జంతువులను వాటి యజమానులు బుజ్జగిస్తూ.. ఆస్పత్రికి తీసుకొచ్చారు. దీంతో అక్కడ సందడి నెలకొంది. - విజయవాడ సిటీ

రావమ్మా.. గోదారమ్మా..!

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పట్టిసీమ నుంచి గోదావరి నీటి విడుదలను ఆదివారం మరింత పెంచారు. శనివారం 8 పంపుల ద్వారా 2,382 క్యూసెక్కులు ఇవ్వగా.. కృష్ణా డెల్టా సాగునీటి అవసరాల రీత్యా ఆదివారం 16 పంపుల ద్వారా 5,564 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇవి నగరంలోని ప్రకాశం బ్యారేజీకి చేరడానికి కొంత సమయం పడుతుంది. దీనిపై సోమవారం రాత్రి ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కృష్ణా నదిలో పులిచింతల ప్రాజెక్టు పవర్ హౌస్ నుంచి 5,000 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను 11.2 అడుగులు ఉంది.

కాల్వలకు 7,389 క్యూసెక్కులు: కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 7,389 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,084, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,110, బందరు 1,259, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,008 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నారు.



గ్రేడ్‌ల ప్రాధాన్యతకు తిలోదకాలు

అస్తవ్యస్తంగా కార్యదర్శుల బదిలీలు

న్యూస్‌టుడే, కలెక్టరేట్(మచిలీపట్నం)

సచివాలయ కార్యదర్శుల బదిలీ ప్రక్రియ పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహించాల్సిన బదిలీలను అపహాస్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు ఇచ్చిన నేపథ్యంలో పది నెలల కిందట క్యాడర్ స్ట్రెంత్ సమస్య లేకుండా చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రెజరీ డైరెక్టరేట్ జిల్లాలో రద్దు చేసిన దాదాపు 500 స్థానాల్లో కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఒకే స్థానానికి ఇద్దరు కార్యదర్శులను నియమించడం, ఉన్నవారికి బదిలీ లేకుండా కొత్త వారిని వేయడం వంటి ఉత్తర్వులు కార్యదర్శుల్లో కలవరం పుట్టిస్తున్నాయి.

విచిత్రం ఏమిటంటే.. ఉమ్మడి కృష్ణా పరిధిలోని సచివాలయ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి బదిలీలకు నోచుకోని వారు స్థానచలనం పొందవచ్చని ఆశపడ్డారు. ఈ క్రమంలో అధికారులు కార్యదర్శుల నుంచి బదిలీ ఆప్షన్లు కోరుతూ అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సీనియార్టీల ప్రకారం కోరుకున్న స్థానాలకు బదిలీ అవుతుందని భావించిన వారికి చుక్కెదురైంది. కృష్ణా, ఎన్టీఆర్‌లతో పాటు ఏలూరు జిల్లాలో విలీన మండలాలకు సంబంధించిన 414 మందిని బదిలీ చేశారు. విచిత్రం ఏమిటంటే ఉన్న బదిలీ ఆదేశాల్లో కొన్ని సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శుల స్థానంలో కొత్త వారిని నియమించి పాత వారిని ఎక్కడికీ పంపలేదు. దీంతో కొత్త వారు బాధ్యతలు ఎలా తీసుకుంటారనేది ప్రశ్నార్థకం. కొన్ని పంచాయతీల్లో గ్రేడ్-5 కార్యదర్శులకు అవకాశం ఇవ్వకుండా ఇటీవలే వచ్చిన గ్రేడ్-6 కార్యదర్శులను నియమించారు. మలపరాజుగూడెం, ఆముదాలలంక, నాచుగుంట, కొక్కిలిగడ్డ, అవనిగడ్డ- 3 వంటి సచివాలయాల్లో ఇద్దరికి చొప్పున పోస్టింగ్ ఇచ్చారు.

కొత్తవారు వస్తే విధులు ఎలా?: కూచికాయలపూడి, బల్లిపర్రు, చంద్రాల, చినకళ్లేపల్లి, కంచడం సచివాలయాల్లో పని చేస్తున్న వారిని బదిలీ చేయకుండా ఆ స్థానాల్లో కొత్త వారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొత్తవారు వస్తే విధుల్లో ఉన్న కార్యదర్శులు అదే సచివాలయంలో కలుపుకొని పనిచేయాలా? అనే సమస్య ఎదురవుతోంది. ట్రెజరీ డైరెక్టర్ రద్దు చేసిన స్థానాల్లో నియమితులైన వారికి వేతనాలు ఎవరు ఇస్తారనేది చూడాలి. మొత్తం మీద అస్తవ్యస్తంగా ఉన్న బదిలీ ఆదేశాలపై కార్యదర్శులు, సంఘ నాయకులు ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం.

ఇచ్చినవి చెబుతున్నారు.. తీసుకున్నవి దాచేస్తున్నారు

పటమట, న్యూస్‌టుడే: అద్విక ట్రేడింగ్ కంపెనీ స్కాంలో ఏజెంట్లు, బాధితులు చెప్పిన లెక్కలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లెక్కలు దాదాపుగా కొలిక్కి వచ్చినా..కొంతమంది ఏజెంట్లు, పెట్టుబడిదారులు కంపెనీలో పెట్టిన మొత్తాన్ని పోలీసుల ముందు రూపాయలతో సహా వెల్లడిస్తున్నారు. కానీ కంపెనీ ఎండీ ఆదిత్య నుంచి వడ్డీ, కమీషన్ రూపంలో తీసుకున్న నగదు గురించి మాత్రం పొంతన లేని లెక్కలు చెబుతున్నారు. దీంతో పోలీసులు కంపెనీ బ్యాంకు ఖాతా లావాదేవీల ద్వారా అసలు లెక్కలు తేల్చనున్నారు. ఇందుకోసం బ్యాంకులకు లేఖలు రాసిన విషయం తెలిసిందే. మరోవైపు విచారణలో ఆదిత్య వ్యవహారశైలితో నిధులు కచ్చితంగా పక్కదారి పట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. హవాలా రూపంలో దుబాయ్‌కు తరలించిన నగదును అక్కడే పెట్టుబడులు పెట్టడం లేదా వేరే ఖాతాల ద్వారా తిరిగి ఇంకా ఎక్కడైనా పెట్టుబడి పెట్టి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చారు. దీని ప్రకారమే దర్యాప్తు వేగవంతం చేశారు.

గోల్డెన్ లీఫ్‌పై అనుమానాలు.. పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించేందుకు ఆదిత్య దుబాయ్ వెళ్లి అక్కడ గోల్డెన్ లీఫ్ అనే ఫేక్ ట్రేడింగ్ కంపెనీ స్థాపించి డిజిటల్ కరెన్సీని డిపాజిట్ చేసినట్లు తొలుత పోలీసులు గుర్తించారు. కానీ అందులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికి గత ఏడాది వాలెట్‌లోని నగదు విత్‌డ్రా చేసుకునే తేదీ నవంబర్ 2గా చూపించింది. అదే సమయానికి ఆదిత్య కంపెనీ డైరెక్టర్లతో కలిసి దుబాయ్ వెళ్లారు. ఈ విషయాన్ని కొంతమంది డైరెక్టర్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారికున్న అనుమానాలు సైతం పోలీసులకు తెలిపారు. దీంతో గోల్డెన్ లీఫ్ లెక్కలు తేల్చేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించి అంతర్జాతీయ బ్యాంకు, కంపెనీల నిబంధనల ప్రకారం గోల్డెన్ లీఫ్ వివరాలకు సంబంధిత శాఖలకు పోలీసులు మెయిల్ పెట్టారు. ఈ వివరాలన్నీ వస్తే అసలు గోల్డెన్ లీఫ్ నకిలీదా కాదా అనేది తేలనుంది.

గుణదల చోరీపై దర్యాప్తు ముమ్మరం

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన భారీ చోరీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులతో పాటు సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. నేరం జరిగిన విధానాన్ని బట్టి.. పాత నేరస్థులపై ఆరా తీస్తున్నారు. గతంలో ఇదే తరహాలో జరిగిన నేరాల్లో పట్టుబడిన నిందితుల వివరాలు సేకరిస్తున్నారు. గతంలో నగర శివారులో చెడ్డీగ్యాంగ్ దోపిడీకి పాల్పడిన ఘటనను పోలి ఉండడంతో.. ఆ దిశగాను దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నారు. ముగ్గురు నిందితులు నేరం చేసినట్లు తేలడంతో పుటేజీలను తనిఖీ చేస్తున్నారు. టవర్ డంప్ సమాచారం సేకరిస్తున్నారు. వీటినన్నింటినీ క్రోడీకరిస్తున్నారు. కాగా ఈ చోరీ.. చెడ్డీ గ్యాంగ్ ముఠా చేసే విధంగా ఉండడంతో ఆ దిశగాను దర్యాప్తు చేస్తున్నారు. వీరు ఒక నేరంతో సరిపెట్టుకోరని, మరోచోట చేసే అవకాశం ఉండడంతో నగరవ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. శివారు ప్రాంతాలైన గుణదల, పాయకాపురం, భవానీపురం తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి బీట్లు పెంచారు. గుణదల స్టేషన్ పరిధి శివారులోని విల్లాలు, అపార్ట్‌మెంట్లను జల్లెడ పట్టారు. అక్కడ ఉన్న సెక్యూరిటీలను అప్రమత్తం చేశారు.



చెల్లిస్తే బాగు.. సాఫీగా సాగు!

ఈనాడు, అమరావతి

రూ. 20కోట్ల బకాయిలకు రైతుల నిరీక్షణ

రబీ ధాన్యం కొనుగోలు సొమ్ము చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. వైకాపా పాలనలో ధాన్యం కొనుగోళ్లు కూడా సవ్యంగా చేయకపోవడం, కూటమి సర్కారు లక్ష్యానికి మించి కొనుగోలు చేయడంతో నిధుల సమస్య తలెత్తింది. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో పెట్టుబడికి సొమ్ము లేక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

లక్ష్యం పెరగడంతో భారం.. వైకాపా పాలనలో గత రెండేళ్లు రబీలో ధాన్యం కొనుగోళ్లు చేయలేదు. గత ఐదేళ్లలో ఒక సీజన్‌లో కొన్న అత్యధిక ధాన్యం 15వేల మెట్రిక్ టన్నులు. ఈ ఏడాది 10వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు లక్ష్యం. గతంలో ఇతర రాష్ట్రాల్లో వరి సాగు ఎక్కువ ఉండకపోవడంతో జిల్లా నుంచి ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం పొరుగు రాష్ట్రంలో వరి సాగు పెరగడంతో ధాన్యం బయటికి వెళ్లలేదు. పైగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే సొమ్ము జమ చేయడంతో రైతులు ప్రభుత్వానికే ధాన్యం అమ్మేందుకు పోటీపడ్డారు. దీంతో అధికారులు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 77వేల మెట్రిక్ టన్నులకు పెంచారు. లక్ష్యం ఊహించని రీతిలో పెరగడంతో నిధుల సమస్య తలెత్తింది. రైతులకు చెల్లించాల్సిన రూ.177 కోట్లలో రూ.147 కోట్లు ధాన్యం కొన్న 24గంటల్లోపే చెల్లించారు. వారం కిందట మరో రూ.10 కోట్లు జమ చేశారు.

జిల్లాలో..

- ధాన్యం కొనుగోలు: 77వేల మెట్రిక్ టన్నులు
- మొత్తం చెల్లించాల్సిన సొమ్ము:రూ.177కోట్లు
- ఇప్పటివరకు చెల్లించిన మొత్తం: రూ.157 కోట్లు
- ఇంకా చెల్లించాల్సిన బకాయిలు: రూ.20కోట్లు
- ధాన్యం అమ్మిన రైతులు: 6,287
- బకాయిలు రావాల్సిన రైతులు: 622


పాత కంచల(నందిగామ)లో ధాన్యం లోడు (పాత చిత్రం)

622 మంది నిరీక్షణ.. ఏప్రిల్‌లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారు. జూన్ 22తో ముగిశాయి. 75 కేజీల ధాన్యం బస్తాకి రకాన్ని బట్టి రూ.1725-రూ.1740 వరకు చెల్లించారు. దీంతో రైతులు మొత్తం బకాయిలు చెల్లిస్తారని భావించారు. సొమ్ము వస్తే ఖరీఫ్‌లో విత్తనాలు, నారుమళ్లకు వాడుకునేందుకు ఉపయోగించుకోవచ్చు అనుకున్నారు. కొందరు బ్యాంకుల్లో, వడ్డీలకు తెచ్చిన అప్పులు చెల్లించి వడ్డీ భారం తగ్గించుకోవచ్చని నిరీక్షిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

'వారం రోజుల్లో బకాయిలు మొత్తం రైతుల ఖాతాల్లో జమవుతాయి. రైతులు ఆందోళన చెందొద్దు' అని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీశ్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత ప్రవేశాలు

వేంపల్లె, న్యూస్‌టుడే


ఇడుపులపాయల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్యాలయం

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగులు సీట్లు 600

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రవేశాలు ముగిసిన తర్వాత ఈ నాలుగు ట్రిపుల్ ఐటీలలో 600 సీట్లు మిగిలాయి. ఈ సీట్లను 10వ తరగతి మార్కుల మెరిట్, సామాజిక వర్గాలు, రిజర్వేషన్లతో పాటు ఇది వరకే ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన వారి వెనుక మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు తదుపరి విద్యార్థుల మెరిట్ జాబితాను తయారు చేసి ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తారు. ఈ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4400 సీట్లు ఉన్నాయి. ఒక్కో ట్రిపుల్ ఐటీలో 1100 సీట్లు ఉండగా దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ కోటా కింద 360 సీట్లు పోను నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1010 చొప్పున 4040 సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్ ఐటీలలో ఉన్న సీట్లకు మెరిట్ జాబితా విడుదల చేసి జూన్ 30 నుంచి జులై 5వ తేదీ వరకు ఇడుపులపాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 878 సీట్లు భర్తీ కాగా 132 సీట్లు మిగిలిపోయాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలో 1010కి 869 భర్తీ కాగా 141 సీట్లు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు గాను 867 భర్తీ కాగా 143, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్లకు 826 సీట్లు భర్తీకాగా 184 సీట్లు మిగిలాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జాప్యం, ఇక్కడి విద్యపై ఆసక్తి లేని కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడంతో 600 సీట్లు ఖాళీ ఏర్పడింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా రెండో విడత ప్రవేశాలకు సంబంధించి రెండో జాబితాను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

11, 12 తేదీల్లో రెండో విడత ప్రవేశాల జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మిగిలిపోయిన 600 సీట్ల భర్తీకి తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11, 12 తేదీల్లో వెబ్‌సైట్‌లో వెల్లడిస్తాం. ఈ మేరకు రెండో విడత జాబితా సిద్ధం చేసే పనిలో తమ సిబ్బంది ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ లోపే రెండో విడత ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేస్తాం. - **ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ**

విద్యుత్తు బిల్లులకు చెక్..!

పరిశ్రమల్లో కెపాసిటర్లు సరిచూసుకోండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

☛ **విజయవాడ** నగర శివారులోని పిండి మరకు ప్రతి నెలా రూ.6వేల విద్యుత్తు బిల్లు వచ్చేది. జూన్‌లో ఒక్కసారిగా రూ.26వేలు రావడంతో యజమాని లబోదిబోమన్నారు. అధికారుల వద్దకు పరుగులు తీస్తే.. కెపాసిటర్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైందని చెప్పి సరిచేశారు.

☛ **గవర్నర్‌పేటలోని** ఒక బంగారు దుకాణం యజమాని అవసరం లేకపోయినా కెపాసిటర్ పెట్టుకున్నారు. ఆయన వాడే లోడ్‌కు 1.5 ఏవీఏఆర్ కెపాసిటర్ పెట్టుకుంటే సరిపోతుంది. ఎలక్ట్రీషియన్ మాటలు విని అవసరం లేకపోయినా 6 కేవీఏఆర్ కెపాసిటర్ పెట్టేశారు. నెలా నెలా రూ.20వేలు వచ్చే బిల్లు రూ.70వేలు అయ్యింది.

... **ఈ రెండు** ఉదాహరణల్లో విద్యుత్తు బిల్లులు ఎక్కువ రావడానికి కారణం కెపాసిటర్‌లే. ఒకరికి కెపాసిటర్ లేక బిల్లు ఎక్కువ వస్తే.. మరొకరు అవసరం కన్నా ఎక్కువ కెపాసిటర్ పెట్టుకుని బిల్లు ఎక్కువ వచ్చేలా చేసుకున్నారు.


పిండిమరకు వాడుతున్న కెపాసిటర్

మన వాడుకభాషలో చెప్పాలంటే.. వినియోగించే విద్యుత్తును నియంత్రించే ఉపకరణమే కెపాసిటర్. పరిశ్రమలు, హీటర్లు, లిఫ్టులు ఎక్కువగా ఉండే సంస్థల్లో, ఒకటి రెండు మోటార్లు వినియోగించే చిన్న చిన్న కర్మాగారాల్లో కెపాసిటర్‌ను బిగించుకోవాలి. మోటార్లు ఆన్‌చేయగానే కావాల్సిన దాని కన్నా అధిక విద్యుత్తును తీసుకుంటాయి. అక్కడ కెపాసిటర్ పెట్టుకుంటే.. అధికంగా తీసుకునే విద్యుత్తును నియంత్రిస్తుంది. పెట్టుకోకపోతే కావాల్సిన దాని కన్నా ఎక్కువ విద్యుత్తును తీసుకుంటుంది. ఇలా నాలుగైదు సంస్థలు ఎక్కువ విద్యుత్తును వాడేస్తే.. దాని పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడుతుంది. తద్వారా గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ఒక్కోసారి ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు పోయే అవకాశం ఉంది. కెపాసిటర్ లేని వారికి ఇలా అదనంగా వాడేసే విద్యుత్తుతో పాటు పెనాల్టీ పడిపోతుంది. సాధారణంగా వచ్చే బిల్లు కన్నా అదనంగా మూడు రెట్లు వరకు బిల్లు వస్తుంది.

ఏపీఈఆర్‌సీ నిబంధనల ప్రకారం..

విద్యుత్తు నియంత్రణ మండలి 2022 సంవత్సరంలో కొత్త నిబంధనలు తెచ్చింది. దీని ప్రకారం కెపాసిటర్‌ను పరిమితికి మించి ఎక్కువ పెట్టుకున్నా.. అపరాధ రుసుము విధించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల ఎక్కువ బిల్లులు రావడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. దీనిని గమనించిన అధికారులు.. పరిమితి పెంచి కెపాసిటర్ పెట్టుకున్నవారిని గుర్తించి మార్పిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ

నగరంలో ప్రతి నెలా వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లకు, అధిక విద్యుత్తు వినియోగించే సంస్థల బిల్లులు.. అధికారులే దగ్గరుండి నమోదు చేసి ఇస్తారు. ఎవరైనా కెపాసిటర్ పెట్టుకోకపోయినా, అదనపు కెపాసిటర్ పెట్టుకున్నా.. తగిన సూచనలు చేస్తున్నారు. భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను వివరిస్తున్నారు. సాధారణంగా కెపాసిటర్ సామర్థ్యం బట్టి రూ.500ల నుంచి రూ.10వేల వరకు ఉంటుంది. అదే పరిశ్రమలకు వినియోగించే ఆటోమేటిక్ కెపాసిటర్ అయితే రూ.30వేల నుంచి రూ.60వేల వరకు ఉంటుంది. ఈ ఖర్చు పెట్టుకుంటే.. బిల్లులు నియంత్రణలోనే ఉంటాయి. తడిచి మోపెడయ్యే పరిస్థితి రాదు. ఎవరికైనా ఈ అంశంలో సందేహాలుంటే.. వారు తమ ప్రాంత విద్యుత్తు ఏఈని సంప్రదించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

అపురూప నేస్తం.. ఆనంద పరవశం



జూనోసిస్ దినోత్సవం సందర్భంగా లబ్బీపేటలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌లో ఆదివారం శునకాలకు రేబీస్ టీకాలు వేశారు. యజమానులు శునకాలను ద్విచక్ర వాహనాలు, కార్లపై ఎక్కించుకుని తీసుకొచ్చారు. టీకాలు వేయడానికి వేచి ఉండటంతో ప్రాంగణం అంతా సందడి నెలకొంది. వివిధ జాతుల శునకాలను పలువురు ఆసక్తిగా తిలకించారు. అపురూపంగా పెంచుకునే శునకాలకు టీకాలు వేసేటప్పుడు వాటికి బాధ కలుగకుండా దగ్గరుండి యజమానులు విలవిల్లాడడం గమనార్హం. - న్యూస్‌టుడే, విజయవాడ సిటీ


మేమూ వచ్చాం..


జర్మన్‌షెపర్డ్‌తో యజమాని...


పిల్లిని తీసుకొస్తూ...

జనసంద్రం.. జగన్మాత క్షేత్రం

తొలి ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి: జగన్మాత కొలువైన ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడం, తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆషాఢ సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గనగర్ మీదుగా ఉదయం నుంచి భక్తుల వాహనాలతో కిటకిటలాడాయి. రికార్డుస్థాయిలో 80వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఉదయం నుంచి దేవస్థానంలో సేవా సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, అదనపు విధులు కేటాయించిన అధికారులు మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తులను నియంత్రించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వాహనాలు నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


కనకదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

రూట్స్ హెల్త్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: గత 12 ఏళ్లుగా సేవలు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రూట్స్ హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత అన్నారు. మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ల అవార్డుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి సవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వైద్య రంగానికి ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు 'యోగాంధ్ర-2025' పేరుతో గిన్నిస్ రికార్డు నమోదయ్యేలా చేశారన్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రూట్స్ ఫౌండేషన్ సేవలు అద్వితీయమన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్. మురళి బాబూరావుకు జీవన సాఫల్య అవార్డు అందజేశారు. మరో ఆరుగురికి ఉత్తమ డాక్టర్ల అవార్డులతో సత్కరించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి రూ.10 వేలను ఫౌండేషన్ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సినీహీరో సుమన్, రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పోలవరపు విజయభాస్కర్, ఆంధ్రా హాస్పిటల్స్ ఎండీ రమణమూర్తి, డాక్టర్ సమరం, డాక్టర్ మురళీకృష్ణ, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎ.వై.రావు, ఎస్ఎల్‌వీ డెవలపర్స్ ఛైర్మన్ పి.శ్రీనివాసరాజు, నగరానికి చెందిన పలువురు వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సవిత


డాక్టర్ మురళి బాబూరావుకు జీవన సాఫల్య అవార్డు అందజేస్తున్న సినీ నటులు సుమన్ తదితరులు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక ఆదివారం విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కె.వినాయకం, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.ప్రభావతి, ఆర్థిక కార్యదర్శిగా కె.భానుప్రకాష్, సహాధ్యక్షుడిగా మోహన్, అదనపు కార్యదర్శిగా కె.శేషాద్రితో పాటు మరో 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.


వినాయకం


ప్రభావతి

శాకంబరి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్న శాకంబరి ఉత్సవాలకు ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. ఆలయప్రాంగణంలో కూరగాయలు, పండ్లు దండలు కట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల మూడు రోజులకు 20టన్నుల కూరగాయలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే దాతలు, రైతులు ఇచ్చిన కొన్ని కూరగాయల మూటలను తీసుకువచ్చి మల్లికార్జున మహామండపంలో ఉంచారు. వాటిని ఈవో శీనానాయక్ పరిశీలించారు. 7వ తేదీ రాత్రికి కూరగాయల దండలు కట్టేందుకు మూడు షిఫ్టుల్లో 300 మంది మహిళలను నియమించారు. నిమ్మ, టమాట, దోస, బెండ, వంకాయ, బంగాళదుంప, క్యారెట్ వంటి కూరగాయలతోపాటు ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ కూడా అమ్మవారి అలంకరణకు వినియోగిస్తారు.


దాతలు ఇచ్చిన కూరగాయలను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

దుర్గగుడి మార్గంలో ఆటోల నిషేధం

విద్యాధరపురం: శాకంబరి ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 8, 9, 10 తేదీల్లో దుర్గగుడి మార్గంలో ఆటోలను నిషేధించినట్లు వన్‌టౌన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి గుడి సమీపంలోని కుమ్మరిపాలెం, సీతమ్మ వారి పాదాలు, గద్ద బొమ్మ సెంటర్ల నుంచి ఘాట్ రోడ్డు వైపునకు ప్రవేశం లేదన్నారు. మల్లికార్జున మహామండపం నుంచి కెనాల్ రోడ్డులో ఆటోలకు ప్రవేశం లేదని ఈవిషయాన్ని ఆటో డ్రైవర్లు గుర్తించి పోలీసులకు సహకరించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గించాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ కార్యదర్శుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మరింత జాప్యం చేయకుండా సత్వరమే వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీ అధికారులను.. పంచాయతీ కార్యదర్శుల నుంచే నియమించేలా చర్యలు తీసుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు సమయపాలనలో మార్పులు చేయాలని, వీడియో కాలింగ్ చేస్తున్న విధానాన్ని తొలగించాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.6వేల వేతనం చాలకపోవడంతో కార్యదర్శులు అదనంగా చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్నా.. రహదారుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నా.. దానికి అవసరమైన యంత్రాలు ఇవ్వాలని కోరారు. మొత్తం 6 గ్రేడ్లుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను మూడు గ్రేడ్లుగా చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు అవినీతిరహితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పంచాయతీ వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. పని గంటల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వి.రమణ, పంచాయతీ కార్యదర్శులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.టి.వి.రమణ, ఉపాధ్యక్షుడు హేమంత్ కుమార్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటాద్రి, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యాసాగర్. వేదికపై ప్రసాద్, రమణ, హేమంత్‌కుమార్‌రెడ్డి, వెంకటాద్రి తదితరులు

తిరుపతమ్మ దేవాలయంలో వైభవంగా పూజలు


శాకంబరిగా తిరుపతమ్మ, గోపయ్య స్వాములు


సీతారాముల ఉత్సవ మూర్తులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకొని పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయంలో ఆదివారం శాకంబరి పూజలు వైభవంగా నిర్వహించారు. సుమారు 20 టన్నుల కూరగాయాలు, ఆకుకూరలు, ఫలాలతో తిరుపతమ్మ, గోపయ్య స్వాములతో పాటు, ఆలయంలో కొలువై ఉన్న గ్రామదేవతలు, సీతారాముల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని రైతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రత్యేకమైన కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జె.శ్రీనివాసరావు, ఈవో కిశోర్‌కుమార్, ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాస్, ఏఈలు రాజు, అరవింద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాపు రిజర్వేషన్ల సాధనకు మరో ఉద్యమం

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్నివిధాలా వెనుకబడి ఉన్న కాపు కులస్థుల రిజర్వేషన్ల కోసం మరో ఉద్యమం చేపడుతున్నట్లు రాష్ట్ర కాపు ఐకాస అధ్యక్షుడు చందు జనార్దన్ తెలిపారు. కాపులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ రూపొందించేందుకు ఐకాస ఆధ్వర్యంలో వివిధ కాపు సంఘాల నేతలు, రాధా, రంగా మిత్రమండలి నాయకులు, ఉద్యమకారులు విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చందు జనార్దన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న కాపులు విద్య, ఉపాధి, రాజకీయపరంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారని వాపోయారు. కాపు, తెలగ, ఒంటరి కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కృష్ణా జిల్లాకు దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని, కాపు కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.3 వేల కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ నుంచి ఏపీలో కలిసిన 7 ముంపు మండలాల్లోని మున్నూరు కాపుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై న్యాయపరమైన అంశాలను సమీక్షించడానికి సీనియర్ న్యాయవాదులతో సబ్ కమిటీ వేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐకాస నాయకులు ముత్యాల రాందాసు, ఆకుల శ్రీనివాస్, నెలిబండ్ల రాజు, కోటా శ్రీనివాస్, మార్కండేయులు, సుంకర సాంబశివరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చందు జనార్దన్. చిత్రంలో రాందాసు, శ్రీనివాస్, రాజు, సాంబశివరావు తదితరులు

13న నదీతీరంలో ఫ్లోర్ పెయింటింగ్ పోటీలు

భవానీపురం, న్యూస్‌టుడే: పర్యాటకులకు, సందర్శకులకు కొత్త అనుభూతులను పంచాలనే ఉద్దేశ్యంతో ఈనెల 13న భవానీపురంలోని హరిత బరంపార్కు వద్ద ఫ్లోర్ పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. భవానీపురంలోని హరిత బరంపార్కు వద్ద యోగాంధ్ర కార్యక్రమం, పెయింటింగ్ పోటీలకు సంబంధించి గోడపత్రికను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణానదీతీరంలో కళాత్మక సౌందర్యం, సామాజిక భాగస్వామ్యం పెంపొందించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో పెయింటింగ్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ4 విధానం, సే నోటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, సేవ్ వాటర్, రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్, హరితాంధ్ర అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. నగరవాసులు తమ కళాప్రతిభకు పదును పెట్టి ప్రజలను జాగృతం చేసేలా చిత్రాలను వేసి తీరానికి కొత్త శోభను తీసుకురావాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు అవార్డులతో సత్కరించటం జరుగుతుందని వెల్లడించారు. చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. మరిన్ని వివరాలకు 7075196840లో సంప్రదించాలని కోరారు.


నదీతీరంలో అధికారుల యోగాసనాలు

☛ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నది ఒడ్డున కలెక్టర్, అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏపనైనా చేయవచ్చని, నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ అధికారి రత్నప్రియదర్శిని, డీపీఎం కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ -180, చికెన్ స్కిన్‌లెస్ - 205.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 570 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

17న బీసీ సంక్షేమ సంఘం మహాసభ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఈ నెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు తెలిపారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సభకు కేంద్ర మంత్రులు రావు ఇంద్రజిత్‌సింగ్, రామ్మోహననాయుడు, నేషనల్ ఓబీసీ కమిషన్ ఛైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహీర్‌తో పాటు బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని వివరించారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళల సబ్ కోటా తదితర అంశాలను సభలో చర్చిస్తామని చెప్పారు. సంఘీయులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఏపీలో 140 బీసీ కులాలు ఉంటే కనీసం 20 శాతం రిజర్వేషన్లు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న బీసీ కోటాను 24 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. ఉద్యోగులకు పదోన్నతుల్లో క్రీమీలేయర్ విధానం ఇబ్బందికరంగా మారిందని, దీన్ని ఎత్తివేయాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్లు, రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ గోడ పత్రికలు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు, ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్, యలమందరావు, నాగుల్‌మీరా, దివాకర్, నగర మహిళా అధ్యక్షురాలు గీతా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సభ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వెంగళరావు యాదవ్, నరసింహారావు, కృష్ణమోహన్, యలమందరావు, గీతాకృష్ణ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కేశారు గ్రామంలోని కాలువల్లో నెలల తరబడి పూడిక తీయక మురుగు పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. -ఎం.శ్రీనివాసరావు, గ్రామస్థుడు

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. తక్షణమే పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి.

స్పందనకు వందనం



వెల్లటూరు గ్రామంలో కృష్ణా వాటర్ ట్యాంకుల వద్ద ట్యాప్‌లు తుప్పు పట్టి పాడైపోయాయని స్థానికులు సమస్యను న్యూస్‌టుడే దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ కార్యదర్శి ఈ విషయాన్ని వివరించగా స్పందించారు. సిబ్బందిని పంపి కొత్త ట్యాప్‌లను ఏర్పాటు చేసి నీటి సరఫరా పునరుద్ధరించారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు ★ రాయనపాడు ఆశోక్‌నగర్‌లో తాగునీరు సక్రమంగా రావడం లేదని పంచాయతీ అధికారులకు తెలుపగా సిబ్బంది పంపి పరిష్కరించారు. ★ గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో నివాసాల మధ్య చెత్త పేరుకుపోయిందని అధికారులకు వివరించగా చెత్తను తీయించారు. -గొల్లపూడి, న్యూస్‌టుడే. ★ కొండపల్లి గాయత్రీనగర్ కాలువలో చెత్త నిలిచిపోయిందని స్థానికులు తెలిపిన సమస్యపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. ఆదివారం ఆ ప్రాంతంలో కాలువల్లో పూడికలు తీసి చెత్తను తొలగించారు. పారిశుద్ధ్య మేస్త్రీ శ్రీను పనులు పర్యవేక్షించారు. -న్యూస్‌టుడే, కొండపల్లి

135 మందికి వైద్య సేవలు

గొల్లపూడి, న్యూస్‌టుడే: హెల్ప్ హాస్పటల్ ఆధ్వర్యంలో గొల్లపూడి బొడ్డురాయి సెంటర్ వద్ద ఉన్న సామాజిక భవనంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 135 మందికి నరాలు, గుండె, గ్యాస్, నేత్ర సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి యాంజియోగ్రాం ఉచితంగా చేస్తామని తెలిపారు.

ఆలయంలో భగవద్గీత పారాయణం

మైలవరం, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడి ఎన్నిక

మైలవరం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడిగా వెన్నెపూ సతీష్ కుమార్‌ను ఆదివారం నిర్వహించిన మండల శాఖ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ నజీర్, సోలా రామవరాజు ప్రకటించారు. ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన అధ్యక్షుడు పి.గోపాల్ స్థానంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పుల్లారెడ్డి, గోపాల్, వెంకటేష్, సూరిబాబు, జడ్.నరసింహారెడ్డి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ముత్యాలమ్మకు సారె సమర్పణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం పురస్కరించుకుని రుద్రవరం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, సారె సమర్పించి..ప్రసాదాలు నివేదించారు. పాల పొంగళ్లు, చీరెలతో ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.



సారెతో వస్తున్న మహిళలు

కూటమి చూపు.. సాంకేతికత వైపు

ఆర్పీలకు త్వరలో ట్యాబ్‌లు

కొండపల్లి, న్యూస్‌టుడే: మెప్మా పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు సేవలు వేగంగా అందాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డిజిటల్ విధానానికి అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ముందుగా రాష్ట్రంలోనే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా మహిళా సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు స్లమ్ సమాఖ్య రిసోర్స్ పర్సన్లకు గెలాక్సీ ఎ9+5జీ ట్యాబులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆయా పురపాలికల్లోని మెప్మా కార్యాలయాలకు వాటిని సరఫరా చేశారు.



సొంత చరవాణులతో ఇక్కట్లు

కొండపల్లి పురపాలికల్లో 1105 ఎస్‌హెచ్‌జీలు ఉండగా 35 మంది ఆర్పీలు ఉన్నారు. మెప్మా పరిధిలో స్లమ్ సమాఖ్య రిసోర్స్ పర్సన్లు మహిళల వివరాలను వారి చరవాణుల్లో ఆన్‌లైన్‌లో పొందుపరచవచ్చు. మెప్మాకు సంబంధించిన పలు రకాల యాప్‌లను చరవాణిల్లో డౌన్‌లోడ్ చేసుకొని వాటి ద్వారా మహిళల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తున్నారు. ఒక్కోసారి అవి సక్రమంగా పని చేయక ఇచ్చిన లక్ష్యాల మేరకు వివరాలను అనుసంధానం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని గమనించిన ప్రభుత్వం అడుగు ముందుకు వేసింది. ● జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోని ఆర్పీలకు, మెప్మా సిబ్బందికి ట్యాబులను అందజేయనుంది. ఇప్పటికే కార్పొరేషన్లలో వీటిని ఆర్పీలకు అందజేయగా..త్వరలో మున్సిపాలిటీల్లో కూడా పంపిణీ చేయనున్నారు. ఒక్కో ట్యాబ్ విలువ రూ.31 వేల వరకూ ఉంటుందని అంచనా.

ఆన్‌లైన్‌లో అనుసంధానం

కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలు, మొబైల్ బుక్ కీపింగ్, ర్యాపిడో ఎలక్ట్రికల్ వాహనాలు, స్వయం ఉపాధి కింద వ్యక్తిగత, బృంద రుణాలు, ఆర్థిక చేకూర్పు, కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు ఇది ఉపయోగపడుతుంది. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు, మహిళా సంఘాల సభ్యుల ముఖ ఆధారిత వివరాలు, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిట్ కామర్స్ రుణాల వివరాలు, లావాదేవీలు, అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తారు. **- మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్**

వెంకటాచలుడికి లక్ష విరజాజులతో అర్చన

తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటాచలస్వామి గుడిలో ఆదివారం రాత్రి అర్చకులు డీవీ కృష్ణమాచార్యులు, భక్తుల ఆధ్వర్యంలో లక్ష విరజాజి పూలతో అర్చన, విష్ణుసహస్రనామ పారాయణం ఆలాపన నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు.



శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళి

గంపలగూడెం, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం గంపలగూడెంలో భాజపా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎ.ప్రతాపకుమార్, యుగంధర్, సూర్యప్రకాశ్, బీవీ.రామారావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:** ఇబ్రహీంపట్నం భాజపా కార్యాలయంలో శ్యామాప్రసాద్ చిత్రపటానికి నాయకులు రఘునాధరెడ్డి, యుగంధర్, భవానీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గంపలగూడెంలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



పొందుగలలో కరపత్రాలు అందిస్తున్న తెదేపా నాయకులు



శ్రీరాంపురంలో ఇంటింటా ప్రచారంలో...

మైలవరం, రెడ్డిగూడెం, గొల్లపూడి, గంపలగూడెం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో కూటమి నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పథకాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.



గొల్లపూడి సూరాయిపాలెంలో...



ఊటుకూరులో..

పురపాలికను ప్రగతి పథంలో నడిపించాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: పురపాలికను అభివృద్ధిలో నడిపించాలని కొండపల్లి ఛైర్మన్ చిట్టిబాబును చిన్ననాటి స్నేహితులు కోరారు. కొండపల్లి కానూరు శివరావు జిల్లా పరిషత్ పాఠశాలలో 1984-85లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ బ్యాచ్‌కు చెందిన ఛైర్మన్ చిట్టిబాబును స్థానిక కల్యాణమండపంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ స్నేహితుడు పురపాలికకు మొట్టమొదటి ఛైర్మన్ కావడం సంతోషకరమన్నారు. పాలక బోర్డు లేక నాలుగేళ్లుగా అభివృద్ధికి నోచుకోని పురపాలికను ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. అనంతరం ఛైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ.. స్నేహితులతో పాటు కాకుండా పురప్రజలకు అందుబాటులో ఉంటానని, అభివృద్ధికి తన వంతు కృషి తప్పనిసరిగా ఉంటుందన్నారు.



ఛైర్మన్ చిట్టిబాబు దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉచితంగా రేబిస్ టీకాలు



గొల్లపూడిలో కుక్కలకు టీకాలు వేస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం శునకాలు, పిల్లులకు ఉచిత రేబిస్ టీకాలు వేశారు. పశుసంవర్థక శాఖ ఎన్టీఆర్ జిల్లా సంయుక్త సంచాలకులు హనుమంతరావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ సునంద తదితరులు పాల్గొన్నారు. **మల్లేల, చింతలపాడు(తిరువూరు), న్యూస్‌టుడే:** మండలంలోని మల్లేల, చింతలపాడు పశువైద్యశాలల్లో వైద్యాధికారులు డి.అభిలాష్, టి.శ్వేత ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యజమానులకు సూచనలు చేశారు. వీఎల్వో ఎం.గోపాలకృష్ణ, వీఏఎస్ ఎన్.రాఘవరావు, సిబ్బంది సంధ్యారాణి, నాగేంద్రబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బోధనేతర పనులు మినహాయించాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సాయి శ్రీనివాస్ కోరారు. ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయులకు బోధనేతర వ్యవహారాలను మినహాయించి బోధన మాత్రమే పరిమితి చేయగలిగితే పాఠశాలల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు కనిపిస్తాయన్నారు. 12వ వేతన సవరణ కమిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల వయోపరిమితి పెంచి వారిని రెగ్యులర్ విధానంలో నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బిక్షమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుగ్రహప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్దులపర్వ గ్రామంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దోమల నివారణ మందును ఆదివారం రాత్రి పిచికారీ చేయించారు. పీహెచ్‌సీ సిబ్బంది నాగేశ్వరరావు, ప్రతాప్, ఆశా కార్యకర్తలు పర్యవేక్షించారు.

ఎత్తిపోతలు.. ఉత్తిపోతలేనా



మండలంలోని గడ్డమణుగు శివారు మునగపాడు బైపాస్ రోడ్డు పక్కనే మోటరుగడ్డ సమీపంలో ఏర్పాటు చేసిన తారకరామ ఎత్తిపోతలు.. ఉత్తిపోతలగానే మిగిలింది. 2018 లో మునగపాడు గ్రామంలోని గ్రంధివాని చెరువుకు నీరు ఎత్తి పోసేందుకు పైపులైన్, మోటార్లు ఏర్పాటు చేసి షెడ్ నిర్మించారు. ఇది కాస్త గతేడాది వచ్చిన వరదల సమయంలో షెడ్ మొత్తం కొట్టుకుపోయి పైపులైన్, మోటార్లు మాత్రమే మిగిలి ఉండి దుస్థితికి చేరింది. ఈ ఘటన జరిగి దాదాపు సంవత్సరం కావస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. తక్షణమే నీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

పంచాయతీలో పాతుకుపోయారు...

ప్రభుత్వ కార్యాలయాల్లో ఐదేళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు ఎవరినైనా బదిలీ చేయాల్సిందే, ఎంతటివారైనా తప్పనిసరిగా వేరొక ప్రాంతానికి పంపాల్సిందే అంటూ కొన్నాళ్ల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ...గొల్లపూడి గ్రామ పంచాయతీలో పని చేసే ఉద్యోగులకు మాత్రం ఆ ఉత్తర్వులు వర్తించని పరిస్థితి నెలకొంది. ఒకటి కాదు రెండు కాదు పదేళ్ల పైగానే గొల్లపూడి గ్రామ పంచాయతీలోనే వారు విధులు నిర్వర్తిస్తున్నారు. గొల్లపూడి పంచాయతీలో పని చేస్తున్న ఉద్యోగికి చందర్లపాడుకు బదిలీ చేస్తూ జూన్ 9న డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు వచ్చి 20 రోజులు దాటుతున్నా కూడా సదరు ఉద్యోగి అక్కడకు వెళ్లి జాయిన్ కాలేదు. ఇక్కడి నుంచి రిలీవ్ అవ్వలేదు. ఆ ఉద్యోగిని గొల్లపూడిలోనే ఉంచేలా కొందరు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రికార్డులు సరిగా నిర్వహించడం లేదనే కారణంతో అప్పటి అధికారులు కొన్ని రోజుల పాటు ఆ ఉద్యోగిని సస్పెండ్ కూడా చేశారు. ఆ తర్వాత అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో తిరిగి విధుల్లో చేరారు. అలాగే మరో పదవిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి కూడా పదేళ్లుగా పంచాయతీలోనే పని చేస్తున్నాడు. ఎనికేపాడుకు కొన్నాళ్ల కిందట బదిలీ చేసినా అక్కడకు వెళ్లి చేరకుండా గొల్లపూడిలోనే ఉంటున్నారు. ఈ విషయమై డీపీవో లావణ్యకుమారిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ఐదేళ్లు దాటి పని చేసే ఉద్యోగులు బదిలీపై వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**



గొల్లపూడి పంచాయతీ కార్యాలయం...

అందుబాటులోకి తెస్తే.. ఆరోగ్యమే

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే వాకింగ్ చేయాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అందుకు తగ్గట్టుగా కొండపల్లిలో సౌకర్యమైన స్థలం లేకుండా పోయింది. ఈ విషయాన్ని గతంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ దృష్టికి పురవాసులు తీసుకెళ్లడంతో గజరాజు చెరువు ప్రాంతంలో ఒక ట్రాక్‌ను సిద్ధం చేయించారు. కొంతకాలం దాన్ని స్థానికులు ఉపయోగించుకున్నారు. కొద్దికాలానికి వర్షాలు పడడంతో ట్రాక్ పరిసరాల్లో పిచ్చిచెట్లు దట్టంగా పెరిగిపోయాయి. అయితే పురపాలిక అధికారులు, సిబ్బంది దానిపై దృష్టి సారించకపోవడంతో వాకింగ్ ట్రాక్ మరుగున పడిపోయింది. దీనిపై కొత్తగా ఎన్నికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు దృష్టి సారించి తిరిగి వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పుర వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**



వాకింగ్ ట్రాక్‌లో పెరిగిన కంప చెట్లు

పాలసంఘం ఎన్నికల బహిష్కరణ

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘంలో ఖాళీగా ఉన్న సభ్యుల స్థానాలకు నిర్వహిస్తున్న ఎన్నికలను తెదేపా బహిష్కరిస్తున్నట్లు ఏఎంసీ మాజీ ఛైర్మన్ వజ్రాల కుమార్‌రెడ్డి ప్రకటించారు. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నదని, ఎన్నికల విషయంలో ఎన్నికల అధికారి ఎం.వెంకటేశ్వరరావు బైలాకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నందున, వైకాపాతో కుమ్మక్కవడంతోనే తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ గడువు కుదించారని, ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఎన్నికల అధికారిని నియమించారని, జూన్ నిర్వహించాల్సిన ఎన్నికను బైలా నిబంధనలకు విరుద్ధంగా, జిల్లా సంఘం అనుమతి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి గత నెలలో ఖాళీగా ఉన్న సభ్యుల నియామకానికి సమావేశం ద్వారా ఎన్నిక నిర్వహించాలని భావించగా, రెండు వర్గాల ఆందోళనతో వాయిదా వేశారు. మరోసారి ఎన్నికకు నోటీసు ఇవ్వగా, పోలీసులు రక్షణ కల్పించలేమని చెప్పారంటూ రెండో పర్యాయం వాయిదా వేయడంతో, ఈసారి ఏకంగా కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ అధికార తెదేపా బహిష్కరణతో ఏ మలుపులు తిరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

మైలవరం, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఓ రైతు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని చంద్రగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గనిపిశెట్టి వేణుగోపాల్(42) శుక్రవారం పొలం పనికి వెళ్లి కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే విజయవాడకు తీసుకెళ్లగా..అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. వ్యవసాయం కలిసి రాక అప్పుల బాధతోనే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని వేణుగోపాల్ భార్య ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు.

దేశాభివృద్ధికి జగ్జీవన్‌రామ్ కృషి



మైలవరంలో నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకులు



తిరువూరులో....

న్యూస్‌టుడే, బృందం: తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. దేశాభివృద్ధిలో ఆయన చేసిన కృషిని కూటమి, వైకాపాతో పాటు పలు పార్టీల నాయకులు స్మరించుకుంటూ ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ★ దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి మాజీ మంత్రి దేవినేని ఉమా పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.

వైకాపా విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న వేణుగోపాలరెడ్డి, పక్కన స్వామిదాసు

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు సూపర్- 6 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వైకాపాను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ ఎన్.సుధారాణి, మోదుగుల వేణుగోపాల రెడ్డి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలిఏకాదశి సందడి



అనుముల్లంకలో సీతారామచంద్రస్వామి

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వైష్ణవాలయాల్లో ఆదివారం ఏకాదశి పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరువూరు, పెనుగొలను, అనుముల్లంక, ఊటుకూరు, గంపలగూడెం, గోసవీడు, వినగడప, మెట్టగుట్ట ఆలయాల్లో భక్తులు హరేరామ నామ సంకీర్తన, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



వినగడపలో పంచముఖ ఆంజనేయస్వామి



రెడ్డిగూడెం శ్రీరాజగోపాలస్వామి దేవాలయంలో..

పూజలందుకున్న నెమలి కృష్ణుడు

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన నెమలిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు తిరునఘరి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌ను పంచామృతాభిషేకాలు నిర్వహించి సువర్ణాభరణాలతో అలంకరించారు. అధికారులు, పాలకవర్గం పర్యవేక్షణలో ఏకాహ దీక్షతో హరే నామ సంకీర్తన ప్రారంభించారు. భక్తులకు పేలాల పిండితో పాటు పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు.



తట్ట మట్టి వేయక.. తంటాలు చూడక..!

గత ఐదేళ్ల నిర్లక్ష్యం నేడు శాపంగా మారిందంటున్న ప్రజలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రధాన రహదారులు మోకాళ్లలోతు గుంతలతో అధ్వానంగా మారి ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి. గత ఐదేళ్ల పాలనలో గుంతల్లో తట్ట మట్టి కూడా వేయకపోవడంతో నేడు తంటాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రహదార్ల అభివృద్ధిపై దృష్టి సారించి తమ అవస్థలు తొలగించాలని కోరుతున్నారు.



గడ్డమణుగు సమీపంలో గుంతలు తేలి ఇలా..

బిల్లుల జాప్యంతో..: గత ఐదేళ్లలో జి.కొండూరు నుంచి గంగినేని గ్రామం వరకు 15 కిలోమీటర్ల మేర రహదారి గుంతలు ఏర్పడి ప్రయాణానికి వాహనచోదకులు నానాతంటాలు పడ్డారు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గతంలో మంజూరైన న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.34 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించింది. గంగినేని వైపు నుంచి రహదారి పనులు మొదలుపెట్టి గ్రామాల్లో సీసీరోడ్లు, గ్రామం వెలుపల బీటీ రహదారిగా చెరువుమాధవరం గ్రామం వరకు పూర్తి చేశారు. కాని జి.కొండూరులోని గెయిల్ గ్యాస్ కంపెనీ నుంచి చెరువుమాధవరం వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర అధ్వానంగా తయారైనా బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

5 కి.మీ మేర అవస్థలే: విజయవాడ -విస్సన్నపేట ప్రధాన రహదారిలో భాగంగా ఉన్న మండలంలోని వెల్లటూరు కందులపాడు గ్రామాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల మేర రహదారి గుంతలు ఏర్పడి దారుణంగా తయారైంది. నిత్యం ఈ రహదారి నుంచే నియోజకవర్గంలోని ప్రజలు విజయవాడకు చేరుకుంటారు. గత వైకాపా పాలనలో ఈ రహదారి అభివృద్ధిని విస్మరించడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చినుకు పడితే చాలు వాటిల్లో నీరు నిలిచి వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. రహదారి విషయమై సహాయక ఇంజినీర్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా త్వరలోనే రహదారి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



వెల్లటూరులో చెరువును తలపిస్తూ..

జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై ట్రోలింగ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం

న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకోవడం సరికాదు: ఏపీ బార్ కౌన్సిల్

ఈనాడు, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోల్ చేయడాన్ని ఏపీ బార్ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. హైకోర్టు న్యాయమూర్తులపై, న్యాయవ్యవస్థపై ట్రోలింగ్ ద్వారా దాడులకు పాల్పడడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. 'తీర్పుల విషయంలో న్యాయమూర్తులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం సరికాదు. హైకోర్టు న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకోవడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సామాజిక మాధ్యమాల్లో న్యాయవ్యవస్థపై దాడి ఘటనల్లో చర్యలు తీసుకునేందుకు రిజిస్ట్రార్ పర్యవేక్షణలో ఓ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలని హైకోర్టును కోరుతున్నాం. న్యాయమూర్తులకు హాని తలపెట్టే వ్యవహారంపై పర్యవేక్షణకు, దర్యాప్తునకు డీజీపీ సారథ్యంలో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటుచేయాలి. న్యాయవ్యవస్థను అపకీర్తి పాలు చేసేవారిపై వెంటనే చర్యలు తీసుకునేందుకు ఈ యూనిట్‌కు అధికారం కల్పించాలి. ప్రస్తుతం, గతంలోనూ న్యాయమూర్తులపై దుష్ప్రచారం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలా రెచ్చగొడుతున్నా.. నిష్పక్షపాతంగా, రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తించే న్యాయమూర్తులకు సంఘీభావం ప్రకటిస్తున్నాం' అని ఆ ప్రకటనలో బార్ కౌన్సిల్ పేర్కొంది.

● ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి అధ్యక్షతన ఆదివారం బార్ కౌన్సిల్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్, సభ్యులు పాల్గొన్నారు. జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లకు ఖండన, తదితర అంశాలపై సమావేశంలో తీర్మానాలు చేశారు.

'డబుల్ మేజర్ విధానాన్ని ప్రవేశపెట్టాలి'

ఈనాడు, అమరావతి: డిగ్రీ కళాశాలల్లో అమలుచేస్తున్న 'సింగిల్ మేజర్ విధానం' సరైనది కాదని జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. విద్యార్థుల శ్రేయస్సు పరిగణనలోకి తీసుకోకుండా సింగిల్ మేజర్ విధానాన్ని ప్రవేశపెట్టారని, డబుల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.



మీ విలువను నిర్ణయించేది మీరే

మన గురించి మనం ఎలా ఆలోచిస్తున్నామన్నదాన్ని బట్టే ఇతరులు మనకిచ్చే విలువ ఆధారపడి ఉంటుంది. మన విలువను మనమే తక్కువగా అంచనా వేసుకుంటూ బలహీన వ్యక్తిత్వంతో ఉంటే, ఎదుటివారూ మనల్ని విలువ లేని వ్యక్తులుగానే జమకడతారు. అలా కాకుండా మనం ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ ఎదుటివారి దగ్గర ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తే, వారూ మనల్ని గౌరవిస్తారు.

– లెవిస్ హావెస్, రచయిత



శ్రీలక్ష్మీనరసింహస్వామి యజ్ఞమూర్తులకు లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్టలో తొలి ఏకాదశి వేడుక

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: తెలంగాణలోని యాదగిరిగుట్టలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పూజలు విశేషంగా కొనసాగాయి. ప్రధానాలయంలో ఆళ్వారులతో కూడిన మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను కొలుస్తూ, ఏకాదశి వేడుకగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ఈవో వెంకట్రావు, ధర్మకర్త నరసింహమూర్తి తదితరులు పాల్గొని ఆశీస్సులు పొందారు. దర్శనమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు. పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ ఏకాదశి వేడుక చేపట్టారు. భక్తులతో క్షేత్ర పరిసరాలు కోలాహలంగా మారాయి. దైవదర్శనానికి భక్తులు బారులు తీరారు.

దలైలామాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: బౌద్ధ గురువు దలైలామా పుట్టినరోజు సందర్భంగా సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రపంచ శాంతికి, ఆధ్యాత్మికతకు గుర్తని కొనియాడారు. ఆయన బోధనలు ప్రపంచ వ్యాప్తంగా ఎందరినో ప్రభావితం చేశాయన్నారు.

విష్ణుమూర్తి అనుగ్రహంతో అందరికీ మంచి జరగాలి

విష్ణుమూర్తి అనుగ్రహంతో అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఎక్స్'లో తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వర్షాలు పడి, పాడి పంటలతో రాష్ట్రం సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు.

దళితుల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు: మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: దళితులు, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ అలుపెరగని పోరాటం చేశారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు.

● ఆదివారం తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు ప్రజలకు లోకేశ్ మరో పోస్టులో శుభాకాంక్షలు తెలిపారు.

భోగాపురం చుట్టూ భారీ ప్రాజెక్టులు!

● పర్యాటక, పారిశ్రామిక ప్రగతికి ఊతం

● మారనున్న విమానాశ్రయ పరిసరాల రూపురేఖలు



విజయనగరం జిల్లా చింతపల్లి సముద్ర తీరంలో సిద్ధమవుతున్న కాటేజీలు

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లా భోగాపురానికి మరో ఏడాదిలో అంతర్జాతీయ చిత్రపటంలో స్థానం దక్కనుంది. ఇక్కడ విమానాశ్రయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం వస్తున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయి. విమానాశ్రయానికి సమీపంలో తీర ప్రాంతంలో పర్యాటక శాఖకు ప్రభుత్వం గతంలో 80 ఎకరాలు కేటాయించింది. ఇందులో 40 ఎకరాలు మై కేర్ సంస్థకు, మరో 40 ఎకరాలు ఒబెరాయ్ సంస్థకు అప్పగించారు. భోగాపురం- భీమిలి మండలాల పరిధిలో ఫైవ్ స్టార్ హోటళ్లు రానున్నాయి. చింతపల్లి తీరంలో గతంలో నిర్మించిన టూరిజం కాటేజీలను ఏపీ స్కూబా డైవింగ్ సంస్థకు కేటాయించారు. నాలుగున్నర ఎకరాల్లోని ఈ కాటేజీల పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. విమానాశ్రయాన్ని ఆనుకుని జీఎంఆర్ సంస్థ రూ.500 కోట్లతో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించతలపెట్టింది. సమీపంలో ప్రస్తుతం ఉన్న ప్రైవేటు రిసార్టు యాజమాన్యం రూ.100 కోట్లతో బీచ్ ఫ్రంట్ రిసార్ట్ నిర్మాణ పనులు ప్రారంభించింది. సుమారు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో విమానాశ్రయానికి సమీపంలోనే కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. జిల్లా సరిహద్దులోని భీమిలి మండల పరిధిలో తాజ్ హోటల్ నిర్మాణానికి యాజమాన్యం ముందుకొచ్చింది.



భోగాపురం సమీపంలో విమానాశ్రయ రన్‌వే నిర్మాణం

రహదారుల నిర్మాణానికి ఎదురుచూపు

విమానాశ్రయానికి ఒకవైపు 16వ నంబరు జాతీయ రహదారి.. మరోవైపు అందాల సముద్రతీర ప్రాంతం ప్రధాన ఆకర్షణ. ఇక్కడికి ప్రయాణికులు సులువుగా చేరుకునేందుకు వీఎంఆర్‌డీఏ సహా ప్రభుత్వ శాఖలు 15 అనుసంధాన రోడ్లు నిర్మించనున్నాయి. విశాఖ తీర రహదారిని ఆరు వరుసలుగా విస్తరించనున్నందున ఈ పనులు ప్రారంభమైతే వాటిని ఆనుకొని ఇటు తీరంలో.. అటు ఆనందపురం, తగరపువలస మధ్య నాలుగైదు ఫైవ్ స్టార్ హోటళ్లు నిర్మించాలని పారిశ్రామికవేత్తలు యోచిస్తున్నారు. ప్రభుత్వం వద్దనున్న 500 ఎకరాలను జీఎంఆర్ సంస్థకు తాజాగా అప్పగించింది. కొంత విస్తీర్ణంలో దిల్లీలో మాదిరి టౌన్‌షిప్ నిర్మించాలని జీఎంఆర్ యాజమాన్యం నిర్ణయించింది.

వంద ఎకరాల్లో ఐటీ కంపెనీ

విమానాశ్రయానికి సమీపంలోనే వంద ఎకరాల్లో ఐటీ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముక్కాం తీరానికి వెళ్లే దారిలో కొంగవానిపాలెం వద్ద పరిశ్రమల శాఖకు 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం 36 ఎకరాలు కేటాయించింది. ఇందులో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి చేయకుండా వైకాపా ప్రభుత్వం మోకాలడ్డింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 23 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధికి పచ్చజెండా ఊపింది. ఇంజినీరింగ్, ఫ్యాబ్రికేటింగ్ పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పనున్నారు. మరో 10 ఎకరాల్లో దివీస్ సంస్థ లాజిస్టిక్ హబ్ నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వివిధ రకాల సామగ్రిని ఇక్కడ నిల్వ చేసి ఎగుమతులకు హబ్‌గా వినియోగించనుంది.

స్థిరాస్తి రంగానికి కళ

విమానాశ్రయ పరిసర మండలాల్లో ఇప్పటికే భూములు కొనుగోలు చేసిన యజమానులు లేఅవుట్లు వేశారు. భోగాపురం, పూసపాటిరేగ, తగరపువలస, ఆనందపురం, భీమిలి మండలాల్లో టౌన్‌షిప్‌ల నిర్మాణానికి రియల్టర్లు ముందుకొస్తున్నారు. విమానాశ్రయం పనులు పూర్తయ్యే నాటికి వీటిలో కొన్నింటిని పూర్తి చేయాలని యోచిస్తున్నారు.

ఇటీవలె నిశ్చితార్థం.. అంతలోనే విషాదం!

● ప్రమాదవశాత్తు తుపాకీ పేలి జవాను మృతి



రవికుమార్

నగరం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు తుపాకీ పేలి బాపట్ల జిల్లాకు చెందిన జవాన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన జమ్మూ కశ్మీర్‌లో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నగరం మండలం చిలకాలవారిపాలెం గ్రామానికి చెందిన ఇమాన్యుయేల్, లక్ష్మి దంపతుల రెండో కుమారుడైన ఉప్పాల రవికుమార్ (24) నాలుగేళ్ల కిందట భారత ఆర్మీలో జవానుగా చేరి, జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీలో విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ప్రమాదవశాత్తు తుపాకీ పేలి ఆయన అక్కడ మృతి చెందారు. కాగా, రవికుమార్ వివాహం చేసుకునేందుకు ఇటీవలె సెలవులపై ఇంటికి వచ్చారు. గ్రామంలోని బంధువుల కుమార్తెతో నిశ్చితార్థం జరిగింది. ముహూర్తం చూసుకుని పెళ్లి చేసుకుందామనుకునే సమయంలో 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొనేందుకు రావాల్సిందిగా ఆర్మీ నుంచి ఆదేశాలు వచ్చాయి. దాంతో ఆయన పెళ్లి వాయిదా వేసుకుని విధులకు వెళ్లారు. "యుద్ధంలో విజయం సాధించి త్వరలోనే ఇంటికి తిరిగి వస్తాను. వచ్చిన వెంటనే పెళ్లి చేసుకుంటాను" అని తల్లిదండ్రులు, బంధువులకు రవికుమార్ చెప్పారు. ఇంతలోనే ప్రమాదవశాత్తు.. ఆయన ప్రాణాలు కోల్పోవడంపై తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కుక్కను ఢీకొని నిలిచిన వందేభారత్



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చీరాల, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20678) బాపట్ల జిల్లా చీరాల రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం కుక్కను ఢీకొనడంతో 20 నిమిషాలకు పైబడి నిలిచిపోయింది. ప్రత్యక్ష సాక్షులు, రైల్వే సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. రైలు చీరాల స్టేషన్ వద్ద కుక్కను ఢీకొనడంతో బ్రెజర్‌బాక్స్‌ను బలంగా తాకింది. దీనికి సంబంధించిన నట్టు దెబ్బతింది. దీంతో రైలు కొంత ముందుకువెళ్లి రైల్వేగేటు దాటి నిలిచిపోయింది. అనంతరం చెన్నైలోని నిపుణుల సలహా మేరకు రైల్వే సిబ్బంది మరమ్మతులు చేయడంతో రైలు ముందుకు కదిలింది.

ఎద్దును ఢీకొట్టి మరోటి..

కేసముద్రం రూరల్, న్యూస్‌టుడే: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఆదివారం పెనుప్రమాదం తప్పింది. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో పట్టాలపైకి అడ్డుగా వచ్చిన ఎద్దును రైలు ఢీకొట్టింది. దీంతో రైలు కొద్ది నిమిషాలపాటు నిలిచిపోయింది. ఇంజిన్ ముందు భాగం (క్యాటిల్ గార్డ్) కొంత విరిగి సంఘటన స్థలంలో పడింది. విషయం తెలుసుకున్న సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతిచెందిన ఎద్దును తొలగించి రైలును పంపించారు. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

దోమలపై సాంకేతిక అస్త్రం!

● సెన్సర్లతో గుర్తింపు, డ్రోన్లతో రసాయనాల పిచికారీ

● 6 నగరాల్లో ప్రయోగాత్మకంగా త్వరలో అమలు

ఈనాడు, అమరావతి: ఆధునిక సాంకేతికతతో దోమలను నియంత్రించాలని ప్రభుత్వం నడుం బిగించింది. డీప్ టెక్నాలజీతో ఏఐ ఆధారిత 'స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టం' (ఎస్ఎంఓఎస్ఎస్)ను అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు, కర్నూలులో ఈ విధానం తీసుకురానున్నారు. ప్రైవేటు సంస్థ రూపొందించిన ఎస్ఎంఓఎస్ఎస్ పనితీరును పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, సంచాలకుడు పి.సంపత్‌కుమార్ ఇటీవల పరిశీలించారు. ఈ విధానంలో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిన 66 ప్రాంతాల్లో ఏఐ ఆధారిత సెన్సర్లు ఏర్పాటు చేయనున్నారు. అవి.. దోమల సాంద్రత, వాటి లింగం, ఉష్ణోగ్రత వంటివి గుర్తించి సెంట్రల్ సర్వర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం పంపుతాయి. ఇలా గుర్తించిన దోమల ఉద్ధృతి ప్రాంతాల్లో అవసరం మేర డ్రోన్లతో రసాయనాలు పిచికారీ చేయనున్నారు. దీనివల్ల సమయం, ఖర్చు తగ్గుతుంది. రాష్ట్రంలోని మిగతా పుర, నగరపాలక సంస్థల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.



దోమల నియంత్రణకు ఉపయోగించే సాంకేతికతను పరిశీలిస్తున్న సురేశ్‌కుమార్, సంపత్‌కుమార్

రేపటి నుంచి డీసీహెచ్ఎస్‌లకు ప్రత్యేక శిక్షణ

● పదేళ్ల అనంతరం తొలిసారిగా ఈ కార్యక్రమం

ఈనాడు, అమరావతి: పనితీరు మెరుగుపరిచే చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని 26 జిల్లాల ఆరోగ్య సేవల సమన్వయాధికారులకు (డీసీహెచ్ఎస్) ఈ నెల 8 నుంచి 4 రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించనుంది. పదేళ్ల అనంతరం తొలిసారి డీసీహెచ్ఎస్ ప్రధాన కార్యాలయంలో ఈ శిక్షణ కార్యక్రమాలు జరగనున్నాయి. జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల పనితీరును పర్యవేక్షించే డీసీహెచ్ఎస్‌లు కొన్నిచోట్ల విధుల నిర్వహణలో విఫలమవుతున్నారు. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ జారీచేసిన ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ సిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పథకాల అమలు, అవినీతి నిరోధ చర్యలు, పనితీరు మదింపు, విజిలెన్స్ కేసులు, ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కింద రోగులకు వైద్యం అందించే తీరు ఇతర అంశాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తామన్నారు.

మత్స్యకార క్లస్టర్‌కు అంతర్జాతీయ ఇంధన సామర్థ్య సాంకేతికత

ఈనాడు, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లాలోని మత్స్యకార క్లస్టర్‌ను 'ఎనర్జీ ఎఫిషియన్సీ క్లస్టర్' కింద అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ఇంధన సామర్థ్య సాంకేతికత అమలుజేయడానికి ఎంపిక చేసినట్లు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో ఇంధన సామర్థ్య రంగంలో మత్స్యకార విభాగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని పేర్కొంది. ఇంధన, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, పర్యాటక, మహిళా, శిశు సంక్షేమం, రోడ్లు భవనాలు వంటి శాఖల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపింది.

సీనరేజ్ గుత్తేదారు కోసం గనులశాఖ అడ్డగోలు నిర్ణయాలు

● బకాయిలో రూ.27 కోట్ల సర్దుబాటు

● బ్యాంక్ గ్యారంటీగా జిరాక్స్ కాపీ ఇచ్చినా అనుమతి

ఈనాడు, అమరావతి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనింగ్ సీనరేజ్ వసూలు గుత్తేదారుకు మేలు చేసేందుకు గనులశాఖ అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటోంది. వైకాపా హయాంలో దందా చేసి, లీజుదారులను అన్ని విధాలా ఇబ్బందులు పెట్టిన గుత్తేదారు సంస్థకు.. కూటమి ప్రభుత్వంలో నిబంధనలను పక్కన పెట్టి అన్ని విధాలా సహకారం అందిస్తుండటంపై లీజుదారులు ఆశ్చర్యపోతున్నారు. రాష్ట్రంలో ఏడు ఉమ్మడి జిల్లాల్లో సీనరేజ్ వసూళ్ల గుత్తేదారులు ఉండగా.. వీరిలో అయిదు జిల్లాల గుత్తేదార్ల రెండేళ్ల కాలపరిమితి కొంతకాలం కిందట ముగిసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో మూడు నెలలపాటు జిల్లాల్లో సీనరేజ్ వసూళ్లను ఈ గుత్తేదార్లు నిలిపేశారు. దాంతో అప్పట్లో ఆపేసిన కాలానికి ఇప్పుడు అవకాశం ఇవ్వాలని సదరు గుత్తేదారు సంస్థలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. అందుకు అంగీకరించిన సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. అయితే బకాయిలను మూడు వాయిదాలుగా చెల్లించాలని, నిబంధనలన్నీ పాటించాలని షరతులు పెట్టింది. ఇప్పుడీ విషయంలోనే అనంతపురం గుత్తేదారు పలుకుబడి ఉపయోగించి అడ్డగోలుగా ప్రయోజనాలు పొందుతున్నారు.

బకాయి పూర్తిగా చెల్లించకుండా..

ఉమ్మడి అనంతపురం జిల్లా సీనరేజ్ గుత్తేదారైన 'అమిగోస్ మినరల్స్'కు 87 రోజుల పాటు మళ్లీ సీనరేజ్ వసూళ్లకు అవకాశం ఇవ్వనున్నారు. అయితే గనులశాఖకు ఆ సంస్థ రూ.61 కోట్లు బకాయి ఉన్నట్లు గతంలోనే తేల్చారు. దీనిని రూ.20.33 కోట్ల చొప్పున మూడు వాయిదాల్లో గనులశాఖకు చెల్లించాల్సి ఉంది. తొలి వాయిదా చెల్లించాక సీనరేజ్ వసూళ్ల ఆరంభించేందుకు అవకాశం ఇస్తారు. ఇక్కడే అమిగోస్ మినరల్స్ తెలివితేటలు చూపించింది. గతంలో ప్రభుత్వ పనులకు తరలించిన ఖనిజాలకు చెందిన సీనరేజ్ పేరిట.. ఏవేవో లెక్కలు వేసి రూ.27 కోట్లు బుక్ ఎడ్జెస్ట్‌మెంట్ (సర్దుబాటు)గా చూపి, బకాయిలు రూ.34 కోట్లే అన్నట్లు చెబుతోంది. గనులశాఖ అధికారులూ దీనికి తలూపారు. గతంలో అన్ని లెక్కలూ వేసి రూ.61 కోట్ల బకాయి అని చెప్పిన తర్వాత, మళ్లీ ఇప్పుడు రూ.27 కోట్ల సర్దుబాటుకు అధికారులు ఎలా ఒప్పుకొంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లా గుత్తేదారు సంస్థకు అవకాశం కల్పించినప్పుడు.. ఇలాంటి సర్దుబాట్లు ఏమీ చూపలేదు.

ఏజీకి.. డీడీ బాధ్యతలు!

అనంతపురం గుత్తేదారుకు సీనరేజ్ వసూళ్ల ఆరంభించేలా ఆదేశాలిచ్చే అధికారం అక్కడి గనులశాఖ ఉప సంచాలకుల(డీడీ)కు ఉంటుంది. మొన్నటి వరకు అక్కడి డీడీగా ఉన్న అధికారిని విజయవాడలోని సంచాలకుడి కార్యాలయానికి బదిలీ చేయడంతో.. ఆ పోస్టు ఖాళీ అయింది. నిబంధనల ప్రకారం కడప, కర్నూలు డీడీలలో ఎవరికైనా అదనపు బాధ్యతలు ఇవ్వాలి. లేదంటే గనులశాఖ డివిజనల్ కార్యాలయంలో ఏడీ స్థాయి అధికారికైనా డీడీగా బాధ్యతలు అప్పగించవచ్చు. కానీ, వీరెవరినీ కాదని అనంతపురం కార్యాలయంలో అసిస్టెంట్ జియాలజిస్ట్(ఏజీ)గా ఉన్న డి.ఆదినారాయణకు.. ఏకంగా డీడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు. ఇది గనులశాఖలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు సీనరేజ్ గుత్తేదారుల్లో కొందరు విదేశీ బ్యాంక్ అయిన.. యూరో ఎగ్జిమ్ బ్యాంక్ నుంచి తెచ్చిన బ్యాంక్ గ్యారంటీ (బీజీ)ని ఇచ్చారు. దాని స్థానంలో దేశీయ బ్యాంకుల నుంచి బీజీ ఇవ్వాలని గనులశాఖ షరతు విధించింది. అమిగోస్ మినరల్స్ సంస్థ ఇలా ఓ దేశీయ బ్యాంక్ నుంచి బీజీ ఇచ్చింది. అయితే అది ఒరిజనల్ కాపీ కాకుండా జిరాక్స్ ఇచ్చినాసరే అధికారులు దానిని అనుమతించడంపైనా విమర్శలు వస్తున్నాయి.

గతంలో వైకాపాకు అనుకూలంగా..

గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో వైకాపా అభ్యర్థుల తరఫున అమిగోస్ మినరల్స్‌కు చెందిన యాజమాన్యం డబ్బులు పంపిణీ బాధ్యతలు చూసిందనే ఆరోపణలు ఉన్నాయి. అటువంటి సంస్థకు ఇప్పుడు అన్ని విధాలా ఎలా సహకారం అందిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆర్థిక సంస్కరణల బాటలో విద్యుత్తు సంస్థలు

● కొత్త అప్పులకు వెళ్లకుండా దిద్దుబాటు చర్యలు

● వడ్డీ రేటులో 1.5% తగ్గడంతో.. ఏటా రూ.250 కోట్లు ఆదా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్యుత్తు సంస్థలు (ట్రాన్స్‌కో, జెన్‌కో, మూడు డిస్కంలు) ఆర్థిక సంస్కరణలు చేపట్టాయి. విద్యుత్తు సంస్థల సంస్కరణలు 3.0 పేరిట ఆర్థిక దిద్దుబాటు చర్యల దిశగా అడుగులు వేస్తున్నాయి. వడ్డీ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు కొత్త అప్పులకు వెళ్లకుండా ఆర్థిక ఉపశమన చర్యలు చేపట్టాయి. దీనికోసం ప్రస్తుతం ఉన్న రుణాలను రీషెడ్యూల్ చేశాయి. వివిధ ఆర్థిక సంస్థలు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు పీఎఫ్‌సీ, ఆర్ఈసీ నుంచి విద్యుత్తు సంస్థలు రూ.1,12,422 కోట్లు రుణంగా తీసుకున్నాయి. వాటికి సగటున 10.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నాయి. గత ఐదేళ్లలో విద్యుత్తు సంస్థల రేటింగ్ పడిపోవడంతో అధిక వడ్డీ రేటుకు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దృష్ట్యా పాత రుణాలు రీషెడ్యూల్ చేయడం ద్వారా విద్యుత్తు సంస్థలకు ఆర్థికంగా ఊపిరి పోయాలన్న ప్రతిపాదనను అధికారులు అమలు చేస్తున్నారు. వడ్డీ రేటు తగ్గించేందుకూ రుణ సంస్థలు అంగీకరించాయి. దీంతో సగటు వడ్డీ రేటు 9 శాతానికి (గతంలో సగటున 10.5 శాతం ఉండేది) తగ్గింది. దీనివల్ల ఏటా రూ.250 కోట్లు ఆదా అవుతాయని విద్యుత్తు సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఆ మేరకు వినియోగదారులపై పడే ట్రూఅప్ భారం తగ్గుతుంది. రీషెడ్యూల్‌తో రుణాలపై రెండేళ్ల పాటు మారటోరియం లభించింది. ఈ రెండేళ్ల పాటు కేవలం వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. దానివల్ల మిగిలిన మొత్తాన్ని సంస్థ నిర్వహణకు వినియోగిస్తారు. ఒకవేళ ఇంకా మిగిలితే అప్పులకు సంబంధించి చెల్లింపులు చేస్తారు. దీనివల్ల కొత్త అప్పుల జోలికి వెళ్లకుండా.. ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఒక అధికారి తెలిపారు.

రూ.50 వేల కోట్ల అప్పుల్లో ముంచిన వైకాపా

గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.49,596 కోట్ల కొత్త అప్పులు చేసింది. 2019 ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ.62,826 కోట్ల అప్పులతో పోలిస్తే.. వైకాపా హయాంలో 79% కొత్త అప్పులు విద్యుత్తు సంస్థల నెత్తిన పడ్డాయి. కొత్తగా తెచ్చిన అప్పుల్లో మూలధన వ్యయం కింద రూ.9,588 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే.. నిర్వహణ మూలధనం కింద రూ.40,008 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేసింది. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేందుకూ కొన్ని నెలలపాటు విద్యుత్తు సంస్థలు ఇబ్బందులు పడ్డాయి.

● స్వల్పకాలిక విద్యుత్తు ఒప్పందాల ద్వారా అధిక ధరకు విద్యుత్తు కొనడం వల్ల ఐదేళ్లలో రూ.12,250 కోట్ల అదనపు భారం వినియోగదారులపై పడిందని డిస్కంలు లెక్కలు తేల్చాయి. విద్యుత్తు ప్లాంట్లను బ్యాక్ డౌన్ చేసి.. ఆ సమయంలో తీసుకోని విద్యుత్తుకు ఐదేళ్లలో రూ.3,135 కోట్లు చెల్లించింది.

వైకాపా ప్రభుత్వం 2022-23, 2023-24లకు సంబంధించిన ట్రూఅప్ రూ.16 వేల కోట్లు సహా.. వివిధ రూపాల్లో సుమారు రూ.48 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసింది. కూటమి ప్రభుత్వం ట్రూఅప్ పేరిట అదనపు భారం పడకుండా చూడాలని ప్రయత్నిస్తోంది.

భవిష్యత్తుపై ఆశలు కలిగించేలా న్యాయం అందించాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్

ఈనాడు, హైదరాబాద్: లైంగిక వేధింపుల బాధితులకు గతం తాలూకు గాయాలు మరిచేలా, భవిష్యత్తుపై ఆశలు చిగురించేలా న్యాయం అందించాలని, నిందితులకు కఠిన శిక్షలు విధించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'వాయిస్ ఫర్ వాయిస్‌లెస్- ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఆఫ్ సెక్సువల్ అబ్యూజ్' కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. "బాధితులైన చిన్నారుల సంరక్షణ మాటలకే పరిమితం కాకూడదు. వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా ఉండాలి. న్యాయం మానవీయంగా ఉండాలి. కోర్టు గది, పోలీస్ స్టేషన్, ఆసుపత్రి లేదా ఆశ్రయ గృహంలో అడుగుపెట్టే ప్రతి బిడ్డకూ అది కనిపించాలి. ఇన్ కెమెరా విచారణ, వీడియో కాన్ఫరెన్స్ సాక్ష్యాన్ని అనుమతించడం, ప్రశ్నలు వేయడంలో జాగ్రత్తలు, వాయిదాల తగ్గింపుపై దృష్టి సారించాలి. కోర్టుల్లో బాధిత చిన్నారులకు అనుకూల వాతావరణం అవసరాన్ని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో నొక్కిచెప్పింది. పెండింగ్ కేసులు ఎక్కువగా, దోషులుగా నిర్ధారించే రేటు తక్కువగా ఉంది. బాధితులకు పరిహారం సకాలంలో అందేలా న్యాయసేవాధికార సంస్థలు చూడాలి" అని జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు.

ప్రైవేటు వైద్య కళాశాలల మాయాజాలం

● ఎన్ఎంసీ మార్గదర్శకాలకు తిలోదకాలు

● అదనపు కోర్సులు, సీట్ల అనుమతుల వెనుక అవినీతి బాగోతం

ఈనాడు, అమరావతి: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆధ్వర్యంలో ప్రైవేట్ వైద్య కళాశాలల్లో నిర్వహించిన తనిఖీల సందర్భంగా అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లో అదనపు కోర్సులు, సీట్ల అనుమతుల నిమిత్తం తనిఖీలకు వచ్చే సీనియర్ ప్రొఫెసర్లను ప్రలోభాలకు గురిచేసిన తీరు సీబీఐ విచారణలో బయటపడింది. ఈ అక్రమాల పరంపరలో దేశవ్యాప్తంగా 36 మందిపై కేసులు నమోదు కాగా.. వీరిలో ఎనిమిది మంది కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ, ఎన్ఎంసీ కార్యాలయ అధికారులు ఉన్నారు. మిగిలిన వారిలో వైకాపాకు చెందిన డాక్టర్ హరిప్రసాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన నలుగురు ఉండడం గమనార్హం. నిందితుల్లో తనిఖీలకు వెళ్లిన వైద్యులతో పాటు దళారులు, కళాశాలల యజమాన్యాల ప్రతినిధులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మందిని ఇప్పటివరకు సీబీఐ అరెస్టు చేసింది. ప్రధానంగా ఎన్ఎంసీ కార్యాలయం, ప్రైవేటు వైద్య కళాశాలల మధ్య దళారీ వ్యవస్థ వేళ్లూనుకుపోయింది. ఎన్ఎంసీ రికార్డుల్లోని వివరాలను రహస్యంగా సేకరించి, తనిఖీలకు వచ్చే వారిని ముందుగానే సంప్రదించి.. సానుకూల నివేదికలిచ్చేలా చేయడంలో దళారులు కీలకపాత్ర పోషించిన విషయం సీబీఐ విచారణలో స్పష్టమైంది. ఈ దందాలో రూ.కోట్లు చేతులు మారాయి. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం కళాశాలల్లో అర్హులైన బోధకుల నియామకాలు చేపట్టకుండా, రోగ నిర్ధారణ పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకుండా యాజమాన్యాలు తనిఖీల వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్నాయి.

'ఎన్ఎంసీ'లోనే అక్రమార్కులు

ప్రైవేటు వైద్య కళాశాలల్లో కొత్త కోర్సులు ప్రారంభించాలన్నా.. ఉన్న వాటికి అదనంగా సీట్లు కావాలన్నా.. యాజమాన్యాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు తొలుత ఆయా రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల ద్వారా తనిఖీలు జరుగుతాయి. ఇవి కూడా కంటితుడుపుగానే జరుగుతున్నాయి. వర్సిటీలిచ్చే ప్రాథమిక అనుమతితో యాజమాన్యాలు ఎన్ఎంసీకి దరఖాస్తు చేస్తాయి. తరువాత ఎన్ఎంసీ దేశంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేసే సీనియర్ ప్రొఫెసర్లను ర్యాండమ్‌గా ఎంపిక చేసి, తనిఖీలకు పంపుతుంది. వారిని ఎక్కడికి పంపుతున్నారన్న విషయాన్ని చివరి నిమిషం వరకు చెప్పకుండా గోప్యంగా ఉంచుతుంది. కానీ, ఆ సమాచారం దళారుల ద్వారా బయటకు తెలిసిపోతోంది. దీంతో కళాశాలల యాజమాన్యాలు తనిఖీలకు వచ్చే వారిని ప్రలోభాలకు గురిచేసి, సానుకూల నివేదికలు పొందుతున్నాయి. ఈ దందాలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ, ఎన్ఎంసీకి చెందిన 8 మంది పాత్ర ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 40 చోట్ల సీబీఐ అధికారులు తనిఖీలు చేపట్టారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కళాశాలల తనిఖీల నివేదికలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాగానే.. వాటిల్లో వ్యతిరేకంగా ఉన్న సమాచారాన్ని ట్యాంపరింగ్ చేసినట్లు కూడా విచారణలో తేలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నవరాయపుర్‌లోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో జరిగిన తనిఖీల సందర్భంగా రూ.55 లక్షల వరకు బెంగళూరులో చేతులు మారినట్లు సీబీఐ గుర్తించింది. కర్ణాటకలోని ఓ ప్రైవేట్ వైద్య కళాశాలలో నిర్వహించిన తనిఖీలకు సంబంధించి.. ఓ వైద్యుడ్ని సీబీఐ అరెస్టు చేసిందని ఎన్ఎంసీ గత వారం ఓ ప్రకటనలో తెలిపింది. కళాశాల యాజమాన్యానికి అనుకూలంగా నివేదిక ఇచ్చే విషయంలో రూ.10 లక్షల మేర చేతులు మారినట్లు తెలిపింది.

అదనపు 'ఉపాధి'కి ప్రతిపాదనలు

● రాష్ట్రాలతో 15న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సమావేశం

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్రం అదనపు బడ్జెట్ కేటాయించాలని దిల్లీలో ఈ నెల 15న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ రాష్ట్రాలతో నిర్వహించే సమావేశంలో రాష్ట్రం విజ్ఞప్తి చేయనుంది. ఈ ఏడాది (2025-26) రూ.15 కోట్ల పని దినాలను రాష్ట్రానికి కేటాయించింది. మరో రూ.10 కోట్ల పని దినాలు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై హెయిర్ క్లిప్పు, చిన్న కత్తితో ప్రసవం

ఝాన్సీ (యూపీ): రైలులో వెళుతున్న గర్భిణికి అకస్మాత్తుగా పురిటినొప్పులు రావడంతో ఓ యువ ఆర్మీ వైద్యుడు అందుబాటులో ఉన్న హెయిర్ క్లిప్పు, పాకెట్ కత్తి సాయంతో రైల్వే ప్లాట్‌ఫాంపైనే ఆమెకు ప్రసవం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. పన్వేల్ నుంచి గోరఖ్‌పుర్‌కు రైలులో వెళ్తున్న గర్భిణికి అత్యవసర వైద్యసాయం కోసం ఝాన్సీ స్టేషనులో దింపారు. అదే సమయంలో హైదరాబాద్ వెళ్లేందుకు మరో రైలు కోసం ఎదురుచూస్తున్న ఆర్మీ వైద్యాధికారి మేజర్ డాక్టర్ రోహిత్ బచ్వాలా (31) పరిస్థితిని గమనించి రైల్వే మహిళా సిబ్బంది, స్థానిక మహిళల సాయంతో గర్భిణికి ప్లాట్‌ఫాంపైనే సురక్షితంగా ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డ పుట్టింది. బొడ్డుతాడును బిగించడానికి హెయిర్ క్లిప్పు వాడాను. బిడ్డ ఆరోగ్యం స్థిరంగా ఉందని నిర్ధరించుకున్నాక పాకెట్ కత్తితో దానిని కత్తిరించినట్లు వివరించారు.



మాజీ చీఫ్‌జస్టిస్ చంద్రచూడ్‌ను ఆ భవనం నుంచి ఖాళీ చేయించండి

- కేంద్రానికి సుప్రీంకోర్టు లేఖ

దిల్లీ: సుప్రీంకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌ను వీలైనంత త్వరగా అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు పాలనా విభాగం లేఖ రాసింది. దిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్‌లో జస్టిస్ చంద్రచూడ్ నివాసముంటున్న 5వ నంబరు బంగ్లాను అత్యవసరంగా ఖాళీ చేయించాలని పేర్కొంది. పదవీ విరమణ అనంతరం ఆయన నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ఉంటున్నారని, చంద్రచూడ్‌కు ఇచ్చిన గడువు ఈ ఏడాది మే 31తో ముగిసిందని సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. గతేడాది నవంబరు 10న సీజేఐగా పదవీ విరమణ పొందిన జస్టిస్ చంద్రచూడ్, బంగ్లాను ఖాళీ చేయాల్సిన గడువు ముగిసిపోయి ఎనిమిది నెలలు పూర్తైందని గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొంది. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. కొన్ని వ్యక్తిగత పరిస్థితులు, తన కుమార్తెలకు ఉన్న ప్రత్యేక అవసరాల దృష్ట్యా అధికారిక బంగ్లా ఖాళీ చేయడానికి ఆలస్యమైందని సుప్రీంకోర్టుకు తెలియజేశారు. తనకు ప్రత్యామ్నాయ వసతిగా తుగ్లక్ రోడ్డులోని బంగ్లా నంబరు 14ను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించినప్పటికీ.. పునరుద్ధరణ పనులు జరుగుతున్న కారణంగా అందులోకి మారలేదని ఆయన తెలిపారు. త్వరలో బంగ్లాను ఖాళీ చేసి అధికారులకు అప్పగిస్తానని పేర్కొన్నారు.

60 వేల మొక్కలు నాటిన అస్సాం ఉపాధ్యాయుడు

ఈటీవీ భారత్: ప్రకృతిని కాపాడేందుకు అస్సాంకు చెందిన ఓ ప్రకృతి ప్రేమికుడు నడుం బిగించారు. 24 ఏళ్లలో ఏకంగా 60,000 మొక్కలను నాటి ప్రకృతిపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. బొంగాయిగావ్ జిల్లాలోని తులంగియా గ్రామానికి చెందిన బుద్ధేశ్వర్ రాయ్‌ది పేద కుటుంబం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సమాజానికి, ప్రజలకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో 2001 నుంచి మొక్కలు నాటడాన్ని మొదలు పెట్టారు. తన సంపాదనను రహదారులు, పాఠశాలలు, గ్రామాల్లో, బంజరు భూముల్లో మొక్కలు నాటడం కోసం వినియోగించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చాక కూడా ఇది కొనసాగుతోంది. జాతీయ రహదారి-31కి ఇరువైపులా నాటిన 12,000కు పైగా మొక్కలు వృక్షాలుగా ఎదిగాక 2019లో రహదారి విస్తరణకు అధికారులు రాత్రికి రాత్రే నరికేశారు. అదే రహదారికి ఇరువైపులా మళ్లీ మొక్కలు నాటడం ప్రారంభించానని బుద్ధేశ్వర్ తెలిపారు.



కొత్త పార్టీని ప్రకటించిన మస్క్

- అమెరికన్లకు స్వేచ్ఛ కల్పిస్తానని వెల్లడి

వాషింగ్టన్: అమెరికాలో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించారు. అధ్యక్షుడు ట్రంప్ తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లు చట్టమైతే కొత్త పార్టీ పెడతానని అన్నట్లుగానే అడుగు వేశారు. తాజాగా 'అమెరికా పార్టీ'ని స్థాపిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం లేదని, ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. తన పార్టీ ద్వారా దేశంలో ద్వి పార్టీ వ్యవస్థకు సవాలు చేయనున్నట్లు వివరించారు. అయితే తన పార్టీని ఎక్కడ రిజిస్టర్ చేసేదీ ఆయన వెల్లడించలేదు.



గతంలో విఫలం

అమెరికాలోని రెండు పార్టీల వ్యవస్థపై ఎప్పటి నుంచో విమర్శలున్నాయి. అయితే గత శతాబ్ద కాలంలో మూడో పార్టీ స్థాపించడానికి చేసిన పలు ప్రయత్నాలు విఫలమయ్యాయి.

ప్రభావితం చేయగలరా?

ఈ పార్టీ ద్వారా ఎలాన్ మస్క్.. అమెరికా రాజకీయాలను ప్రభావితం చేయగలిగే అవకాశాలు తక్కువే. ఆయనకు అధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం లేదు. విదేశాల్లో జన్మించిన కారణంగా ఆయనకు అర్హత లేదు. అమెరికా రాజ్యాంగం ప్రకారం.. అమెరికాలో జన్మించిన పౌరులకే అధ్యక్షుడయ్యే అవకాశం ఉంటుంది. మస్క్ అయితే ఆయన గవర్నర్ వరకూ వెళ్లవచ్చు. గతంలో అమెరికా బయట జన్మించిన హాలీవుడ్ స్టార్ నటుడు ఆర్నాల్డ్ స్వార్జ్‌నెగ్గర్ కాలిఫోర్నియా గవర్నర్ అయ్యారు.

■ మస్క్ పార్టీ ప్రధానంగా అమెరికా కాంగ్రెస్‌లోని 2, 3 సెనెట్ సీట్లు, 8, 10 ప్రతినిధుల సభ సీట్లపై దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. చట్టాలను ఆమోదించడంలో కీలకంగా మారడానికి అమెరికా కాంగ్రెస్‌లో ఈ నంబర్లు సరిపోతాయని ఆయన భావిస్తున్నారు.

టెక్సాస్‌లో కొనసాగుతున్న వరద బీభత్సం

70కి చేరిన మృతుల సంఖ్య

కెర్‌విల్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో వరద బీభత్సం కొనసాగుతోంది. ఈ విపత్తులో మరణించిన వారి మొత్తం సంఖ్య 70కి చేరింది. ఒక్క కెర్ కౌంటీలోని గ్వాడలూప్ నది సమీపంలోనే 59 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో 21 మంది చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్వాడలూప్ నది ఉప్పొంగి గంటల వ్యవధిలో పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో నది తీరంలోని క్రైస్తవ బాలికల వేసవి శిబిరం వరదల్లో కొట్టుకుపోయింది. ఈ శిబిరంలో గల్లంతైన 27 మంది బాలికలతో సహా



టెక్సాస్ జార్జిటౌన్‌లో ఉప్పొంగి ప్రవహిస్తున్న శాన్ గాబ్రియెల్ నది

మిగిలిన వారి కోసం గాలింపు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నది సమీపంలో అనేక నివాసాలు నీట మునిగాయి. పలు వాహనాలు కొట్టుకుపోయాయి. వరదల్లో చిక్కుకున్న దాదాపు 850 మందిని రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. టెక్సాస్ వరదల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ భారత ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఎర్ర సముద్రంలో నౌకపై గ్రనేడ్ దాడి.. చెలరేగిన మంటలు

బీరుట్: ఎర్ర సముద్రంలో మరోసారి అలజడి రేగింది. యెమెన్ తీరంలో ఓ నౌకపై కొందరు సాయుధులు కాల్పులు జరిపారు. రాకెట్లతో గ్రనేడ్‌లను ప్రయోగించారు. వెంటనే నౌకలోని సాయుధ సిబ్బంది ఎదురు కాల్పులు ప్రారంభించారు. సాయుధులు హూతీ తిరుగుబాటుదారులే అయి ఉండొచ్చని బ్రిటన్ భావిస్తోంది. బాంబులతో నిండిన డ్రోన్ పడవలు వచ్చి ఢీకొట్టడంతో ఈ నౌకలో మంటలు చెలరేగాయని వార్తలు వెలువడ్డాయి. అనంతరం నౌకలో నీళ్లు చేరడం మొదలైంది. దాంతో దానిని అక్కడే వదిలేసి బయటపడేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.

అట్టహాసంగా దలైలామా పుట్టినరోజు వేడుకలు

- పలు దేశాల ప్రతినిధులు, రాజకీయ నేతలు హాజరు

ధర్మశాల: టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదిన వేడుకలు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పలు దేశాల ప్రతినిధులు, రాజకీయ నేతలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధులు, వేల మంది టిబెటన్లు తరలివచ్చారు. దలైలామా మాట్లాడుతూ.. 'ప్రజల ప్రేమ నన్ను అన్ని విధాలుగా సేవ చేసే మార్గంలో నడిపిస్తోంది' అన్నారు. 'కరుణ, మంచి హృదయంతో జీవించడం వల్ల మనశ్శాంతిని పొందొచ్చు. నేను ఒక సాధారణ బౌద్ధ సన్యాసిని. పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం నాకు ఇష్టం లేదు. కానీ మీరు చూపిస్తున్న ప్రేమ కోసం వాటిలో పాల్గొంటున్నా. దలైలామా బిరుదుతో నాకు ఎటువంటి గర్వం, అహంకారం లేవు. బుద్ధుడి అనుచరుడిని, భిక్షువును.. ప్రజలకు సేవ చేయడమే నా జీవిత ప్రధాన ధ్యేయం' అని దలైలామా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రాజీవ్ రంజన్ సింగ్, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ, సిక్కిం మంత్రి సోనమ్ లామా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ గేర్, ఇతర పలుదేశాల ప్రతినిధులు హాజరయ్యారు.



పుట్టినరోజు వేడుకల్లో టిబెట్ బౌద్ధ మతగురువు దలైలామా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు


కొత్తరకం గోల్డెన్ వీసాను ప్రవేశపెట్టిన యూఏఈ

దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) కొత్తరకం గోల్డెన్ వీసాను ప్రారంభించి భారతీయులకు తీపి కబురు అందించింది. నామినేషన్ ఆధారంగా ఎంపిక చేసే ఈ ప్రక్రియలో కొన్ని షరతులు ఉన్నప్పటికీ ఇంతకు ముందున్న చాలా నియమాలను సవరించింది. '2 మిలియన్ దిర్హమ్(రూ.4.66 కోట్లు)లతో స్థిరాస్తి కొనుగోలు చేయడం, అరబ్ దేశాల వ్యాపారంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం' గోల్డెన్ వీసాను పొందడానికి భారతీయులకు ఇప్పటివరకు ఉన్న మార్గాల్లో ఒకటి. కొత్తగా ప్రవేశపెట్టిన నామినేషన్ ఆధారిత విధానంతో లక్ష దిర్హమ్(రూ.23.30 లక్షలు) చెల్లించి ఈ గోల్డెన్ వీసాను పొందవచ్చు. మూడు నెలల్లో 5 వేలకు పైగా భారతీయులు ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకొవచ్చని అధికారులు తెలిపారు. దీనిని పరీక్షించేందుకు మొదటి విడతలో భారత్, బంగ్లాదేశ్‌లను ఎంపిక చేశారు. భారత్‌లో ఈ నామినేషన్ ప్రక్రియను రాయద్ గ్రూప్ కన్సల్టెన్సీ పరిశీలించనుంది.

అధికారాలను బదలాయిస్తున్న జిన్‌పింగ్!

- బాధ్యతల పంపిణీయేనా.. పదవీ విరమణా?

బీజింగ్: జీవిత కాలంపాటు అధికారాన్ని చెలాయించేలా కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగాన్ని సవరించుకున్న చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ క్రమంగా దిగివస్తున్నట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పాలన తర్వాత అధికారాలను ఒక్కొక్కటిగా ఆయన తదుపరి నేతలకు అప్పగిస్తున్నట్లు సమాచారం. తద్వారా పదవీ విరమణకు ఆయన సిద్ధమవుతున్నట్లు వార్తలొస్తున్నాయి. పార్టీ వ్యవస్థల పని విధానాలను నిర్ణయించే కొత్త నిబంధనలపై జూన్ 30వ తేదీన జరిగిన 24 మంది సభ్యుల అత్యంత శక్తిమంతమైన కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సమీక్షించినట్లు అధికార వార్తా సంస్థ జిన్‌హువా పేర్కొనడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. ఈ సమావేశానికి స్వయంగా జిన్‌పింగే అధ్యక్షత వహించారని తెలుస్తోంది. పార్టీని మరింత సుస్థిర పరిచేందుకు, బాధ్యతల నిర్వహణకు, సీపీసీ కేంద్ర కమిటీ నిర్ణయాత్మక శక్తికి, వ్యవస్థల మధ్య సమన్వయానికి ఈ కొత్త నిబంధనలు అవసరమని ఆయనే గట్టిగా స్పష్టం చేశారని సమాచారం. ఇవన్నీ జిన్‌పింగ్ పదవీ విరమణకు మార్గం చూపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. అయితే అత్యంత శక్తిమంతమైన జిన్‌పింగ్ కావాలనే కొన్ని బాధ్యతలను సహచరులకు అప్పగిస్తున్నారని, మరింత పెద్ద అంశాలపై దృష్టి పెట్టడానికి ఆయనిలా చేస్తున్నారని మరి కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. దైనందిన కార్యక్రమాలను దూరంగా ఉండాలని ఆయన నిర్ణయించుకుని ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.





రేపూ మీకుండేది 24 గంటలే

ఈరోజు చేయాల్సిన పనిని ఈరోజే చేయండి. సమయం లేదని రేపటికి వాయిదా వేశారంటే, ఆరోజు చేయాల్సిన పనులను మరో రోజుకు వాయిదా వేయాల్సి వస్తుంది. ఎందుకంటే ఈరోజులాగే రేపూ మీకుండేది 24 గంటలే. వాయిదాలు వేసుకుంటూ వెళ్తే ఏ పనికీ న్యాయం చేయలేరు.

– అంకుర్ వారికూ, కంటెంట్ క్రియేటర్

భారత్‌లో రాయిటర్స్ 'ఎక్స్' ఖాతా నిలిపివేత, పునరుద్ధరణ

దిల్లీ: అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ ఎక్స్ ఖాతా భారత్‌లో కొన్ని గంటలపాటు నిలిచిపోయింది. ఎక్స్ యాజమాన్యం ఈ చర్య తీసుకుంది. చట్టపరమైన డిమాండ్‌కు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. అయితే వెంటనే ప్రభుత్వ జోక్యం చేసుకోవడంతో పునరుద్ధరించింది. తాము రాయిటర్స్ ఖాతాను నిలిపేయాలని కోరలేదని, తమ తరఫున చట్టపరంగా అలాంటి డిమాండ్లేవీ లేవని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది మేలో ఆపరేషన్ సిందూర్ సమయంలో.. 'ఎక్స్'లో రాయిటర్స్ సహా పలు ఖాతాలను నిలిపేయాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. అప్పట్లో అనేక ఖాతాలను స్తంభింపజేసిన 'ఎక్స్'.. రాయిటర్స్ విషయంలో చర్యలు చేపట్టలేదు. నాటి డిమాండ్ల మేరకు తాజాగా చర్యలు చేపట్టి ఉండొచ్చని తెలుస్తోంది. చైనా వార్తా సంస్థ గ్లోబల్ టైమ్స్, తుర్కియేకు చెందిన మీడియా సంస్థ టీఆర్‌టీ వరల్డ్‌ల ఖాతాలను చట్టపరమైన డిమాండ్ పేరుతో 'ఎక్స్' నిలిపేసింది. వాటినీ తిరిగి ప్రారంభించే అవకాశాలున్నాయి.

బిహార్‌ని దేశ నేర రాజధానిగా మార్చేశారు

- సీఎం నీతీశ్‌కుమార్‌పై మండిపడ్డ రాహుల్ గాంధీ


దిల్లీ: బిహార్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం తీవ్రంగా మండిపడ్డారు. నీతీశ్ కుమార్ ప్రభుత్వం రాష్ట్రాన్ని గూండాల రాజ్యంగా మార్చిందని దుయ్యబట్టారు. "పట్నాలో వ్యాపారి గోపాల్ ఖేమ్కాపై జరిగిన కాల్పుల ఘటనను ప్రస్తావిస్తూ.. భాజపా, నీతీశ్ కుమార్ ప్రభుత్వం కలిసి బిహార్‌ను దేశ నేర రాజధానిగా మార్చారని మరోసారి రుజువైంది. నేడు బిహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో నివసిస్తోంది. రాష్ట్రంలో నేరాలు జరగడమనేది సాధారణంగా మారిపోయింది. వీటిని నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బిహార్‌లో దారుణాలు, దోపిడీలను పూర్తిగా నిర్మూలించి, పురోగతి వైపు అడుగులు వేసే సమయం వచ్చింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ప్రభుత్వాన్ని మార్చడానికే కాదు.. రాష్ట్రాన్ని కాపాడడానికి ఓట్లు వేయండి" అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



ప్రజలు ఎదురుతిరిగితే.. భాజపా వెనకడుగేస్తుంది

- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్య

దిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక శీఘ్ర పునశ్చరణ(ఎస్ఐఆర్) ద్వారా బిహార్ ప్రజల ప్రత్యేక ఓటు హక్కులను హరించేందుకు భాజపా కుట్ర పన్నిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ కింద ఒక ఫారం మాత్రమే నింపాలని కోరుతూ ఎన్నికల సంఘం(ఈసీ) కొత్తగా జారీచేసిన ప్రకటనను ఆయన ఉదహరించారు. "ఈసీ మద్దతుతో కోట్లమంది ఓటర్ల హక్కును హరించడానికి భాజపా రూపొందించి బృహత్ ప్రణాళిక ఇప్పుడు ఆ పార్టీనే ఊబిలోకి నెట్టేలా చేసింది. ఎన్నికల్లో ఓటు వేసేందుకు అన్ని పత్రాలు చూపించాలని ఓటర్లను ఎందుకు అడుగుతున్నారు? ఓటరు జాబితాను సరిదిద్దాల్సిన బాధ్యత ఈసీదే, ప్రజలది కాదు. ప్రతిపక్షాలు, ప్రజలు ఎదురుతిరగడంతో ఓటు వేయడానికి ఒక ఫారం మాత్రమే నింపాలి, ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదని ఈసీ ఈ రోజు హడావిడిగా ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు భాజపా పన్నిన వ్యూహంలో భాగం. ఎలాగైనా ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని చూసిన భాజపా ప్రజలు ఎదురుతిరగడంతో ఒక అడుగు వెనక్కి వేసింది" అని ఖర్గే ఆదివారం ఎక్స్‌లో పోస్ట్‌చేశారు.



బ్యాంక్ ఆఫ్ లండన్ పక్కనే చైనా కొత్త ఎంబసీ నిర్మాణం

- గూఢచర్యం కోసమేనంటూ 'డెయిలీ మెయిల్' కథనం!

ఇంటర్నెట్ డెస్క్: లండన్‌లో చైనా నిర్మించతలపెట్టిన భారీ దౌత్య కార్యాలయం బ్రిటన్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ విషయాన్ని 'డెయిలీ మెయిల్' పత్రిక కథనం వెల్లడించింది. టవర్ ఆఫ్ లండన్ సమీపంలోని రాయల్ మింట్ వద్ద ఇది ఉండటమే దీనికి కారణం. గతంలో బ్రిటన్ నిఘా సంస్థ ఎంఐ 5, స్కాట్లాండ్ యార్డ్ హెచ్చరించడంతో చైనా కార్యాలయానికి అనుమతులు నిలిపివేశారు. బ్రిటన్‌లో ప్రభుత్వం మారిన తర్వాత పాత అనుమతులను పునరుద్ధరించారు. ఫైనాన్షియల్ సెంటరు సమీపంలో చైనా దౌత్య కార్యాలయం నిర్మించడంపై బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా ప్రధానమంత్రి కార్యాలయానికి అభ్యంతరాలను పంపింది. చైనా దౌత్య కార్యాలయ స్థలానికి అత్యంత సమీపంలోనే మూడు భారీ డేటా సెంటర్లు, స్టాక్ ఎక్స్ఛేంజీలు ఉన్నాయి. చైనా చేపట్టిన నిర్మాణంలో బేస్‌మెంట్ సూట్లు, సొరంగం కూడా ఉన్నట్లు సమాచారం. గూఢచర్యం కోసం అవసరమైన నిర్మాణాలను చైనా చేపట్టిందని 'డెయిలీ మెయిల్' కథనం. ఈ భవనంలోని కల్చరల్ ఎక్స్ఛేంజి విభాగాన్ని బ్రిటన్ అధికారుల తనిఖీ నుంచి మినహాయించాలని చైనా అధికారులు భావిస్తున్నారు.



రియల్టర్ల వద్ద భూమి కొన్న చైనా

2018లో బ్రిటన్ రాయల్ మింట్‌కు చెందిన 5.4 ఎకరాల భూమిని చైనా కొనుగోలు చేసింది. 1809-1967 మధ్య కాలంలో బ్రిటన్ రాయల్ మింట్‌లో ఇది భాగమే. బ్లాక్‌డెత్ ప్లేగు సమాధులు ఇక్కడున్నాయి. రాయల్ నేవీ కూడా కొన్నాళ్లు ఈ స్థలాన్ని వినియోగించుకొంది. ఇది టవర్ ఆఫ్ లండన్‌కు అత్యంత సమీపంలో ఉంది. బ్రిటన్ రాజకుటుంబం ఈ ప్రదేశాన్ని రియల్ ఎస్టేట్ డెవలపర్లకు విక్రయించింది. దీంతో చైనా కొనుగోలు చేయడం తేలికైంది. దీనిని ఐరోపాలోనే అతిపెద్ద దౌత్య కార్యాలయంగా నిర్మించాలని చైనా నిర్ణయించింది. ఇందులో 225 ఇళ్లు, కల్చరల్ ఎక్స్ఛేంజి భవనం కూడా ఏర్పాటుచేసేలా ప్లాన్ చేసింది.

రఫేల్‌పై చైనా దుష్ప్రచారం

స్వీయ యుద్ధవిమానాల అమ్మకాలను పెంచుకునేందుకు ప్రయత్నాలు

పారిస్: ఫ్రాన్స్ తయారీ రఫేల్ యుద్ధ విమానాల విషయంలో చైనా కుయుక్తులు పన్నుతోంది. ఇటీవల భారత్- పాకిస్థాన్ ఉద్రిక్తతల అనంతరం.. రఫేల్ పనితీరుపై సందేహాలు వ్యాప్తి చేసేందుకు యత్నిస్తోందని ఫ్రాన్స్ సైనిక, నిఘా విభాగం అధికారులు గుర్తించారు. యుద్ధ విమాన ఖ్యాతిని, విక్రయాలను దెబ్బతీసేందుకు డ్రాగన్ ప్రయత్నిస్తున్నట్లు వారు పసిగట్టారు. ఇందుకోసం చైనా తన రాయబార కార్యాలయాలను ఉపయోగించుకుంటున్నట్లు వారు భావిస్తున్నారు. ఇప్పటికే రఫేల్ కోసం ఆర్డర్ చేసిన దేశాల్లో.. ముఖ్యంగా ఇండోనేసియాలో చైనా దుష్ప్రచారం చేస్తున్నట్లు ఫ్రాన్స్ ఇంటెలిజెన్స్ సర్వీస్ గుర్తించిందని ఓ వార్తాసంస్థ పేర్కొంది. చైనా దౌత్య కార్యాలయాల్లోని రక్షణశాఖ అధికారులు.. యుద్ధక్షేత్రంలో రఫేల్‌లు పేలవంగా పనిచేశాయని చెబుతూ వాటి అమ్మకాలను దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని తెలిపింది. ఇప్పటికే ఆర్డర్ చేసిన దేశాలకు.. మరిన్ని రఫేల్‌లు కొనుగోలు చేయొద్దని, ఆసక్తి చూపుతున్న ఇతర దేశాలకు చైనా తయారీ యుద్ధవిమానాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు వివరించింది.

మేలో జరిగిన ఘర్షణల్లో భారత్‌కు చెందిన 5 యుద్ధవిమానాలను నేలకూల్చామని, వాటిలో మూడు రఫేల్‌లు ఉన్నాయని పాక్ తెలిపింది. యుద్ధ విమానాలు కోల్పోయిన విషయాన్ని అంగీకరించిన భారత్.. వాటి సంఖ్యపై స్పష్టత ఇవ్వలేదు. భారత్ మూడింటిని కోల్పోయినట్లు ఆధారాలు ఉన్నాయని, వాటిలో రఫేల్, సుఖోయ్-30, మిరాజ్-2000 జెట్‌లు ఉన్నాయని ఫ్రాన్స్ వైమానికదళ చీఫ్ జనరల్ జెరోమ్ బెల్లాంజర్ వెల్లడించారు. ఈ క్రమంలో రఫేల్‌లను కొనుగోలు చేసిన దేశాలు.. వాటి పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తినట్లు ఫ్రాన్స్ అధికారులు తెలిపారు.

తాజా పరిస్థితుల నేపథ్యంలో రఫేల్ ప్రతిష్ఠకు భంగం వాటిల్లకుండా కాపాడేందుకు ఫ్రాన్స్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాకిస్థాన్, దాని మిత్రదేశమైన చైనా నుంచి ఆన్‌లైన్‌లో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. భారత్- పాక్ ఉద్రిక్తతల వేళ కొత్తగా వెయ్యికి పైగా సోషల్ మీడియా ఖాతాలు పుట్టుకొచ్చాయని, చైనా సాంకేతికతపై కథనాలు వ్యాప్తి చేశాయని తెలిపారు. ఈ ఆరోపణలను చైనా కొట్టిపారేసింది. సైనిక ఎగుమతుల విషయంలో బాధ్యతాయుత విధానాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ ఇప్పటివరకు 533 రఫేల్‌లను విక్రయించింది. ఈజిప్ట్, భారత్, ఖతార్, గ్రీస్, క్రొయేషియా, యూఏఈ, సెర్బియా వంటి దేశాలు కొనుగోలు చేసిన జాబితాలో ఉన్నాయి. ఇండోనేసియా 42 యుద్ధ విమానాలకు ఆర్డర్ చేసింది.





ఎఫ్-35 ఫైటర్ జెట్ మరమ్మతుకు కేరళ చేరుకొన్న బ్రిటన్ ఇంజినీర్లు

తిరువనంతపురం: సాంకేతిక సమస్యలతో దాదాపు నెల రోజులుగా కేరళలోని తిరువనంతపురంలో నిలిచిపోయిన బ్రిటన్ రాయల్ నేవీ యుద్ధ విమానం ఎఫ్-35బీ మరమ్మతులకు బ్రిటన్ ఇంజినీర్ల బృందం ఆదివారం కేరళకు చేరుకుంది. గత నెల ఇండో - యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బీ విమానంలో ఇంజినీరింగు సమస్య తలెత్తడంతో జూన్ 14వ తేదీన తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగు చేశారు. మరమ్మతులకు ఆగమేఘాల మీద హెలికాప్టరులో నిపుణులు వచ్చినా ప్రయోజనం లేకపోవడంతో అప్పటి నుంచీ సీఐఎస్ఎఫ్ సిబ్బంది కాపలా నడుమ ఎయిర్‌పోర్టులోనే ఉంచారు. ఆదివారం వచ్చిన ఇంజినీర్ల బృందం పర్యవేక్షణలో విమానాశ్రయంలోని మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) కేంద్రానికి ఎఫ్-35 జెట్‌ను తరలించారు. భారత అధికారుల మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ బ్రిటిష్ హైకమిషను ఓ ప్రకటన విడుదల చేసింది. రూ.940 కోట్ల (110 మిలియన్ డాలర్లు) విలువ చేసే ఈ విమానాన్ని ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

హత్యాయత్నం కేసులో గుజరాత్ ఆప్ ఎమ్మెల్యే అరెస్టు

రాజ్‌పీపలా: గుజరాత్‌లోని నర్మదా జిల్లా డేడియాపాడా నియోజకవర్గ శాసనసభ్యుడు చైతర్ వసావాను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఈయన తాలూకా పంచాయతీ కార్యకర్తపై హత్యాయత్నం చేశారన్నది అభియోగం. డేడియాపాడా నియోజకవర్గంలోని ఓ కార్యాలయంలో శనివారం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఓ స్థానిక సమన్వయ కమిటీకి సభ్యుడిగా తాను సూచించిన అభ్యర్థిని పరిగణనలోకి తీసుకోలేదని సమావేశంలో ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. సాగ్బారా తాలూకా పంచాయతీ మహిళా అధ్యక్షురాలిని దూషించారు. అలాగే డేడియాపాడా తాలూకా పంచాయతీ అధ్యక్షుడు సంజయ్ వాసవాపై ఎమ్మెల్యే ఫోను విసరడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. తప్పించుకోటానికి ప్రయత్నించిన తనను చంపేస్తానంటూ ఎమ్మెల్యే పగిలిన గాజు ముక్కలతో వెంబడించినట్లు సంజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద ఎమ్మెల్యేపై కేసులు నమోదు చేశారు. విసావదర్ ఉప ఎన్నికలో ఆప్ చేతిలో ఓడినందుకు ప్రతీకార చర్యగా భాజపా సర్కారు తమ ఎమ్మెల్యేను అరెస్టు చేసిందని, గుజరాత్ ప్రజలే వారికి బుద్ధి చెబుతారంటూ ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ మండిపడ్డారు.



చైతర్ వసావా




స్పెయిన్‌లోని పాంపలోనాలో ప్రసిద్ధి చెందిన బుల్స్ వేడుకల ప్రారంభం సందర్భంగా ఆదివారం పాంపలోనాలోని రెవలర్స్ ప్యాక్ వద్దకు భారీగా చేరుకున్న పౌరులు

బహిరంగంగా కనిపించిన ఖమేనీ

ఇజ్రాయెల్‌తో ఇటీవలి యుద్ధం మొదలయ్యాక తొలిసారిగా..

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ చాన్నాళ్ల తర్వాత బహిరంగంగా కనిపించారు. 'అషౌరా' ముందురోజైన శనివారం టెహ్రాన్‌లోని తన కార్యాలయం పక్కనే ఉన్న మసీదు వద్ద ఏర్పాటుచేసిన సంతాప కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఖమేనీ రాగానే అక్కడున్న వారంతా లేచి నిలబడి.. ఆయనకు మద్దతుగా పిడికిలి బిగించి, నినాదాలు చేసిన దృశ్యాలను 'స్టేట్ టీవీ' ప్రసారం చేసింది. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో గత నెలలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. దీంతో టెహ్రాన్ కూడా ప్రతిదాడులు జరిపింది. 12 రోజుల యుద్ధం తర్వాత గత నెల 26న ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఆ యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఖమేనీ బహిరంగంగా కనిపించడం ఇదే తొలిసారి. యుద్ధ సమయంలో ఆయన బంకర్‌లో ఉన్నట్లు సమాచారం.



ఫోనుతో ముఖం స్కానింగు.. వెంటనే రేషను

దేశంలో మొదటి రాష్ట్రంగా హిమాచల్

ఈటీవీ భారత్: ప్రజాపంపిణీ వ్యవస్థలో ముఖ ప్రామాణీకరణ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దేశంలో ఈ విధానాన్ని అమలుచేసిన మొదటి రాష్ట్రంగా హిమాచల్ ప్రదేశ్ నిలిచింది. అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయడానికి ఈ రాష్ట్రంలోని డిజిటల్ టెక్నాలజీ, గవర్నెన్స్ విభాగం జూన్ 28 నుంచి ఆధార్ ఆధారిత ముఖ ప్రామాణీకరణ వ్యవస్థను ప్రారంభించింది. రేషను దుకాణాల్లో ఆండ్రాయిడ్ ఫోనుతో వినియోగదారుల ముఖాన్ని స్కాన్ చేయడం ద్వారా రేషను అందజేస్తారు. ఫోను ద్వారా ముఖాన్ని స్కాన్ చేసిన వెంటనే వినియోగదారుల రేషన్ కార్డులో నమోదు చేసుకున్న సభ్యులందరి పూర్తి వివరాలు వస్తాయి. రేషన్ కార్డులో నమోదు చేసుకున్న సభ్యుల పేర్లను ఆధార్ కార్డుకు లింక్ చేయడం వల్ల ఇది సాధ్యమైంది. దీనిపై ప్రిన్సిపల్ అడ్వైజర్ గోకుల్ బుటెల్ మీడియాతో మాట్లాడుతూ.. "ఈ వ్యవస్థలో డీలరు స్మార్ట్‌ఫోనులో అమర్చిన కెమెరాతో ముఖ స్కానింగు, లబ్ధిదారుల ధ్రువీకరణ జరుగుతాయి. సురక్షితమైన మొబైల్ అప్లికేషను ద్వారా నిర్వహిస్తున్నాం" అని వివరించారు. హిమాచల్ ప్రదేశ్‌లో 19,40,968 రేషన్ కార్డులు ఉన్నాయి.



మట్టికి కొత్త రంగులు వృత్తికి కొత్త హంగులు

గ్రామీణ ప్రజల జీవనోపాధికి వృత్తులే వెన్నెముక! అనేక కుటుంబాలకు అవే ఆలంబన... కానీ వీటిలో చాలా కాలక్రమంలో దెబ్బతిన్నాయి. ఆధునికత విసిరిన సవాలును ఎదుర్కొని అప్‌డేట్ అయిన చేనేత వంటివి మనుగడ సాగిస్తున్నాయి! ఇప్పుడా కోవలోకి... కుమ్మరి కళ కూడా చేరింది! మట్టికి ఆధునిక రంగులు రుద్దుతూ... తమ వృత్తికి కొత్త హంగులు అద్దుతూ నవతరం శ్రామికులు కుమ్మరి సారెను కదం తొక్కిస్తున్నారు!



చూడచక్కని ఫిల్టర్

ఊళ్లు మారుతున్నాయి... అవసరాలు మారుతున్నాయి...మారుమూల గ్రామాల్లోనూ ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేశాయి... బతికి బయటకట్టాలంటే... నైపుణ్యాలకు ఆధునికతను అద్ది తీరాల్సిన పరిస్థితుల్లో గ్రామీణ వృత్తుల్లోనూ కొత్త నైపుణ్యాలు చొచ్చుకు వస్తున్నాయి.

కుమ్మరి వృత్తినే తీసుకుందాం. వారు కుండలు, కూజాలు తయారు చేస్తారని తరతరాలుగా మనకు తెలిసిన విషయం. తర్వాత మట్టి వాటర్ బాటిళ్ల వంటివీ చూశాం. అయితే రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, వాటర్ ఫిల్టర్లు, బెంచీలు, స్టూళ్లు.. మట్టితో చేస్తారని ఊహించగలమా? కానీ వారిప్పుడు వాటిని తయారు చేస్తున్నారు. దీనికి కారణం సమాజంలో మారుతున్న పరిస్థితులు... కొత్త తరం డిమాండ్లు. ప్లాస్టిక్ వినియోగం విస్తృతమైన తర్వాత మట్టిపాత్రలు అరుదుగా మారాయి. ఈ తరుణంలో కుమ్మరి కళాకారుల ఆలోచనా విధానం మారింది. వినియోగదారులకు నచ్చేలా మట్టి పరికరాలు, సామగ్రిపై వారు దృష్టి సారిస్తున్నారు. సృజన, వ్యూహరచన, కళాత్మకత, ముందుచూపు వారికి ఆయుధాలుగా మారాయి. ప్రత్యేకంగా శిక్షణ పొంది మరీ వస్తువులను తయారు చేస్తున్నారు.

ఆధునిక యంత్రాలతో...

మట్టితో కళాకృతుల తయారీ అంత తేలికేం కాదు. ఇక వాటిని పెద్ద ఎత్తున తయారు చేయాలంటే యంత్రాల సహాయం తప్పనిసరి. ఇప్పుడు వృత్తి కళాకారులు ఆధునిక పరికరాలను వాడుతున్నారు. మరింత సులభంగా, వేగంగా, పెద్దస్థాయిలో చేయడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి.

- సంప్రదాయ కుమ్మరి సారెల స్థానంలో విద్యుత్ ఆధారిత పాటర్స్ వీల్స్ విస్తృతంగా వాడుతున్నారు.
- మట్టిని చేతితో కలపడం పాత మాట. ఇప్పుడు మట్టిని కలపడానికి, గట్టిగా ఉండే గుండ్రని ముద్దలు తయారు చేయడానికి పగ్ మిల్లులు వచ్చేశాయి.
- మట్టిని సమంగా రోల్ చేసి స్లాబ్‌లుగా మార్చడానికి క్లే స్లాబ్ రోలర్స్ అందుబాటులో ఉన్నాయి. ఇవి వివిధ ఆకృతులను తయారు చేయడానికి అవసరం

మట్టి పాత్రలను కాల్చడానికి సిరామిక్ కిలన్ (కొలిమి)లను వాడుతున్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్, గ్యాస్ కొలుములు అందుబాటులో ఉన్నాయి.



ఆధునిక పాటర్స్ వీల్

ఇంట్లో వస్తువులన్నీ...

రిఫ్రిజిరేటర్లను ప్లాస్టిక్, ఫైబర్, ఐరన్‌తో చేయడం మనకు తెలుసు... అయితే కుమ్మరి కళాకారులు. చుట్టూ మట్టితో తయారు చేసి మధ్యలో ఫ్రేమ్ పెడుతున్నారు. లోపల మట్టి ప్లేట్‌లో ఇసుక నింపి వస్తువులను అందులో నిల్వ చేస్తున్నారు. కుమ్మరి ఫ్రిజ్ ఫైబర్, ప్లాస్టిక్, లోహాలతో చేసిన దాని కంటే బాగా పనిచేస్తోందని వాడుతున్న వారు చెబుతున్నారు. వీటిలో రేడియేషన్, గ్యాస్ సమస్యలు లేకుండా సహజసిద్ధంగా వస్తువులు నిల్వ ఉంటున్నాయి. ఇక నీటిని శుద్ధి చేయడానికి ఉపయోగించే మట్టి ఫిల్టర్లూ మార్కెట్‌లోకి వచ్చేశాయి. ఇంటికి చల్లదనాన్నిచ్చే కూలర్లూ అందుబాటులో ఉన్నాయి. కూర్చునే స్టూళ్లు, బల్లలు సైతం మట్టితో తయారవుతున్నాయి.



మట్టి ఫ్రిజ్..

కాసింత కళాపోషణ...

అదే మట్టి... అదే చక్రం... అదే కళాకారుడు... అదే కుండ... రోడ్డు పక్కన పెట్టి అమ్మితే వచ్చేది ఏ పదో... పరకో... అదే దానికి కాస్తంత సొబగులద్ది, రంగులతో హంగులు పొదిగి... మిట్టిఆర్ట్స్ డాట్ కామ్‌లో పెడితే, దాని విలువ వేలల్లోకి మారుతుంది.

నవతరం ఇప్పుడు సరిగ్గా ఇదే పని చేస్తోంది. వాల్యూ ఎడిషన్‌తో ఉత్పత్తులకు కొత్త మార్కెట్ సృష్టిస్తున్నారు. దీపావళి ప్రమిదల నుంచి పూల కుండీల దాకా అనేక వస్తువులను తయారు చేసి వాటిని అద్భుతమైన కళాకృతులుగా మలిచి డిమాండ్ వచ్చేలా చేస్తున్నారు. నీళ్లసీసాలు, టీ కప్పులు, ప్లేట్లు, అన్నం కంచాలు, ఇతర గృహోపయోగ వస్తువులు రూపొందిస్తున్నారు. మధుబని శైలి వంటి కళాత్మక డిజైన్లతో కూడిన టెర్రకోట కుండలు అందుబాటులోకి తెచ్చారు. క్రాఫ్టెడ్ మగ్గులు, కప్పులు, జార్లు, స్టూడియో పాటరీ గిన్నెలు, సర్వ్ వేర్‌లకు రెస్టారెంట్ల నుంచి డిమాండ్ ఉంది. అలంకరణ వస్తువులు, టైల్స్‌కు చాలా మంచి ఆదరణ ఉందని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో వర్క్‌షాపు నిర్వహిస్తున్న కుమ్మరి వృత్తి కళాకారుడు జి.గోవర్ధన్ వివరిస్తున్నారు. ఆధునిక డిజైన్‌లతో కూడిన ఫ్లవర్ బౌల్స్, పోర్షన్ బౌల్స్‌కూ విశేష ఆదరణ ఉంది. పర్యావరణహితంగా, ఆరోగ్యపరంగా శ్రేష్ఠమైన ఈ ఉత్పత్తులకు ప్రజల నుంచీ ఆదరణ లభిస్తోంది. కుమ్మరి వృత్తి కళాకారుల కుటుంబాలతో పాటు యువత ఆధునిక డిజైన్లతో ఉత్పత్తుల తయారీకి ముందుకొస్తున్నారు. ఏఐ సాంకేతికత సాయంతో డిజైన్లను రూపొందించి, వాటితో ఉత్పత్తులు తయారు చేస్తున్నారు.



స్టూల్ ఇలా..

- ఈనాడు, హైదరాబాద్

రప్పా రప్పా ఫ్లెక్సీలు ఎక్కడ ముద్రించారు?

- అనుమతి లేని కార్యక్రమంలో ఎందుకు పాల్గొన్నారు?
- వైకాపా మాజీ ఎమ్మెల్యేలను ప్రశ్నించిన పోలీసులు



సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్ తదితరులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటనకు పోలీసుశాఖ నుంచి అనుమతులు లేవని తెలిసీ మీరెందుకు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు? మీతో పాటు కార్యకర్తలను ఎందుకు సమీకరించారు? ప్రజల ఆస్తులకు ఎందుకు నష్టం కలిగించారు? రప్పా రప్పా నరుకుతామంటూ ప్రదర్శించిన ఫ్లెక్సీలు ఎక్కడ ముద్రించారో తెలుసా? అని వైకాపా నాయకులను పోలీసులు ప్రశ్నించారు. జూన్ 18న జగన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో అనుమతి లేకుండా ర్యాలీ చేయడం, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించడంపై నమోదైన కేసులో విచారణకు హాజరవ్వాలని 113 మందికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు నరసరావుపేట, తెనాలి మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, వైకాపా సత్తెనపల్లి నియోజకవర్గ బాధ్యుడు గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జునయాదవ్ హాజరయ్యారు. వారిని వివిధ ప్రశ్నలను అడిగి, వివరాలను సీఐ నాగమల్లేశ్వరరావు, ఎస్సై పవన్‌కుమార్ తెలుసుకున్నారు. వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. విచారణకు పిలిస్తే మళ్లీ రావాలని వారికి చెప్పినట్లు సమాచారం.

'అధికారంలోకి వస్తే తెదేపా నాయకులకు రప్పా రప్పా.. సినిమా'

- ప్రతి కార్యకర్త ఒక బుక్ తెరవాలి
- వైకాపా వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి. చిత్రంలో వైకాపా కడప బాధ్యుడు అంజాద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు తదితరులు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: "త్వరలో జమిలి ఎన్నికలు రాబోతున్నాయి. ఆ ఎన్నికల్లో వైకాపా విజయం సాధించడం ఖాయం. రెండోసారి అధికారంలోకి వచ్చాక జగన్ 2.0 మొదలవుతుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే తెదేపా నాయకులకు రప్పా రప్పా.. సినిమా చూపిస్తాం" అని వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో జరిగిన వైకాపా కడప నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వైకాపా కార్యకర్త ఒక బుక్ తెరవాలన్నారు. 'అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బుక్‌లో పేర్లు ఉన్న వారిపై రప్పా రప్పా అంటూ' కార్యకర్తలతో నినాదాలు చేయించారు. కార్యకర్తలు కేసులకు భయపడకూడదని, ఎవరిపై ఎక్కువ కేసులుంటే అధికారంలోకి వచ్చాక వారికి అంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. మ్యానిఫెస్టోను అమలు చేయని తెదేపా నాయకులను అన్ని స్థాయిల్లో చొక్కా పట్టుకుని నిలదీయాలన్నారు. వైకాపా కడప బాధ్యుడు అంజాద్‌బాషా మాట్లాడుతూ రానున్న నగరపాలక ఎన్నికల్లో కడపలో 50కి 50 డివిజన్లు ఏకగ్రీవం చేస్తామని ఎమ్మెల్యే మాధవీరెడ్డి తెదేపా నాయకులను మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ ఒక్క డివిజన్‌ను కూడా ఏకగ్రీవం చేయలేదన్నారు.

జగన్ పర్యటనకు హెలిపాడ్ ఏర్పాటుకు అనుమతి

ఈనాడు, చిత్తూరు: వైకాపా అధినేత జగన్ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వచ్చి మామిడి రైతులను పరామర్శించనున్న నేపథ్యంలో హెలిపాడ్ ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం అనుమతి ఇచ్చింది. చెన్నై- బెంగళూరు జాతీయ రహదారికి సమీపంలోని అరగొండ రోడ్డు చరణ్ దాబా వద్ద హెలికాప్టర్ దిగుతుందని వైకాపా నేతలు అధికారులకు వివరాలు సమర్పించడంతో వారు ఆమోదం తెలిపారు. అన్నదాతల పరామర్శకు పదివేల మందితో కాకుండా ఐదువేల లోపే జనాలు ఉండేలా చూసుకోవాలని పోలీసులు సూచించారు. ఈనెల 9న ఉదయం 11 గంటలకు మాజీ సీఎం బంగారుపాళ్యానికి చేరుకుని మధ్యాహ్నం 2 గంటలకు తిరుగు పయనమవుతారని సమాచారం.

నాయకత్వమంటే పదవులు కాదు.. వ్యక్తిత్వం

- 'రప్పా.. రప్పా' డైలాగును సమర్థించడం బాధాకరం
- ఇలాంటి నాయకులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 'నిరుపమాన దేశభక్తులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి' పుస్తకావిష్కరణ



'నిరుపమాన దేశభక్తులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో ఎం.నాగేశ్వరరావు, పసల శివాజీ, మండలి బుద్ధప్రసాద్, ఏవీ రాజమౌళి, గాదం గోపాలస్వామి, డాక్టర్ పసల వీణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నాయకత్వం పదవుల్లో ఉండదని, ఉత్తమ వ్యక్తిత్వం, నడవడికలే నాయకుడిని నిర్ణయిస్తాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రస్తుతం రాజకీయాల తీరుతెన్నులు మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. హింసను ప్రోత్సహించేలా ఇటీవల 'రప్పా.. రప్పా' అనే సినిమా డైలాగును నాయకులు సమర్థించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి నాయకులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతులు గాంధీ స్ఫూర్తితో స్వరాజ్య సాధన కోసం తమ యావదాస్తిని, జీవితాలను అంకితం చేశారని శ్లాఘించారు. వారి జీవిత విశేషాలతో రూపొందించిన 'నిరుపమాన దేశభక్తులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి' పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని దసపల్లా హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

గర్భవతిగా ఉన్నా జైలు శిక్షకు వెనుకాడలేదు

"త్యాగం, నిస్వార్థగుణం, స్వాతంత్ర్యం తప్ప లాభాపేక్ష లేని పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతుల పోరాటం అనుపమానమైనది. సహాయనిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో పాల్గొన్నవారు.. ఎంతో ఆదర్శనీయం. గాంధీజీ సూచనతో బంగారం విరాళంగా ఇవ్వడమే గాక, జీవితాంతం పుత్తడిని కొనని వారి నిష్ఠ స్ఫూర్తిదాయకం. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పింఛనును నిరాకరించిన గొప్ప వ్యక్తిత్వం వారిది. పదవులను త్యజించడం, సిద్ధాంత వైరుధ్యం కలిగిన వారికి కూడా ఆశ్రయమివ్వడం, తప్పును తప్పు అని కరాఖండిగా చెప్పి జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధపడడం, గర్భవతిగా ఉన్నప్పటికీ జైలు శిక్షకు వెనుకాడని అంజలక్ష్మి జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి" అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

ప్రజాప్రతినిధులు చదవాల్సిన పుస్తకం

ఏపీలోని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. "వచ్చిన స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చుకుంటే పసల కృష్ణమూర్తి దంపతుల వంటి మహనీయుల ఆశయాలను సాధించినట్టు. ప్రస్తుతం శాసనసభ్యుడంటే ఎవరికీ గౌరవం లేకుండా పోయింది. దోచుకోవడం, దాచుకోవడమే పని అని భావిస్తున్నారు. దీనివల్ల ఎమ్మెల్యేగా ఎందుకు నిలబడ్డామా అనే బాధ కలుగుతోంది. ఈ పుస్తకం చదివాక నా మనసు ఆర్ద్రతతో నిండిపోయింది. ప్రతి ప్రజాప్రతినిధి ఈ పుస్తకాన్ని చదవాలి" అని సూచించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి రాజమౌళి మాట్లాడుతూ.. "స్వాతంత్ర్య సంగ్రామ వృక్షంలోని అజ్ఞాత పుష్పాలు పసల కృష్ణమూర్తి దంపతులు. ఇలాంటి మహనీయుల చరిత్ర భవిష్యత్తు తరాలకు తెలియాల్సిన అవసరం ఉంది. పసల కృష్ణమూర్తి.. గోదావరి గాంధీ మాదిరిగా కనిపిస్తారు" అని కొనియాడారు. 'ఈనాడు' ఏపీ సంపాదకులు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పునాదులపైనే నేడు మనం ఈ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నామనే విషయం యువతీయువకులకు తెలిసేలా పాఠ్యాంశాలను రూపొందించాలని అన్నారు. ప్రతి స్కూలు గ్రంథాలయంలో ఈ పుస్తకం ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పుస్తక రచయిత గాదం గోపాలస్వామి, కృష్ణమూర్తి కుమార్తె డాక్టర్ వీణ, మనవరాలు ఆదిలక్ష్మి మాట్లాడారు. కృష్ణమూర్తి కుమారుడు శివాజీ, ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం: సుంకర

కరేడులో ఐలు బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్

ఉలవపాడు, న్యూస్‌టుడే: భూసేకరణతో పొలాలు కోల్పోతున్న రైతులకు న్యాయసహాయం అందించి అండగా ఉంటామని అఖిలభారత న్యాయవాదుల సంఘం (ఐలు) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కరేడు పంచాయతీలోని గ్రామాల్లో న్యాయవాదుల బృందం పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంది. అనంతరం కరేడులో రైతులతో న్యాయవాదులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండోసోల్ సోలార్ కంపెనీ ఏర్పాటుకు వందల ఎకరాలు సరిపోతాయని, పెద్ద మొత్తంలో కావాలనుకుంటే నేరుగా ప్రజల నుంచి కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. 8వేల ఎకరాలు కావాలని చెప్పడంతో ప్రభుత్వ పెద్దలు రైతుల భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. బలవంతపు భూసేకరణకు సాహసిస్తే న్యాయపోరాటానికి అండగా నిలుస్తామని తెలిపారు. రైతులు, మత్స్యకారులు, కూలీలు, గిరిజనులు సంఘటితం కావడం వల్లే ఈ విషయం రాష్ట్రమంతా తెలిసిందన్నారు. న్యాయవాదులు కృష్ణమూర్తి, చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, జీవీబీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బనకచర్లపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల

నందికొట్కూరు, న్యూస్‌టుడే: బనకచర్ల ప్రాజెక్టుపై కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలంలోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం కృష్ణా జలాలను విడుదల చేసేందుకు వచ్చిన మంత్రి అక్కడే విలేకర్లతో మాట్లాడారు. 'గోదావరి మిగులు జలాలనే వాడుకుంటామని స్పష్టంగా చెబుతున్నా.. రాజకీయ ఉనికి కోసం తెలంగాణ ప్రభుత్వం, అక్కడి పార్టీలు తాపత్రయపడుతున్నాయి. మిగులు జలాలను వాడుకునే హక్కు ఏపీకి ఉంది. పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తున్నాం. త్వరలో బనకచర్ల పనులూ ప్రారంభిస్తాం. ఇది నీటి పారుదల రంగంలో ఓ గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుంది' అని మంత్రి వెల్లడించారు. వైకాపా పాలకుల పాపాలతో దెబ్బతిన్న అలగనూరు రిజర్వాయర్ బండ్, గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు పూజలు చేశారు. 10 వేల క్యూసెక్కుల శ్రీశైలం వెనుక జలాలను పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బనకచర్లకు విడుదల చేశారు. కృష్ణమ్మకు చీరె, సారె సమర్పించి జలహారతినిచ్చారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ రెడ్డిశేఖరరెడ్డి, ఈఈ నాగేంద్రప్రసాద్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



జలాలు విడుదల చేసి కృష్ణమ్మకు జలహారతిని ఇస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ శబరి, ఎమ్మెల్యే జయసూర్య

స్త్రీనిధి వాయిదాలు నేరుగా చెల్లించొచ్చు

- వచ్చే నెల నుంచి రికవరీ యాప్ అందుబాటులోకి

ఈనాడు, అమరావతి: స్త్రీనిధి సంస్థలో అక్రమాల కట్టడిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో మహిళలు తీసుకున్న అప్పునకు నెల వాయిదాలు చెల్లించడానికి ఆగస్టు నుంచి రికవరీ యాప్ అందుబాటులోకి తీసుకురానుంది. గతంలో సభ్యులు నెల వాయిదాలను వీవోఏలకు ఇచ్చేవారు. వారు గ్రామ సంఘానికి జమ చేస్తే, అక్కడి నుంచి స్త్రీనిధి ఖాతాకు మళ్లిస్తున్నారు. ఇక్కడే అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. సభ్యులు డబ్బు కడుతున్నా.. చాలాచోట్ల సిబ్బంది ఆ మొత్తాన్ని సకాలంలో స్త్రీనిధి ఖాతాకు జమ చేయడం లేదు. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం రికవరీ యాప్‌ను తీసుకొచ్చింది. తద్వారా మహిళలు ఇంటి నుంచే నేరుగా నగదు చెల్లించొచ్చు.

వైకాపా హయాంలో రూ.4.38 కోట్లు పక్కదారి


గత వైకాపా ప్రభుత్వం ఈ సంస్థను పూర్తిగా దెబ్బతీసింది. డ్వాక్రా మహిళలకు రుణాలిచ్చేందుకంటూ వాణిజ్య బ్యాంకుల నుంచి రూ.1,000 కోట్లు అప్పు తెచ్చి ఇతర అవసరాలకు మళ్లించారు. క్షేత్రస్థాయిలోనూ మహిళలు తీసుకున్న అప్పునకు వారు సకాలంలో వాయిదాలు చెల్లించినా, అవి సంస్థకు చేరకుండా పక్కదారి పట్టించారు. ఇలా గత ప్రభుత్వంలో రూ.4.38 కోట్ల సొమ్ము లెక్కాపత్రం లేకుండా ఇతరుల జేబుల్లోకి మళ్లింది.

42కు చేరిన 'సిగాచీ' ప్రమాద మృతులు

ఈనాడు, సంగారెడ్డి: తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 42కి చేరింది. పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు జితేందర్ ఆదివారం మృతిచెందారు. పేలుడు ఘటనలో దొరికిన శరీర విడి భాగాల డీఎన్ఏ పరీక్ష ఆధారంగా మరొకరిని గుర్తించారు. అతని వివరాలు అధికారులు ఇంకా వెల్లడించలేదు. ప్రమాదంలో గాయపడిన మరో 18 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికీ ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ లభించలేదు. వారి కుటుంబీకులు సహాయక కేంద్రం వద్ద నిరీక్షిస్తున్నారు.

మహారాష్ట్ర తెలుగు పాఠ్యపుస్తకంలో తిరుపతి జిల్లా ఉపాధ్యాయుడి గేయం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం రాసిన గేయం మహారాష్ట్ర తెలుగు పాఠ్యాంశాల్లో చేరింది. ఒకటో తరగతి బాలభారతి తెలుగు వాచకంలో ఆయన రాసిన 'సీతాకోక చిలుక' గేయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశంగా చేర్చింది. బాలసుబ్రహ్మణ్యం కవితలు, గేయాలు, మిమిక్రీతో పిల్లలను అలరిస్తుంటారు. పాఠ్యాంశాలను గేయరూపంలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తుంటారు. ఆయన రచనలు, గేయాలను వాట్సప్, సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేస్తున్నారు. మహారాష్ట్ర విద్యాశాఖలో సభ్యుడిగా ఉన్న తెలుగు వ్యక్తి విజయభాస్కర్ పలు కవితలను, గేయాలను పరిశీలించి సీతాకోక చిలుక గేయాన్ని అక్కడ పాఠ్యాంశాల్లో పొందుపరిచేలా కృషిచేశారు.



పాఠ్యపుస్తకంలో బాలసుబ్రహ్మణ్యం రచించిన గేయం



బాలసుబ్రహ్మణ్యం

ఇది మూడంతస్తుల జిల్లేడు..



జిల్లేడు చెట్టు సాధారణంగా 15 అడుగుల ఎత్తుకు మించి పెరగదు. అనంతపురంలో మాత్రం ఏకంగా 50 అడుగుల ఎత్తు పెరిగి ఆకట్టుకుంటోంది. బీరక నాగభూషణం అనే వ్యక్తి 40 సంవత్సరాల క్రితం ఈ స్థలం కొనగా అక్కడ ఉన్న జిల్లేడు చెట్టును తీసేయకుండా కంటిపాపలా చూసుకున్నారు. తర్వాత మూడంతస్తుల భవనం నిర్మించినప్పుడూ చెట్టు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి ఫ్లోర్‌లో కొంత స్థలాన్ని వదిలి పైకి ఎదిగేలా ఏర్పాట్లు చేయడంతో ఈ ఎత్తుకు ఎదిగింది. 'తీగ జిల్లేడు 30 అడుగులకు మించి పెరగడమే అరుదు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కొమ్మల్ని కత్తిరించుకుంటూ, సరైన పోషకాలు అందించడంతో ఈ చెట్టు 50 అడుగుల వరకు పెరిగి ఉండవచ్చు' అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగ అధిపతి బి.రవిప్రసాద్ వివరించారు.

- ఈనాడు అనంతపురం



పుట్టుకతోనే ప్రతిభావంతులు కాకపోయినా..

ప్రతి ఒక్కరూ పుట్టుకతోనే ప్రతిభావంతులు కాకపోవచ్చు. కానీ ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తూ విభిన్న నైపుణ్యాలు నేర్చుకొనే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకుంటే చాలు.. ఈ ప్రపంచంలోని 99 శాతం మంది కన్నా మెరుగైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు.

- ఎడ్డీ క్వాన్, కాపీరైటర్

ఛాంపియన్



భళా భారత్

● 336 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ చిత్తు

● ఆకాశ్‌దీప్ అద్భుత బౌలింగ్

● రెండో టెస్టులో ఘనవిజయం

● ఆకాశ్‌దీప్ కెరీర్‌లో తొలిసారి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, మ్యాచ్‌లో 10 వికెట్ల ఘనత సాధించాడు.

ఇంగ్లాండ్‌లో టెస్టు అంటే ఎప్పుడూ తేలిక కాదు. పైగా సీనియర్లు రోహిత్, కోహ్లి రిటైరైపోయారు. ఆపై ప్రధాన పేస్ అస్త్రం బుమ్రా కూడా దూరమయ్యాడు. నడిపిస్తున్నది కొత్త కెప్టెన్.. ఆడుతోంది అనుభవం కొరవడిన జట్టు. కానీ టీమ్ఇండియా ఆట అద్భుతం. పరుగుల వరద పారిస్తూ.. ఇంగ్లాండ్ బజ్‌బాల్‌కు కళ్లెం వేస్తూ ఆ జట్టు ఎడ్జ్‌బాస్టన్‌లో చిరస్మరణీయ విజయాన్నందుకుంది.

తొలి టెస్టులో బాగానే ఆడినా.. చాలా భాగం ఆధిపత్యాన్ని ప్రదర్శించినా.. గెలిచే అవకాశాన్ని చేజార్చుకున్న భారత్.. ఈసారి వదల్లేదు. మరింత కసితో, పట్టుదలతో చెలరేగిపోయింది. బ్యాటర్ల శ్రమకు బౌలర్ల కృషీ తోడైన వేళ దెబ్బకు దెబ్బ తీస్తూ 1–1తో సిరీస్‌ను సమం చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అసాధారణ బ్యాటింగ్‌తో ముందుండి అలవోకగా పరుగులు రాబడితే.. వికెట్ల వేటలో ఆకాశ్‌దీప్, సిరాజ్ విజృంభించారు. ఇంగ్లాండ్‌ను వంచడంలో పంత్, జైస్వాల్‌లదీ విలువైన పాత్రే.

ఆఖరి రోజు కొండంత లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ఛేదించే అవకాశం లేదన్నది ముందు రోజే తేలిపోయింది. మిగిలిన ఏడు వికెట్లు భారత్ పడగొట్టగలదా అన్నదే ప్రశ్న. అలాంటి స్థితిలో ఉదయం ఆటను ఆలస్యం చేసి భారత్‌ను వర్షం భయపెట్టింది. ఇంగ్లాండ్ అంత సులభంగా ఏమీ లొంగలేదు. నిర్జీవమైన పిచ్‌పై పెద్దగా సహకారం లేకున్నా అద్భుత ప్రదర్శన చేసిన ఆకాశ్‌దీప్.. ఆతిథ్య జట్టును చుట్టేసి టీమ్ఇండియాను విజయపథంలో నడిపించాడు. వర్షం వల్ల దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ఆట ఆరంభమైనా.. చాలా సమయం ఉండగానే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ముగించింది టీమ్ఇండియా.

బర్మింగ్‌హామ్

టీమ్ఇండియా అదరహో! గిల్‌సేన ఈసారి అవకాశాన్ని వదిలి పెట్టలేదు. రెండో టెస్టు ఆరంభం నుంచి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆ జట్టు.. చివరి రోజూ అదరగొట్టింది. ఆఖరి పంచ్‌ను కూడా విజయవంతంగా విసిరింది. నిర్జీవ పిచ్‌పై ఆకాశ్‌దీప్ (6/99) సూపర్ బౌలింగ్‌తో 336 పరుగుల భారీ తేడాతో ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించింది. 608 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 72/3తో చివరి రోజు, ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 271 పరుగులకు ఆలౌటైంది. జేమీ స్మిత్ (88) టాప్ స్కోరర్. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 587 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 407 పరుగులకు ఆలౌటైంది. భారత్ రెండో ఇన్నింగ్స్‌ను 427/6 వద్ద డిక్లేర్ చేసింది. గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో అయిదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. మూడో టెస్టు గురువారం లార్డ్స్‌లో ఆరంభమవుతుంది.

ఆకాశ్‌దీప్ అదరహో..: ఇంగ్లాండ్‌కు గెలిచే అవకాశమే లేదు. అసాధారణంగా పోరాడితే డ్రా చేసుకోవచ్చు. భారత్ ఏడు వికెట్లు పడగొడితే చాలు గెలుపు సొంతమవుతుంది. చివరి రోజు పరిస్థితిది. ఎంతో ఉత్సాహంగా సిద్ధమైన టీమ్ఇండియాకు వర్షం ఆందోళన కలిగించింది. వాన వల్ల దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ఆట మొదలైంది. పది ఓవర్ల ఆటా పోయింది. కానీ మ్యాచ్ ఆలస్యంగా మొదలైనా.. పట్టుదలగా బౌలింగ్ చేసిన భారత్, సెషన్‌కు పైగా ఆట మిగిలి ఉండగానే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించింది. బుమ్రా లాంటి మేటి పేసర్ గైర్హాజరీలో బాధ్యత తీసుకున్న ఆకాశ్‌దీప్.. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆఖరి రోజు అతడి బౌలింగే హైలైట్. దాదాపు అసాధ్యమైన 608 పరుగుల లక్ష్య ఛేదనలో 72/3తో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లాండ్‌ను ఆరంభంలోనే దెబ్బతీసి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు ఆకాశ్‌దీప్. నాలుగో ఓవర్లోనే పోప్ (24)ను ఔట్ చేసి ఇంగ్లాండ్‌కు షాకిచ్చాడు. ఆకాశ్‌దీప్ బంతిని పోప్ వికెట్ల మీదికి ఆడుకున్నాడు. అతడు తన తర్వాతి ఓవర్లో బ్రూక్ (23)ను వెనక్కి పంపాడు. సీమ్ అవుతూ లోపలికి వచ్చిన బంతికి బ్రూక్ వికెట్ల ముందు దొరికిపోయాడు. అయితే స్టోక్స్, జేమీ స్మిత్ వెంటనే వికెట్ పడనివ్వలేదు. జడేజా నుంచి పరీక్షను ఎదుర్కొన్నా స్టోక్స్ నిలబడగలిగాడు. స్మిత్ కాస్త వేగంగానే ఆడాడు. మరో వికెట్ పడకుండానే ఇంగ్లాండ్ లంచ్‌కు వెళ్తుందనిపించింది. కానీ విరామానికి ముందు చివరి ఓవర్లో స్టోక్స్ (33)ను సుందర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. లంచ్ తర్వాత స్మిత్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. అతడికి తోడుగా పట్టుదలగా నిలిచిన వోక్స్ (32 బంతుల్లో 7) భారత్‌ను విసిగించాడు. ప్రసిద్ధ్ ఓ షార్ట్ బంతితో వోక్స్‌ను ఔట్‌చేయడం ద్వారా ఎట్టకేలకు ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. కాసేపటి తర్వాత స్మిత్‌ను ఆకాశ్‌దీప్ వెనక్కి పంపాడు. ఆ తర్వాత టెయిలెండర్లు కాస్త ప్రతిఘటించే వెనుదిరిగారు. టంగ్ (29 బంతుల్లో 2)ను జడేజా ఔట్ చేయగా.. కార్స్ (38; 48 బంతుల్లో 5×4, 1×6)ను వెనక్కి పంపడం ద్వారా ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు ఆకాశ్‌దీప్ తెరదించాడు.



గిల్ విజయానందం



భారత్ తొలి ఇన్నింగ్స్: 587
ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 407
భారత్ రెండో ఇన్నింగ్స్: 427/6 డిక్లేర్డ్
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: డకెట్ (బి) ఆకాశ్‌దీప్ 25; క్రాలీ (సి) సాయి సుదర్శన్ (బి) సిరాజ్ 0; ఒలీ పోప్ (బి) ఆకాశ్‌దీప్ 24; రూట్ (బి) ఆకాశ్‌దీప్ 6; హారీ బ్రూక్ ఎల్బీ (బి) ఆకాశ్‌దీప్ 23; స్టోక్స్ ఎల్బీ (బి) సుందర్ 33; జేమీ స్మిత్ (సి) సుందర్ (బి) ఆకాశ్‌దీప్ 88; వోక్స్ (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ కృష్ణ 7; కార్స్ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 38; జోష్ టంగ్ (సి) సిరాజ్ (బి) జడేజా 2; బషీర్ నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 13 మొత్తం: (68.1 ఓవర్లలో ఆలౌట్) **271;** వికెట్ల పతనం: 1-11, 2-30, 3-50, 4-80, 5-83, 6-153, 7-199, 8-226, 9-246; బౌలింగ్: ఆకాశ్‌దీప్ 21.1-2-99-6; సిరాజ్ 12-3-57-1; ప్రసిద్ధ్ కృష్ణ 14-2-39-1; జడేజా 15-4-40-1; వాషింగ్టన్ సుందర్ 6-2-28-1

2 ఇంగ్లాండ్‌లో టెస్టుల్లో పది వికెట్లు తీసిన రెండో భారత బౌలర్ ఆకాశ్‌దీప్. 1986లో చేతన్‌శర్మ ఈ ఘనత సాధించాడు. ఇద్దరూ బర్మింగ్‌హామ్‌లోనే పది వికెట్ల ప్రదర్శన చేశారు.

336 భారత్ గెలుపు అంతరం. విదేశాల్లో పరుగుల పరంగా టీమ్ఇండియాకు ఇదే అతి పెద్ద విజయం.

1692 రెండో టెస్టులో మొత్తం పరుగులు. ఇంగ్లాండ్, భారత్ మధ్య ఓ టెస్టు మ్యాచ్‌లో ఇవే అత్యధికం.

● ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు ఇదే తొలి విజయం. అంతేకాదు ఈ వేదికలో విజయాన్ని అందుకున్న మొదటి ఆసియా జట్టు కూడా టీమ్ఇండియానే. గతంలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక బర్మింగ్‌హామ్‌లో 18 టెస్టులాడినా ఒక్క మ్యాచ్ గెలవలేకపోయాయి.

తేడా అతడే

ఈనాడు క్రీడావిభాగం

తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో అద్భుత ప్రదర్శన చేసిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టును ముందుండి నడిపించాడు. రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. సిరాజ్, సుందర్ కూడా తమ వంతు పాత్ర పోషించారు. కానీ తొలి టెస్టులో ఓటమికి, ఈ మ్యాచ్‌లో విజయానికి మధ్య తేడా మాత్రం ఆకాశ్‌దీపే. బుమ్రా లేకపోయినా ఈ మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం సాధించిందంటే అందులో ఆకాశ్ పాత్ర అత్యంత కీలకం. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి అతను 10 వికెట్లు తీయడం విశేషం. అసలు ఈ మ్యాచ్‌లో ఆకాశ్ తుది జట్టులో ఉండడమే ఆశ్చర్యం. ఈ టెస్టుకు ముందు 7 మ్యాచ్‌లు ఆడి 15 వికెట్లే తీశాడతను. బుమ్రా అందుబాటులో లేకుంటే లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్‌ను ఎంచుకోవాలనే డిమాండ్లు వినిపించాయి. కానీ జట్టు యాజమాన్యం మాత్రం ఆకాశ్‌కు ఓటేసింది. ఈ నిర్ణయం సరైందేనా అన్న సందేహాలు కలిగాయి. కానీ భారత్ భారీ స్కోరు సాధించాక.. రెండో రోజు సాయంత్రం దొరికిన కాస్త సమయంలోనే ఆకాశ్ అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో తన ఎంపిక సరైందే అని చాటాడు. ముఖ్యంగా ప్రస్తుతం ప్రపంచ మేటి బ్యాటరైన జో రూట్‌ను కళ్లు చెదిరే ఇన్‌స్వింగర్‌తో బౌల్డ్ చేసిన వైనం అసాధారణం. పిచ్ బౌలర్లకు అంతగా అనుకూలించకపోయినా.. చక్కటి స్వింగ్, పేస్‌తో అతను ఇంగ్లిష్ బ్యాటర్లను పరీక్షించాడు. కీలక దశల్లో వికెట్లు పడగొట్టాడు. నాలుగో రోజు ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో అతను కొట్టిన దెబ్బతోనే ఇంగ్లాండ్ ఆత్మరక్షణలో పడింది. బజ్‌బాల్ శైలిని పక్కన పెట్టి డ్రా కోసం రక్షణాత్మకంగా ఆడడం మొదలుపెట్టింది. కానీ చివరి రోజు ఆకాశ్ దాడిని కాచుకోలేక ఓటమి చవిచూసింది. తర్వాతి మ్యాచ్‌కు బుమ్రా కూడా అందుబాటులోకి వస్తాడు కాబట్టి.. అతడికి ఆకాశ్ తోడైతే ఇంగ్లాండ్ బ్యాటర్లకు కష్టమే.

"తొలి టెస్టు తర్వాత బౌలింగ్, ఫీల్డింగ్‌లో మేం గొప్పగా పుంజుకున్నాం. ప్రతి మ్యాచ్ లీడ్స్ కాదు. మా బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేశారు. వాళ్లు ఇంగ్లాండ్ టాప్ ఆర్డర్‌ను దెబ్బతీసిన తీరు అద్భుతం. ఎక్కువ వికెట్లు పడగొట్టలేకపోయినా ప్రసిద్ధ్ కూడా చక్కగా బౌలింగ్ చేశాడు. ఆకాశ్‌దీప్ సరైన లెంగ్త్‌ల్లో బంతులేశాడు. బంతితో రెండు వైపులా ప్రభావం చూపాడు. నిజానికి ఇలాంటి పిచ్‌పై అలా చేయడం కష్టం. అతడు గొప్పగా బౌలింగ్ చేశాడు. నా ఆట పట్ల సంతృప్తిగా ఉన్నా. లార్డ్స్‌లో బుమ్రా ఆడతాడు. ఆ మైదానంలో టెస్టు మ్యాచ్‌లో దేశానికి నాయకత్వం వహించడానికి మించిన గౌరవం ఉండదు" - **శుభ్‌మన్ గిల్**

సాక్షికి స్వర్ణం



సాక్షి

అస్తానా: బాక్సింగ్ ప్రపంచకప్‌లో భారత క్రీడాకారిణి సాక్షి మెరిసింది. రెండు సార్లు యూత్ ప్రపంచ ఛాంపియన్ సాక్షి.. ఈ టోర్నీలో స్వర్ణం సాధించింది. ఆదివారం మహిళల 54 కేజీల ఫైనల్లో యోస్లిన్ పెరెజ్ (అమెరికా)పై విజయం సాధించింది. ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడటంతో సాక్షిని ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. మహిళల 48 కేజీల ఫైనల్లో మీనాక్షి 2-3తో నాజిమ్ కిజైబే (కజకిస్థాన్) చేతిలో ఓడి రజతం సాధించింది. పురుషుల 85 కేజీలలో జుగ్నూ 0-5తో బెక్‌జాద్ నూర్‌దౌలెతోవ్ (కజకిస్తాన్) చేతిలో, మహిళల 80 కేజీలో పూజ రాణి 0-5తో ఎసెటా ఫ్లింట్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడి రజతాలకు పరిమితమయ్యారు.

క్వార్టర్స్‌లో సబలెంకా

● పవ్లిచెంకోవా, ఫ్రిట్జ్ కూడా

● వింబుల్డన్

లండన్



పవ్లిచెంకోవా

వింబుల్డన్‌లో టైటిల్ దిశగా సబలెంకా (బెలారస్) మరో అడుగు వేసింది. జోరు ప్రదర్శిస్తూ ఆమె క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో టాప్ సీడ్ సబలెంకా 6-4, 7-6 (7-4)తో ఎలిస్ మెర్టెన్స్ (బెల్జియం)పై గెలిచింది. తొలి సెట్లో పెద్దగా కష్టపడకుండానే గెలిచిన సబలెంకాకు.. రెండో సెట్లో మెర్టెన్స్ గట్టి పోటీనే ఇచ్చింది. ఇద్దరూ తగ్గకపోవడంతో మ్యాచ్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో సర్వీసుల్లో అదరగొట్టిన సబలెంకా సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఆమె 6 ఏస్‌లతో పాటు 36 విన్నర్లు కొట్టింది. రష్యా అమ్మాయి పవ్లిచెంకోవా కూడా క్వార్టర్స్ చేరింది. ఆమె 7-6 (7-3), 6-4తో సోనీ కార్టల్‌ను ఓడించింది. లారా సిగ్మండ్ (జర్మనీ) 6-3, 6-2తో సొలానా సియారా (అర్జెంటీనా)ను ఓడించి తుది ఎనిమిది జాబితాలో చోటు దక్కించుకుంది. గంటన్నరలోపే ముగిసిన ఈ పోరులో అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన ఆమె.. తేలిగ్గా విజయాన్ని సొంతం చేసుకుంది.



జకోవిచ్



వింబుల్డన్‌లో వంద విజయాలు సాధించిన మూడో ప్లేయర్‌గా నొవాక్ జకోవిచ్ ఘనత సాధించిన సందర్భంగా స్టాండ్స్‌లో నృత్యం చేస్తున్న అతడి తనయురాలు తార.

కచనోవ్ ముందంజ: పురుషుల సింగిల్స్‌లో కరెన్ కచనోవ్ (రష్యా) క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్స్‌లో ఈ 17వ సీడ్ ఆటగాడు 6-4, 6-2, 6-3తో మచార్‌జాక్ (పోలెండ్)ను ఓడించాడు. ఈ టోర్నీలో క్వార్టర్స్ చేరడం కచనోవ్‌కు ఇది రెండోసారి. అమెరికా ఆటగాడు ఫ్రిట్జ్ కూడా ముందంజ వేశాడు. అతడికి వాకోవర్ లభించింది. ప్రిక్వార్టర్స్‌లో అతడు 6-1, 3-0తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా) గాయంతో తప్పుకున్నాడు. మ్యాచ్ ఆరంభం నుంచి థాంప్సన్ వెన్ను, కాలి గాయాలతో ఇబ్బందిపడ్డాడు. మధ్యలో ఒకటికి రెండుసార్లు విరామం తీసుకున్నాడు. కానీ రెండో సెట్ మధ్యలో ఇంక ఆటను కొనసాగించలేకపోయాడు. పదోసీడ్ షెల్టన్ (అమెరికా) ప్రిక్వార్టర్స్ చేరాడు. అతడు 6-3, 7-6 (7-4), 6-2తో ఫుసోవిక్స్ (హంగేరి)ని ఓడించాడు. మరో మూడో రౌండ్ పోరులో పదకొండో సీడ్ డిమెనార్ (ఆస్ట్రేలియా) 6-4, 7-6 (7-5), 6-3తో హోల్‌గ్రెన్ (డెన్మార్క్)పై విజయం సాధించాడు.

ప్రపంచ అథ్లెటిక్స్‌కు భారత్ బిడ్

బెంగళూరు: 2029, 2031 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌ల ఆతిథ్య హక్కుల కోసం భారత్ బిడ్ దాఖలు చేయనుంది. రెండు టోర్నీలలో ఏదో ఒకటి భారత్ దక్కేలా వ్యూహాత్మక బిడ్ వేయనున్నట్లు జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) అధికార ప్రతినిధి సుమరివాలా ఆదివారం తెలిపాడు. 2029, 2031 పోటీలకు ఆతిథ్యమిచ్చే దేశాల వివరాల్ని ప్రపంచ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) 2026 సెప్టెంబరులో ప్రకటిస్తుంది. ఆతిథ్య హక్కుల కోసం ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీలోపు బిడ్ దాఖలు చేయొచ్చు. "2029, 2031 పోటీలకు వ్యూహాత్మక బిడ్ దాఖలు చేయబోతున్నాం. రెండు ఈవెంట్ల ఆతిథ్య హక్కుల్ని ఒకేసారి ప్రకటిస్తారు. భారత్‌కు ఏది లభించినా సమ్మతమే. బిడ్డింగ్ ప్రక్రియ ప్రారంభానికి ఇంకా కొంత సమయముంది" అని సుమరివాలా పేర్కొన్నాడు.

గెలుపు బాటలో ఆసీస్



స్టార్క్

సెయింట్‌జార్జ్: వెస్టిండీస్‌తో మూడు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన ఆస్ట్రేలియా.. రెండో టెస్టులోనూ విజయం దిశగా సాగుతోంది. విండీస్‌కు 277 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన ఆసీస్.. నాలుగో రోజు కడపటి వార్తలందేసరికి ప్రత్యర్థిని 99/7కు పరిమితం చేసింది. మిచెల్ స్టార్క్ (3/19), జోష్ హేజిల్‌వుడ్ (2/33) విజృంభించడంతో విండీస్ 33 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఓటమి బాటలో సాగింది. ఈ దశలో కెప్టెన్ రోస్టన్ చేజ్ (34) నిలిచినా.. అతడికి సహకరించే బ్యాటర్లు కరవయ్యారు. చేజ్ ఔటయ్యాక వికెట్ల పతనం మళ్లీ వేగవంతమైంది.

గుకేశ్‌కు మూడో స్థానం



గుకేశ్

జాగ్రెబ్: గ్రాండ్ చెస్ టూర్ సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో మొత్తంగా దొమ్మరాజు గుకేశ్ (19.3 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాడు. ర్యాపిడ్‌లో అగ్రస్థానం సాధించిన గుకేశ్.. బ్లిట్జ్ పోటీలను మూడో స్థానంతో ముగించాడు. మరో భారత ఆటగాడు ప్రజ్ఞానంద (15) తొమ్మిదో స్థానం దక్కించుకున్నాడు. మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే, 22.5) విజేతగా నిలిచాడు. వెస్లీ సో (అమెరికా, 20) రన్నరప్ ట్రోఫీని దక్కించుకున్నాడు.

పాలిగ్రాస్ హాకీ అవార్డుకు దీపిక



దిల్లీ: ప్రతిష్ఠాత్మక పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డు రేసులో భారత హాకీ క్రీడాకారిణి దీపిక నిలిచింది. 2024-25 ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్ సీజన్‌లో భాగంగా ప్రపంచ నంబర్‌వన్ నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దీపిక సాధించిన అద్భుతమైన ఫీల్డ్ గోల్ అవార్డుకు నామినేట్ అయింది. ఈనెల 14న ముగిసే ఓటింగ్ ప్రక్రియలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న హాకీ అభిమానులు పాల్గొంటారు. అత్యధిక ఓట్లు వచ్చిన క్రీడాకారిణికి 2024-25 సీజన్‌కు గాను అవార్డు లభిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో భువనేశ్వర్‌లో హాకీ ప్రొ లీగ్ మ్యాచ్‌లో దీపిక ఈ గోల్ నమోదు చేసింది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో స్కోరు 2-2తో సమం కాగా.. షూటౌట్‌లో భారత్ విజేతగా నిలిచింది. 35వ నిమిషంలో దీపిక గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది.

ముల్డర్ 264 నాటౌట్

ఒక్క రోజులో దక్షిణాఫ్రికా 465/4

బులవాయో: జింబాబ్వేతో తొలి టెస్టులో ఘనవిజయం సాధించిన దక్షిణాఫ్రికా.. సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టునూ గొప్పగా ఆరంభించింది. ఆదివారం మొదలైన ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 465 పరుగులు చేయడం విశేషం. ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ (264 బ్యాటింగ్; 259 బంతుల్లో 34×4, 3×6) భారీ డబుల్ సెంచరీతో అజేయంగా నిలిచాడు. బెడింగ్‌హామ్ (82), లువాన్ ప్రిటోరియస్ (78) కూడా రాణించారు. ఆట చివరికి ముల్డర్‌కు తోడుగా బ్రెవిస్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

హర్వీందర్‌కు రెండు స్వర్ణాలు



హర్వీందర్


బీజింగ్: ఆసియా పారా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పారాలింపిక్ ఛాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ హర్వీందర్ సింగ్ సత్తాచాటాడు. ఆదివారం రెండు బంగారు పతకాలతో మెరిసిన హరిందర్.. భారత్‌కు టోర్నీలో ద్వితీయ స్థానం అందించాడు. రికర్వ్ మిక్స్‌డ్ ఫైనల్లో హర్వీందర్- భావ్నా జోడీ 5-4తో జిహాన్ గావో- జున్ గాన్ (చైనా) జంటపై నెగ్గి స్వర్ణం గెలుచుకుంది. రికర్వ్ ఓపెన్ ఫైనల్లో హర్వీందర్ 7-1తో హెన్రిరుచయ్ నెత్సిరి (థాయ్‌లాండ్)పై గెలిచి మరో పసిడి సొంతం చేసుకున్నాడు. మహిళల కాంపౌండ్ టీమ్‌లో శీతల్ దేవి- జ్యోతి జోడీ 148-143తో లూ జాంగ్- జింగ్ జావో (చైనా) జంటపై నెగ్గి స్వర్ణం కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో మూడేసి స్వర్ణ, రజత, కాంస్యాలతో మొత్తం 9 పతకాలతో భారత్ ద్వితీయ స్థానం సాధించింది. 10 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలతో చైనా అగ్రస్థానంలో నిలిచింది.

భారత్‌కు మిశ్రమ ఫలితాలు

ఫిడే మహిళల ప్రపంచకప్

బటుమి (జార్జియా): ఫిడే మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఆదివారం తొలి రౌండ్లో జాంగ్ లాన్‌లిన్ (కెనడా)పై పద్మిని రౌత్... ఒర్టిజ్ అనాహి (ఈక్వెడార్)పై నందిత విజయాలు అందుకున్నారు. కె.ప్రియాంక ఓడిపోయింది. గాల్ జోస్కా (హంగేరి) ఆమెపై గెలిచింది. కిరణ్ మనీషా మహంతికి కూడా నిరాశ ఎదురైంది. సాంగ్ యుగ్జిన్ (చైనా) చేతిలో మనీషా ఓడింది. షఖ్రా దోవా లాలా (తుర్క్మెనిస్థాన్)తో గేమ్‌ను వంతిక అగర్వాల్ డ్రా చేసుకుంది.

సెమీస్‌లో శ్రీకాంత్ ఓటమి



శ్రీకాంత్

కాల్గరి: కెనడా ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ కిదాంబి శ్రీకాంత్ కథ ముగిసింది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అతడు 21-19, 14-21, 18-21తో లి షిఫెంగ్ (చైనా) చేతిలో ఓడాడు. తొలి గేమ్‌లో షిఫెంగ్ నుంచి శ్రీకాంత్‌కు గట్టిపోటీ ఎదురైంది. ఒక దశలో 16-18తో వెనుకబడ్డాడు. కానీ పుంజుకుని గేమ్‌ను గెలుచుకున్నాడు. రెండో గేమ్‌లోనూ భారత షట్లర్ 9-4తో ఆధిక్యంలోకి వెళ్లినా తర్వాత తడబడ్డాడు. 14-14తో ఉన్న దశ నుంచి గేమ్ కోల్పోయాడు. మూడో గేమ్‌లోనూ శ్రీకాంత్ మెరుగ్గానే ఆడాడు. 12-8తో ఆధిక్యంలో నిలిచాడు. అయితే మరోసారి అనవసర తప్పిదాలతో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు.

మెయిన్ రోడ్స్ నిబంధనలు చెప్పే క్రాస్ రోడ్స్!



పార్కులో తెలుసుకోవాల్సిన చిహ్నాలు ఎన్నో..



ఏలూరులోని ట్రాఫిక్ పార్కు

పిల్లలు సులువుగా రహదారి భద్రతా నిబంధనలు తెలుసుకునేలా ఏలూరులో ఓ పార్కు సిద్ధమైంది. దీన్ని త్వరలో ప్రారంభించనున్నారు. 'క్రాస్ రోడ్స్'గా పిలిచే ఈ పార్కులోకి చిన్నారులను తీసుకెళ్లగానే రంగురంగుల ట్రాఫిక్ సింబల్స్ ఎన్నో ఆకట్టుకుంటాయి. అక్కడ ఉన్న సైకిళ్లను వేసుకొని పిల్లలు పార్కునంతా ఓ చుట్టు చుట్టేయొచ్చు. అలా చక్కర్లు కొడుతూనే రహదారులపై కనిపించే గుర్తుల గురించి అక్కడున్న కానిస్టేబుళ్లను అడిగి తెలుసుకోవచ్చు. అంతేనా, ప్రమాద క్షతగాత్రులను అంబులెన్సులో తరలించడం, డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవడం కూడా బొమ్మలతో, వీడియో గేమ్‌లతో నేర్పిస్తారు. ఇలా ట్రాఫిక్‌పై అవగాహన కల్పించే ఇతివృత్తంతో నిర్మించిన పార్కు రాష్ట్రంలో మరెక్కడా లేదు. మొత్తం 0.75 ఎకరాల విస్తీర్ణంలో ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ(ఎలుడా) దీన్ని చక్కటి హంగులతో సిద్ధం చేసింది. 'పిల్లలకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తే, వారు తల్లిదండ్రుల్లోనూ మార్పు తీసుకొస్తారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులనూ ఇక్కడికి తీసుకొచ్చి చూపిస్తాం. వారికి కానిస్టేబుళ్లు అవగాహన కల్పిస్తారు' అని ఎలుడా వైస్ ఛైర్మన్ పి.ధాత్రిరెడ్డి, ఏలూరు ఎస్పీ, కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. - ఈనాడు, ఏలూరు



రోడ్డుపై ఉన్నగుర్తులు చూడాలి..



రోడ్డు పక్కనున్న ట్రాఫిక్ రూల్స్ గమనించాలి..

వైభవంగా ముగిసిన తానా మహాసభలు



శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, దుర్యోధనుడి వేషధారణలో కృష్ణప్రసాద్

ఈనాడు, అమరావతి: అమెరికాలోని డెట్రాయిట్‌లో ఈ నెల 3న ప్రారంభమైన తానా మహాసభలు 5వ తేదీన వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని తెలుగు ప్రముఖులతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి రాజకీయ, సినీరంగ ప్రముఖులు హాజరయ్యారు. వివిధ అంశాలపై చర్చలు నిర్వహించారు. ఫ్యాషన్ షోలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత విభావరి ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు తానా మెరిటోరియస్ అవార్డులు అందించారు.

✦ తరతరాల తెలుగు వైభవం నృత్యనాటిక ద్వారా మహాకవుల గొప్పదనాన్ని తెలియజేశారు. శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అలరించారు. దుర్యోధనుడి ఏకపాత్రాభినయంతో బోస్టన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే కృష్ణప్రసాద్ సొంపల్లి ఆకట్టుకున్నారు. తానా సేవా కార్యక్రమాల గురించి ఏటా తాను వింటూనే ఉంటానని.. సినీనటి సమంత పేర్కొన్నారు. ప్రాంతాల వారీగా దూరంగా ఉన్నా.. తెలుగు వారంతా ఎప్పటికీ తన మనసులో ఉంటారని ఆమె భావోద్వేగానికి గురయ్యారు.

దలైలామా శాంతికి ప్రతిరూపం: ప్రధాని మోదీ

ధర్మశాల: టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదినం సందర్భంగా దేశంలోని 140 కోట్ల మందితో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రేమ, కరుణ, ఓర్పు, నైతిక క్రమశిక్షణకు ఆయన ప్రతిరూపం. మతాలకు అతీతంగా ఆయనిచ్చే సందేశం ప్రజలను ప్రభావితం చేస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



భక్తులకు వడలు వడ్డిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమలలో రాత్రి అన్నప్రసాదంలోనూ వడలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో భక్తులకు నాణ్యతతో కూడిన రుచికరమైన అన్నప్రసాదం అందించాలనే లక్ష్యంతో తితిదే నిర్ణయం తీసుకుంది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో మధ్యాహ్న భోజన సమయంలోనే కాకుండా రాత్రి భోజన సమయంలో కూడా వడలు వడ్డించేందుకు ఏర్పాట్లు చేపట్టింది. ఆదివారం సాయంత్రం తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నప్రసాద కేంద్రానికి చేరుకుని భక్తులకు వడలు వడ్డించారు.



ప్రత్యేక శ్రద్ధతోనే బంధాలు పదిలం

ఫోన్ పని చేయడానికి ఛార్జింగ్, వాహనం నడవడానికి ఇంధనం ఎలా అవసరమో, బంధాలు పటిష్ఠంగా ఉండటానికి ప్రత్యేక శ్రద్ధ చూపడం కూడా అంతే అవసరం. తీరిక లేని జీవితాల్లో సమయం కల్పించుకొని అయినవారితో మనస్ఫూర్తిగా సంభాషించడం, కష్టసుఖాలు చెప్పుకోవడం మరవొద్దు. పని ఉన్నప్పుడే ఫోన్ చేద్దాంలే అన్న ధోరణి వద్దు.

- వి.మోహన్, వైద్యులు

పట్టాలెక్కిన క్రిస్ సిటీ పనులు

- ఓ పక్క భూసేకరణ.. మరోవైపు మౌలిక వసతుల కల్పన
- 2027 ఫిబ్రవరికల్లా పూర్తికి చర్యలు
- 4.67 లక్షల మందికి ఉపాధి లక్ష్యంగా పనులు



క్రిస్ సిటీ కోసం చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో జరుగుతున్న రోడ్డు పనులు

ఈనాడు, తిరుపతి: తిరుపతి జిల్లాలోని కృష్ణపట్నం పారిశ్రామిక నగరం (క్రిస్ సిటీ)పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రూ.37,500 కోట్ల పెట్టుబడితో 4,67,500 మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా, ఎన్డీయే సర్కార్ ఆటంకాలను తొలగిస్తోంది. భూసేకరణ కోసం.. ప్రభుత్వ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు పరిహారం చెల్లిస్తోంది. తాజాగా సేకరించిన భూమిలో మౌలిక సదుపాయాలు కల్పించే పనిలో పడింది. చెన్నై, కృష్ణపట్నం నౌకాశ్రయాలు, రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం, చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి, చెన్నై- కోల్‌కతా రైల్వేలైన్‌కు సమీపంలోని క్రిస్ సిటీలో ఏడాదిన్నరలో పనులు పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది.

పరిహారం పెంచి..: తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల పరిధిలో క్రిస్ సిటీ ఏర్పాటుకు 2017లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిక్ట్), రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగమైన ఈ ప్రాజెక్టుకు మూడు దశల్లో 10,834 ఎకరాలు అవసరం. తొలి విడతలో కోట, చిల్లకూరు మండలాల్లో 2,500.49 ఎకరాలు సేకరించాలి. ఇందులో 985.604 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిలో దాదాపు 600 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ఐదేళ్లు భూసేకరణను పక్కనపడేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక అన్నదాతలతో చర్చలు జరిపారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములు తీసుకుంటే బతుకుదెరువు కోల్పోతామని వారు వాపోయారు. దీంతో వారికి ఎకరాకు రూ.5.99 లక్షల చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. అది చాలదని అన్నదాతలు విన్నవించడంతో రూ.8 లక్షలకు పెంచారు. మొత్తం రూ.78.84 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 371ఎకరాలకు రూ.40కోట్లు రైతులఖాతాల్లో జమ చేశారు.

రూ.531.36 కోట్లు విడుదల

గతేడాది జనవరి 8న క్రిస్ సిటీకి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.2,139.43 కోట్లతో మౌలిక వసతులు కల్పించే ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు నిక్‌డిక్ట్ రూ.531.36 కోట్లు విడుదల చేసింది. ప్రధాన, అంతర్గత రోడ్లు, వంతెనలు, నీటి సరఫరా, మురుగు నీటి శుద్ధి ప్లాంటు, విద్యుత్తు ఉప కేంద్రాలు, తదితర వసతులు కల్పించే పనులు చేస్తున్నారు. రెండు ప్రధాన వంతెనల్లో ఒకదాని నిర్మాణం శరవేగంగా సాగుతోంది. నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించి 69.48 కి.మీ.లకు గాను 10.14 కి.మీ. మేర పూర్తయింది. రోడ్ల నిర్మాణంలో భాగంగా 9 కి.మీ. మేర కట్ట పనులు చేశారు. 2027 ఫిబ్రవరి 13 నాటికి వీటన్నింటినీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పనులు మరింత వేగవంతమయ్యేలా చర్యలు

భూసేకరణ పూర్తయిన వెంటనే మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఈ పనులు మరింత వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆహారశుద్ధి, టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్, ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు వస్తాయి. రాష్ట్రానికే క్రిస్ సిటీ తలమానికంగా మారుతుంది.

- వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు ★ కనకదుర్గమ్మకు సారె తీసుకొచ్చిన మహిళా భక్తులు

దుర్గమ్మ చెంత తొలి ఏకాదశి సందడి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా ఇంద్రకీలాద్రి ఆదివారం భక్తులతో జనసంద్రంగా మారింది. ఒకవైపు సారె తీసుకొచ్చిన మహిళలు, మరోవైపు ఏకాదశి రోజున అమ్మవారి ఆశీస్సులు అందుకునేందుకు వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. దుర్గగుడి ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గం ఉదయం నుంచి భక్తుల వాహనాలతో కిటకిటలాడాయి. 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు కనిపించడం లేదా?

- వైకాపా నేతలకు మంత్రి సంధ్యారాణి ప్రశ్న
- తోటపల్లి రిజర్వాయర్ నీటి విడుదల

పార్వతీపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ 6 పథకాలపై వైకాపా నాయకులు విమర్శలు చేస్తున్నారని, వారికి లబ్ధిదారులు కనిపించడం లేదా అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లిలో ఆదివారం తోటపల్లి జలాశయం నుంచి ఆమె నీటిని విడుదల చేసి అనంతరం మాట్లాడారు. ఈ నీటితో పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 84 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఈ జలాశయం పూర్తిచేయడానికి 2015లో సీఎం చంద్రబాబు గట్టుపైనే సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయనున్నట్లు చెప్పారు. కారు కింద పడి మృతి చెందిన కార్యకర్తను పక్కన పడేసిన జగన్‌కు, క్యాన్సర్‌తో బాధపడుతున్న కార్యకర్తను పరామర్శించిన చంద్రబాబుకూ మధ్య తేడాను ప్రజలు తెలుసుకోవాలన్నారు.



స్వర్ణాల చెరువు తీరంలో భక్తుల రద్దీ

రొట్టెల పండగ ప్రారంభం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా రొట్టెల పండగ ఆదివారం ప్రారంభమైంది. 12 మంది అమరవీరుల సమాధులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా చేరుకుంటున్నారు. మొక్కులు తీర్చుకునేందుకు కావాల్సిన రొట్టెలతో స్వర్ణాల చెరువు దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. మొహర్రం నెల షహదత్ రోజు నుంచి ప్రారంభమయ్యే ఈ పండగకు ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ రొట్టెలు మార్పిడి చేసుకుంటే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. గతేడాది మొక్కులు పూర్తయినవారు ఈ ఏడాది రొట్టెలను వదులుతున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు. సోమవారం రాత్రి బారాషహీదుల గంధ మహోత్సవం జరగనుండడంతో దర్గా ఆవరణలో పెద్దఎత్తున వేచి ఉన్నారు. రాష్ట్ర పండగ కావడంతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

విద్యకు బ్రాండ్ అంబాసిడర్లు మా'స్టార్స్'

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్లు మా'స్టార్స్' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జిన్నూరు జడ్పీ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ బొంతు మధుబాబు, పంగిడిగూడెం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు బాబూ రాజేంద్రప్రసాద్, సోమరాజుచెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వీరవాసరపు బాలకరుణాకరరావులకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలని కోరే మీరు.. మీ పిల్లల్ని కూడా అదే పాఠశాలల్లో చదివించడం ఆదర్శనీయం' అని పేర్కొన్నారు.

EENADU Vol: 51, Issue: 328 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

నీడనూ నమ్మని ట్రంప్!

- అందుకే శత్రువులవుతున్న మిత్రులు
- అందరితోనూ వివాదాలే..
- తాజాగా ఆ జాబితాలో మస్క్..

ఇంటర్నెట్ డెస్క్: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడైన ఆరు నెలల్లోనే గతంలో ముందే మిత్రులు శత్రువులుగా మారుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఎన్నికల్లో తనకు నీడలా వెంట ఉండి గెలిపించిన వారూ శత్రువులుగా మారడం. ప్రస్తుతం ఆయనపై విమర్శలు చేస్తున్న వారిలో చాలా మంది గతంలో అత్యంత సన్నిహితులే. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నుంచి మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ దాకా ఎంతో మంది ఇప్పుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా గొంతు విప్పుతున్నారు. ఆయన అనుసరిస్తున్న పాలనా విధానాలను ఎండగడుతున్నారు. బిగ్ బ్యూటిఫుల్ చట్టం నుంచి విదేశాంగ విధానాలదాకా ట్రంప్ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలను బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు.

ఎలాన్ మస్క్



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయానికి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్రంగా కృషి చేశారు. అత్యధిక ధనాన్ని ఖర్చుపెట్టారు. దీంతో ట్రంప్ అధ్యక్షుడు కాగానే ప్రభుత్వ వ్యయ నియంత్రణ కోసమంటూ మస్క్ కోసం కొత్తగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీని (డోజ్) ఏర్పాటు చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ట్రంప్ విధానాలను నచ్చని మస్క్.. డోజ్‌కు రాజీనామా చేశారు. ఆ తర్వాత బిగ్ బ్యూటిఫుల్ చట్టాన్ని ట్రంప్ తేవడంతో వారి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఏకంగా కొత్త పార్టీ పెట్టే వరకూ మస్క్ వెళ్లారు. అంతకుముందు ట్రంప్‌పై సెక్స్ కుంభకోణానికి సంబంధించిన ఆరోపణలు చేశారు. అటు ట్రంప్.. మస్క్‌ను తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఆయన కంపెనీలకు బిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులను రద్దు చేస్తానని స్పష్టం చేశారు.

జాన్ బోల్టన్




ట్రంప్ తొలిసారి అధ్యక్షుడయ్యాక జాన్ బోల్టన్‌ను అమెరికా జాతీయ భద్రతా సలహాదారుడిగా నియమించుకున్నారు. 2018 ఏప్రిల్ 9 నుంచి 2019 సెప్టెంబరు 10 వరకు ఈ పదవిలో ఆయన కొనసాగారు. ఇరాన్, ఉత్తర కొరియాలకు సంబంధించిన విదేశాంగ విధానాలను రూపకల్పన చేసే క్రమంలో ట్రంప్, జాన్ బోల్టన్‌ల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో జాన్ బోల్టన్ 17 నెలలే పని చేశారు. తానే రాజీనామా చేశానని బోల్టన్ ప్రకటించగా.. తానే తీసేశానని ట్రంప్ అప్పట్లో చెప్పారు. రెండోసారి అధికారంలోకి రాగానే జాన్ బోల్టన్ సెక్యూరిటీ క్లియరెన్స్‌ను ట్రంప్ రద్దు చేశారు.

జిమ్ మ్యాటిస్



అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తొలి హయాంలో జిమ్ మ్యాటిస్ రక్షణ మంత్రిగా సేవలందించారు. ఆయన 2017 జనవరి 20 నుంచి 2019 జనవరి 1 వరకు ఈ పదవిలో కొనసాగారు. సిరియా నుంచి అమెరికా సేనలను ఉపసంహరించుకోవాలనే ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో జిమ్ మ్యాటిస్ రాజీనామా చేశారు. 2020లో జిమ్ మ్యాటిస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రజలను ఏకం చేసే కనీస ప్రయత్నం కూడా చేయని అధ్యక్షుడిగా ట్రంప్‌ను తాను చూశానని విమర్శించారు.

మైక్ పెన్స్



ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడయ్యాక మైక్ పెన్స్‌ను ఉపాధ్యక్షుడిగా నియమించుకున్నారు. ఆయన 2017 జనవరి 20 నుంచి 2021 జనవరి 20 దాకా ఆ పదవిలో కొనసాగారు. ఆ హయాంలో పలు వ్యవహారాలపై మైక్ పెన్స్‌కు మంచి పట్టుంది. ఈ అంశాల్లో కీలక సలహాలన్నీ ఈయన నుంచే ట్రంప్ తీసుకునేవారు. 2020 నవంబరులో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయారు. ఇద్దరి స్నేహం 2021 జనవరి 6న దెబ్బతింది. జో బైడెన్ ఎన్నికల్లో గెలిచినట్లుగా సర్టిఫికెట్‌ను జారీ చేయొద్దని మైక్ పెన్స్‌కు ట్రంప్ నిర్దేశించారు. అందుకు పెన్స్ నిరాకరించారు. దీంతో ఆయనపై ట్రంప్ బహిరంగంగా విమర్శలు చేశారు. అనంతరం క్యాపిటల్ హిల్ వద్ద నిరసనకు దిగిన ట్రంప్ వర్గీయులు మైక్ పెన్స్‌ను ఉరితీయండంటూ నినాదాలు చేశారు. దీనిపై పెన్స్ అప్పట్లో స్పందిస్తూ.. రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరించాలని భావించే వారు అమెరికా అధ్యక్షుడు కాకూడదని వ్యాఖ్యానించారు.

జాన్ కెల్లీ




ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జాన్ కెల్లీ అమెరికా చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సేవలందించారు. 2017 జులై 31 నుంచి 2019 జనవరి 2 వరకు ఈ పదవిలో కొనసాగారు. పదవి నుంచి వైదొలగినప్పటి నుంచి జాన్ కెల్లీ.. ట్రంప్ విమర్శకుడిగా మారిపోయారు. ట్రంప్ ఒక ఫాసిస్టు, నియంత అని విమర్శించారు.

మార్క్ మిల్లే



ట్రంప్ తొలి విడత అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్‌గా మార్క్ మిల్లే సేవలందించారు. ఆయన 2015 ఆగస్టు 14 నుంచి 2019 ఆగస్టు 9 వరకు ఈ పదవిలో కొనసాగారు. రాజీనామా చేశాక ఈయన ట్రంప్‌నకు వ్యతిరేకంగా గళం విప్పారు. ట్రంప్ ఒక ఫాసిస్టు అంటూ ధ్వజమెత్తారు. అమెరికాలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా అభివర్ణించారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ వల్లే భారత్‌లో కశ్మీర్ భాగమైంది: షా



ఆణంద్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ లేకపోతే కశ్మీర్ భారత్‌లో ఎన్నటికీ కలిసేది కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకుని ఆయనకు అమిత్‌షా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుజరాత్‌లోని ఆణంద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. దేశానికి ముఖ్యంగా జమ్మూకశ్మీర్ కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలను స్మరించుకున్నారు. "జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే భారత రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించకుండా భారత్‌లోనే పూర్తిగా విలీనం చేయాలని వాదించారు. అలాగే బెంగాల్ ఈ రోజున భారత్‌లో భాగంగా ఉండటానికీ కూడా శ్యామా ప్రసాద్ ముఖర్జీ, స్వామి ప్రణవానందే కారణం" అని అమిత్ షా అన్నారు. ఇక 10 మందితో ప్రారంభించిన భారతీయ జనసంఘ్ ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని పేర్కొన్నారు. అనంతరం ఆయన అమూల్ డైరీ నాల్గో వార్షికోత్సవంలో పాల్గొన్నారు. సహకార రంగం పని సంస్కృతిలో పారదర్శకత, సాంకేతికత, ప్రజా సంక్షేమాన్ని అంతర్భాగం చేయాలని వాణిజ్య సంస్థలకు పిలుపునిచ్చారు.

వారసుడి నిర్ణయాధికారం దలైలామాకు లేదు: చైనా

దిల్లీ: తన వారసుడిని ఎంపికచేసే ప్రక్రియను నిర్ణయించే అధికారం దలైలామాకు లేదని చైనా మరోసారి ప్రకటించింది. ఈ మేరకు భారత్‌లోని చైనా రాయబారి షూ ఫెయిహాంగ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "టిబెటిన్ బౌద్ధంలో ఓ ప్రత్యేకమైన విధానంలో వారసుడి ఎంపిక జరుగుతుంది. లివింగ్ బుద్ధ విధానంలో దాదాపు 700 సంవత్సరాలుగా పునర్జన్మ విధానం కొనసాగుతోంది. చైనాలోని వివిధ ప్రావిన్సుల్లో వందల రకాల పునర్జన్మ విధానాల్ని అనుసరిస్తున్నారు. సుదీర్ఘ చారిత్రక సంప్రదాయంలో 14వ దలైలామా ఓ భాగం మాత్రమే, అంతకంటే ఎక్కువ కాదు. ఆ సంప్రదాయాలు ఆయనతోనే మొదలు కాలేదు.. ఆయనతోనే అంతం కావు. పునర్జన్మ విధానాన్ని కొనసాగించాలా.. పక్కన పెట్టాలా అనేది నిర్ణయించే అధికారం ఆయనకు లేదు" అని పేర్కొన్నారు. కాగా దలైలామా జీవితంపై రచించిన కొత్త పుస్తకం 'ఎటర్నల్ లైట్'ను సెప్టెంబరులో విడుదల చేయనున్నట్లు వెస్ట్‌ల్యాండ్ పబ్లికేషన్స్ వెల్లడించింది. సీనియర్ జర్నలిస్ట్, రచయిత అరవింద్ యాదవ్ ఈ పుస్తకానికి రచయిత.

మా సేవల్ని విస్తృతంగా ఉపయోగించుకోండి

- అన్ని రాష్ట్రాల పోలీసులకు నాట్‌గ్రిడ్ పిలుపు

దిల్లీ: నేరాల కట్టడి కోసం తమ సేవలను మరింత విస్తృతంగా ఉపయోగించుకోవాలని అన్ని రాష్ట్రాల పోలీసు బలగాలకు నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (నాట్‌గ్రిడ్) పిలుపునిచ్చింది. ముఖ్యంగా జిల్లాల ఎస్పీలు తమ డేటాబేస్ వినియోగాన్ని పెంచడంపై దృష్టిపెట్టాలని సూచించింది. అవసరమైతే దేశవ్యాప్తంగా ఎక్కడైనాసరే పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకూ తాము సిద్ధమని తెలిపింది. అన్ని రాష్ట్రాల డీజీపీలకు నాట్‌గ్రిడ్ సీఈవో పీయూష్ గోయల్ తాజాగా ఈ మేరకు లేఖ రాశారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో నాట్‌గ్రిడ్ సేవలను బాగా వినియోగించుకున్నాయంటూ ఆంధ్రప్రదేశ్, హరియాణా, రాజస్థాన్, మహారాష్ట్ర, అస్సాంలను ఆయన ప్రశంసించారు. తమిళనాడు కూడా తమ డేటాబేస్ వినియోగాన్ని పెంచిందంటూ కితాబిచ్చారు. నాట్‌గ్రిడ్ కేంద్ర హోంశాఖ నియంత్రణలో పనిచేస్తుంది. ఉగ్రవాద కార్యకలాపాలు, వ్యవస్థీకృత నేర ముఠాలు, ఆర్థిక లావాదేవీలు, వలసలు, మాదకద్రవ్యాలు, నకిలీ నోట్ల చలామణి సహా పలు అంశాలపై తమ డేటాబేస్‌ను 11 కేంద్ర సంస్థలకు, అన్ని రాష్ట్రాల పోలీసు బలగాలకు ఇది అత్యంత వేగంగా చేరవేయగలదు.

జమిలి ఎన్నికల భావన రాజ్యాంగబద్ధమైనదే

- బిల్లులోని పలు అంశాలపై మాజీ సీజేఐల ఆందోళన

దిల్లీ: జమిలి ఎన్నికలపై పార్లమెంటరీ కమిటీకి తమ అభిప్రాయాలను తెలియజేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానం రాజ్యాంగబద్ధమైనదేనని పేర్కొన్నారు. అదే సమయంలో ఎన్నికల కమిషన్‌కు అపరిమిత అధికారాలు ఇవ్వడం సహా పలు ఇతర అంశాలపై ఆందోళన వెలిబుచ్చారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరపడం రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని ఉల్లంఘించడమేనంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ తోసిపుచ్చారు. జాతీయ, రాష్ట్రాల ఎన్నికలు విడివిడిగా నిర్వహించాలని రాజ్యాంగం ఎప్పుడూ ఆదేశించలేదని సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి సమర్పించిన తన అభిప్రాయంలో పేర్కొన్నారు. ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ బిల్లులో 'విచక్షణను వినియోగించడానికి ఎలాంటి మార్గదర్శకాలు నిర్దేశించకుండా' ఎన్నికల సంఘానికి 'అపరిమిత అధికారాలు' మంజూరు చేయాలనుకోవడాన్ని ప్రశ్నించారు. ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ కోసమంటూ రాష్ట్రాల శాసనసభల కాలాన్ని తగ్గించడం, పొడిగించడానికి ఈసీకి ఈ అధికారాలు వీలు కల్పిస్తాయన్నారు. ఈసీ ఈ అధికారాన్ని వినియోగించగల పరిస్థితులను రాజ్యాంగం నిర్వచించాలని పేర్కొన్నారు. గతంలో మరో మాజీ సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్ ఎన్నికల సంఘానికి అధికారాలివ్వాలనుకోవడాన్ని ప్రశ్నించారు. భాజపా ఎంపీ పీపీ చౌదరి ఛైర్‌పర్సన్‌గా ఉన్న జేపీసీ ముందు ఈ నెల 11న మాజీ సీజేఐలు జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జె.ఎస్. కేహర్ హాజరుకానున్నారు. కమిటీ సభ్యులు వారితో బిల్లులోని నిబంధనలపై చర్చిస్తారు. ఇప్పటికే ఫిబ్రవరి, మార్చిలలో మాజీ సీజేఐలు జస్టిస్ యు యు లలిత్, జస్టిస్ రంజన్ గొగొయ్ కమిటీ ముందు హాజరయ్యారు. జస్టిస్ యు యు లలిత్ ఎన్నికలు ఒకేసారి కాకుండా దశలవారీగా నిర్వహించాలని సూచించారు.

ఎలక్ట్రిక్ బస్సులు, హైపర్‌లూప్‌లతో విప్లవాత్మక మార్పులు: గడ్కరీ

రాంచీ: విద్యుత్‌తో వేగవంతమైన రవాణా, పట్టణ ప్రాంతంలో రోప్‌వే, హైపర్‌లూప్, ఎలక్ట్రిక్ బస్సులు, ప్యునికులర్ రైల్వేలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఇవన్నీ ఆచరణలోకి వస్తే.. భారత రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నట్లు తెలిపారు. మొబైల్ ఆధారిత డ్రైవింగ్ పరీక్షలు, చెట్లను దానం చేసేందుకు (ట్రీ బ్యాంకు)లను పర్యావరణశాఖ ఆమోదంతో తీసుకురానున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 25వేల కి.మీ. రెండు లైన్ల రోడ్డును నాలుగు లైన్లుగా మార్చడం, ప్రముఖ పట్టణాలను కలుపుతూ విద్యుత్ రవాణాను నిర్మించడం తమ ఎజెండాలో భాగమన్నారు. "కేదార్‌నాథ్ సహా 360 ప్రాంతాల్లో కేబుల్ కార్లు, రోప్‌వే, ప్యునికులర్ రైల్వేలను నిర్మించనున్నాం. వీటిలో 60 ప్రాజెక్టుల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అన్ని ప్రాజెక్టుల వ్యయం రూ.200 నుంచి రూ.5వేల కోట్ల వరకు ఉండొచ్చు. ఇవి పూర్తయితే దేశ ముఖచిత్రం మారుతుంది" అని గడ్కరీ అన్నారు.

ఈ-పాన్ కార్డు డౌన్‌లోడ్.. ఈ-మెయిల్‌తో జాగ్రత్త: కేంద్రం

ఇంటర్నెట్ డెస్క్: ఈ-పాన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ ఏదైనా ఈ-మెయిల్ వచ్చిందా? అయితే జాగ్రత్త! ఈ తరహా మెయిల్స్‌తో సైబర్ మోసగాళ్లు మీ బ్యాంకు ఖాతాలను ఖాళీచేసే ప్రమాదం పొంచిఉందని కేంద్రం హెచ్చరిస్తోంది. వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ తరహా ఆర్థిక, సున్నితమైన సమాచారానికి సంబంధించిన ఈ-మెయిల్స్, లింకులు, ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లకు స్పందించొద్దని సూచించింది.

ఇవి గుర్తుంచుకోండి: ఆదాయపు పన్నుశాఖ ఎప్పుడూ ఈ-మెయిల్ ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని కోరదు. ✦ పిన్, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డులు, బ్యాంకుల ఖాతాలకు సంబంధించిన సమాచారాన్ని అభ్యర్థిస్తూ ఐటీశాఖ ఈ-మెయిల్ పంపదు. ✦ ఐటీ శాఖ అధికారినని చెప్పుకొనే వ్యక్తుల నుంచి ఆదాయపు పన్ను శాఖ వెబ్‌సైట్‌కు మళ్లించేలా ఏదైనా మెయిల్ వస్తే.. దానికి స్పందించకూడదు. అలాంటి మెయిల్ ద్వారా వచ్చే అటాచ్‌మెంట్లను తెరవొద్దు. కంప్యూటర్/ఫోనుకు హాని కలిగించే కోడ్ వాటిలో ఉండొచ్చు. తద్వారా అవి హ్యాక్ అయ్యే ప్రమాదం ఎక్కువ. ✦ ఏవైనా లింక్‌లు వచ్చినా క్లిక్ చేయొద్దు. అనుమానాస్పద ఈ-మెయిల్/ మోసపూరిత వెబ్‌సైట్లోని లింకులపై క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతాలు, క్రెడిట్ కార్డుల వివరాలు వంటి గోప్యమైన సమాచారాన్ని నమోదు చేయకండి. ✦ మెసేజ్‌లో లింకును కట్‌చేసి బ్రౌజర్‌లో పేస్ట్ చేయొద్దు. ✦ కంప్యూటర్లలో యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ వాడి.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునేలా జాగ్రత్త వహించండి.✦ ఈ తరహాలో ఏదైనా ఇ-మెయిల్ వచ్చినా లేదా ఐటీ శాఖ వెబ్‌సైట్‌గా చెప్పుకొనేలా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే వాటిని webmanager@incometax.gov.in, incident@certnin.org.inకు ఫిర్యాదు చేయొచ్చు.

విధులకు వెళ్లకుండా 12 ఏళ్లుగా రూ.28 లక్షల జీతం

- మధ్యప్రదేశ్‌లో ఓ కానిస్టేబుల్ నిర్వాకం

భోపాల్: ఆ కానిస్టేబుల్ కొన్నేళ్లుగా విధులకు వెళ్లడం లేదు. ఇంట్లోనే ఉండిపోయినా నెలనెలా తన ఖాతాలో జీతం పడుతూనే ఉంది. ఒక్కటి.. రెండు కాదు.. ఏకంగా 12 ఏళ్లుగా ఇలాగే కొనసాగుతోంది. మధ్యప్రదేశ్‌లోని విదిశా జిల్లాకు చెందిన ఓ వ్యక్తి 2011లో భోపాల్‌లోని పోలీస్ లైన్స్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. అనంతరం కొన్ని రోజులకు శిక్షణ కోసం సాగర్‌కు పంపించాలని అధికారులు నిర్ణయించారు. ఇన్‌ఛార్జిగా ఉన్న అధికారి సర్వీసు రికార్డు అతడికే ఇచ్చి పంపించారు. సదరు కానిస్టేబుల్ సాగర్‌కు వెళ్లకుండా వ్యక్తిగత కారణాలతో ఇంటికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత సర్వీసు రికార్డును పోలీస్ లైన్స్‌లో ఉన్న అధికారులకు స్పీడ్ పోస్టులో పంపించాడు. వాటిని తీసుకున్న అధికారులు.. ధ్రువీకరించుకోకుండానే ఆమోదించారు. దీంతో ఇటు పోలీస్ లైన్స్‌లో, అటు సాగర్‌లో శిక్షణా కేంద్రంలో లేకుండా పోయాడు. రికార్డుల్లో మాత్రం పేరు ఉండటంతో విధులకు రాకున్నా 12 ఏళ్లుగా అతడి ఖాతాలో జీతం పడుతూనే ఉండటం గమనార్హం. ఇలా మొత్తంగా రూ.28లక్షలు అతడి ఖాతాలో జమైనట్లు అంచనా. దీర్ఘకాలంలో ఒకే చోట పనిచేస్తున్న పోలీసులను బదిలీ చేయడం, 2011 బ్యాచ్ వారికి పే గ్రేడ్ మదింపుపై డీజీపీ ఇటీవల ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో జాబితా సిద్ధం చేస్తున్న సమయంలో ఈ కానిస్టేబుల్ వ్యవహారం వెలుగు చూసింది. చివరకు కానిస్టేబుల్‌కు నోటీసులు పంపిన అధికారులు ఆయన నుంచి వివరణ కోరారు. తాను మానసిక సమస్యతో బాధపడ్డానని, అందుకే అధికారులకు తగిన సమాచారం ఇవ్వలేకపోయానని చెప్పాడు. ఇప్పటివరకు తీసుకున్న దాంట్లో కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇచ్చిన అతను.. మిగతాది కూడా ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం.

బిహార్‌లో ఓటర్ల జాబితా పునశ్చరణ ఉత్తర్వులను పక్కనపెట్టండి

- సుప్రీంకోర్టులో పిటిషన్లు

దిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక శీఘ్ర పునశ్చరణను (ఎస్ఐఆర్) సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ నేత, ఎంపీ మహువా మొయిత్రా, ఆర్జేడీ నేత మనోజ్ ఝా పిటిషన్లు వేశారు. వీరితోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. ఎన్నికల సంఘం ఉత్తర్వులను రద్దు చేయాలని కోరాయి.

✦ పునశ్చరణ కోసం జూన్ 24వ తేదీన ఈసీ ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టాలని మహువా మొయిత్రా కోరారు. రాజ్యాంగంలో పలు నిబంధనలను ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తున్నాయని పేర్కొన్నారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 32ను వినియోగించుకుని ప్రజాప్రయోజన వ్యాజ్యంగా ఈ పిటిషన్ దాఖలు చేస్తున్నా. జూన్ 24వ తేదీన ఈసీ ఇచ్చిన ఉత్తర్వులను పక్కనబెట్టాలని కోరుతున్నా. బిహార్‌లో ఇచ్చిన పునశ్చరణ ఉత్తర్వులు.. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19(1)(ఏ), 21, 325, 328లను, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని నిబంధనలనూ, 1960 నాటి ఓటర్ల రిజిస్ట్రేషన్ రూల్స్‌నూ ఇవి ఉల్లంఘిస్తున్నాయి. ఈ ఉత్తర్వులను పక్కనబెట్టకపోతే భారీ సంఖ్యలో అర్హులైన ఓటర్ల హక్కులను కోల్పోతారు. తద్వారా ప్రజాస్వామ్యం బలహీనపడి స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలకు విఘాతం కలుగుతుంది' అని మొయిత్రా తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

✦ ఈసీ ఉత్తర్వులు.. ఆర్టికల్స్ 14, 21, 325, 326లను ఉల్లంఘిస్తున్నాయని ఆర్జేడీ రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా తెలిపారు. ముస్లింలు, దళితులను లక్ష్యంగా చేసుకుని ఈ ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు.

✦ ఏడీఆర్, పీయూసీఎల్ తదితర సంస్థలూ పిటిషన్లను దాఖలు చేశాయి.

ఆ ప్రక్రియలో మార్పుల్లేవ్

ఎన్నికల సంఘం స్పష్టీకరణ

పట్నా: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక శీఘ్ర పునశ్చరణ(ఎస్ఐఆర్)లో ఎలాంటి మార్పుల్లేవని, ఆ ప్రక్రియ క్షేత్ర స్థాయిలో సాఫీగా కొనసాగుతోందని, గతంలో జారీ చేసిన నిబంధనల్లో ఎటువంటి మార్పులు చేయలేదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. ఓటర్లు.. జులై 25వ తేదీలోగా ధ్రువీకరణ పత్రాలను అందించవచ్చని, ఈ సమయంలోగా అందించలేని వారికి విజ్ఞప్తులు, అభ్యంతరాల సమయంలో సమర్పించడానికి అవకాశమిస్తామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈసీ వెల్లడించింది. జూన్ 24వ తేదీన తాము జారీ చేసిన ఎస్ఐఆర్ నిబంధనలను పూర్తిగా చదవకుండా కొంత మంది వ్యక్తులు చేస్తున్న తప్పుడు ప్రకటనలను నమ్మవద్దని ప్రజలకు సూచించింది. ప్రస్తుతం పత్రాలను నింపితే సరిపోతుందని, ఎటువంటి ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేసహా పలువురు సామాజిక మాధ్యమాల్లో ప్రకటించిన నేపథ్యంలో ఈసీ ఈ ప్రకటన చేసింది. 'జూన్ 24వ తేదీన ఈసీ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. బిహార్‌లో ఎస్ఐఆర్ కొనసాగుతోంది. ఆగస్టు 1వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తాం. ఇందులో ఎన్యుమరేషన్ పత్రాలు అందించిన వారి పేర్లు ఉంటాయి' అని బిహార్ ప్రధాన ఎన్నికల అధికారి ఆదివారం తెలిపారు. ప్రస్తుత ఓటర్లందరూ ధ్రువీకరణ పత్రాలను అందించడానికి అవసరమైన అన్ని ఏర్పాటు చేశామని, వారంతా ఈ పత్రాలను అందించడానికి సమయముందని పేర్కొన్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో వర్ష బీభత్సం

శిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. తాజాగా కంగడా, మండీ, సిర్మౌర్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగాలు ఆదివారం రెడ్ అలర్ట్ జారీ చేశాయి. గత నెల 20న ప్రారంభమైన రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాల తీవ్రతకు ఇప్పటివరకు 74 మంది మరణించారు. రానున్న 24 గంటల్లో చంబా, కంగడా, కుల్లూ, మండీ, బిలాస్‌పుర్, శిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో భారీ వర్షాలతో వరద ముప్పు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొండచరియలు విరిగిపడటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది.

సీఏ ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ ఫలితాల విడుదల


దిల్లీ: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) సీఏ ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. తమ రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబరు వివరాలను https://icai.nic.in వెబ్‌సైట్‌లో నమోదు చేయడం ద్వారా స్కోరు కార్డులతో పాటు మెరిట్ జాబితాలను పొందొచ్చని అధికారులు తెలిపారు. మే నెలలో నిర్వహించిన సీఏ ఫౌండేషన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 551 కేంద్రాల్లో 82,662 మంది హాజరయ్యారు. వీరిలో కేవలం 12,472 మంది (15.09శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షల్లో బ్రిందా అగర్వాల్ (గాజియాబాద్) జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకుతో సత్తా చాటగా.. యద్నేష్ రాజేశ్ నర్కర్ (ముంబయి), శార్దూల్ శేఖర్ విచారే (ఠాణె) రెండు, మూడు ర్యాంకుల్లో మెరిశారు.

✦ సీఏ ఇంటర్ పరీక్షల్లో దిశ ఆశీష్ (ముంబయి) తొలి ర్యాంకుతో సత్తా చాటగా.. దేవిదాన్ యశ్ సందీప్ (ఔరంగాబాద్) రెండో ర్యాంకు, యామిష్ జైన్ (జైపుర్), నిలయ్ డంగీ (ఉదయ్‌పుర్) మూడో ర్యాంకులో నిలిచారు.

✦ సీఏ ఫైనల్ పరీక్షల్లో రాజన్ కబ్రా(ముంబయి) జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు, నిషిత బోత్రా (కోల్‌కతా), మానవ్ రాకేశ్ షా (ముంబయి) మూడో ర్యాంకు సాధించారు.

సమాచారం కోసం.. రూ.80 వేలు చెల్లింపు

- 40 వేల పేజీలతో సమాధానం..



ఈటీవీ భారత్: ప్రజారోగ్య శాఖకు సంబంధించిన వివరాల కోసం హరియాణాకు చెందిన ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 15 అంశాలపై సమాచారం కావాలని కోరారు. ఇందుకోసం ఆయన రూ.80 వేలు కట్టారు. అయితే.. అధికారుల నుంచి 40వేల పేజీల సమాధానం రావడంతో ఆయన అవాక్కయ్యాడు. అయినా.. వివరాలు అసంపూర్తిగా ఉండటంతో బాధితుడు ప్రధాన సమాచార కమిషనర్ కోర్టును ఆశ్రయించారు. కురుక్షేత్రలోని సెక్టార్ 13లో బుక్ డిపో నడుపుతున్న పంకజ్ అరోరా సమాచారం నిమిత్తం జనవరి 30న ప్రజా ఆరోగ్య శాఖకు ఆర్టీఐ చట్టం కింద కోరారు. వివిధ టెండర్ల ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తోందా? అని లేఖలో పేర్కొన్నారు. అంటే 2023-25 వరకు ఆ శాఖలో ఎన్ని టెండర్లు జారీ చేశారు? ఎంత మంది కాంట్రాక్టర్లకు లైసెన్స్‌లు జారీ చేశారు? ఎంత మంది శాశ్వత ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు, కాంట్రాక్టుపై పనిచేస్తున్నారు? ఆదాయం ఎంత మేరకు వచ్చింది? తదితర వివరాలను అడిగారు. ఫిబ్రవరి 3న ఆ శాఖకు రూ. 85 వేలు డిపాజిట్ చేశానని పంకజ్ చెప్పారు. అధికారులు దాదాపు 40 వేల పేజీల్లో సమాధానం పంపగా.. అందులో సగం అనవసర సమాచారం ఉందని పంకజ్ పేర్కొన్నారు.

ఆయుధాలు వదిలేయాలంటే ఇజ్రాయెల్ వైదొలగాల్సిందే: హెజ్‌బొల్లా

బీరుట్: దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ వైదొలగి, గగనతల దాడుల్ని నిలిపివేసేవరకు తాము ఆయుధాలు వదిలిపెట్టేదే లేదని హెజ్‌బొల్లా నేత నయీం కసెం స్పష్టంచేశారు. మొహర్రం సందర్భంగా ఆదివారం బీరుట్ దక్షిణ శివార్లలో జరిగిన కార్యక్రమంలో వేలమందిని ఉద్దేశించి ఆయన వీడియో సందేశం వెలువరించారు. ఇజ్రాయెల్ దళాలు తమపై దురాక్రమణకు దండెత్తి వస్తుంటే, తమ భూభాగాల్లోకి చొరబడి ప్రాణాలు తీస్తుంటే ఏమీ చేయకుండా ఎలా ఉండగలమని ప్రశ్నించారు. లెబనాన్‌లో ఆక్రమణకు చట్టబద్ధత కల్పించడానికి చేయూతనిచ్చేది లేదన్నారు. ఆయుధాలు లేకపోతే ఇజ్రాయెల్‌ను ఎలా నిలువరించగలమని ప్రశ్నించారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 38 మంది గాజా వాసుల మృతి

గాజా: ఇజ్రాయెల్ జరిపిన గగనతల దాడుల్లో కనీసం 38 మంది మృత్యువాత పడ్డారని గాజాలోని ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో గాజాలో 130 లక్ష్యాలపై దాడులు నిర్వహించామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సోమవారం చర్చించడానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు బయల్దేరిన నేపథ్యంలో ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. ఇజ్రాయెల్ వరుస దాడులతో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పంద ప్రయత్నాల్లో కదలిక వచ్చినట్లు కనిపిస్తోంది.



ఇజ్రాయెల్ బాంబు దాడులతో గాజాలోని ఓ ప్రాంతంలో ఆవరించిన పొగ

రైలు వెళుతుండగా.. స్లీపర్ల మధ్య బాలుడు!



ఇంటర్నెట్ డెస్క్: పెద్దలు, పిల్లలు అనే తేడా లేకుండా ప్రాణాలు పణంగా పెట్టి రీల్స్ చిత్రీకరిస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో పెరుగుతూనే ఉన్నాయి. ఒడిశాలోని బౌద్ జిల్లా పురుణాపాణి రైల్వేట్రాకుపై ముగ్గురు మైనర్లు చేసిన వీడియో గగుర్పాటు కలిగిస్తోంది. ఓ బాలుడు ట్రాకుపై ఉన్న స్లీపర్ల మధ్యలో పడుకోగా.. అతడి స్నేహితులు దాన్ని ఫోనులో చిత్రీకరించడం మొదలుపెట్టారు. రైలు వెళ్లిన తర్వాత బాలుడు పైకి లేచి ఫొటోలకు పోజులిచ్చాడు. ఈ వీడియో వైరల్ కావడంతో రంగంలోకి దిగిన పోలీసులు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తన మీదుగా రైలు వెళ్తున్నప్పుడు గుండె వేగంగా కొట్టుకుందని, బతుకుతానని అనుకోలేదని ఆ బాలుడు చెప్పడం గమనార్హం.

ట్యాక్సీ డ్రైవర్లే లక్ష్యం.. 25 ఏళ్లకు సీరియల్ కిల్లర్ అరెస్టు



దిల్లీ: ట్యాక్సీలను అద్దెకు తీసుకోవడం.. డ్రైవర్లను చంపేసి మృతదేహాలను అటవీ ప్రాంతాల్లో విసిరేయడం.. ఆ వాహనాలను నేపాల్ సరిహద్దులో విక్రయించడం.. ఇలా పలు కిరాతక నేరాలకు పాల్పడిన ఓ సీరియల్ కిల్లర్‌ను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 25 ఏళ్లుగా చిరునామాలు మార్చి పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న అజయ్ లాంబా అనే నేరస్థుడిని ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. అజయ్ లాంబా అలియాస్ బన్సీ (49) దిల్లీ, ఉత్తరాఖండ్‌లలో నాలుగు దోపిడీ, పలు కిరాతక హత్యకేసుల్లో నిందితుడు. దిల్లీలోని కృష్ణానగర్‌కు చెందిన అజయ్ ఆరో తరగతితో చదువు మానేసి నేరాల బాట పట్టాడు. దిల్లీ, హల్ద్వానీ, అల్మోరా, చంపావత్‌లలో అతడిపై దోపిడీ, హత్యకేసులు నమోదైనప్పటికీ.. ఈ కేసుల్లో ఏనాడూ అరెస్టు కాలేదు. 2008 నుంచి 2018 వరకు తన కుటుంబంతో నేపాల్‌లో నివాసం ఉన్నాడు. ఆ తర్వాత దేహ్రాదూన్‌కు మకాం మార్చాడు. 2020లో డ్రగ్స్ రవాణా దందాలోకి ప్రవేశించాడు. గతంలో రెండుమార్లు అరెస్టు కాగా, రెండు కేసుల్లోనూ బెయిలుపై బయటకు వచ్చాడు. ఈ క్రమంలో దిల్లీ పోలీసులు ప్రత్యేక ఆపరేషను నిర్వహించి అజయ్ లాంబాను అరెస్టు చేసినట్లు నేరవిభాగ డీసీపీ ఆదిత్య గౌతం తెలిపారు.

గుజరాత్‌లో 700 మెగావాట్ల అణు రియాక్టర్లకు లైసెన్సు

- మంజూరు చేసిన ఏఈఆర్‌బీ

దిల్లీ: గుజరాత్‌లోని కాక్రాపార్ అణు విద్యుత్ కేంద్రం (కేపీపీఎస్)లో రెండు స్వదేశీ ప్రెజరైజ్డ్ హెవీవాటర్ రియాక్టర్లకు భారత అణుశక్తి నియంత్రణ బోర్డు (ఏఈఆర్‌బీ) లైసెన్సు మంజూరు చేసింది. ఒక్కో రియాక్టర్ సామర్థ్యం 700 మెగావాట్లు. ఇందులో కేపీపీఎస్-3 రియాక్టర్ 2023 ఆగస్టులో పూర్తి సామర్థ్యంతో వినియోగంలోకి వచ్చింది. కేపీపీఎస్-4 గత ఏడాది అందుబాటులోకి వచ్చింది. వీటి డిజైన్, భద్రత తదితర అంశాలపై సమీక్ష జరిపిన ఏఈఆర్‌బీ తాజాగా లైసెన్సులు జారీ చేసింది. 700 మెగావాట్ల సామర్థ్యంతో కలిగిన ప్రెజరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లలో ఇవి తొలి స్వదేశీ రియాక్టర్లు. అందువల్ల లైసెన్సింగ్ ప్రక్రియలో అనేక అంశాలను క్షుణ్నంగా తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో 220 మెగావాట్లు, 540 మెగావాట్ల సామర్థ్యమున్న 15 ప్రెజరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లు ఉన్నాయి.

వసుంధర

vasundhara@eenadu.in

చాక్లెట్... చాలామంది చిన్ననాటి జ్ఞాపకాల్లో భాగం. బాగా నచ్చిందనుకోండి... భిన్న రకాల్నీ రుచి చూడాలనుకుంటాం. అపర్ణ గొర్రెపాటి కూడా అంతే! అయితే ఆమె రుచిని ఆస్వాదించడానికే పరిమితం కాలేదు. కొత్తవాటిని సృష్టించి ఇతరులు ఆస్వాదించేలా చేయాలనుకున్నారు. అంతేనా చాక్లెటీర్‌గా విదేశాల్లోనూ గుర్తింపు పొందారు. ఈ తొలి తరం వ్యాపారవేత్తను 'వసుంధర' పలకరించగా తన గురించి పంచుకున్నారిలా...

చాక్లెట్ నాకో భావోద్వేగం!


అపర్ణ

చాక్లెట్లు, క్యాండీలంటే ఇష్టపడని అమ్మాయి ఉంటుందా? నేనూ అంతే! అన్నీ ప్రయత్నించేదాన్ని. బంధువుల్లో ఎవరైనా విదేశాలకు వెళ్లొస్తే చాక్లెట్లు తెచ్చేవాళ్లు. వాటి రుచి, ఫ్లేవర్లు మనకు దొరికే వాటితో పోలిస్తే భిన్నంగా తోచేవి. అయితే తయారీ ప్రయత్నించాలనుకున్నది మాత్రం మా బాబుకోసం. మార్కెట్‌లో దొరికేవి అంతగా సంతృప్తి ఇవ్వకపోయేసరికి తయారీలో శిక్షణ తీసుకున్నా. మాది హైదరాబాద్. కుటుంబంలో అందరూ డాక్టర్లు, ప్రొఫెసర్లు, రైటర్లు, లాయర్లే. నేనూ వాళ్ల బాటలోనే నడుస్తా అనుకున్నారు. కానీ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్‌నయ్యా. కార్పొరేట్ ఉద్యోగులకు కమ్యూనికేషన్, లీడర్‌షిప్, టీమ్ బిల్డింగ్... వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చేదాన్ని. ఖాళీ సమయంలో చాక్లెట్ తయారీ నేర్చుకునేదాన్ని. ఎంతగా నచ్చిందంటే సంబంధిత కోర్సులన్నీ చేయాలనిపించింది. ముంబయి, ఫ్రాన్స్‌ల్లో ప్రొఫెషనల్ కోర్సులూ చేశా. ఫ్రాన్స్‌లో వంద ఏళ్లనాటి ప్రముఖ సంస్థలోనూ, బెల్జియం, అమెరికాల్లో ప్రముఖ మాస్టర్ షెఫ్‌లతోనూ పనిచేశా. ఈ అనుభవంతో సొంత సంస్థను స్థాపించాలని హైదరాబాద్‌కి వచ్చా. నా లక్ష్యం స్వచ్ఛమైన చాక్లెట్ కదా... అందుకే ఆ అర్థం మెచ్చేలా నా సంస్థకు 'జుకి' అని పేరు పెట్టా.

అందుకున్న పురస్కారాలెన్నో!

వ్యాపారానికి కొత్త. ప్రతిదీ నేర్చుకోవాల్సిందే. రా మెటీరియల్ సమకూర్చుకోవడం, మార్కెటింగ్, రిటైలింగ్ వంటివన్నీ అవగాహన తెచ్చుకోవడం అంత సులువు కాలేదు. దీనికితోడు మేం సంస్థ స్థాపించగానే కొవిడ్. భవిష్యత్తేంటన్న భయం మామూలే. కానీ వెంటనే తేరుకుని ఆన్‌లైన్ సేవలు మొదలుపెట్టాం. ఈ విషయంలో మా బృందం నా వెన్నంటే నిలిచింది. కాబట్టే, నిలదొక్కుకోగలిగాం. చాక్లెట్ నా దృష్టిలో ఓ భావోద్వేగం, వేడుక, కళాఖండం... అందుకే ఫ్లేవర్లు, దాని రూపురేఖలు, వాడే పదార్థాలు, బ్రెడ్, డెజర్ట్‌ల్లో వేటితో జత చేయాలి... ఇలా ప్రతిదానిలో ప్రయోగాలు చేస్తుంటా. కేవలం తయారీ, డెజర్ట్‌లు, పేస్ట్రీల మెనూ సిద్ధం చేయడం, ప్రెజెంటేషన్‌పై దృష్టి పెట్టడమే కాదు, మా చాక్లెట్లు, ఉత్పత్తుల గురించి వినియోగదారులకు పరిచయం చేస్తుంటా. ఎప్పటికప్పుడు వాళ్ల నుంచి ఫీడ్‌బ్యాక్‌నీ తీసుకుంటా. కాబట్టే, గ్లోబల్ లీడర్స్ సమిట్‌లో జుకి 'వరల్డ్స్ బెస్ట్ ఎమర్జింగ్ బ్రాండ్స్' పురస్కారం దక్కించుకుంది. 'టైమ్స్' నుంచి 2021-24 వరకు వరుసగా బెస్ట్ చాక్లెటీర్ అవార్డునీ అందుకున్నా. ఆంత్రప్రెన్యూర్ ఆఫ్ ద ఇయర్, విమెన్ అచీవర్, విమెన్ ఎంపవర్‌మెంట్ లీడర్‌షిప్ సహా ఎన్నో పురస్కారాలూ వరించాయి.

తిరిగి ఇవ్వాలనీ...

నా ప్రయాణమేమీ సులువు కాదు. ఏళ్ల అభ్యాసం, ఎన్నో ప్రయోగాలు, వైఫల్యాలు... ఇవన్నీ దాటుకుంటూ ముందుకుసాగా. అందుకే నాలా చాక్లెట్ల తయారీ, బేకింగ్ మీద ఆసక్తి ఉన్నవారికోసం ఏదైనా చేయాలనుకున్నా. '100 ఫోల్డ్స్ అకాడమీ' ప్రారంభించి శిక్షణనిస్తున్నా. ఆరోగ్యకరమైన, విలువలతో కూడిన నిపుణులను తయారు చేయడం నా ఉద్దేశం. దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లడం, జుకిని విస్తరించడం... భవిష్యత్ లక్ష్యాలు. ఒక్కోసారి వెనక్కి చూసుకున్నప్పుడు నచ్చింది చేయాలనిపించినప్పుడు వెంటనే ధైర్యంగా చేయాల్సింది అనిపిస్తుంటుంది. అందుకే ఈ తరానికి నచ్చితే తప్పక ప్రయత్నించమని చెబుతా. అలాగే, నేర్చుకోవడానికీ... నేర్చుకుంది మర్చిపోయి, తిరిగి కొత్తది నేర్చుకోవడానికీ ఎప్పుడూ సిద్ధంగా ఉండండి. సానుకూలమైన వ్యక్తులు మీ చుట్టూ ఉండేలా చూసుకోండి. కానీ మిమ్మల్నే మీరు నమ్మండి. వైఫల్యాలు వస్తాయి. అలాగని ఆగొద్దు. వాటిని పాఠాలుగా తీసుకుంటూ ముందుకే సాగండి. అప్పుడే అసలైన విజయాలు పరిచయమవుతాయనీ సలహానిస్తుంటా.





మాడీస్... ఊటీలోని 'ఆల్ విమెన్' చాక్లెట్ తయారీ ఫ్యాక్టరీ ఇది. ప్రొడక్షన్, ప్యాకేజింగ్, సేల్స్ అన్నింటినీ మహిళలే చేస్తారు. అంతేకాదు, అందరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో చాక్లెట్లన్నీ శాకాహార పదార్థాలతో తయారుచేస్తారట.



మీకు తెలుసా!

అంతర్జాతీయ కోకో ఆర్గనైజేషన్ తాజా అధ్యయనం ప్రకారం... పశ్చిమ ఆఫ్రికాలోని కోకో రైతుల్లో దాదాపు 40 శాతం మంది మహిళలు ఉన్నారు. అంతేకాదు, ప్రపంచ వ్యాప్తంగా బీన్ టు బార్ చాక్లెట్ తయారీదారుల్లో 57 శాతం మంది మహిళలేనట.

ఆ రుచే... కెరియర్‌గా!

చాక్లెట్ రుచి ఎలా ఉంటుంది అంటే, 'తియ్యగా'... అనేస్తాం మనం. కానీ, పూనమ్ చోర్డియాను అడిగి చూడండి దాని అసలు రుచేంటో, నాణ్యత ఏంటో ఇట్టే చెప్పేస్తారు. అదెలా అంటారా? మనదేశంలోనే మొట్టమొదటి సర్టిఫైడ్ చాక్లెట్ టేస్టర్ ఈవిడే మరి. తన కథ ఏంటో, ఈ భిన్నవృత్తిని ఎలా ఎంచుకున్నారో తెలుసుకుందామా!


పూనమ్

చెన్నైలో పుట్టిన పూనమ్ చోర్డియాకు చిన్నప్పటి నుంచీ చాక్లెట్లంటే చాలా ఇష్టం. కళ్లు మూసుకుని కూడా ఏ బ్రాండ్ ఏంటో చెప్పేసేది. ఆ నైపుణ్యాన్ని కుటుంబ సభ్యులు సరదాగా చూసేవారట. కానీ, పూనమ్ మాత్రం దాన్ని సీరియస్‌గా తీసుకుని కెరియర్‌ని నిర్మించుకోవాలనుకుంది. చదువయ్యాక నితిన్ చోర్డియాతో వివాహమైంది. ఆపై ఇద్దరూ కలిసి యూరప్ వెళ్లారు. ఇద్దరికీ స్వతహాగా చాక్లెట్ల మీద ఉన్న ఇష్టంతో అక్కడ దాని గురించి మరింతగా తెలుసుకోవడం మొదలుపెట్టారు. స్విట్జర్లాండ్, బెల్జియం వంటి దేశాల్లో ఉన్న బీన్ టు బార్ చాక్లెట్ టెక్నాలజీతో పాటు వాటి రుచి, టెక్స్చర్ వంటివి పూనమ్‌ని బాగా ఆకర్షించాయి. దాంతో చాక్లెట్ తయారీని వ్యాపారంగా ఎంచుకోవాలనుకున్నారు. ఇందులో భాగంగానే యూకేలోని 'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చాక్లెట్ అండ్ కోకో టేస్టింగ్'లో చేరారు. అక్కడ కోర్సు పూర్తి చేసి భారతదేశపు మొట్టమొదటి మహిళా సర్టిఫైడ్ చాక్లెట్ టేస్టర్‌గా గుర్తింపు పొందారు. అలాగని వాటి రుచి చూడటం మాత్రమే కాదు... నాణ్యమైన ముడిసరకు సేకరించడం, చాక్లెట్ తయారుచేయడం, అత్యుత్తమమైనది ఎంపిక చేయడం, ప్రిజర్వేషన్, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్... ఇలా వివిధ దశల్లో టేస్టర్‌గా పూనమ్ పనిచేస్తున్నారు.

సొంత బ్రాండ్...

మనదేశంలో చాక్లెట్ డిమాండ్‌కి తగినట్లు తయారీ లేకపోవడం గమనించాక 2015లో చెన్నైలో 'కోకోశాల' పేరుతో శిక్షణ సంస్థను స్థాపించారు. ఇది ఆసియాలోనే తొలి బీన్ టూ బార్ చాక్లెట్ స్కూల్. ఇక్కడ చిన్న వ్యాపారులు, హోమ్ బేకర్లు, ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు చాక్లెట్ తయారీ టేస్టింగ్, సెన్సరీ అనాలిసిస్ వంటి శిక్షణలు అందిస్తున్నారు. ఇప్పటి వరకూ వేలమందికి శిక్షణ ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అనేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు.

హ్యాండ్‌మేడ్ చాక్లెట్...

పూనమ్ తన సొంత బ్రాండ్ ఎన్‌కాంటే చాక్లెట్స్ ద్వారా హ్యాండ్‌మేడ్ క్రియేటివ్ చాక్లెట్స్‌ని రూపొందించడం ప్రారంభించారు. కాఫీ ఇన్‌ఫ్యూజ్డ్ చాక్లెట్లు, ఫ్లోరల్, ఫ్రూటీ నోట్స్, తేనె, దాల్చిన చెక్క... వంటి పదార్థాలతో తయారుచేసిన ప్రత్యేకమైనవి ఎన్నో ఉన్నాయి. వీటికి విదేశాల్లోనూ డిమాండ్ ఉంది. ఆపై భర్తతో కలిసి పర్యావరణహిత చాక్లెట్ కోకాట్రైట్ బ్రాండ్ తీసుకొచ్చారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి జీరోవేస్ట్ బీన్ టు బార్ చాక్లెట్ బ్రాండ్. ప్యాకేజింగ్ కోసం కోకో షెల్స్, రీసైకిల్డ్ కాటన్ వంటివి ఉపయోగిస్తారు.

అంకురాలతో దూసుకెళ్తూ...

చాక్లెట్ అంటే అమ్మాయిలే గుర్తొస్తారు. ఇదిస్తే చాలు కోపం, బాధ పక్కన పెట్టేసి చిరునవ్వు చిందించేస్తారు! అలాంటి వాటి గురించి వారికి కాక ఇంకెవరికి గొప్పగా తెలుస్తుంది? దీనికి రుజువే వీళ్ల ప్రయాణాలు. చాక్లెట్ రంగంలో దూసుకెళ్తున్న అలాంటి కొందరిని మీరూ కలుసుకోండి.



తాతకి వారసురాలు: జెబా కోహ్లి

ఆసియాలోనే ప్రతిష్ఠాత్మక చాక్లెట్ సంస్థను స్థాపించాలన్నది జెబా వాళ్ల తాతయ్య కల. అందుకే దాదాపు ఎనిమిది దశాబ్దాల క్రితం 'ఫాంటైజ్ ఫైన్ చాక్లెట్స్' ప్రారంభించారాయన. ఆర్థికంగా వెనకబడిన వారికి ఇందులో పనిచేసే అవకాశాన్ని కల్పించాలన్న ఆలోచన జెబాకి నచ్చింది. దీంతో స్కూలు పూర్తవగానే సంస్థకు వెళ్లేవారు. ఈమెది ముంబయి. తాత, అమ్మ సంస్థని నడిపిస్తోంటే ఆసక్తిగా చూసేవారు. 'ఏ కెరియర్ ఎంచుకున్నా అకౌంటింగ్‌నీ నేర్చుకో' అన్న అమ్మ సలహాతో దాన్ని నేర్చుకున్నారు. తీరా సంస్థ బాధ్యత తీసుకోమంది అమ్మ. జెబానేమో ఫిజిక్స్ విద్యార్థిని. కానీ తాత, అమ్మ కోరిక కాదనలేక చాక్లెట్ కోర్సుల్లో చేరారు. అక్కడ దానిపై మనసు పారేసుకున్న ఆమె ప్రయోగాలెన్నో చేశారు. పోషకాలను జోడించారు. ఈ క్రమంలో దేశంలోనే ప్రతిష్ఠాత్మక చాక్లెట్ సంస్థల్లో ఒకదానిగా ఫాంటైజ్ ఫైన్ చాక్లెట్లను నిలపడమే కాదు, అంతర్జాతీయ వేదికలపైనా ప్రశంసలు, అవార్డులు దక్కేలా చేశారు జెబా. ఈ విజయవంతమైన వ్యాపారవేత్త టెడెక్స్ స్పీకర్, రచయిత కూడా.

దేశీ రకాలు అందించాలని: స్వాతి కల్లెగుండి



చక్కెర, రసాయనాలు, ప్రిజర్వేటివ్స్... వీటికి చాక్లెట్లూ మినహాయింపు కాదు. అలాగని దూరంగానూ ఉండలేరు. మరి వీటిని మనస్ఫూర్తిగా తినేలా అందిస్తే ఎలా ఉంటుంది అనుకున్నారు స్వాతి. ఈమెది కర్ణాటకలోని బెట్టంపాడి. 2020లో భర్తతో కలిసి 'అనుత్తమ' పేరుతో చాక్లెట్ల తయారీ ప్రారంభించారు. అనుత్తమ అంటే అత్యుత్తమమైనది అని అర్థమట. ఫామ్‌తో ఒప్పందం చేసుకుని మరీ రసాయనాలు లేకుండా పండించిన కోకోని తయారీకి తీసుకుంటున్నారు. తియ్యదనానికి చక్కెరకు బదులు బెల్లం, కర్జూర, కొబ్బరి షుగర్లను ఉపయోగిస్తున్నారు. ప్రిజర్వేటివ్లకు తావులేని దేశీ డార్క్ చాక్లెట్లను అందిస్తున్నారు. స్వాతిది వ్యవసాయ నేపథ్యం. వాళ్ల కుటుంబం కోకో పండించేది. ఏదైనా కొత్తగా చేయాలనుకున్నప్పుడు ఈ ఆలోచన రావడంతో శిక్షణ తీసుకుని మరీ తయారీ ప్రారంభించారు. బెల్లం, అల్లం, మిరియాలతో చేసిన వీళ్ల 'స్పైసీ ట్యాంగ్' రకం చాక్లెట్‌కి అంతర్జాతీయ స్థాయిలో అవార్డూ వచ్చింది.

మెట్రోస్టేషన్లో స్టాల్ నుంచి: అనువా కక్కర్



చల్లని వాతావరణం. మెట్రో రైలు రావడానికి ఇంకా సమయం ఉంది. హాట్ చాక్లెట్ తాగాలనిపించింది అనువాకి. ఈమెది ఆగ్రా. ఉద్యోగరీత్యా గురుగ్రామ్‌కి వచ్చింది. దగ్గర్లో స్టాల్ కనిపించడంతో కొన్నది కానీ... ధర చూసే కంగారు పడింది. తన జీతానికి నెలలో వేళ్ల మీద లెక్కపెట్టే అన్నిసార్లే తాగగలను అనుకుంది. కానీ మనసేమో దానికేసి లాగుతోంటే ఇంట్లోనే హాట్ చాక్లెట్ తయారీని ప్రయత్నించాలనుకుంది. సరైన మిక్స్‌లే లేవు. ఉన్నా విదేశీ బ్రాండ్లవే. అప్పుడే 'నేనే తయారుచేస్తే' అన్న ఆలోచన వచ్చింది అనువాకి. ప్రయోగాలెన్నో చేసింది. వైఫల్యాలు ఎదురైనా ప్రయత్నించింది. చివరకు విజయవంతమైంది. వినియోగదారులకు నచ్చుతుందా అని పరీక్షించడానికి మెట్రో స్టేషన్‌లోనే అమ్మకానికి పెట్టింది. అందుబాటు ధరలో ఉంచేసరికి గంటలోనే స్టాల్ ఖాళీ అయ్యింది. ఇది ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో రూ.20 వేల పెట్టుబడితో 'టిగిల్' ప్రారంభించింది. ఇదో హాట్ చాక్లెట్ పౌడర్ల సంస్థ. తొలి స్వదేశీ సంస్థగా గుర్తింపు పొందడమే కాదు తక్కువ వ్యవధిలోనే రూ.కోట్ల వ్యాపారంగా మారింది. షార్క్‌ట్యాంక్ నుంచి పెట్టుబడులూ అందుకుంది 23ఏళ్ల అనువా.

లాభాలు 'కోకో'ల్లలు!



మూడ్ బాగోలేదంటే అమ్మాయిలకి గుర్తొచ్చేది చాక్లెట్. ఏడ్చే పిల్లలను ఊరడించాలన్నా ఇదే ఆయుధం. చాక్లెట్ తినని ప్రెగ్నెన్సీనీ ఊహించుకోలేం. ఒక్కో పీస్ తీసుకుని తింటుంటే ఉండే ఆ ఆనందమే వేరు మరి... అంతేనా, దీనివల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు బోలెడున్నాయంటున్నాయి పరిశోధనలు. అవేంటో చూసేద్దామా...

గర్భిణులకు...

డార్క్ చాక్లెట్ మితంగా తినటం వల్ల గర్భిణుల్లో ప్రి-ఎక్లాంప్సియా ప్రమాదం తగ్గుతుందని యేల్ యూనివర్సిటీ పరిశోధనలు చెబుతున్నాయి. ఎండార్ఫిన్లు, సెరటోనిన్ స్థాయులు పెరిగేలా చేసి ఒత్తిడినీ తగ్గిస్తుందట. ఇది కడుపులో ఉన్న శిశువు యాక్టివిటీ పెరిగేలానూ చేస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధనలూ చెబుతున్నాయి. డార్క్ చాక్లెట్‌లో అధికంగా ఉండే ఐరన్ ప్రెగ్నెన్సీలో హీమోగ్లోబిన్ స్థాయులు సమంగా ఉండేలా చేస్తుందట. అయితే, క్యాడ్మియం, లెడ్ లాంటి భార లోహాలు లేనివి చూసుకుని ఎంచుకుంటే సరి.

పిల్లలకు...

డార్క్ చాక్లెట్‌లోని ఫ్లేవనాయిడ్లు మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపుతాయట. జ్ఞాపకశక్తినీ, ఏకాగ్రతనీ అందిస్తాయి. అందులోనూ, కోకోలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉండటం వల్ల క్యావిటీలు కలిగిస్తాయన్న బెంగా అక్కర్లేదు. అయితే, అందులో దీని శాతం కనీసం 70కి తగ్గకుండా చూసుకుంటే మేలు.

అమ్మాయిలకు..

ఎత్నోగ్రాఫిక్ రిసెర్చ్ ప్రకారం... చాక్లెట్‌ను సెల్ఫ్‌కేర్‌లో భాగంగా, సెన్సరీ ఎంజాయ్‌మెంట్‌గా తీసుకోవటం వల్ల అమ్మాయిల్లో ఉండే మూడ్ స్వింగ్స్ తగ్గుతాయట. రుతుక్రమ సమయంలో వచ్చే పొత్తి కడుపునొప్పి, యాంగ్జయిటీ లక్షణాల నుంచి ఉపశమనం లభిస్తుంది. డార్క్ చాక్లెట్ తినే యుక్త వయసు పిల్లల్లో బీఎమ్ఐ తక్కువగా ఉంటోందట.

జ్ఞాపకంగా... తియ్యని వేడుక







చాక్లెట్ అంటే చిన్నపిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ ఇష్టమే! పుట్టినరోజుకైనా, పెళ్లిరోజుకైనా, చదువుల్లో ఫస్ట్ వచ్చినా, స్నేహితులకు గిఫ్ట్ ఇవ్వాలన్నా గుర్తొచ్చేవి చాక్లెట్లే. అందుకే ఇవి కూడా కొత్త అవతారమెత్తాయి. చిన్నారుల నుంచి అమ్మల వరకూ వారి మనసుని గెలుచుకునేలా, సరికొత్త లుక్‌లో కనువిందు చేస్తున్నాయి. పిల్లల కోసం చిట్టిచిట్టి రోబోలు, చిన్నిచిన్ని గుర్రాలు, బిల్డింగ్ బ్లాక్స్‌గా మారిపోతున్నాయి. లిప్‌స్టిక్, హ్యాండ్ బ్యాగ్ అంటూ ఫ్యాషన్ యాక్సెసరీస్‌గా అమ్మాయిల మనసుని దోచుకుంటూ మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. సాధారణంగా చాక్లెట్లను కోకో, పాలు, చక్కెర పొడులతో తయారు చేస్తారు. కానీ, చాక్లెట్ ఆర్టిస్టులు వీటికి కాస్త సృజనాత్మకత, ఎడిబుల్ రంగులను జోడించి పిల్లల్నీ, పెద్దల్నీ ఆశ్చర్యపరిచేలా భిన్నమైన రూపాలు, వర్ణాల్లోనూ డిజైన్ చేస్తున్నారు. మరి ఈ 'చాక్లెట్ డే'కి మీకు ఇష్టమైన వారి మనసుకి ఏది నచ్చుతుందో చూసి నోరు తీపి చేసేయండి మరి!

చెల్లిని మార్చేదెలా..?

నాకు 30 ఏళ్లు. పెరిఫ్రల్ న్యూరోపతి సమస్య ఉంది. దీనివల్ల ఏ పనీ చెయ్యలేను. మూడేళ్ల కిందట నాన్న చనిపోయారు. అప్పట్నుంచీ చెల్లి స్వభావంలో చాలా మార్పు వచ్చింది. తనకు గర్వం ఎక్కువ. ఎవరైనా ఏమైనా అంటే వారిని మానసికంగా, శారీరకంగా హింసించడమే లక్ష్యంగా పెట్టుకుంటుంది. నా విషయంలోనూ అంతే. ఈ మధ్య మా ఇద్దరికీ గొడవలు మరీ ఎక్కువ అవుతున్నాయి. అనారోగ్యంవల్ల నేను కొన్ని పనులు చేయలేనని తెలిసీ అవి నేనే చేయాలంటోంది. తప్పని చెప్పిన అమ్మను కొట్టడానికి వెళ్తోంది. తనని మార్చేదెలా? – ఓ సోదరి

అక్కాచెల్లెళ్లు అన్నాక గొడవలూ సహజం. ఇంట్లో పెద్దవాళ్లు ఎప్పటికప్పుడు వీటిని సర్దిచెబుతూ, రాజీ కుదురుస్తుంటారు. ముఖ్యంగా కూతుళ్ల విషయంలో ఈ బాధ్యతల్ని నాన్నే తీసుకుంటారు. కానీ మీ విషయంలో ఇది పెద్ద లోటుగా మారింది. అందులోనూ మీరు చెబుతున్న దాన్నిబట్టి చూస్తే మీ చెల్లికి మానసిక పరిపక్వత లేదని అర్థమవుతోంది. అందుకే ఆమె మీ అనారోగ్యాన్ని అర్థం చేసుకోలేకపోతోంది. మీతో గొడవలు పడుతోంది. సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తోన్న అమ్మ మీద చేయి చేసుకుంటోంది. మీ బంధువుల్లో పెదనాన్న, చిన్నాన్న, అన్నయ్య... ఇలా ఎవరి మాటైనా వింటే వారితో చెప్పించి చూడండి. ఆమెను తప్పుపట్టినట్లు కాకుండా... పరిస్థితి వివరించేలా మాట్లాడమనండి. లేదూ... మీకు వైద్యం చేస్తున్న డాక్టర్‌ని మీ అనారోగ్యం గురించి వివరించమనండి. అప్పుడు తను అర్థం చేసుకునే వీలుంది. మీరూ చేయగలిగినంత వరకు పనులు పంచుకోండి. కూరగాయలు తరగడం, బట్టలు ఆరబెట్టడం లాంటివి చేస్తే తనలో తప్పకుండా మార్పొస్తుంది. ఇన్ని చేసినా ఆమె పద్ధతిలో మార్పు లేదనుకుంటే సైకాలజిస్టుని కలవండి. ఆమె సమస్యను అర్థం చేసుకుని అవసరమైన థెరపీ ఇస్తారు.

డియర్ వసుంధర


డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

అందానికి చాకో!

ముఖం కాంతిమంతంగా మెరవాలన్నా... నిర్జీవంగా ఉన్న చర్మం పునరుత్తేజితమవ్వాలన్నా శరీరంలో రక్త ప్రసరణ మెరుగ్గా జరగాలి. ఇందుకు చాక్లెట్ చక్కగా తోడ్పడుతుంది. చాక్లెట్ మిశ్రమంతో ముఖానికి మర్దన చేస్తే ఈ ప్రయోజనాలు పొందవచ్చు. చాక్లెట్‌లో ఉండే కోకోవల్ల పొడిబారిన చర్మం కొత్త ఉత్తేజాన్ని సంతరించుకుంటుంది. దీన్లో ఉండే ఫ్లేవనాల్స్ చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షిస్తాయి.



✦ చర్మం పొడిబారినట్లు కనిపిస్తే చాక్లెట్ ఫేషియల్‌తో ఉపశమనం పొందొచ్చు. డార్క్ చాక్లెట్ పిగ్మెంటేషన్‌నీ, నల్లమచ్చల్నీ తగ్గించి కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది.

✦ అందంగా కనిపించాలని ముఖానికి పైపూతలు పూస్తుంటాం. ఇవి చర్మంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. డార్క్ చాక్లెట్‌లో ఉండే విటమిన్లు చర్మాన్ని హైడ్రేట్ చేసి నిగారింపు వచ్చేలా చేస్తాయి.

✦ చాక్లెట్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడి వృద్ధాప్య ఛాయలు రానీయకుండా కాపాడతాయి. ముఖానికి వాడే చాక్లెట్‌లో చక్కెర, ఇతర పదార్థాలు కలవకుండా చూసుకోవాలి. ఇందుకు అచ్చంగా డార్క్ చాక్లెట్‌ని డబుల్ బాయిల్ పద్ధతిలో కరిగించి మాత్రమే వాడాలి.

ఈనాడు సినిమా

ఈ ఏడాది ప్రథమార్ధం తెలుగు చిత్రసీమకు మిశ్రమ ఫలితాల్నే అందించింది. సంక్రాంతి చిత్రాల మెరుపులతో ఇండస్ట్రీకి అదిరే ఆరంభం దక్కినా.. ఆ తర్వాత సరైన సినిమాల్లేక వేసవి సీజనంతా వెలవెలబోయింది. ఈ మధ్యలో 'కోర్ట్', 'మ్యాడ్', 'హిట్ 3' రూపాల్లో ఒకటి రెండు హిట్లు పడినా.. వసూళ్ల పరంగా బాక్సాఫీస్‌కు కళ తెచ్చిన చిత్రాలేవీ లేవు. జూన్‌లో విడుదలైన 'కుబేర', 'కన్నప్ప' చిత్రాలు ప్రేక్షకుల్ని మళ్లీ థియేటర్ బాట పట్టించడంతో తెలుగు సినీ పరిశ్రమ కాస్త ఊపిరి పీల్చుకున్నట్లయింది. దీంతో ఇప్పుడు ద్వితీయార్ధం ఎలా సాగనుందన్న చర్చ అందరిలోనూ మొదలైంది. అయితే ఈ జులై నుంచి డిసెంబరు వరకు బాక్సాఫీస్ ముందంతా స్టార్ల సందడే కనిపించనుంది. అందులోనూ ప్రతి నెలా ఒకటికి రెండు భారీ సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతుండటం అందరిలోనూ ఆసక్తిరేకెత్తిస్తోంది.

ప్రతి నెలా.. పాన్ ఇండియా మెరుపులే!


చిరంజీవి

ఈ ద్వితీయార్ధంలో పాన్ ఇండియా బాక్సాఫీస్‌పై 'హరి హర వీరమల్లు' చిత్రంతో తొలి అడుగు వేయనున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయనకిది తొలి పాన్ ఇండియా సినిమా. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ సంయుక్తంగా తెరకెక్కించారు. 17వ శతాబ్దం నాటి మొఘలుల సామ్రాజ్యం నేపథ్యంలో చారిత్రక కథాంశంతో భారీ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైంది. పవన్ ఇందులో ధర్మం కోసం పోరాడే శక్తిమంతమైన యోధుడిగా కనువిందు చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్లకు ఇటు దక్షిణాదిలోనూ అటు ఉత్తరాదిలోనూ మంచి ఆదరణ దక్కడం.. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్ లాంటి బాలీవుడ్ తారలు దీంట్లో కీలక పాత్రల్లో సందడి చేయనుండటం సినీప్రియుల్లో దీనిపై భారీ అంచనాలే నెలకొని ఉన్నాయి. మరి పవన్ ఈ చిత్రంతో తొలి ప్రయత్నంలోనే పాన్ ఇండియా మార్కెట్‌లోనూ సత్తా చాటుతారా? లేదా? తెలియాలంటే ఈ నెల 24వరకు వేచి చూడక తప్పదు. అయితే దీని కన్నా ముందు కిరీటి రెడ్డి, శ్రీలీల జంటగా నటించిన 'జూనియర్' అనే చిత్రం కూడా పాన్ ఇండియా బరిలో అదృష్టం పరీక్షించుకోనుంది. రాధాకృష్ణ తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందన్నది ఈ నెల 18న తెలుస్తుంది.

వీళ్ల దారెటు!

ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న విడుదల తేదీల విషయంలో స్పష్టత ఇవ్వని పాన్ ఇండియా సినిమాలు తెలుగులో మరికొన్ని ఉన్నాయి. అనుష్క - క్రిష్ జాగర్లమూడి కాంబోలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'ఘాటి'. ఇది ఈ నెలలోనే థియేటర్లలోకి రావాల్సి ఉండగా.. గ్రాఫిక్స్ పనుల వల్ల మరోసారి వాయిదా పడింది. ప్రస్తుతం ఇది అక్టోబరులో తెరపైకి వచ్చే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఈ చిత్ర హక్కుల్ని అమెజాన్ ప్రైమ్ దక్కించుకున్న నేపథ్యంలో.. విడుదల తేదీ విషయంలో ఆ సంస్థ నుంచే స్పష్టత రావాల్సి ఉందని తెలుస్తోంది. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' విజయం తర్వాత అనుష్క నుంచి రానున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ ఏడాది చివర్లోనే 'విశ్వంభర'తో పాన్ ఇండియా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు చిరంజీవి. చాలా కాలం తర్వాత ఆయన నుంచి వస్తున్న సోషియో ఫాంటసీ చిత్రమిది. ఇది చిరు కెరీర్‌లోనే భారీ బడ్జెట్ సినిమా కావడం.. 'బింబిసార'తో ప్రేక్షకుల్ని మెప్పించిన వశిష్ఠ దీనికి దర్శకుడిగా వ్యవహరిస్తుండటం ఇప్పటికే దీనిపై సినీప్రియుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఇది సెప్టెంబరు లేదా అక్టోబరులో థియేటర్లలోకి వచ్చే అవకాశమున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. 'కింగ్డమ్'తో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. ఈసారికే విడుదల కావాల్సిన ఈ సినిమా నిర్మాణానంతర పనుల వల్ల ఆలస్యమైన సంగతి తెలిసిందే. దీన్ని ఈ నెలాఖరు గానీ ఆగస్టు తొలి వారంలో గానీ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ వారంలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. 'కార్తికేయ 2' విజయంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు హీరో నిఖిల్ సిద్ధార్థ్. ఇప్పుడాయన నుంచి రానున్న మరో పాన్ ఇండియా సినిమా 'స్వయంభూ'. చారిత్రక కథాంశంతో ముస్తాబవుతున్న ఈ చిత్రం ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది ఈ ఏడాది చివర్లో థియేటర్లలోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. త్వరలోనే ఈ చిత్ర విడుదలపైనా స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

సెప్టెంబరులో హోరాహోరీ..

'హను-మాన్'తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు యువ హీరో తేజ సజ్జా. ఇప్పుడాయన నుంచి రానున్న మరో పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్'. ఇది ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్. తేజ ఇందులో సూపర్ యోధగా అలరించనున్నారు. భారీ బడ్జెట్‌తో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే విడుదలైన టీజర్‌తో ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి క్రేజ్ సంపాదించుకుంది. మరి ఈ చిత్రంతో తేజ మరో పాన్ ఇండియా విజయాన్ని అందుకుంటారా? లేదా? అన్నది సెప్టెంబరు 5న తెలుస్తుంది. ఇక ఇదే నెల ఆఖరి వారంలో పవన్ కల్యాణ్ 'ఓజీ'.. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2: తాండవం' బాక్సాఫీస్ బరిలో తలపడనున్నాయి. 'సాహో' సినిమా తర్వాత సుజీత్ దర్శకత్వం నుంచి వస్తున్న చిత్రమే 'ఓజీ'. ఇందులో పవన్ శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనువిందు చేయనుండటం.. ఇమ్రాన్ హష్మీ లాంటి బాలీవుడ్ స్టార్ ప్రతినాయకుడిగా నటిస్తుండటంతో ఇప్పటికే దీనిపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇక మరోవైపు దీంతో పాటే వస్తున్న బాలయ్య తొలి పాన్ ఇండియా చిత్రం 'అఖండ 2'పైనా అదే స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి. ఇటీవల కాలంలో 'కార్తికేయ', 'హను-మాన్', 'కాంతార' లాంటి ఆధ్యాత్మిక టచ్ ఉన్న సినిమాలకు ఉత్తరాదిలో మంచి ఆదరణ లభిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అది 'అఖండ 2'కి కలిసొచ్చే అవకాశముంది. విజయవంతమైన 'అఖండ'కు కొనసాగింపుగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ సీక్వెల్ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. మరి సెప్టెంబరు 25న థియేటర్లలోకి రానున్న ఈ 'అఖండ 2', 'ఓజీ'ల్లో హిట్టు మాట వినిపించేది ఏదో చూడాలి.


బాలకృష్ణ


పవన్ కల్యాణ్

ఓవైపు 'వార్ 2'.. మరోవైపు 'కూలీ'

ఆగస్టులో రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు బాక్సాఫీస్ బరిలో తలపడనున్నాయి. అందులో ఒకటి హృతిక్ రోషన్ 'వార్ 2' కాగా.. మరొకటి రజనీకాంత్ 'కూలీ'. ఈ రెండూ వేర్వేరు పరిశ్రమలకు చెందిన సినిమాలైనప్పటికీ వీటిపై తెలుగులోనూ భారీ క్రేజ్ నెలకొని ఉంది. తెలుగు కథానాయకులు నాగార్జున, ఎన్టీఆర్‌లు వీటిలో ప్రధాన పాత్రలు పోషించడమే దీనికి కారణం. ఎన్టీఆర్ ఆయా సినిమాల్లో ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనే కనువిందు చేయనున్నట్లు తెలుస్తుండటం అందరిలోనూ ఆసక్తిరేకెత్తిస్తోంది. 'కూలీ'లో నాగ్ పూర్తి స్థాయి విలన్‌గా కనిపించనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించేసింది. 'వార్ 2'లో తారక్ పాత్ర ఎలా ఉండనుందన్నది అధికారికంగా స్పష్టత రాలేదు. అయితే సినిమాలో ఆయన పాత్ర రెండు కోణాల్లో ఆశ్చర్యపరిచే అవకాశమున్నట్లు బాలీవుడ్ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. అయితే 'వార్ 2'తో పోలిస్తే 'కూలీ'లో స్టార్ల సందడి రెట్టింపుగా ఉండనుంది. ఇందులో ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్, పూజా హెగ్డే ఇలా స్టార్ ఆకర్షణలు చాలానే కనిపిస్తున్నాయి. మరి ఈ రెండు యాక్షన్ థ్రిల్లర్లలో ప్రేక్షకుల మెప్పు పొందేది ఏది అన్నది తెలియాలంటే ఆగస్టు 14వరకు ఎదురు చూడక తప్పదు. ప్రస్తుతం వీటిపై సినీప్రియుల్లో ఉన్న అంచనాల్ని బట్టి చూస్తే ఏది హిట్ టాక్ తెచ్చుకున్నా.. వసూళ్ల పరంగా కొత్త రికార్డులు నమోదవ్వడం ఖాయమని అర్థమవుతోంది.


ఆఖర్లో అదరగొట్టేదెవరో!

'సలార్', 'కల్కి 2898ఏడీ' చిత్రాలతో పాన్ ఇండియా మార్కెట్‌లో మెరుపులు మెరిపించారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడీ వరుస విజయాల తర్వాత ఆయన నుంచి రానున్న కొత్త పాన్ ఇండియా సినిమా 'ది రాజాసాబ్'. ఇది ప్రభాస్ చేస్తున్న తొలి హారర్ కామెడీ ఎంటర్‌టైనర్. దీంట్లో ఆయన 'బుజ్జిగాడు' తరహా క్యారెక్టరైజేషన్‌తో వింటేజ్ లుక్‌లో కనిపించనుండటం మరో ఆకర్షణ. మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ సినిమా ఇప్పటికే టీజర్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది. ముఖ్యంగా ఈ చిత్రం కోసం నిర్మించిన భారీ సెట్టు సినిమాకు ప్రధాన ఆకర్షణగా మారాయి. ఇక ఇటీవల కాలంలో బాలీవుడ్‌లో హారర్ సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటం ఈ చిత్రానికి కలిసొచ్చే అవకాశముంది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ముచ్చటగా మూడో విజయాన్ని అందుకుంటారా? లేదా? తెలియాలంటే డిసెంబరు 5వరకు వేచి చూడక తప్పదు. ఇక అదే నెల చివర్లో 'డెకాయిట్'గా పాన్ ఇండియా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు యువ హీరో అడివి శేష్. 'మేజర్' లాంటి పాన్ ఇండియా విజయం తర్వాత తన నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలే నెలకొని ఉన్నాయి. మరి ఈ చిత్రంతో ఆయన మరో హిట్‌ను ఖాతాలో వేసుకుంటారా? లేదా? అన్నది డిసెంబరు 25న తెలుతుంది.


ప్రభాస్


ఎన్టీఆర్

ప్రేక్షకుల్లో ధైర్యాన్ని నింపే చిత్రం.. 'ది 100'



రాఘవ్ ఓంకార్, ఆర్కే సాగర్, డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సమాజంలో జరుగుతున్న అనేక విషయాలకి జవాబులా 'ది 100' సినిమా ఉంటుందన్నారు తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు. ఐపీసీలోని ఒక సెక్షన్‌ని ఆధారంగా చేసుకుని, కుటుంబ కథగా మలిచిన తీరు మెప్పిస్తుందని చెప్పారు. ఆయన, తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో 'ది 100' విడుదలకి ముందస్తు వేడుక జరిగింది. ఆర్కే సాగర్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. మిషా నారంగ్ కథానాయిక. ధన్య బాలకృష్ణ కీలక పాత్ర పోషించారు. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకుడు. రమేశ్ కరుటూరి, వెంకీ పూశడపు నిర్మాతలు. ఈ నెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. వేడుకలో బిగ్ టికెట్‌ని ఆవిష్కరించిన అనంతరం డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ "ఈ సినిమాని చూశా. బలమైన సందేశంతో తెరకెక్కింది. ఆత్మరక్షణ, సైబర్ నేరాల నేపథ్యంతో సాగే ఈ చిత్రం ప్రేక్షకుల్లో ధైర్యాన్ని నింపేలా ఉంటుంది" అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ "మంచి సందేశంతో... సరైన సమయంలో సరైన సినిమాని తీసిన దర్శకనిర్మాతలకి అభినందనలు. ఈ సినిమాలోని పాటలు చూడగానే తొలి రోజే థియేటర్‌కి వెళ్లాలనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారం సినిమాకి ఉంటుంది. పైరసీని అరికట్టడంలో కూడా పోలీసు అధికారులతో మాట్లాడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, ఎస్.గోపాల్ రెడ్డి, శుభలేఖ సుధాకర్, ఆర్కే సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మన సైనికుల త్యాగాలకు నివాళి... 'సేనా కీ జై'


శుభాంగి దత్

భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగాలకు హృదయపూర్వక నివాళిగా 'తన్వి ది గ్రేట్' చిత్రం నుంచి మొదటి పాట 'సేనా కీ జై'ని చిత్ర నిర్మాతలు విడుదల చేశారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం కీరవాణి స్వరపరచిన ఈ పాటను షగున్ సోధి పాడారు. కౌసర్ మునీర్ సాహిత్యమందించారు. ఈ సినిమాకి అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించారు. ఈ పాట సైనికుల నేపథ్యంలో సాగుతుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన శుభాంగి దత్ దేశం కోసం త్యాగాలు చేసిన వారిని గుర్తుచేసుకుంటూ సైనికులతో కలిసి పాడుతూ... నృత్యం చేస్తూ ఇందులో కనిపిస్తుంది. ఈ పాటలో సైనికుడిగా, ఆమె తండ్రిగా నటించిన కరణ్ టాకర్‌తో కలిసి నృత్యం చేస్తుంది శుభాంగి. పాటలో విజువల్స్ కదిలించేవిగా, దేశభక్తితో నిండి ఉన్నాయి. అనుపమ్ ఖేర్ మాట్లాడుతూ..."కీరవాణి మన కాలంలోని ప్రతిభావంతులైన కళాకారులలో ఒకరు. ఆయనను తెలుసుకోవడం నా జీవితంలో అత్యంత సుసంపన్నమైన అనుభవాలలో ఒకటి. ఆయన పుట్టినరోజు కానుకగా మా చిత్రం 'సేనా కీ జై' నుంచి ప్రత్యేకమైన పాటను విడుదల చేయడం నాకు గౌరవంగా ఉంది" అని అన్నారు. ఈ పాట ధైర్యవంతులకు ఒక గీతంగా ఉంటుంది. 2002లో వచ్చిన 'ఓం జై జగదీష్' సినిమా తర్వాత అనుపమ్ మళ్లీ ఇప్పుడు 'తన్వి ది గ్రేట్'కి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో జాకీ ష్రాఫ్, అరవింద స్వామి, బొమన్ ఇరానీ, పల్లవి జోషి, నాజర్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని ఎన్‌ఎఫ్‌డీసీతో కలిసి అనుపమ్ ఖేర్ స్టూడియోస్ నిర్మించింది. ఈ సినిమా ఈ నెల 18న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

ఆ సంస్కృతి మళ్లీ రావాలి!


ఎస్.కె.ఎన్


"ప్రేక్షకుడు థియేటర్‌కి వచ్చి సినిమాని చూసే సంస్కృతిని చంపేస్తున్నాం. ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా గ్రహిస్తే పరిశ్రమకి అంత మేలు" అంటున్నారు నిర్మాత ఎస్.కె.ఎన్. 'ఈరోజుల్లో' సినిమాతో ప్రయాణం మొదలుపెట్టిన ఆయన.. 'టాక్సీవాలా', 'బేబి' తదితర చిత్రాలతో విజయాల్ని అందుకున్నారు. ప్రస్తుతం మాస్ మూవీ మేకర్స్ పతాకంపై వరుసగా సినిమాలు నిర్మిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ది రాజాసాబ్' సినిమాకి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఎస్.కె.ఎన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

◆ "ప్రస్తుతం మాస్ మూవీ మేకర్స్ పతాకంపై వరుసగా సినిమాలు నిర్మిస్తున్నా. పెద్ద, చిన్న అనే తేడా లేకుండా మంచి కథలతో ప్రయాణం చేస్తున్నాం. సినిమాలో కంటెంట్ లేకపోతే ఇప్పుడు ప్రేక్షకుడు థియేటర్‌కి రావడం లేదు. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే బలమైన కథల్ని ఎంచుకుని సినిమాల్ని నిర్మిస్తున్నాం".

◆ "సినిమాపై ఎంతో ప్యాషన్ ఉంటే తప్ప నిర్మాతగా రాణించడం కష్టం. ఇక్కడ రూ. పది పెడితే ఇరవై వస్తుందనే ఆశతోనో, గ్లామర్‌పై ఉన్న ఆకర్షణతోనో సినీ రంగంలోకి రావొద్దనేది నా సలహా. వచ్చే నెల హిందీలో 'బేబి' రీమేక్ మొదలవుతుంది. ప్రస్తుతం 'చెన్నై లవ్‌స్టోరి'తోపాటు, సంతోశ్ శోభన్ - అలేఖ్య హారిక సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి".

◆ "ఓటీటీ వేదికల నుంచి కాకుండా... థియటర్ నుంచే డబ్బు రాబట్టుకోవాలనే ఆలోచనతో నిర్మాతలు సినిమాలు తీసినప్పుడే పరిశ్రమ, డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్ వ్యవస్థలు బాగుంటాయి. ఈమధ్య థియేటర్‌కి వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోయేసరికి భయపడిపోయి... వస్తున్న ఆ కొద్దిమందిపై మరింత భారం మోపేలా టికెట్ ధరల్ని పెంచుతున్నారు. దాంతో చాలామంది ఓటీటీ వేదికలవైపు చూస్తున్నారు. తెలుగు ప్రేక్షకుడు థియేటర్లో సినిమాని ఆస్వాదించే సంస్కృతిని పునరుద్ధరించే ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ నడుం కట్టాలి".

మరో హారర్ కథలో రాజ్‌కుమార్?


రాజ్‌కుమార్ రావ్

'స్త్రీ' చిత్రాలతో హారర్ ప్రియుల్ని మెప్పించిన రాజ్‌కుమార్ రావ్.. ఇప్పుడు 'మాలిక్' అనే గ్యాంగ్‌స్టర్‌గా తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నాడు. ఈ సినిమా ఇంకా విడుదల కాకముందే.. ఆయన తన రాబోయే ప్రాజెక్టుల కోసం చర్చలు చేస్తున్నారు. తాజాగా రాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో కరణ్ జోహార్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. దీనికి 'ది నైట్ మేనేజర్' ఫేమ్ సందీప్ మోదీ దర్శకత్వం వహించనున్నారట. "ఇంకా పేరు ఖరారు కానీ ఈ సినిమాను హారర్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దనున్నారు. భారీ స్థాయిలో ఒక ఫ్రాంఛైజీగా ఈ ప్రాజెక్టును రూపొందించడానికి సన్నాహాలు మొదలు పెట్టారు. నవంబరులో సెట్స్‌పైకి రానున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనుల్ని ఇప్పటికే ప్రారంభించారు దర్శకుడు" అని రాజ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

'లక్కీ భాస్కర్'కు సీక్వెల్


దుల్కర్ సల్మాన్

గతేడాది దీపావళికి విడుదలై బాక్సాఫీస్ ముందు భారీ విజయాన్ని అందుకున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఈ సినిమాకి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి సీక్వెల్ చేస్తానని ప్రకటించారు దర్శకుడు వెంకీ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దీనిపై స్పష్టత ఇచ్చారు. 'లక్కీ భాస్కర్'కు సీక్వెల్ తప్పకుండా ఉంటుందని చెప్పినప్పటికీ.. ఎప్పుడు సెట్స్‌పైకి తీసుకొస్తారన్నది వెల్లడించలేదు. ఈ సందర్భంగానే ప్రస్తుతం తాను దర్శకత్వం వహిస్తున్న 'సూర్య 46' (వర్కింగ్ టైటిల్) చిత్రానికి సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాల్ని వెంకీ అట్లూరి పంచుకున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఆ సినిమా అందమైన కుటుంబ కథా చిత్రంగా ఉండనుందని.. ఫ్యామిలీతో కలిసి హాయిగా చూడగలిగేలా ఉంటుందని తెలిపారు. ఇది వచ్చే ఏడాదికి థియేటర్లలోకి రానుంది.

గిన్నీ.. సన్నీ ముగించారు


మేధా శంకర్

'ట్వెల్త్ ఫెయిల్' చిత్రంతో యువతను విశేషంగా ఆకట్టుకున్న బాలీవుడ్ యువ కథానాయిక మేధా శంకర్. త్వరలో ఆమె 'గిన్నీ వెడ్స్ సన్నీ 2' చిత్రంతో తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది. మేధా, అవినాశ్ తివారీ జంటగా ప్రశాంత్ ఝా తెరకెక్కిస్తున్న చిత్రమిది. సినీ ప్రియుల్ని నవ్వుల్లో ముంచెత్తిన 'గిన్నీ వెడ్స్ సన్నీ'కు సీక్వెల్ ఇది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేసుకున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్ర బృందం. "గిన్ని వెడ్స్ సన్నీ 2'తో ఓ కొత్త ప్రేమ కథను పరిచయం చేయడానికి మేము ఉత్సాహంగా ఉన్నాము. మొదటి చిత్రానికి పొందిన ఆదరణ మమ్మల్ని మళ్లీ ఇలా..కొత్త కథతో అవినాశ్, మేధా లాంటి రిఫ్రెషింగ్ జంటను అన్వేషించడానికి ప్రోత్సాహించింది. ఈ సీక్వెల్ ప్రేక్షకుల్ని మనస్ఫూర్తిగా నవ్విస్తూనే వారి హృదయానికి చేరువవుతుంద'ని సినీ వర్గాలు తెలిపాయి.

నివిన్ పౌలీతో మమిత ప్రేమప్రయాణం


మమితా బైజు

కథ ఏదైనా.. ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఈ ఏడాది వరుస సినిమాలతో తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది మలయాళీ భామ మమితా బైజు. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్‌తో 'డ్యూడ్' సినిమాతో బిజీగా ఉన్న ఆమె.. ఇప్పుడు మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా మమిత, నివిన్ పౌలీ జంటగా 'బెత్లెహం కుడుంబా యూనిట్' అనే చిత్రంలో జంటగా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్ర బృందం. గిరీశ్ ఏడీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోలను పంచుకుంది మమిత. ఈ సినిమాలో నివిన్, మమితల జోడీ, ప్రేమప్రయాణం ఆశ్చర్యపరిచేలా ఉంటుందని, సెప్టెంబరులో చిత్రీకరణ మొదలు కానుందని సినీ వర్గాలు తెలిపాయి. ఈ రొమాంటిక్ డ్రామాను భావన స్టూడియోస్ నిర్మిస్తోంది.

'ధురంధర్' పోరాటాన్ని ఎవరూ ఆపలేరు


రణ్‌వీర్ సింగ్

నా పోరాటాన్ని ఎవరూ ఆపలేరని అంటున్నారు బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్. మరి ఆయన మాటల వెనుక అర్థమేంటో తెలుసుకోవాలంటే 'ధురంధర్' సినిమా చూడాల్సిందే. ఆయన ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఆదివారం రణ్‌వీర్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమా డిసెంబరు 5న థియేటర్లలోకి రాబోతుందని ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో యాక్షన్ అవతారంలో మునుపెన్నడూ చూడని విధంగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతున్నారు రణ్‌వీర్. "గాయపడిన వ్యక్తిని నేను.. అందుకే బాధితుడిగా మారాను" లాంటి సంభాషణలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందీ టీజర్. జియో స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్, ఆర్.మాధవన్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

వ్యోమగామి అయ్యేదెలా?



బీటెక్ సీఎస్ఈ (డీఎస్) మొదటి ఏడాది పూర్తిచేశాను. ఆస్ట్రోనాట్ అవ్వాలంటే ఏ కోర్సులు చదవాలి? అంతరిక్ష రంగంలో ఇంటర్న్‌షిప్‌లు/ ఉద్యోగావకాశాలు ఎలా పొందాలి? – వి.జ్ఞానశశాంక్, నిజామాబాద్

■ వ్యోమగామి (ఆస్ట్రోనాట్) అవ్వాలంటే సైన్స్, అంతరిక్షం, పరిశోధనలపై తీవ్రమైన ఆసక్తి ఉండాలి. నిజాయతీ, బృందంతో పని చేసే సామర్థ్యం, ఒత్తిడి భరించే శక్తి, విమర్శనాత్మక ఆలోచన, త్వరిత నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, తిరస్కారాన్ని తట్టుకునే శక్తి, భౌతిక దృఢత్వం లాంటి లక్షణాలుండాలి. యోగా, నియంత్రిత ఆహారం, సిమ్యులేటర్, ఏరోమెడికల్, మానవ-మెషిన్ ఇంటర్‌ఫేస్, ప్యారా జంపింగ్, సైకలాజికల్ శిక్షణ లాంటివి తీసుకోవాలి. ధైర్యం, క్రమశిక్షణ, నిరంతర శ్రమ వ్యోమగామిగా మారటానికి సరైన మార్గం చూపుతాయి.

● ఇస్రోలో వ్యోమగామిగా ఎంపికకు విద్యా ప్రతిభ, సైన్స్ రిసెర్చ్, జెట్ ఫ్లయింగ్ అనుభవం, క్రీడా విజయాలను ప్రధానంగా పరిశీలిస్తారు. బీటెక్‌లో కనీసం 8 సీజీపీఏ సాధించి, గణితం, భౌతికశాస్త్రం, ప్రోగ్రామింగ్, డేటా విశ్లేషణలపై బలమైన పట్టు సాధించండి. ప్రాజెక్టులు, హ్యాకథాన్‌లలో పాల్గొని సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోండి. ప్రతిరోజూ వ్యాయామం, యోగా ద్వారా శారీరక దృఢత్వం పెంచుకోండి. పైతాన్, ఏఐ, ఎంఎల్ , రోబోటిక్స్‌లో ప్రావీణ్యం పొందండి. ఏరోస్పేస్, డ్రోన్, స్పేస్ రిసెర్చ్ క్లబ్‌లలో చురుకుగా పాల్గొనండి. ఏరోస్పేస్ డేటా అనలిటిక్స్ ఇంటర్న్‌షిప్స్, నాసా కోర్సులు కూడా సాయం చేస్తాయి.

> ‘ ఈ రంగంలో రాణించాలంటే ‘సి’ ప్రోగ్రామింగ్, మ్యాట్ ల్యాబ్, క్యాడ్ టూల్స్ ఉపయోగించి శాటిలైట్ డేటా అనాలిసిస్, రాకెట్ డిజైన్ సిమ్యులేషన్స్ ప్రాజెక్టులు చేయాలి. ప్రతి ఇంటర్న్‌షిప్‌కు ముందు బయోడేటా అప్‌డేట్ చేసి, స్పేస్ ప్రాజెక్టులు కూడా జోడించాలి. ఎన్‌పీటెల్, కోర్స్ ఎరా, యుడెమిలలో స్పేస్ టెక్నాలజీ కోర్సులు చేయాలి ’


● బీటెక్ తరువాత ఏరోస్పేస్/ స్పేస్ టెక్నాలజీలో ఎంటెక్/ ఎంఎస్ చేయడం, డిఫెన్స్ పైలట్ అవడం, లేదా ఇస్రోలో శాస్త్రవేత్తగా ఉద్యోగం పొందడం లాంటి మార్గాలున్నాయి. ప్రస్తుతం ఇస్రో గగనయాన్ కోసం ఎయిర్‌ఫోర్స్ పైలట్లను ఎంచుకుంటున్నా, భవిష్యత్తులో సివిలియన్ సైంటిస్టులు, ఇంజినీర్లను మిషన్ స్పెషలిస్టులుగా తీసుకునే అవకాశం ఉంది. నాసాలో పౌరసత్వం అవసరం లేని సహకార మిషన్ల ద్వారా అవకాశాలు ఉండొచ్చు. ఇంటర్న్‌షిప్‌ల కోసం ఇస్రో, డీఆర్‌డీఓ లాంటి ప్రభుత్వ సంస్థలతోపాటు అగ్నికుల్ కాస్మోస్, స్కైరూట్, బెల్లాట్రిక్స్, పిక్సెల్, ధ్రువ లాంటి ఏరోస్పేస్ కంపెనీలు అవకాశం ఇస్తాయి. ఇస్రో-నాసా సహకార ప్రాజెక్టులు, ఎంఐటీ, కాల్ టెక్ రిసెర్చ్ ప్రాజెక్టుల ద్వారా చేరవచ్చు.



● ఇస్రోలో శాస్త్రవేత్త అవ్వాలంటే గేట్ లేదా ప్రత్యేక పరీక్ష రాయాలి. ఎంటెక్/ ఎంఎస్ చేసిన తర్వాత ఇస్రో, డీఆర్‌డీఓ, నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ లాంటి పరిశోధన సంస్థల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

టెక్నీషియన్ పోస్టుల కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల ప్రకటన వెలువడింది. దేశవ్యాప్తంగా 6238 ఖాళీలు. వీటిలో గ్రేడ్-3లోని 6055 పోస్టులకు పదో తరగతి తర్వాత నిర్దేశిత ట్రేడుల్లో ఐటీఐ పూర్తిచేసుకున్నవారు ప్రయత్నించవచ్చు. గ్రేడ్-I ఖాళీలకు డిప్లొమా/బీఎస్సీ/బీటెక్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షలో ప్రతిభతో నియామకాలుంటాయి.



రైల్వే పిలుస్తోంది!

గత సంవత్సరమే రెండుసార్లు టెక్నీషియన్ గ్రేడ్-1, గ్రేడ్-3 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. తక్కువ వ్యవధిలోనే మరో నోటిఫికేషన్ రావడం ఆశావహులకు ఎంతో మేలు చేసేదే. నియామకాలు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ)ల వారీ ఉంటాయి. పరీక్ష అందరికీ ఉమ్మడిగా నిర్వహిస్తారు. ఏదో ఒక ఆర్ఆర్‌బీ పోస్టులకే దరఖాస్తు చేసుకోవాలి. అందులోని జోన్ల ప్రాధాన్యాన్ని ఎంచుకోవాలి. తెలుగు మాధ్యమంలోనూ పరీక్ష రాసుకోవచ్చు. అర్హతలు ఉన్నవారు రెండు పోస్టులకూ విడిగా దరఖాస్తు చేసుకోవచ్చు.

టెక్నీషియన్ గ్రేడ్-I

ఖాళీలు: 183

విద్యార్హత: ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఇన్‌స్ట్రుమెంటేషన్ వీటిలో ఏదైనా ఒక సబ్జెక్టుతో బీఎస్సీ/ డిప్లొమా/బీఈ/బీటెక్.

వయసు: జులై 1, 2025 నాటికి 18-33 ఏళ్ల మధ్యలో ఉండాలి.

వేతనం: గ్రేడ్-1 టెక్నీషియన్లకు లెవెల్-5 రూ.29,200 మూల వేతనం, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులన్నీ కలిపి సుమారు రూ.60 వేల జీతం పొందవచ్చు.

పరీక్ష: కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. వంద ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 90 నిమిషాలు. జనరల్ అవేర్‌నెస్ 10, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 15, కంప్యూటర్ అప్లికేషన్స్ బేసిక్స్ 20, మ్యాథమెటిక్స్ 20, బేసిక్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ 35 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి.

టెక్నీషియన్ గ్రేడ్-3

ఖాళీలు: 6055.

విద్యార్హత: పదో తరగతి తర్వాత సంబంధిత ట్రేడులు/విభాగాల్లో ఐటీఐ లేదా అప్రెంటిస్‌షిప్

వయసు: జులై 1, 2025 నాటికి వయసు 18-30 ఏళ్ల మధ్యలో ఉండాలి.

వేతనం: గ్రేడ్-3 టెక్నీషియన్లకు లెవెల్-2 రూ.19,900 మూల వేతనం, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులన్నీ కలిపితే సుమారు రూ.40 వేల జీతం పొందవచ్చు. అనుభవం, అంతర్గత పరీక్షలతో వీరు గ్రేడ్-2, గ్రేడ్-1 టెక్నీషియన్లుగా పదోన్నతులు పొందవచ్చు.

పరీక్ష: ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. వంద ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 90 నిమిషాలు. మ్యాథమెటిక్స్ 25, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 25, జనరల్ సైన్స్ 40, జనరల్ అవేర్‌నెస్‌లో 10 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి.

● గ్రేడ్-1, గ్రేడ్-3 పరీక్షల్లో అర్హత సాధించడానికి అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్‌లు 40, ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ 30, ఎస్టీ 25 మార్కులు పొందాలి. ఇందులో మెరిట్‌లో ఉన్నవారి ధ్రువపత్రాలు పరిశీలించి, వైద్య పరీక్షల అనంతరం ఉద్యోగానికి తీసుకుంటారు.

● గ్రేడ్-1, గ్రేడ్-3 రెండు పరీక్షల్లో ప్రతి తప్పు సమాధానానికీ 1/3 వంతు మార్కు తగ్గిస్తారు.

● రెండు పోస్టులకూ ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.

గ్రేడ్-3 సన్నద్ధత

● సిలబస్ ప్రకారం విభాగాల వారీ ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించి, పూర్తిగా చదవాలి. అందులో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి.

● అధ్యయనం పూర్తయిన తర్వాత పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పరీక్ష కోణంలో ఆలోచించి, ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని, మళ్లీ చదవడం, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించడం చేయాలి.

● మాక్ టెస్టులు రాసి, ఫలితాలు విశ్లేషించుకోవాలి. తప్పులు పునరావృతం కాకుండా, పరీక్షల వారీ స్కోరులో మెరుగుదల ఉండేలా కృషి చేయాలి.

● రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయాలి.

● ప్రతి ప్రశ్నకూ 54 సెకన్ల వ్యవధి. మెలకువలు పాటించి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

● మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రశ్నలకు ఆబ్జెక్టివ్ అరిథ్‌మెటిక్ - ఆర్ఎస్ అగర్వాల్ పుస్తకం సరిపోతుంది. ఈ విభాగంలో త్రికోణమితి, ఆల్జీబ్రా.. మొదలైన అంశాల కోసం పదో తరగతి గణిత పుస్తకాన్ని బాగా చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి.

● జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగానికీ ఆర్ఎస్ అగర్వాల్ రీజనింగ్ పుస్తకం లేదా ఏదైనా తీసుకోవచ్చు. అయితే ఏ పుస్తకం చదివినప్పటికీ పరీక్షలో పేర్కొన్న అంశాలకే పరిమితమై, వాటినే బాగా సాధన చేయాలి.

● జనరల్ సైన్స్‌పై ప్రత్యేక దృష్టి అవసరం. వంద మార్కుల పరీక్షలో ఈ విభాగానికే 40 కేటాయించారు. అందువల్ల వీలైనన్ని ఎక్కువ మార్కులు పొందాలి. 8, 9, 10 తరగతుల భౌతిక, రసాయన, జీవశాస్త్రాల పుస్తకాలు క్షుణ్నంగా చదవాలి. అలాగే ఈ విభాగాల్లో ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పాత, మాదిరి ప్రశ్నలు బాగా చదివితే గరిష్ఠ మార్కులకు వీలుంది.

● జనరల్ అవేర్‌నెస్ కోసం ఏదైనా పత్రికను చదివి ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలకు చెందిన తాజా వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

ముఖ్య వివరాలు

దరఖాస్తుకు చివరి తేదీ: 28.07.2025

దరఖాస్తు ఫీజు: గ్రేడ్-1, గ్రేడ్-3 దేనికైనా.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జండర్, ఈబీసీలకు రూ.250. పరీక్షకు హాజరైతే బ్యాంకు ఛార్జీలు మినహాయించి, మిగిలిన ఫీజు ఇచ్చేస్తారు. ఇతర వర్గాల వారికి ఫీజు రూ.500. పరీక్ష రాస్తే వంద తీసుకుని, రూ.400ల్లో బ్యాంకు ఛార్జీలు మినహాయించి వెనక్కి ఇచ్చేస్తారు.

వెబ్‌సైట్: https://www.rrbapply.gov.in/#/auth/landing

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 1340 జూనియర్ ఇంజినీర్ (జేఈ) ఉద్యోగాల భర్తీ కోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచుల్లో డిప్లొమా, ఇంజినీరింగ్ చదివినవారికి ఇదో మంచి అవకాశం. నియామక పరీక్షల్లో మెరుగైన మార్కులతో మెరవాలంటే మెలకువలు..



కేంద్రప్రభుత్వ శాఖల్లో.. 1340 జేఈ కొలువులు

నియమితులైనవారు దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ/ విభాగాలు/ సంస్థల్లో గ్రూప్-బీ (నాన్-గెజిటెడ్) నాన్ మినిస్టీరియల్ జూనియర్ ఇంజినీర్ పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తారు. వీరికి సెవెన్త్ పే స్కేలు ప్రకారం రూ.35,400 - రూ.1,12,400 స్కేలుతో రూ.60 వేల ప్రారంభ వేతనం లభిస్తుంది. డిపార్ట్‌మెంట్ పరీక్షల ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌లుగా పదోన్నతి పొందుతారు.

దరఖాస్తు ఎలా?

● అభ్యర్థులు ముందుగా వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ విధానం ద్వారా తమ వివరాలను కొత్త వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. తర్వాత దరఖాస్తును http://ssc.gov.in ద్వారా పూర్తిచేయాలి.

● పరీక్ష ఫీజు రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు ఫీజు ఉండదు.

విద్యార్హతలు: సివిల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ బ్రాంచుల్లో డిప్లొమా/ డిగ్రీ చదివివుండాలి.

వయసు: పోస్టును బట్టి 18- 32 ఏళ్లుండాలి. వివిధ కేటగిరీలకు వయసులో సడలింపు ఉంటుంది.

▸ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 21.07.2025 (రాత్రి 11 గంటల వరకు)

▸ **పేపర్–1:** 27.10.2025 నుంచి 31.10.2025

▸ **పేపర్–2:** జనవరి లేదా ఫిబ్రవరి 2026

రెండు దశల్లో...

పేపర్-1, పేపర్-2. ఈ రెండూ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు. పేపర్-1లో మెరుగైన మార్కులు సాధిస్తే పేపర్-2 రాయడానికి అనుమతిస్తారు. ఈ రెండు పరీక్షలూ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. పేపర్-1, పేపర్-2 రెండు పరీక్షల్లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుని తుది ఎంపిక చేస్తారు. .

పేపర్-I

200 ప్రశ్నలకుగాను 200 మార్కులు ఉంటాయి. సమయం 120 నిమిషాలు. దీన్నిబట్టి సమయ పాలన కీలకమని గ్రహించాలి. ప్రతి తప్పు సమాధానానికీ 0.25 రుణాత్మక మార్కులు. ప్రశ్నలు సులభంగా డిప్లొమా స్థాయిలో ఉంటాయి. థియరీ బేస్డ్ ప్రశ్నలు ఎక్కువ. అన్ని సబ్జెక్టులకూ తగినంత సమయం కేటాయించాలి. సూటిగా సమాధానం రాగలిగిన ప్రశ్నలను ముందుగా ఎంచుకుని తక్కువ సమయంలో పూర్తిచేయాలి. మిగిలిన సమయాన్ని ఎక్కువ వ్యవధి పట్టే సంఖ్యాపరమైన, సూత్రాధారిత ప్రశ్నలకు కేటాయించవచ్చు.

1. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్: వెర్బల్, నాన్ వెర్బల్ ప్రశ్నలు అడుగుతారు. ముఖ్యంగా ప్రాబ్లమ్ సాల్వింగ్, డెసిషన్ మేకింగ్, అరిథ్‌మెటిక్, రీజనింగ్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, అనాలిసిస్. ఈ అంశాలు చదివిన పాఠ్యాంశాల్లో లేనప్పటికీ ఎంతో కొంత అవగాహన ఉంటుంది కాబట్టి సాధన చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

2. జనరల్ అవేర్‌నెస్: పరిసరాల్లో జరిగే సాధారణ విషయాల అవగాహననూ, సమాజంపై వాటి ప్రభావాన్ని పరీక్షించే ప్రశ్నలుంటాయి. వార్తాపత్రికలు, ప్రామాణిక పాఠ్యపుస్తకాలు శ్రద్ధగా అధ్యయనం చేస్తే మేలు.

3. జనరల్ ఇంజినీరింగ్: అభ్యర్థి ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రశ్నలు అడుగుతారు.

సివిల్: పూర్వ ప్రశ్నపత్రాల ద్వారా సరైన అవగాహన పొంది సన్నద్ధత మొదలుపెట్టాలి. బిల్డింగ్ మెటీరియల్స్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్, సర్వేయింగ్, స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్‌ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడగడం పూర్వ ప్రశ్నపత్రాల ద్వారా గమనించవచ్చు.

మెకానికల్: గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తే.. ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ హైడ్రాలిక్ మెషిన్స్, థర్మల్ ఇంజినీరింగ్, ప్రొడక్షన్ ఇంజినీరింగ్ సబ్జెక్టుల్లో ఎక్కువగా ప్రశ్నలు రావడం గమనించవచ్చు.

ఎలక్ట్రికల్: ఎలక్ట్రికల్ మెషిన్స్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, పవర్ సిస్టమ్స్ సబ్జెక్టులకు అధిక ప్రాధాన్యం లభిస్తోంది.

పేపర్-2

100 బహుళైచ్ఛిక ప్రశ్నలకు 300 మార్కులు కేటాయించారు. అంటే ప్రతి ప్రశ్నకూ 3 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ 3 మార్కులకు ఒక మార్కు చొప్పున తగ్గిస్తారు. జవాబులు గుర్తించేటప్పుడు జాగ్రత్త అవసరం.

ప్రిపరేషన్ ఎలా?

సిలబస్‌ను ప్రణాళికాబద్ధంగా.. కాన్సెప్టుల వారీగా అధ్యయనం చేయాలి.

▲ ప్రశ్నపత్రాలు డిప్లొమా సిలబస్ ఆధారంగా ఉంటాయి. కానీ డిగ్రీ విద్యార్థులు కూడా ఈ పరీక్షకు పోటీపడతారు. కాబట్టి డిప్లొమా విద్యార్థులు కొంత ఎక్కువ శ్రమపడాలి.

▲ మొదట పరీక్ష విధానం, సిలబస్, పరీక్ష స్టాండర్డ్‌ను పూర్తిగా అవగతం చేసుకోవాలి.

▲ పేపర్-1 పరీక్షకు దాదాపు 4 నెలల సమయం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ప్రణాళికను రూపొందించుకోవాలి.

▲ ఇప్పటినుంచి రోజుకు 8 నుంచి 10 గంటల సమయం సన్నద్ధతకు కేటాయించాలి.

▲ ప్రామాణిక పుస్తకాలు, అధ్యయన సామగ్రి (మెటీరియల్) ఎంచుకోవడం ప్రధానం.

▲ పరీక్షకు సిద్ధమయ్యే క్రమంలో ప్రతి చాప్టర్, ప్రతి సబ్జెక్టు ముఖ్యాంశాలను చిన్న పట్టికల్లో తయారుచేసుకోవాలి.

▲ చదివినవన్నీ పునశ్చరణ చేసుకోవాలి.

▲ ప్రిపరేషన్ జరుగుతున్నపుడూ, పూర్తయిన తర్వాతా వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. వీటిలో చేసిన తప్పులను విధిగా సవరించుకోవాలి.



– ప్రొ. వై.వి.గోపాలకృష్ణమూర్తి సీఎండీ, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: రిక్రూట్ సీఆర్ఎం

నైపుణ్యాలు: డిజిటల్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్

స్టైపెండ్: రూ.7,000-7,500

☛ https://shorturl.at/M81UR

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: బవేజా మీడియా

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో **స్టైపెండ్:** రూ.6,000-10,000

☛ https://lnk.ink/Internshala

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 1

సిల్వీసెంటిక్స్ ఇన్ఫోటెక్‌లో

1. ఫ్రంట్‌ఎండ్ డెవలప్‌మెంట్

నైపుణ్యాలు: యాంగ్యులర్, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, రియాక్ట్, రెస్ట్ ఏపీఐ

స్టైపెండ్: రూ.1,000-1,500

☛ https://shorturl.at/bRQqI

2. డిజిటల్ మార్కెటింగ్

నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్ **స్టైపెండ్:** రూ.6,000-16,500

☛ https://shorturl.at/yYD79

డేటా సైన్స్

సంస్థ: డీప్‌థాట్ కల్చర్‌టెక్ వెంచర్స్ ప్రై.లి.

నైపుణ్యాలు: బ్యూటిఫుల్‌సూప్, గూగుల్ షీట్స్, పైతాన్, సెలీనియం

స్టైపెండ్: రూ.7,000

☛ https://shorturl.at/YbzL8

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 2

ఉద్యోగాలు

పీఎఫ్ఆర్‌డీఏలో అసిస్టెంట్ మేనేజర్లు

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) వివిధ విభాగాల్లో 40 ఆఫీసర్ గ్రేడ్-ఏ (అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.

వయసు: 31.07.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఆగస్టు 1, 1995 తర్వాత జన్మించివుండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.44,500 - రూ.89,150.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.08.2025

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.1000. ఎస్టీ, ఎస్సీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో

పరీక్ష కేంద్రాలు: విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, కోల్‌కతా, పట్నా, గువాహటి, భువనేశ్వర్, రాంచీ, ఇంఫాల్, సిలిగురి, అగర్తలా, ముజఫర్‌పూర్, మధురై, కోయంబత్తూర్, చెన్నై, ఎర్నాకుళం, బెంగళూరు, భోపాల్, నాగ్‌పూర్, రాయ్‌పూర్, ప్రయాగ్‌రాజ్, ఇండోర్, కాన్పూర్.

వెబ్‌సైట్: https://www.pfrda.org.in/

టీహెచ్ఎస్‌టీఐ-బీఆర్ఐసీలో..

ఫరిదాబాద్‌లోని బీఆర్ఐసీ- ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (టీహెచ్ఎస్‌టీఐ-బీఆర్ఐసీ) 4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ: 01

● మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 02

● అల్ట్రా సౌండ్ అసిస్టెంట్: 01

నోటీస్ బోర్డు

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.

వయసు: ఎగ్జిక్యూటివ్ సెక్రటరీకి 40 ఏళ్లు, ఎంటీఎస్‌కు 25 - 50 ఏళ్లు, అల్ట్రా సౌండ్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు.

వేతనం: నెలకు ఎంటీఎస్‌కు 23,500, అల్ట్రా సౌండ్ అసిస్టెంట్‌కు రూ.35,000, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీకి రూ.50,000.

పని ప్రదేశాలు: టీహెచ్ఎస్‌టీఐ, ఎయిమ్స్ గువాహటి, కేజీఎంయూ లఖ్‌నవూ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.07.2025

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.236, ఎస్సీ, ఎస్టీ, మహిళా, పీడబ్ల్యూబీడీలకు రూ.118.

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలతో.

వెబ్‌సైట్: https://thsti.res.in/en/Jobs

అగ్నివీర్ ఎంఆర్ మ్యుజీషియన్

భారత నౌకాదళం, అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ (ఎంఆర్ మ్యుజీషియన్)- 02/2025 బ్యాచ్ కోసం అవివాహితుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

అర్హత: కనీసం 50% మార్కులతో పదో తరగతి. భారతీయ లేదా విదేశీ వాద్యాల్లో ప్రావీణ్యం. గుర్తింపు పొందిన సంగీత సంస్థల నుంచి సర్టిఫికెటు లేదా పోటీల్లో పాల్గొన్న/అవార్డు పొందిన సర్టిఫికెట్లు ఉండాలి. నాలుగేళ్ల సేవా కాలంలో వివాహం చేసుకోరాదు.

వయసు: 01 సెప్టెంబరు 2004 నుంచి 29 ఫిబ్రవరి 2008 మధ్య జన్మించివుండాలి.

ఎంపిక: టెన్త్ మార్కులు, సంగీత సర్టిఫికెట్ల ఆధారంగా షార్ట్‌లిస్టింగ్. శారీరక దార్ఢ్య పరీక్ష, మ్యూజిక్ ఎబిలిటీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్‌తో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.07.2025.

పరీక్షా కేంద్రం: పీఈటీ, మ్యూజిక్ ఎబిలిటీ టెస్ట్, మెడికల్ పరీక్షలు భారత నౌకాదళం కేటాయించిన కేంద్రాలలో జరుగుతాయి. **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

జీఆర్ఎస్ఈలో 52 ఉద్యోగాలు

గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ (జీఆర్ఎస్ఈ) కోల్‌కతా 52 జర్నీమ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఫిట్టర్, రిగ్గర్, పైప్ ఫిట్టర్, మెషిన్ ఆపరేటర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, మెటీరియల్ హ్యాండ్లింగ్, డీజిల్ మెకానిక్, క్రేన్ ఆపరేటర్.

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఎన్ఏసీ/ఎన్‌టీసీ.

వయసు: 01.07.2025 నాటికి 26 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టైపెండ్: నెలకు రూ.24,000 - రూ.26,000.

ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, పీఈటీ పరీక్షలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04.08.2025

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.472. ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు.

వెబ్‌సైట్: https://www.grse.in/career/

ఎయిమ్స్ గోరఖ్‌పుర్‌లో నాన్-ఫ్యాకల్టీ

ఎయిమ్స్ గోరఖ్‌పుర్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 9 నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్: 01

● చైల్డ్ సైకాలజిస్ట్: 01

● మెడికల్ ఆఫీసర్: 03

● మెడికల్ ఫిజిసిస్ట్: 04

అర్హత: పోస్టును బట్టి బీఎస్సీ నర్సింగ్, ఎంఏ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.

వయసు: 21 - 35 ఏళ్లు ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04.08.2025

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1000. ఎస్సీ, ఎస్టీలకు రూ.800.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://aiimsgorakhpur.edu.in/current-notices/

వాక్–ఇన్

సీఏఆర్ఐలో రిసెర్చ్ ఫెలోలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్‌కి చెందిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్- సెంట్రల్ ఆయుర్వేద రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. ఒప్పంద ప్రాతిపదికన 5 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● జూనియర్ రిసెర్చ్ ఫెలో: 01

● సీనియర్ రిసెర్చ్ ఫెలో: 04

అర్హత: ఎంఫార్మ్/ ఎంఫార్మ్ (ఆయుర్వేద)/ ఎంఎస్ (ఫార్మాస్యూటికల్ సైన్స్) లేదా ఎమ్మెస్సీ.

వయసు: ఇంటర్వ్యూ తేదీ నాటికి 35 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు సీనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.42,000; జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000.

ఎంపిక: రాత పరీక్ష/ ఇంటర్వ్యూలతో.

ఇంటర్వ్యూ తేదీ: 15.07.2025.

ఇంటర్వ్యూ ప్రదేశం: సెంట్రల్ ఆయుర్వేద రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఝాన్సీ, ఉత్తర్‌ప్రదేశ్.

వెబ్‌సైట్: https://ccras.nic.in/

బామర్ లారీలో అవకాశాలు

బామర్ లారీ సంస్థ 32 సూపర్‌వైజర్ ట్రెయినీ పోస్టులను భర్తీచేయనుంది.

సూపర్‌వైజరీ ట్రెయినీ-ఎస్‌టీ (మెకానికల్)-9, ఎస్‌టీ-కెమికల్/ పెట్రోకెమికల్-12, ఎస్‌టీ-ఎలక్ట్రికల్-4, ఎస్‌టీ-ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్-2, ఎస్‌టీ-పెయింట్/ సర్ఫేజ్ కోటింగ్/ ప్రింటింగ్ టెక్నాలజీ-3, ఎస్‌టీ-లెదర్ టెక్నాలజీ-2 ఖాళీలు ఉన్నాయి.

● మెకానికల్/ కెమికల్/ పెట్రోకెమికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్/ పెయింట్/ సర్ఫేజ్ కోటింగ్/ పెయింటింగ్ టెక్నాలజీ/ లెదర్ టెక్నాలజీ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిప్లొమా 60 శాతంతో పూర్తి చేయాలి. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 50 శాతం సరిపోతుంది. ఫైనల్ సెమిస్టర్‌లో ఉన్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: 25 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు 10- 15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి రాత పరీక్షకు ఎంపిక చేస్తారు.

● ఎంపికైనవారికి ఏడాది శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో స్టైపెండ్ చెల్లిస్తారు. ● శిక్షణను విజయవంతంగా పూర్తిచేసినవారిని జూనియర్ ఆఫీసర్‌గా నియమిస్తారు. వీరికి ఏడాది ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది. ఈ సమయంలో నెలకు రూ.21,750-65,000 వేతనం చెల్లిస్తారు. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్‌ఆర్‌ఏ, మెడికల్, పెర్క్స్ అండ్ అలవెన్స్, సెలవులు, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే లాంటి సదుపాయాలు ఉంటాయి.

● ప్రభుత్వ/ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నవారు ‘నో అబ్జెక్షన్ సర్టిఫికెట్’ను సమర్పించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.07.2025

వెబ్‌సైట్: https://www.blrecruit.in/

ఈనాడు ప్రతిభ
■ e-mail: pratibhadesk@eenadu.net
17
సోమవారం జులై 7, 2025

గ.సా.భా

ముఖ్యాంశాలు

గసాభా: రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల భాజకాల్లో మిక్కిలి పెద్దది గసాభా. దీన్నే గరిష్ఠ సామాన్య భాజకం అంటారు.

- రెండు సరిసంఖ్యల గసాభా సరిసంఖ్యే అవుతుంది.
- రెండు పరస్పర ప్రధాన సంఖ్యల గసాభా 1 అవుతుంది.
- రెండు సంఖ్యల లబ్ధం = కసాగు × గసాభా అవుతుంది.
- భిన్నాల గసాభా $= \frac{\text{లవాల గసాభా}}{\text{హారాల కసాగు}}$
- భిన్నాల కసాగు $= \frac{\text{లవాల కసాగు}}{\text{హారాల గసాభా}}$

మాదిరి ప్రశ్నలు

1. 42, 70ల గ.సా.భా ఎంత?

1) 210 2) 7 3) 14 4) 20

సాధన: 42) 70 (1
42
28) 42 (1
28
14) 28 (2
28
0

∴ 42, 70 ల గ.సా.భా: 14.

సమాధానం: 3

2. 60, 72, 96ల గ.సా.భా ఎంత?

1) 6 2) 12 3) 24 4) 1440

సాధన: 2 | 60, 72, 96
2 | 30, 36, 48
3 | 15, 18, 24
5, 6, 8

రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల గ.సా.భా కనుక్కోవడానికి ఇచ్చిన అన్ని సంఖ్యలను భాగించే కారణాంకాల లబ్ధం గ.సా.భా అవుతుంది.

∴ $2 \times 2 \times 3 = 12$.

సమాధానం: 2

3. $3 \times 5 \times 7 \times 13$, $2^3 \times 3 \times 5 \times 13$, $3^3 \times 5 \times 13$ల గ.సా.భా ఎంత?

1) $2 \times 3 \times 5 \times 7 \times 13$ 2) $3 \times 5 \times 13$
3) $3 \times 5 \times 7 \times 13$ 4) $2^3 \times 3^3 \times 5 \times 13$

సాధన: $3 \times 5 \times 7 \times 13$
$2 \times 2 \times 2 \times 3 \times 5 \times 13$
$3 \times 3 \times 3 \times 5 \times 13$

మూడింటిలోని ఉమ్మడి కారణాంకాలు గ.సా.భా అవుతుంది.

∴ గ.సా.భా. = $3 \times 5 \times 13$

సమాధానం: 2

4. $\frac{4}{9}, \frac{10}{12}, \frac{20}{63}$ ల గ.సా.భా ఎంత?


1) $\frac{5}{63}$ 2) $\frac{1}{63}$ 3) $\frac{2}{63}$ 4) $\frac{2}{9}$

సాధన: భిన్నాల గ.సా.భా $= \frac{\text{లవాల గ.సా.భా}}{\text{హారాల క.సా.గు}}$

లవాలు 4, 10, 20ల గ.సా.భా 2
హారాలు 9, 21, 63ల క.సా.గు 63

∴ దత్త సంఖ్యల గ.సా.భా $= \frac{2}{63}$

సమాధానం: 3



రైల్వే, పోటీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

గరిష్ఠ పరిమాణ పలకల సైజు?

5. 3.78 మీ. పొడవు, 5.25 మీ. వెడల్పు కలిగిన ఒక దీర్ఘచతురస్రాకార ఆట స్థలంలో చతురస్రాకార టైల్స్‌ను అతికించాలి. ఈ పనికి ఉపయోగించే గరిష్ఠ పరిమాణ పలకల సైజు ఎంత?

1) 14 సెం.మీ. 2) 35 సెం.మీ.
3) 21 సెం.మీ. 4) 28 సెం.మీ.

సాధన: ఇచ్చిన పొడవు, వెడల్పుల గసాభానే గరిష్ఠ పరిమాణ పలకల సైజు అవుతుంది.

3.78, 5.25లలో దశాంశాలను తీసివేయగా 378, 525 అవుతుంది.

$378 = 2 \times 3 \times 3 \times 3 \times 7 = 2 \times 3^3 \times 7$
$525 = 3 \times 5 \times 5 \times 7 = 3 \times 5^2 \times 7$
వీటిలో ఉమ్మడి కారణాంకం $3 \times 7 = 21$
378, 525 ల గ.సా.భా. = 21

సమాధానం: 3

6. రెండు సంఖ్యల క.సా.గు వాటి గ.సా.భాకు 12 రెట్లు. గ.సా.భా, క.సా.గుల మొత్తం 403. ఆ రెండు సంఖ్యల్లో ఒక సంఖ్య 93, అయితే మరో సంఖ్యను కనుక్కోండి?

1) 248 2) 124 3) 372 4) 620

సాధన: గ.సా.భా x, క.సా.గు y అనుకుందాం

$x + 12x = 403 \Rightarrow 13x = 403$

$x = \frac{403}{13} = 31$

∴ గ.సా.భా = 31, కసాగు = 31×12

ఒక సంఖ్య 93 అయితే మరో సంఖ్య $= \frac{31 \times 12 \times 31}{93} = 124$

సమాధానం: 2

7. రెండు సంఖ్యల క.సా.గు 432. వాటి గ.సా.భా 72. వీటిలో ఒక సంఖ్య 144 అయితే మరొక సంఖ్య?

1) 216 2) 254 3) 276 4) 108

సాధన: రెండు సంఖ్యల లబ్ధం = వాటి కసాగు × గసాభా

$144 \times x = 432 \times 72$

$x = \frac{432 \times 72}{144} = 216$

సమాధానం: 1

8. రెండు సంఖ్యల లబ్ధం 4107, వాటి గ.సా.భా 37 అయితే వాటిలో పెద్ద సంఖ్య ఏది?

1) 37 2) 4107 3) 74 4) 111

సాధన: రెండు సంఖ్యలు 37a, 37b అనుకుందాం

$37a \times 37b = 4107$

$ab = \frac{4107}{37 \times 37} = 3$

3, 37లు సాపేక్ష ప్రధానాంకాలు. కాబట్టి మనకు కావాల్సిన సంఖ్యలు $37 \times 1 = 37$, $37 \times 3 = 111$

సమాధానం: 4

9. రెండు సంఖ్యల నిష్పత్తి 15 : 11. దాని గ.సా.భా 13. అయితే ఆ సంఖ్యలు ఏవి?

1) 105, 77 2) 15, 11
3) 75, 55 4) 195, 143

సాధన: సంఖ్యలు 15x, 11x అనుకుంటే, వీటి గసాభా = x

x = 13

ఆ సంఖ్యలు $15 \times 13 = 195$, $11 \times 13 = 143$

సమాధానం: 4



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్, విషయ నిపుణులు

703 Word of the Day

Deference

Telugu meaning: గౌరవం, మర్యాద

English meaning: The word deference (డెఫెరెన్స్) is a noun that describes respectful submission or yielding to the opinion, wishes, or judgment of another.

Synonyms: Respect, Regard

Antonyms: Disrespect, Defiance

Usage: **1.** The students showed great deference to the principal during the award ceremony.

2. Out of deference to her experience, they agreed to follow her lead on the project.

కరెంట్ అఫైర్స్



ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో'ను ఆ దేశ అధ్యక్షురాలు క్రిస్టైన్ కర్లా కంగలూ 2025, జులై 4న ప్రధాని మోదీకి ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని దక్కించుకున్న తొలి విదేశీ నేత మోదీయే. ఆయన అందుకున్న 25వ అంతర్జాతీయ అవార్డు ఇది.



నేవీ ఏవియేషన్‌లో దేశంలోనే తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా ఆస్తా పూనియా నియమితులయ్యారు. భారత నౌకాదళంలో ఇప్పటికే మహిళా అధికారులు పైలట్లుగా సముద్ర నిఘావిమానాలు, హెలికాప్టర్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే నౌకాదళ యుద్ధ విమానాలు నడపనున్న తొలి మహిళగా ఆస్తా పూనియా నిలిచారు.



దేశంలోనే మొదటిసారిగా సోలార్ బస్‌స్టేషన్ గుజరాత్‌లోని సూరత్‌లో ఏర్పాటైంది. ఇందులో రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్, సెకండ్ లైఫ్ బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా బస్సులకు 24 గంటల గ్రీన్ ఛార్జింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.



ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ 'బ్లూ టంగ్' పురస్కారం అందుకున్నారు. జర్మనీ కేంద్రంగా పనిచేస్తున్న 'గ్రేటర్' సంస్థ ప్రపంచవ్యాప్తంగా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రజల్ని ప్రభావితం చేయగలిగిన వ్యక్తులను గుర్తించి ఏటా 'బ్లూ టంగ్' పురస్కారంతో గౌరవిస్తోంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



స్టడీ జోన్: భారతదేశంలో ముఖ్యమైన పారిశ్రామిక తీర్మాన విధానాలు


బ్రిటిష్ వలస పాలనతో మన దేశంలో సంప్రదాయ పరిశ్రమలు తీవ్రంగా దెబ్బ తినడమే కాక, సహజ వనరులు విపరీతమైన దోపిడీకి గురయ్యాయి. దీంతో స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంది. నిరక్షరాస్యత, పేదరికం, తక్కువ తలసరి ఆదాయం, పారిశ్రామిక వెనుకబాటుతనం, నిరుద్యోగిత లాంటివి దేశ ఆర్థికాభివృద్ధికి అవరోధాలుగా మారాయి. ఆధునిక పరిశ్రమలు అంతగా అభివృద్ధి జరగలేదు.

- 1944లో ప్రభుత్వం ప్రణాళికా అభివృద్ధి విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీనికి అనుబంధంగా 1945, ఏప్రిల్ 21న ఒక పారిశ్రామిక ప్రకటన చేసింది. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం అమలు చేసిన పారిశ్రామిక తీర్మానాల మౌలిక స్వభావానికి 1945 ప్రకటన పునాదిగా నిలిచింది.
- భారతదేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలిసి ఉండటం వల్ల మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా పేర్కొంటారు. ఈ రెండు రంగాల పరిధిని తెలిపేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాలను ప్రకటిస్తుంది. ఇప్పటివరకు ప్రకటించిన వివిధ ప్రముఖ పారిశ్రామిక తీర్మాన విధానాలు - వాటి ప్రాధాన్యాలు తదితరాలపై వివిధ పోటీపరీక్షల్లోనూ ప్రశ్నలు వస్తుంటాయి.

పారిశ్రామిక విధానం	తేదీ	లక్ష్యం
1. 1948 పారిశ్రామిక తీర్మాన విధానం	1948, ఏప్రిల్ 6	దేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు పునాది వేయడం
2. 1956 పారిశ్రామిక తీర్మాన విధానం	1956, ఏప్రిల్ 30	భారీ, మౌలిక పరిశ్రమల స్థాపన
3. 1970 పారిశ్రామిక తీర్మాన విధానం	1970, జూన్ 1	పరిశ్రమలను 4 రకాలుగా వర్గీకరించారు (కోర్ సెక్టార్, అధిక పెట్టుబడి రంగం, మధ్య పెట్టుబడి రంగం, రిజర్వ్ చేసిన చిన్న పరిశ్రమల రంగం)
4. 1977 పారిశ్రామిక తీర్మాన విధానం	1977 డిసెంబరు 23	కుటీర, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం
5. 1980 పారిశ్రామిక తీర్మాన విధానం	1980, జులై 3	పరిశ్రమల రంగం సమగ్ర అభివృద్ధికి ఆర్థిక ఫెడరలిజం అనే భావనను ప్రవేశపెట్టడం
6. 1991 నూతన పారిశ్రామిక విధానం	1991, జులై 24	ఆర్థిక సంస్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

పదార్థం - స్థితులు



కొంత స్థలాన్ని ఆక్రమించి, ద్రవ్యరాశిని కలిగి ఉన్న పదార్థమే మన భౌతిక ప్రపంచానికి పునాది. పదార్థం వివిధ అణువులు, పరమాణువులతో నిర్మితమవుతుంది. ఇందులోని అణువులన్నీ వివిధ నియమాలను అనుసరిస్తాయి. రసాయనశాస్త్ర ప్రాథమిక సూత్రాలు; మన చుట్టూ ఉన్న పరిసరాలు, విశ్వం ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి పదార్థాలు సహకరిస్తాయి.

పదార్థం

ద్రవ్యరాశి కలిగి, కొంత స్థలాన్ని ఆక్రమించే దేన్నైనా పదార్థం అంటారు. నీటి ఘన, ద్రవ, వాయు స్థితులు ఒకే సమతాస్థితిలో ఉండే ఉష్ణోగ్రతను 'త్రికబిందువు' అంటారు.

మిశ్రమాలను వేరుచేసే పద్ధతులు

1. తేర్చడం 2. వడపోత 3. ఇగర్చడం
4. అయస్కాంత పద్ధతి 5. ఏరివేయడం
6. స్వేదనం 7. అంశికస్వేదనం

పదార్థం - లక్షణాలు, పదార్థాల ధర్మాలు, పదార్థ స్థితి మార్పు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Resident Posts

All India Institute of Medical Sciences (AIIMS), Guwahati is conducting interviews to recruit Senior Resident posts on a contractual basis. The total no. of posts is 212. The application fee is Rs.1000. The last date for online applications is 14 July 2025.

Apprentice Posts

DRDO- Defence Institute of Physiology and Allied Sciences (DIPAS) Delhi is inviting applications for the Graduate, Diploma and Trade Apprentice posts.The total number of posts is 22. Eligible candidates can apply online before 16th July 2025.

Technician Posts

CSIR-National Aerospace Laboratories (CSIR-NAL), Bengaluru is inviting applications to recruit Technician-I posts. The total no. of posts is 86. The application fee is Rs.500. Eligible candidates can apply online before 10th July 2025.

Did You Apply..?

Today (July 7) is the last date for the following jobs/ Apprentice posts

☛ 125 Senior Artisan Jobs in ECIL, Hyderabad. ***Eligibility:*** ITI.

☛ 43 Manager Jobs in ALIMCO.
Qualification: Degree, PG, B.Tech.

☛ Graduate Trainee Apprentice posts in BEL.
Qualification: Degree.

For more information and other notifications - scan QR code

Cloze Test

Directions (Qs. 1 - 10): *In the following passage, some words have been deleted. Read the passage carefully and select the most appropriate option to fill in each blank.*

Over the last decade, India has undergone a remarkable transformation, evolving from a nation focused on financial and digital inclusion to one emerging as a global leader in technology and innovation. The government's push for inclusive development began with the launch of the Jan Dhan-Aadhaar-Mobile (JAM) trinity, which **..... (1) .....** millions of previously unbanked citizens into the formal economy. This financial inclusion laid the foundation for a broader digital revolution, enabling the creation of platforms that **..... (2) .....** public services at an unprecedented scale and efficiency. The introduction of the Unified Payments Interface (UPI) further accelerated the digital payments ecosystem, making India one of the fastest adopters of cashless transactions in the world. Over time, the nation began to transition from being a consumer of global technologies to becoming a **..... (3) .....** of homegrown digital infrastructure. Initiatives like Digital India and Startup India created an environment conducive to entrepreneurship and innovation, attracting both domestic and international investment. This growth was particularly visible in sectors such as fintech, agritech, and healthtech, where startups began offering solutions **..... (4) .....** to Indian problems. Crucially, India also recognized the importance of building digital public goods. Platforms like Aadhaar, CoWIN, and the Government e-Marketplace (GeM) became models of scalable, inclusive tech. These platforms are not only transforming governance but also being **..... (5) .....** globally as examples of effective digital public infrastructure. Alongside, the government invested heavily in developing STEM talent, launching coding and AI-focused educational programs to equip the next generation with future-ready skills.

However, the journey was not without its challenges. Issues such as digital literacy, connectivity gaps, and data privacy concerns **..... (6) .....** the pace of innovation in rural and semi-urban regions. Despite these hurdles, India remained committed to building a robust digital ecosystem that balances innovation with accessibility and inclusiveness. Today, India is not just a passive participant in the global tech economy; it is actively shaping it. The country's advancements in fields like artificial intelligence, space technology, and semiconductor manufacturing signal a shift towards high-value, deep-tech innovation. As global trust in India's technological capabilities grows, the country is increasingly being viewed as a trusted **..... (7) .....** in global digital supply chains. With a strong demographic advantage and government-backed digital policy frameworks, India is well-positioned to lead the next wave of innovation. It now needs to focus on strengthening regulatory institutions, promoting ethical AI, and encouraging research that can deliver scalable, secure, and sustainable solutions. The path ahead may be complex, but India's progress over the past ten years provides a solid **..... (8) .....** to build upon. In essence, India's tech journey from grassroots inclusion to global innovation is a testament to its **..... (9) .....** resilience, forward-thinking policy, and the collaborative spirit of its people. The coming years will be crucial in determining whether the country can convert its digital infrastructure into long-term economic and social **..... (10) .....** for all its citizens.

SSC Exams
English

1. A) excluded B) integrated C) rejected D) discouraged
2. A) delay B) disrupt C) deliver D) reduce
3. A) creator B) follower C) barrier D) critic
4. A) irrelevant B) hostile C) copied D) tailored
5. A) imported B) dismissed C) replicated D) ignored
6. A) accelerated B) hampered C) eliminated D) predicted
7. A) ally B) rival C) experiment D) follower
8. A) interruption B) shortcut C) illusion D) foundation
9. A) strategic B) fragile C) accidental D) chaotic
10. A) burden B) gain C) debt D) threat

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

ఆంధ్రప్రదేశ్ భూగోళ శాస్త్రం

తెలుగు నేలపై జీవనాడులు!

నలభైకిపైగా నదులతో ఆంధ్రప్రదేశ్ నదుల రాష్ట్రంగా ప్రసిద్ధికెక్కింది. తెలుగు నేలను సస్యశ్యామలం చేస్తూ సాగే ఆ ప్రవాహాలు కృష్ణా, గోదావరి డెల్టాలను దక్షిణ భారతదేశ వరి ధాన్యాగారాలుగా మార్చాయి. రాష్ట్రంలో సారవంతమైన పరీవాహక ప్రాంతాలు, మడ అడవులు, సరస్సులకు ఆ నదులే మూలం. రాష్ట్ర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలకు జీవనాడులుగా నిలుస్తున్న ఈ నదులపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. ఏపీలో ప్రవహించే ముఖ్యమైన నదులు, వాటి ఉపనదులు, ప్రవాహమార్గాలు, ప్రత్యేకతలు, పరీవాహక ప్రాంతాలున్న జిల్లాలు, నదీ తీర నగరాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల వివరాలను తెలుసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ నదీవ్యవస్థ

ఆంధ్రప్రదేశ్ భూభాగంలో వాయవ్యంలో ఎక్కువ ఎత్తుగా ఉండి ఆగ్నేయదిశగా వాలి ఉంటుంది. అందుకే ఏపీలో ప్రవహించే నదులన్నీ సాధారణంగా వాయవ్య దిశ నుంచి ఆగ్నేయ దిశకు ప్రవహిస్తుంటాయి. రాష్ట్రంలో ప్రవహించే నదులను రెండు రకాలుగా విభజిస్తారు. 1) పశ్చిమ కనుమల్లో పుట్టి ఏపీ ద్వారా ప్రవహించే నదులు- గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా మొదలైనవి. 2) తూర్పు కనుమల్లో పుట్టి ఏపీ ద్వారా ప్రవహించే నదులు- నాగావళి, వంశధార, మాచ్‌ఖండ్, గుండ్లకమ్మ, స్వర్ణముఖి తదితరాలు.



స్వర్ణముఖి నది

తిరుపతి జిల్లాలోని చంద్రగిరి గుట్టల్లో జన్మించింది. ఇదే జిల్లాలోని అందాలమాల దీవులకుసమీపంలో బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నది ఒడ్డున ఉన్న గొప్ప పుణ్యక్షేత్రం - శ్రీకాళహస్తి.

గోదావరి

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా త్రయంబక్ వద్ద పుట్టి మహారాష్ట్ర, తెలంగాణ మీదుగా ప్రవహించి ఏలూరు జిల్లా (బూర్గంపహాడ్) వద్ద ఏపీలోకి ప్రవేశించి ఏలూరు, అల్లూరి జిల్లాల మధ్యగా ప్రవహించి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి 17 కిలోమీటర్ల దూరంలో అయిదు పాయలుగా విడిపోయి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఆ పాయలు - గౌతమి(యానాం), వశిష్ఠ(అంతర్వేది), వైనతేయ(కొమరగిరిపట్నం), తుల్య(బెండమూర్లంక), భరద్వాజ (బెండమూర్లంక). మరో రెండు పాయలు కౌశిక, ఆత్రేయ. ఇందులో కౌశిక పాయ వశిష్ఠలో, ఆత్రేయ పాయ వైనతేయ నదుల్లో కలుస్తాయి. గౌతమి, వశిష్ఠల మధ్యప్రాంతాన్నే 'కోనసీమ' అంటారు. గోదావరి మొత్తం పొడవు - 1465 కి.మీ.. ఏపీలో గోదావరి పొడవు 250 కి.మీ. గోదావరి ప్రవహించే జిల్లాలు ఏలూరు, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ; యానాం. గోదావరి పోలవరం వద్ద తిరిగి మైదానంలోకి ప్రవేశిస్తుంది. రాజమండ్రి వద్ద డెల్టాను ఏర్పరుస్తుంది. గోదావరి ఉపనదులు మంజీర, ప్రాణహిత, వార్ధా, శబరి, కిన్నెరసాని, సీలేరు, ఇంద్రావతి, మూల, ప్రవర, మాచ్‌ఖండ్. గోదావరిలో చివరిగా కలిసే ఉపనది శబరి. అధిక నీటిని తీసుకొచ్చే ఉపనది సీలేరు. గోదావరిపై ఏపీలో నిర్మించిన ఆనకట్ట సర్ ఆర్థర్ కాటన్ ప్రాజెక్ట్ (1847-52) ధవళేశ్వరం వద్ద ఉంది. పోలవరం వద్ద పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉంది.



▸ నవ్యాంధ్రలో తొలి గోదావరి పుష్కరాలు 2015, జులై 14 నుంచి 25 వరకు జరిగాయి. తర్వాత గోదావరి పుష్కరాలు 2027, జులై 23 నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్నాయి.

కృష్ణా నది



మహారాష్ట్రలోని మహాబలేశ్వర్‌లో పుట్టి కర్ణాటక, తెలంగాణ మీదుగా ముచ్చుమర్రి గ్రామం (కర్నూలు జిల్లా) వద్ద ఏపీలోకి ప్రవేశిస్తుంది. సంగమం వద్ద ప్రధాన ఉపనది అయిన తుంగభద్ర వచ్చి కలుస్తుంది. కర్నూలు, నంద్యాల, నల్గొండ (తెలంగాణ), పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల మీదుగా ప్రవహించి విజయవాడకు 64 కి.మీ. దూరంలో పులిగడ్డ వద్ద రెండు పాయలుగా విడిపోయి హంసల దీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. రెండు పాయల మధ్య ప్రాంతాన్ని 'దివిసీమ' అంటారు. కృష్ణానది పొడవు 1,400 కి.మీ. ఏపీలో దీని పొడవు 470 కి.మీ.

▸ ప్రస్తుతం ఏపీలో అత్యధికంగా కృష్ణా జలాలనే వినియోగిస్తున్నారు.

ఉపనదులు: మహారాష్ట్రలో కొయనా, వర్ణ, పంచగంగ; కర్ణాటకలో ఘటప్రభ, మలప్రభ; తెలంగాణలో భీమ, దిండి, మూసి, పాలేరు; ఏపీలో తుంగభద్ర, బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు.


ఏపీలో కృష్ణానదిపై నిర్మించిన ఆనకట్టలు: శ్రీశైలం ప్రాజెక్ట్ (కర్నూలు), నాగార్జునసాగర్ (గుంటూరు-నల్గొండ), ప్రకాశం బ్యారేజ్ (విజయవాడ).

కృష్ణానది ఒడ్డున ఉన్న పుణ్యక్షేత్రాలు: శ్రీశైలం-శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం, విజయవాడ-కనకదుర్గ ఆలయం, అమరావతి-అమరలింగేశ్వర ఆలయం. ▸ కృష్ణా పుష్కరాలు 2016, ఆగస్టు 12 నుంచి 23 వరకు జరిగాయి. తర్వాత మళ్లీ పుష్కరాలు 2028, ఆగస్టు 12 నుంచి 23 వరకు జరుగుతాయి.

పెన్నా నది: కర్ణాటకలోని నందిదుర్గ కొండల్లో పుట్టి సత్యసాయి జిల్లా హిందూపూర్ వద్ద ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. కడప, నెల్లూరు జిల్లాల మీదుగా ప్రవహించి ఊటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. దీని పొడవు సుమారు 600 కిలోమీటర్లు. ఏపీలో పెన్నా పరీవాహక ప్రాంతం 18.8% ఉంది. ఈ నదినే పెన్నేరు, పినాకిని, రాయలసీమ జీవనాడి అని కూడా పిలుస్తారు. ఉపనదులు - జయమంగళి, చిత్రావతి, సగిలేరు (స్వర్ణబాహు), చెయ్యేరు (బహుదా నది), పాపాఘ్ని. ▸ పెన్నానదిపై ఉన్న ప్రాజెక్టు - సోమశిల (నెల్లూరు). చెయ్యేరు నదిపై అన్నమయ్య ప్రాజెక్టు ఉంది.



కర్ణాటకలో పశ్చిమ కనుమల్లోని వరాహగిరి పర్వతాల్లో పుట్టిన తుంగ, భద్ర అనే రెండు నదులు షిమోగా జిల్లా కూడ్లి వద్ద ఏకమై తుంగభద్ర నది ఏర్పడుతుంది. తెలంగాణలో ప్రవహించి కర్నూలు జిల్లా, కౌతాళం వద్ద ఏపీలోకి ప్రవేశించి సంగమం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. పొడవు 531 కి.మీ. రామాయణ కాలంలో దీనినే పంపానదిగా పిలిచారు. ఉపనదులు - హరిద్ర, వరద, వేదవతి, కుముదవతి ▸ తుంగభద్ర ఒడ్డున కర్నూలు జిల్లా మంత్రాలయంలో రాఘువేంద్ర స్వామి ఆలయం ఉంది.



తుంగభద్ర

తూర్పు కనుమల్లో పుట్టిన నదులు



వంశధార: దీని జన్మస్థలం ఒడిశాలోని జయపుర కొండలు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం వద్ద ఏపీలోకి ప్రవేశించి, కళింగపట్నం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. దీని పొడవు 226 కిలోమీటర్లు (ఏపీలో 130 కి.మీ.) దీని ప్రధాన ఉపనది - మహేంద్ర తనయ.

నాగావళి: దీనినే లాంగుల్యా నది అంటారు. ఒడిశాలోని రాయ్‌గఢ్ కొండల్లో పుట్టి, పార్వతీపురం మన్యం జిల్లా మీదుగా ప్రవహించి, శ్రీకాకుళం జిల్లా మోపస్‌బందర్ వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. దీని పొడవు 206 కిలోమీటర్లు (ఏపీలో 110 కి.మీ.) దీని ఉపనదులు - స్వర్ణముఖి, జంఝావతి, వేదవతి, ఒట్టిగడ్డ. ▸ పార్వతీపురం మన్యం జిల్లా రాజ్యలక్ష్మీపురం గ్రామం వద్ద జంఝావతి నదిపై ఆసియాలోనే మొదటి రబ్బరు డ్యామ్ నిర్మించారు.

ముఖ్యాంశాలు

- ▸ పశ్చిమ కనుమల్లో పుట్టి బంగాళాఖాతంలో కలిసే పెద్ద నది గోదావరి. దీనికే దక్షిణ గంగ, వృద్ధ గంగ, ఇండియన్ రైన్ అని పేరు. గోదావరి నదిపై పాపికొండల వద్ద బైసన్ గార్జ్ ఏర్పడింది.
- ▸ తూర్పు కనుమల్లో పుట్టి బంగాళాఖాతంలో కలిసే పెద్ద నది - వంశధార.
- ▸ ఆంధ్రప్రదేశ్‌లో పుట్టి, ఇక్కడే ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే పెద్ద నది - గుండ్లకమ్మ.
- ▸ ఏపీలో పుట్టి ఇక్కడే ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే చిన్న నది స్వర్ణముఖి.
- ▸ పెన్నానది ఏర్పరచిన గార్జ్ - గండికోట గార్జ్ (కడప)
- ▸ కొల్లేరు సరస్సుకు నీటిని తీసుకొచ్చే నదులు - బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు.

ప్రధాన జలపాతాలు

ఏపీలో ఎత్తయినది.. తలకోన జలపాతం. తిరుపతి జిల్లా, నెరబైలు గ్రామం వద్ద ఉంది. దీని ఎత్తు 82 మీటర్లు. తిరుపతి జిల్లాలోనే ఉబ్బలమడుగు, తడ, కపిలతీర్థం, నగులాపురం లాంటి జలపాతాలు ఉన్నాయి.

నెల్లూరు: పెంచలకోన జలపాతం.

అల్లూరి జిల్లా: అరకు, అనంతగిరి, కటిక జలపాతాలు (కిటికి).

పల్నాడు జిల్లా: ఎత్తి పోతల జలపాతం

నదీ తీర పట్టణాలు, ప్రసిద్ధ ప్రాంతాలు

గోదావరి: రాజమండ్రి (రాజమహేంద్రవరం)

కృష్ణానది: శ్రీశైలం, అమరావతి, విజయవాడ, నాగార్జున కొండ

తుంగభద్ర: మంత్రాలయం

పెన్నా: నెల్లూరు

చిత్రావతి: పుట్టపర్తి

స్వర్ణముఖి: శ్రీకాళహస్తి

నాగావళి: శ్రీకాకుళం

మాచ్‌ఖండ్ నది: ఇది అల్లూరి జిల్లా మాడుగుల కొండల్లో జన్మించింది. ఉత్తరం వైపు ప్రవహించి, ఒడిశాలో శబరి నదిలో కలుస్తుంది. దీనికే మత్స్యకుండల అని పేరు. ఈ నదిపై డుడుమా జలపాతం ఉంది.

గుండ్లకమ్మ నది: నంద్యాల జిల్లా నల్లమల కొండల్లో గుండ్లబ్రహ్మేశ్వరం వద్ద జన్మించి పల్నాడు, ప్రకాశం జిల్లాల మీదుగా ప్రవహించి దేవరపాడు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. పొడవు 285 కి.మీ. ప్రాచీన కాలంలో గుండిక, బ్రహ్మకుండి అని పిలిచేవారు. దీనిపై పుల్లలచెరువు గ్రామం వద్ద 'నెమలిగుండం' జలపాతం ఉంది.




రచయిత: మండ సతీష్

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పెన్నానది ఉపనది కానిది?
   1) జయమంగళ 2) చిత్రావతి 3) మున్నేరు 4) పాపాఘ్ని
2. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టి ఉత్తరంగా ప్రవహించే నది?
   1) మాచ్‌ఖండ్ 2) వంశధార 3) నాగావళి 4) స్వర్ణముఖి
3. ఏపీలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం ఎంత శాతం?
   1) 27% 2) 24% 3) 58% 4) 33%
4. ఇండియన్ నయాగరా జలపాతంగా పిలిచే చిత్రకూట్ జలపాతం ఏ ప్రధాన నదికి చెందిన ఉపనదిపై ఉంది?
   1) కృష్ణా 2) గోదావరి 3) తుంగభద్ర 4) కావేరి

సమాధానాలు

1-3; 2-1; 3-2; 4-2.



కరెంట్ అఫైర్స్

● ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం రఘుజీ భోస్లే-1 ఐకానిక్ కత్తిని లండన్‌లో జరిగిన వేలంలో రూ.47.15 లక్షలకు కొనుగోలు చేసింది?

జ: మహారాష్ట్ర (రఘుజీ భోస్లే-1 మరాఠా సామ్రాజ్యాన్ని ఏకీకృతం చేయడంలో, తూర్పు-మధ్య భారత దేశమంతటా దాని ప్రభావాన్ని విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు.)



మాదిరి ప్రశ్నలు

● ప్రపంచ ట్యూనా దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (ప్రపంచ ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధి, సముద్ర జీవవైవిధ్యంలో ట్యూనా చేపల ప్రాముఖ్యతను వివరించడానికి 2017 నుంచి ఏటా ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తోంది.)

జ: మే 2


● ఏ రెండు ఈశాన్య రాష్ట్రాలను కలిపే షిల్లాంగ్ - సిల్చార్ గ్రీన్ ఫీల్డ్ కారిడార్ ప్రాజెక్ట్‌కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది? (జాతీయ రహదారి - 06 లో మావ్లింగ్ ఖుంగ్ నుంచి పంచ్‌గ్రామ్ వరకు 166.80 కి.మీ మేర ఈ కారిడార్‌ను నిర్మిస్తున్నారు.)

జ: మేఘాలయ-అస్సాం

● దేశంలో మొదటి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ 'క్రియేటర్ ల్యాండ్' ను ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది?

జ: ఆంధ్రప్రదేశ్

పత్రాలు.. మొక్కల ఆహార కర్మాగారాలు!




సృష్టిలో అత్యంత విశిష్టమైన ప్రాథమిక జీవులు మొక్కలు. పర్యావరణ వ్యవస్థను సృష్టించి, ఇతర జీవులన్నింటికీ కావాల్సిన వనరులను అందించే పరోపకారులు. వాతావరణ నియంత్రణ-సమతౌల్యంలో, ఆహార గొలుసు చక్రంలో ఇవే కీలకం. కిరణజన్య సంయోగ క్రియ ద్వారా స్వయంపోషకాలుగా మనుగడ సాగించే మొక్కల్లో పోషణ ప్రక్రియ, ఆహార తయారీ, రవాణా, నిల్వ, వినియోగం జరిగే తీరు, ఆ సమయంలో మొక్కలోని వివిధ భాగాలు పోషించే పాత్ర తదితర వివరాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. మొక్కల్లో పోషణపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు, వెల్లడించిన అంశాలు, సహజీవనం, పరపోషణ సాగించే వివిధ రకాల మొక్కలు, వాటితో సారూప్యతలున్న ఇతర జీవుల గురించి తెలుసుకోవాలి.


జనరల్ స్టడీస్ - బయాలజీ

మొక్కల్లో పోషణ

1. కింది వాటిలో సత్యవాక్యాన్ని ఎంచుకోండి.
   ఎ) ఆహారంలోని ఆవశ్యకమైన పదార్థాలు పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు.
   బి) ఆహారం కోసం జంతువులు, మానవులు పరోక్షంగా మొక్కలపై ఆధారపడాల్సి వస్తుంది.
   సి) 'పోషణ' అనేది ఒక జీవి ఆహారాన్ని తీసుకునే, శరీరంలో దాన్ని వినియోగించుకునే విధానం.
   డి) స్వయంపోషకాలకు ఉదాహరణ మొక్కలు, కొన్ని బ్యాక్టీరియాలు, థాలోఫైటా వర్గపు శైవలాలు.
   1) ఎ, బి 2) ఎ, బి, సి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
2. మొక్కల్లో పోషణ వ్యవస్థ పితామహుడు?
   1) వాన్ హెల్మాంట్ 2) లిన్నేయస్ 3) అరిస్టాటిల్ 4) వాన్ నీల్
3. వాదన-ఎ: సొంతంగా ఆహార పదార్థాలను తయారు చేసుకునే జీవులు స్వయంపోషకాలు.
   వాదన-బి: స్వయంపోషకాల్లో జరిగే ప్రక్రియ కిరణజన్య సంయోగక్రియ.
   1) ఎ సరైంది, బి సరికాదు.
   2) ఎ, బి లు సరైనవి; ఎ అనేది బి కు సరైన వివరణ.
   3) ఎ, బి లు సరికావు.
   4) ఎ సరికాదు, బి సరైంది.
4. కింది వాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.
   1) పత్రాలు.. మొక్కల ఆహార కర్మాగారాలు.
   2) ఆహార పదార్థాల తయారీకి నీరు, ఖనిజ లవణాలు ముఖ్యం.
   3) ప్రతి జీవిలో ఆహారపదార్థాల తయారీకి నీరు, ఖనిజ లవణాలు అవసరం.
   4) పత్రం ఉపరితలంపై ఉన్న సూక్ష్మరంధ్రాలను పత్రరంధ్రాలు అంటారు.
5. ఎ) భూమిపై ఉన్న సమస్త జీవరాశులకు అంతిమ శక్తివనరు సూర్యుడు.
   బి) భూమిపై ఉన్న సమస్త జీవరాశులకు ముఖ్యమైన ప్రక్రియ కిరణజన్య సంయోగక్రియ.
   పై వాక్యాల్లో సరైనవి గుర్తించండి?
   1) ఎ, బి 2) ఎ 3) బి 4) ఏదీకాదు
6. మేఘాలయలో జీవ వేర్ల వంతెనను స్థానికంగా ఏమని పేర్కొంటారు?
   1) జింగ్ కీంగ్ క్రి 2) జాన్ కీంగ్ ట్రీ 3) కీంగ్ యాంగ్ ట్రీ 4) 1, 2
7. నీరు, ఖనిజ లవణాల శోషణలో ప్రధాన పాత్ర వహించేవి?
   1) ప్రధాన వేరు 2) వేరుతొడుగులు 3) మూలకేశాలు 4) పైవన్నీ
8. కిరణజన్య సంయోగక్రియకు కావాల్సిన ప్రధాన కారకాలు?
   ఎ) బాహ్యకారకాలు - నీరు, ఖనిజ లవణాలు
   బి) అంతర కారకం - క్లోరోఫిల్
   1) ఎ, బి 2) బి 3) ఎ 4) ఏదీకాదు
9. పత్రం అడ్డుకోతను గమనించిన రాము పత్రాల్లో కింది ఏ భాగంలో పత్రరంధ్రాలు ఎక్కువగా ఉంటాయని భావించి ఉంటాడు?



   1) స్తంభ కణజాల భాగం 2) స్పంజికణజాల భాగం 3) పత్రపు అంచు 4) పత్రశీర్ష భాగం
10. రమ ఒక పత్రాన్ని ఒక ద్రావణంలో ముంచితే నీలి-నలుపు వర్ణంలోకి మారింది. అయితే అది కింది ఏ ద్రావణం లక్షణమై ఉంటుంది?
   1) అయోడిన్ 2) బెటాడిన్ 3) కాస్టిక్‌సోడా 4) 1, 2
11. కింది వాటిలో పాక్షిక వేరు పరాన్నజీవి?
   1) కస్క్యూటా 2) అమర్ బెల్ 3) లొరాంథస్ 4) సాంటాలం
12. కింది వాటిలో సత్యవాక్యాన్ని ఎంచుకోండి.
   ఎ) పత్రరంధ్రాలు సహాయక కణాల ద్వారా ఏర్పడతాయి.
   బి) పత్రరంధ్రాలు ద్విపుటాకారంలో ఉండే నిర్మాణాలు.
   సి) కిరణజన్య సంయోగక్రియలో పిండిపదార్థాలు, ప్రొటీనులు, కొవ్వులు ఏర్పడతాయి.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి
13. ప్రపంచ శైవల శాస్త్ర పితామహుడు ఎవరు?
   1) లిన్నేయస్ 2) అరిస్టాటిల్ 3) ఎం.ఒ.పి.అయ్యంగార్ 4) విట్టేకర్



లిన్నేయస్

14. కింది వాటిలో ఎరిల్‌ను కలిగి ఉండే నిర్మాణం?
   1) పనస 2) జాజికాయ 3) గుమ్మడి 4) యాపిల్
15. కిందివాటిని జతపరచండి.

మొక్క పేరు	మారు పేరు
1) నెపంథిస్	ఎ) సన్ డ్యూ
2) డ్రాసిరా	బి) పిచ్చర్ ప్లాంట్
3) డయోనియా	సి) బ్లీడర్ వర్ట్
4) యుట్రిక్యులేరియా	డి) వీనస్ ఫ్లైట్రాప్

   1) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
   2) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
   3) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
   4) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
16. కింది వాటిలో పూతికాహార భక్షణను ప్రదర్శించేవి?
   1) శిలీంద్రాలు 2) ప్రొటోజోవన్లు 3) బ్యాక్టీరియాలు 4) పైవన్నీ
17. వెలామిన్ వేర్లు ఉండి పెద్ద మొక్కల కాండాలపై పోషణ సాగించే మొక్కలు కింది వాటిలో?
   1) వాండా 2) వానిల్లా 3) రైజోఫోరా 4) 1, 2
18. రైజోబియంకు సంబంధించి సరికానిది గుర్తించండి.
   ఎ) ఇది సొంతంగా ఆహారం తయారు చేసుకునే ప్రక్రియ.
   బి) కంది, బఠాణీ, పెసర లాంటి మొక్కల వేర్లలో ఇది నివసిస్తుంది.
   1) ఎ సత్యం, బి అసత్యం
   2) ఎ, బి లు అసత్యం
   3) ఎ, బి లు సత్యం
   4) ఎ అసత్యం, బి సత్యం
19. కింది వాటిలో మిశ్రమ పోషణ ప్రదర్శించే జీవి ఏది?
   1) యూగ్లీనా 2) క్లామిడో మోనాస్ 3) అజటోబాక్టర్ 4) సైనోబ్యాక్టీరియా
20. వాదన-ఎ: కీటకాహార మొక్కలు ప్రాథమికంగా స్వయంపోషకాలు. ఇవి సొంతంగా ఆహారాన్ని తయారు చేసుకుంటాయి.
   వాదన-బి: వీటికి కావాల్సిన నత్రజని కోసం కీటకాల మీద ఆధారపడతాయి.
   1) ఎ సత్యం 2) బి సత్యం 3) ఎ, బి లు సత్యం 4) ఎ, బి లు అసత్యం
21. ఐస్‌క్రీమ్ తయారీలో ఫ్లేవర్‌గా ఉపయోగించే వానిల్లిన్ అనేది వానిల్లాలోని ఏ భాగం నుంచి లభిస్తుంది?
   1) పుష్పం 2) పత్రం 3) బీజదళం 4) పూర్తి మొక్క
22. థేమ్స్ నదీ జలాలను, మట్టి ముద్దల ద్వారా మొక్కల్లో పోషణను గురించి అధ్యయనం చేసిన వ్యక్తి ఎవరు?
   1) వాన్ హెల్మాంట్ 2) అరిస్టాటిల్ 3) వాన్‌నీల్ 4) జాన్‌సన్
23. కింది వాటిలో శ్వాసించే వేర్లున్న మొక్క?
   1) రైజోఫోరా 2) అవిసీనియా 3) బ్రుగైరా 4) పైవన్నీ
24. కిరణజన్య సంయోగక్రియలో నీటి కాంతి విచ్ఛేదనానికి తోడ్పడే ముఖ్య మూలకం?
   1) మెగ్నీషియం 2) ఐరన్ 3) క్యాల్షియం 4) జింక్
25. 17వ ఆవశ్యక మూలకంగా కింది వాటిలో వేటిని గుర్తించారు?
   1) క్లోరిన్ 2) నికెల్ 3) బోరాన్ 4) మెగ్నీషియం
26. మొక్కలు బరువు పెరగడంలో ప్రధాన పాత్ర నీటిదని కనుక్కున్న వ్యక్తి ఎవరు?
   1) వాన్ హెల్మాంట్ 2) వాన్ నీల్ 3) స్టీఫెన్ హేల్ 4) 1, 2
27. టమాటో ఎరుపు రంగుకు కారణమయ్యే వర్ణకం?
   1) బీటా కెరోటిన్ 2) ల్యూటిన్ 3) లైకోపీన్ 4) జాంథిన్
28. కిరణజన్యసంయోగ క్రియ జరిపే వేర్లను కలిగిన మొక్క?
   1) టీనియోఫిల్లమ్ 2) రఫ్లీషియా 3) వెలమిన్ 4) విస్కమ్
29. కింది వాటిలో వేరు విధి కానిది?
   1) నీరు, ఖనిజ లవణాల శోషణ; రవాణా.
   2) ఆహార పదార్థాలను నిల్వ చేయడం.
   3) అన్నీ వేర్లు శ్వాసక్రియను జరుపుతాయి.
   4) మొక్కకు ఆధారం ఇస్తుంది.
30. కాంతి అనువర్తనాలకు అనుకూలంగా పెరిగే వేరును కలిగిన మొక్కలు?
   1) రైజోఫోరా 2) అవిసీనియా 3) టర్నిప్ 4) 1, 2
31. కింది వాటిలో పీచు వేరు వ్యవస్థ ఉండని మొక్క?
   1) వరి 2) ఆవాలు 3) గోధుమ 4) జొన్న
32. వాదన-ఎ: దుంప వేర్లు మొదటి ఏడాదిలో ఆహారాన్ని నిల్వ చేసి, రెండో సంవత్సర కాలంలో వాటిని వినియోగించుకుంటాయి.
   ప్రతివాదన-బి: దుంపవేర్లు ద్వివార్షికాలే అయినప్పటికీ మొదటి ఏడాదిలో వాటిని తీసివేస్తారు.
   1) ఎ సరైంది బి సరికాదు.
   2) ఎ అనేది బి కు సరైన ప్రతివాదన.
   3) ఎ, బి లు సరైనవి. అయితే రెండింటికి సంబంధం లేదు.
   4) ఎ, బి లు సరికావు.
33. ప్రపంచంలో అతి పెద్ద మర్రి చెట్టుకు ఉన్న పేరు?
   1) పిల్లల మర్రి 2) పీర్ల మర్రి 3) తిమ్మమ్మ మర్రిమాను 4) 1, 3
34. కింది వారిలో వృక్షశాస్త్ర పితామహుడు ఎవరు?
   1) అరిస్టాటిల్ 2) థియోఫ్రాస్టస్ 3) లిన్నేయస్ 4) హార్వే
35. విత్తనం అంకురించినప్పుడు గురుత్వానువర్తనానికి అనుకూలంగా పెరిగే మొక్క ఏకైక భాగం?
   1) ప్రథమ మూలం 2) ప్రకాండం 3) శాఖలు 4) పత్రాలు
36. మొక్క శాఖీయ భాగాల నుంచి ఏర్పడే వేరుకు ఉదాహరణలు?
   1) మోనోస్టెరా 2) మర్రి 3) టర్నిప్ 4) 1, 2
37. కింది వాటిలో సత్యవాక్యాన్ని గుర్తించండి.
   1) వేరు కొన భాగాన్ని కప్పుతూ ఉండే తొడుగును 'వేరు తొడుగు' అంటారు.
   2) వేరులో విభజన జరిగే ప్రాంతం, పొడవు పెరిగే ప్రాంతం, ముదిరిన ప్రాంతం... అనే భాగాలుంటాయి.
   3) పొడవు పెరిగే ప్రాంతంలో మూలకేశాలు ఉంటాయి.
   4) మూలకేశాలు నీటిని శోషించడంలో సాయపడతాయి.



రచయిత: వట్టిగొనల్ల పద్మనాభం

సమాధానాలు

1-4, 2-1, 3-2, 4-3, 5-1, 6-1, 7-3, 8-1, 9-2, 10-4, 11-4, 12-4, 13-1, 14-2, 15-1, 16-4, 17-4, 18-4, 19-1, 20-3, 21-3, 22-1, 23-4, 24-3, 25-2, 26-1, 27-3, 28-1, 29-3, 30-4, 31-2, 32-2, 33-3, 34-2, 35-1, 36-4, 37-3.